సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16+4 వెల: ₹ 5.50
సంపుటి: 16
సంచిక: 229
గురువారం 9-11-2023
SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL


'రాష్ట్రంలో నిరుపేదలెవరూ డబ్బులేని కారణంగా ఉన్నత విద్యకు దూరం కాకూడదు. అందుకే ఫీజుల చెల్లింపు పథకాన్ని చేపట్టాం'

సోనోవిజన్‌లో కొనుగోలుదారుల సందడి

దీపావళికు సోనోవిజన్ అందించే డిస్కౌంట్ సేల్‌ను ఈ సంవత్సరం ప్రజలు అనూహ్యంగా ఆదరిస్తున్నారు. సోనోవిజన్ స్క్రాచ్ కార్డ్ స్కీమ్ అందరిని ఆకట్టుకుంటుంది. మాములు డిస్కౌంట్‌తో పాటు కార్డ్ స్క్రాచ్ చేయగా మినిమం 6% చాలా మందికి మరింత ఎక్కువ ఎమౌంట్ రావడం పై కొనుగోలుదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా సోనోవిజన్ స్పెషల్ క్యాష్‌బ్యాక్ ఆఫర్స్‌లో 15% వరకు లభించడం ఈ సంవత్సరం ప్రత్యేకత.



దీపావళి శుభాకాంక్షలతో...
సోనోవిజన్ దీపావళి సేల్
LG Life's Good
208 Cm (83") 4K OLED
Flexi EMI : 6999/-
SAMSUNG
189 Cm (75") LED 4K
Ultra UHD
Flexi EMI : 3990/-
SONY
164 Cm (65") LED 4K
Ultra HD Smart
Flexi EMI : 5500/-
Haier
139 Cm (55") LED 4K
HD Smart
Flexi EMI : 1994/-
LLOYD
108 Cm (43") Smart LED
Flexi EMI : 2292/-
TCL
108 Cm (43") Google LED
Flexi EMI : 2182/-
SONY
108 Cm (43") 4K Anroid
EMI : 1850/-
LG Life's Good
108 Cm (43")
4K Smart LED
EMI : 1999/-
Haier
108 Cm (43") Smart 4K LED
EMI : 1994/-
SAMSUNG
80 Cm (32") Smart LED
EMI : 1166/-
LLOYD
108 Cm (43") Smart LED
EMI : 2166/-
boAt
Sound Bar
EMI : 667/-
LG Life's Good
Side by Side
694 Litres
Refrigerator
EMI : 12600/-
SAMSUNG
Side by Side
700 Litres
Refrigerator
EMI : 6333/-
Whirlpool
Frost Free
Double Door
260 Litres
Refrigerator
EMI : 2058/-
VOLTAS beko
Direct Cool
Single Door
190 Litres
Refrigerator
EMI : 1150/-
Haier
256 Litres
BMR
Refrigerator
EMI : 2085/-
LLOYD
Frost Free
Double Door
276 Litres
Refrigerator
EMI : 1900/-
Haier
Side by Side
682 Litres
Refrigerator
EMI : 5083/-
LLOYD
Side by Side
590 Litres
Refrigerator
EMI : 4425/-
SAMSUNG
Frost Free
Double Door
253 Litres
Refrigerator
EMI : 1994/-
Godrej
Direct Cool
Single Door
190 Litres
Refrigerator
EMI : 1083/-
LG Life's Good
Direct Cool
Single Door
215 Litres
Refrigerator
EMI : 1526/-
Haier
Direct Cool
Single Door
190 Litres
Refrigerator
EMI : 985/-
Chest Freezer
230 Litres
EMI:1705/-
LG Life's Good
Front Load
Washing
Machine
11 KGS
EMI : 5335/-
SAMSUNG
Front Load
Washing
Machine
9 KGS
EMI : 3500/-
BOSCH
Front Load
Washing
Machine
6.5 KGS
EMI : 2984/-
IFB
Top Load
Washing
Machine
6.5 KGS
EMI : 1625/-
Whirlpool
Top Load
Washing
Machine
7.5 KGS
EMI : 1275/-
LLOYD
Semi Automatic
Washing
Machine
7.5 KGS
EMI : 995/-
LG Life's Good
10 Years Compressor WARRANTY
5 Years PCB WARRANTY
EMI : 3000/-
SAMSUNG
EMI : 3050/-
VOLTAS
EMI : 2875/-
LLOYD
EMI : 3000/-
BLUE STAR
EMI : 3085/-
HITACHI
EMI : 3041/-
DAIKIN
EMI : 3100/-
FABER COMBO OFFER
Air Chimney
Installation Kit
FREE
4 Burner Glass Cooktop
Offer Price : 18,599/-
Microwave Oven
Rs : 6500/-
Onwards
Chimney
Rs : 8300/-
Onwards
Water Dispenser
Rs : 8200/-
Onwards
Water Purifier RO
Rs : 12800/-
Onwards
Water Geyser
Rs : 3350/-
Onwards
Wet Grinder
Rs : 3500/-
Onwards
Rice Cooker
Rs : 1600/-
Onwards
Mixer Grinder 3 Jar
750 Watts
Rs : 2900/-
Onwards
* T & C Apply
LG Life's Good
SAMSUNG
SONY
LLOYD
Whirlpool
Panasonic
Haier
DAIKIN
HITACHI
VOLTAS
VOLTAS beko
IFB
BOSCH
Carrier
BLUE STAR
TCL
EUREKA FORBES
KENT
pureit
Sunflame
Preethi
Butterfly
FABER
V-GUARD
KEELINE
AO Smith
Unistar
Amirthaa
Crompton
MAHARAJA WHITELINE
HAVELLS
morphy richards
BAJAJ
MOBILES
SAMSUNG
vivo
oppo
iPhone
ONEPLUS
realme
mi
LAPTOPS
hp
DELL
ASUS
Lenovo
MacBook
ACCESERIES
boAt
FIRE-BOLTT
అందరికన్న తక్కువ ధరలు, నమ్మకమైన సర్వీస్‌తో అందరి అభిమానం పొందిన షోరూం సోనోవిజన్
విశాఖపట్నం
డైమండ్‌పార్క్ - 1 ద్వారకా నగర్, వైజాగ్ 9390006608, 8333924946
డైమండ్‌పార్క్ - 2 ద్వారకా నగర్, వైజాగ్ 9246667474, 8333924929
శ్రీకన్య థియేటర్ ఎదురు, గాజువాక 9246667575, 9154281127
న్యూ గాజువాక జంక్షన్, గాజువాక. 9440804187, 9100991705
న్యూ సుకన్య థియేటర్, గోపాలపట్నం 9100991704, 9154281129
కార్‌షెడ్ జంక్షన్, మధురవాడ. 9246666214, 9390006613
తూర్పు గోదావరి
కోటిపల్లి బస్టాండ్, రాజమండ్రి. 9246662288, 9246666212
టి.యస్.రోడ్, రాజమండ్రి 9100991700, 9154281119
థియేటర్, ఇన్నీస్‌పేట, రాజమండ్రి 9154281197, 98, 99
రామయ్య స్ట్రీట్, కాకినాడ. 9246665511, 9246666201
సర్పవరం జంక్షన్, కాకినాడ. 7331149376, 77, 78
శ్రీ పొట్టి శ్రీరాములు జిల్లా
బస్టాండ్ దగ్గర, నెల్లూరు. 9246666206, 9154279913
మిని బైపాస్ రోడ్, నెల్లూరు - 8712600519, 20, 21
పశ్చిమ గోదావరి
జువ్వలపాలెం రోడ్, భీమవరం. 8333924936, 9154281175
పార్క్ ఎదురు, ఏలూరు. 9246666205, 9154281172
అశోక్ నగర్, ఏలూరు. 9390006620, 9154281112
పైడిపర్రు రోడ్, తణుకు. 8333924938, 9154281115
విజయనగరం
3 లాంతర్ల సెంటర్, 9246666208, 9390006630
జంక్షన్, 8712600523, 8712600535
శ్రీకాకుళం
జి.టి.రోడ్, శ్రీకాకుళం - 9154281140, 41
విజయవాడ ఎన్.టి.ఆర్. జిల్లా, కృష్ణా జిల్లా.
రామ మందిరం దగ్గర, ఏలూరు రోడ్, విజయవాడ. 9440804182, 9246666202
కంట్రోల్ రూమ్ దగ్గర, యం.జి.రోడ్, విజయవాడ. 9440804183, 9246666209
ఆల్ ఇండియా రేడియో ఎదురు, యం.జి.రోడ్, విజయవాడ. 9246666203, 9154281640
మోహన్‌దాస్ థియేటర్ దగ్గర, పటమట, విజయవాడ. 9246661616, 9100991702
శ్రీనగర్ కాలనీ, రింగ్ రోడ్, విజయవాడ. 8712600531, 532, 533
విజయప్లాజా (విజయటాకీస్) ఏలూరు రోడ్, విజయవాడ. 9154281648, 649, 650
ప్రియదర్శిని థియేటర్ బిల్డింగ్, అరండల్‌పేట, విజయవాడ. 9100991701, 9246666664
విజయవాడ. 9100991703, 9154281626
గొల్లపూడి, విజయవాడ. 8333924930, 9154281628
కానూరు, యం.జి.రోడ్, విజయవాడ. 8712600536, 8712600537
మెయిన్ రోడ్ సెంటర్, పోరంకి 9154281645, 46, 47
గుడివాడ
ఏలూరు రోడ్, గుడివాడ. 9100991708, 9154281178, 79
మచిలీపట్నం
కోనేరు సెంటర్, మచిలీపట్నం - 7331149379, 80, 81
గుంటూరు జిల్లా
సెంటర్, గుంటూరు 9154279910, 9440804185
లక్ష్మీపురం, మెయిన్ రోడ్, గుంటూరు. 9246667373, 9154867822, 23, 24
లక్ష్మీపురం, గుంటూరు. 9246666204, 9154279905
బ్రాడీపేట, గుంటూరు. 9246666215, 9100991706
దగ్గర, తెనాలి. 8333924937, 9154279903
తెనాలి. 9246666211, 9154279901
మున్సిపల్ ఆఫీస్ ఎదురు, రేపల్లె 9390006609, 9154281200
దగ్గర, తాడేపల్లి - 7331149366, 367, 368
ఒంగోలు
మార్కెట్, ఒంగోలు. 9246666329, 9154279918
రాయలసీమ
తిరుపతి - 7331149370, 371, 372
తిరుపతి - 9100991707, 9154279919
రోడ్, తిరుపతి. 9440804186, 9154279916
పార్క్ రోడ్, కర్నూలు - 9154281642, 43
కర్నూలు - 8333924947, 48
అనంతపురం - 9154281191, 92
కడప - 9154281194, 96
చిత్తూరు 8712600528, 8712600530
నంద్యాల - 8712600525, 526, 527
ఖమ్మం
ఖమ్మం. 9246666319, 9154281634
వైరా రోడ్, ఖమ్మం. 9100991709, 9154281635
వైరారోడ్, ఖమ్మం. 8333924931, 9154281637, 38
కొత్తగూడెం
కొత్తగూడెం, రోడ్, 9154867825, 26, 27
కరీంనగర్
8712635843, 44, 45
వేములవాడ రోడ్, 8712635841, 42
హైదరాబాద్
పంజాగుట్ట, హైదరాబాద్. 9246663535, 9440804181
మెట్రోస్టేషన్ దగ్గర, కూకట్‌పల్లి 9154281180, 9154281181
హైదర్ నగర్, హైదరాబాద్ 7331149363, 364, 365
మలక్‌పేట్, హైదరాబాద్. 8333924932 / 933
ఎల్.బి.నగర్, డి-మార్ట్ ఎదురు. 8333924943, 9154281188



సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+4 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 229

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

జగనే ఎందుకంటే..

నాలుగున్నరేళ్ల అభివృద్ధి-సంక్షేమ పాలనపై నేటి నుంచి భారీ ప్రచార కార్యక్రమానికి శ్రీకారం

- తొలిరోజు రాష్ట్రంలో 711 సచివాలయాల పరిధిలో ప్రారంభం.. ఆయా చోట్ల చేకూర్చిన లబ్ధి వివరాలతో సంక్షేమ బోర్డుల ఆవిష్కరణ
- స్థానిక ప్రజా ప్రతినిధులు, ఎమ్మెల్యే, ఎంపీలకు ప్రత్యేక అతిథులుగా ఆహ్వానం.. పాల్గొననున్న గృహ సారథులు, పార్టీ సానుభూతిపరులు, సీఎం జగన్ అభిమానులు
- గత సర్కారుకు - వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మధ్య వ్యత్యాసాన్ని చాటి చెప్పేందుకు సన్నద్ధం
- మరుసటి రోజు నుంచి ఇంటింటి ప్రచారం.. 24 పేజీలతో ప్రత్యేక బుక్‌లెట్ పంపిణీ.. ఒక రోజు ముందే కార్యక్రమం వివరాలతో ఎస్‌ఎంఎస్ ద్వారా సమాచారం
- వలంటీర్ల ఆధ్వర్యంలో రోజుకు 15 కుటుంబాలను సందర్శించేలా షెడ్యూల్.. 23వతేదీ వరకు 7,610 సచివాలయాల పరిధిలో కార్యక్రమం నిర్వహణ



సాక్షి, అమరావతి: చరిత్ర పుటలు ఎరుగని విప్లవాత్మక పాలనతో నాలుగున్నరేళ్లుగా రాష్ట్రంలో ప్రతి ఇంటికీ, ప్రతి పౌరుడికీ ప్రత్యక్షంగా, పరోక్షంగా చేకూర్చిన మేలును వివరిస్తూ రూపొందించిన భారీ కార్యక్రమం 'వై ఏపీ నీడ్స్ జగన్' (ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే..) గురువారం నుంచి ప్రారంభం కానుంది. పరిపాలనా సంస్కరణలు, వినూత్న కార్యక్రమాల ద్వారా

మిగతా 1వ పేజీలో ▶

మార్పు వివరించి తీర్పు కోరతాం: సజ్జల 9లో

సీమ సిగలో మరో ఉద్యాన కళాశాల

వైఎస్సార్ జిల్లా పులివెందులలో నేడు ప్రారంభించనున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్

ఏపీ కార్ల్ భవనాల్లో తాత్కాలిక ఏర్పాటు.. నేటి నుంచి తరగతులు

60 సీట్లతో బీఎస్సీ ఆనర్స్ (హార్టి) కోర్సుతో శ్రీకారం

ఇప్పటికే 46 సీట్ల భర్తీ.. మిగిలిన సీట్లు నెలాఖరులోగా..

9లో



సామాజిక న్యాయం పరిఢవిల్లుతోంది 2లో

పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో జరిగిన సామాజిక సాధికార యాత్ర సభకు హాజరైన అశేష జనసందోహంలో ఓ భాగం

జగనే ఎందుకంటే..

▶ మొదటి పేజీ తరువాయి

దేశమంతా ప్రశంసించేలా మన రాష్ట్రం సాధించిన పురోభివృద్ధిని అందరికీ క్షుణ్ణంగా తెలియజెప్పేలా దీనికి రూపకల్పన చేశారు. మండలం ప్రాతిపదికన ప్రతి మండలంలో రోజుకొక సచివాలయం పరిధిలో ఈ ప్రచార కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. తొలి రోజు రాష్ట్రవ్యాప్తంగా 711 గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో ప్రారంభం కానుంది. గ్రామాలు, పట్టణాలు, నగరాలలో ఏయే పథకాల ద్వారా ఎంత మంది లబ్ధి పొందారనే వివరాలతో ఆయా గ్రామ, వార్డు సచివాలయాల వద్ద సంక్షేమ అభివృద్ధి బోర్డులను ఆవిష్కరిస్తారు. రోజూ సాయంత్రం 3 నుంచి 5 గంటల మధ్య ఆయా సచివాలయాల పరిధిలో దీన్ని నిర్వహిస్తారు. స్థానిక ప్రజా ప్రతినిధుల ఆధ్వర్యంలో చేపట్టే ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ ఇతర ప్రముఖులను ప్రత్యేకంగా ఆహ్వానిస్తారు. గృహ సారథులు, పార్టీ సానుభూతిపరులు, అభిమానులు ఇందులో పాల్గొంటారు. రాష్ట్రంలో నాలుగున్నరేళ్లుగా జరిగిన ప్రగతి, సాకారమైన మార్పులను తెలియచేయడంతోపాటు గత ప్రభుత్వానికి, ఈ ప్రభుత్వానికి ఉన్న వ్యత్యాసాన్ని వివరిస్తారు. సచివాలయ పరిధిలోని ప్రతి ఒక్కరినీ ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేసేలా ఒక రోజు ముందే వివరాలను ఎస్ఎంఎస్ ద్వారా తెలియజేస్తారు. ఆ తర్వాత రోజు నుంచి వలంటీర్లు వారి పరిధిలో రోజుకు 15 ఇళ్ల చొప్పున సందర్శించి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక కొత్తగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించి చెప్పడంతో పాటు ఆయా కుటుంబాలకు ఎలాంటి లబ్ధి చేకూరింది? ఆ గ్రామానికి ఎంత మేలు జరిగింది? అనే వివరాలను సమగ్రంగా వెల్లడిస్తారు. ఒక్కో గ్రామ సచివాలయం పరిధిలో 5 రోజుల పాటు, వార్డు సచివాలయం పరిధిలో దాదాపు 7 రోజుల పాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహించేలా ఏర్పాట్లు చేసినట్లు అధికారులు వెల్లడించారు. సచివాలయాల వారీగా ఏర్పాటు చేసే సంక్షేమ, అభివృద్ధి బోర్డులను గ్రామ, వార్డు సచివాలయాల శాఖ ఇప్పటికే ఆయా ప్రాంతాలకు చేరవేసింది.

24 పేజీలతో ప్రత్యేక బుక్‌లెట్లు

వై ఏపీ నీడ్స్ జగన్ (ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే..) పేరుతో నిర్వహించనున్న ప్రచార కార్యక్రమంలో భాగంగా 24 పేజీలతో కూడిన ప్రత్యేక బుక్‌లెట్లను రూపొందించారు. వలంటీర్లు ఇంటింటి సందర్శనకు వెళ్లిన సమయంలో వీటిని ప్రతి నివాసంలోనూ పంపిణీ చేస్తారు. పాలనా వికేంద్రీకరణలో భాగంగా ప్రజలకు ప్రభుత్వ సేవలను గడప వద్దే అందించడమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్ సచివాలయాలు-వలంటీర్లు వ్యవస్థను నెలకొల్పిన విషయం తెలిసిందే. పునర్విభజనతో 26 జిల్లాల ఏర్పాటు, వివక్షకు తావులేకుండా సంతృప్త స్థాయిలో సంక్షేమ పథకాల అమలు, నవరత్నాల పథకాల ద్వారా ప్రజలందరికీ మెరుగైన జీవన ప్రమాణాల కల్పన, సామాజిక న్యాయం నినాదంతో బీసీ, ఎస్టీ, ఎస్సీ, మైనార్టీలకు సముచిత స్థానం, మహిళా సాధికారితకు ప్రభుత్వం చేపట్టిన చర్యలను వివరిస్తూ సీఎం జగన్ తనదైన ముద్రతో చేపట్టిన పాలనా సంస్కరణలతో ప్రత్యేకంగా బుక్‌లెట్‌ను రూపొందించారు. అభివృద్ధిపై జాతిపిత గాంధీజీ మొదలు రాజ్యాంగ రూపకర్త బీఆర్ అంబేడ్కర్, మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం, నోబెల్ గ్రహీతలు అమర్త్యసేన్, అభిజిత్ బెనర్జీ, ఆర్‌బీఐ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ తదితరుల నిర్వచనాలను బుక్‌లెట్‌లో ప్రత్యేకంగా ప్రచురించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ కార్యక్రమాల ద్వారా ప్రజల జీవితాల్లో చోటు చేసుకున్న మార్పులు, తలసరి ఆదాయం, జీఎస్‌డీపీ పెరుగుదల, పారిశ్రామిక వృద్ధి రేటు, పరిశ్రమల ఏర్పాటు, ఎంఎస్ఎంఈల ద్వారా కొత్తగా ఉద్యోగాల కల్పన, సమగ్ర భూ సర్వే, రైతు భరోసా, ఇతర కార్యక్రమాల ద్వారా అన్నదాతలకు అందిస్తున్న తోడ్పాటు, వ్యవసాయ వృద్ధి రేటులో పెరుగుదల, అమ్మ ఒడి, నాడు - నేడు ద్వారా మారిపోయిన ప్రభుత్వ స్కూళ్ల స్వరూపం, ఆరోగ్య ఆసరా, ఫ్యామిలీ డాక్టర్ లాంటి వినూత్న కార్యక్రమాలతో పాటు వైద్య రంగంలో భారీ మౌలిక వసతుల కల్పనతో పేదలకు సులభంగా అందుతున్న వైద్య సేవలు, పింఛన్లు, సంక్షేమ పథకాలతో పేదల జీవితాల్లో చోటు చేసుకున్న మార్పులు, దిశ యాప్, పొదుపు సంఘాలకు ప్రోత్సాహం, మహిళా సాధికారిత కోసం చేపట్టిన చర్యలు, రాష్ట్రంలో కొత్తగా పోర్టులు, ఎయిర్‌పోర్టుల నిర్మాణం, పేదలందరికీ ఇళ్లు, మౌలిక వసతుల కల్పన లాంటి వివరాలను బుక్‌లెట్‌లో పొందుపరిచారు. మొత్తంగా వివిధ కార్యక్రమాల ద్వారా నాలుగున్నరేళ్లలో ప్రతి ఒక్కరికీ చేకూరిన లబ్ధి, గత ప్రభుత్వంతో పోలిస్తే ఇప్పుడు ప్రజలకు జరిగిన మేలును సోదాహరణంగా వివరిస్తూ బుక్‌లెట్ రూపుదిద్దుకుంది. పేదల జీవితాలు బాగు పడేవరకు ఈ కార్యక్రమాలు కొనసాగాలన్న సీఎం జగన్ ఆకాంక్షను బుక్‌లెట్‌లో ప్రత్యేకంగా ఉదహరించారు.

షెడ్యూల్ వివరాలతో సచివాలయాలకు సమాచారం..

రాష్ట్రవ్యాప్తంగా తొలిరోజు గురువారం 711 గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం ప్రారంభం కానుంది. రాష్ట్రంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాలతో కలిపి మొత్తం 15,004 గ్రామ, వార్డు సచివాలయాలు ఉండగా మండలాల ప్రాతిపదికన రోజుకొక సచివాలయం పరిధిలో కార్యక్రమాన్ని ఆరంభిస్తారు. నగరాలు, పెద్ద పట్టణాల్లో సులభంగా కొనసాగించేలా చిన్న ప్రాంతాలుగా వర్గీకరించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాలతో కలిపి మొత్తం దాదాపు 900 మండలాల ప్రాతిపదికన కార్యక్రమం అమలుకు కార్యాచరణ సిద్ధం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ఈవోపీఆర్‌డీ, పట్టణ ప్రాంతాల్లో అడిషనల్ కమిషనర్లు దీనికి నోడల్ ఆఫీసర్లుగా వ్యవహరించనున్నారు. ఈ నెల 23వతేదీ వరకు 7,610 గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో ఏ రోజు, ఎక్కడ కార్యక్రమాన్ని నిర్వహిస్తారనే వివరాలతో ఇప్పటికే షెడ్యూల్ రూపొందించి కలెక్టర్ల ద్వారా ఆయా సచివాలయాలకు సమాచారం అందించినట్లు అధికారులు వెల్లడించారు. మిగతా సచివాలయాలకు కూడా త్వరలో షెడ్యూల్ ఖరారు కానుంది. సచివాలయాల పరిధిలో 'సంక్షేమం, అభివృద్ధి బోర్డు' ఆవిష్కరణ కార్యక్రమం పూర్తయిన వెంటనే ఎవరెవరు దీనికి హాజరయ్యారనే వివరాలతోపాటు ఫోటోను ఆయా మండల ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు ప్రత్యేక వెబ్‌పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది.

వలంటీర్లు రోజుకు 15 ఇళ్ల సందర్శన

నాలుగున్నరేళ్లలో ప్రతి గడపకూ జరిగిన మంచిని వలంటీర్లు ఇంటింటి సందర్శన సమయంలో ఆయా కుటుంబ సభ్యులందరికీ సమగ్రంగా తెలియజెప్పేలా రోజుకు 15 ఇళ్ల చొప్పున మాత్రమే సందర్శించేలా ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని ప్రభుత్వం రూపొందించింది. డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా సచివాలయం పరిధిలో ఎంత ప్రయోజనం పొందుతున్నారో వలంటీర్లు ప్రతి కుటుంబానికి తెలియజేస్తారు. ఒకవేళ ఎవరికైనా ఏమైనా అందకుంటే సత్వరమే వారికి అందించి ప్రయోజనం చేకూర్చేలా చర్యలు చేపడతారు. గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో నాడు-నేడు ద్వారా సాకారమైన మార్పులను వివరిస్తారు. ఇంగ్లీషు మీడియం, స్కూళ్లలో 6వ తరగతి నుంచే ఐఎఫ్‌పీ ప్యానెళ్లు, 8వ తరగతిలో ట్యాబ్‌లు పంపిణీ వరకూ మారిపోయిన ప్రభుత్వ విద్యా వ్యవస్థ గురించి తెలియచేస్తారు. వైద్య రంగంలో విలేజ్ క్లినిక్స్‌తో సహా గ్రామంలో వచ్చిన విప్లవాత్మక మార్పులు, ఆర్బీకేలు లాంటి వ్యవస్థతో వ్యవసాయ రంగంలో మునుపెన్నడూ చూడని మార్పుల గురించి ప్రతి ఇంటికీ వివరిస్తారు. పథకాల అమలులో పూర్తి పారదర్శకత, సోషల్ ఆడిట్‌తో ప్రజలకు అందుతున్న నాణ్యమైన సేవల తీరును వివరిస్తారు. దిశ యాప్, ప్రభుత్వ పరిపాలనలో వచ్చిన విప్లవాత్మక మార్పులు గురించి వలంటీర్లు తెలియజేస్తారు. ఆర్థిక ప్రగతిలో గతంలో ఎలా ఉన్నాం? ఇప్పుడు ఎలా ఉన్నాం? అన్న అంశాలను ప్రతి ఇంటికీ చాటి చెబుతారు. గ్రామ సచివాలయాలు, ఆర్బీకేలు, విలేజ్ క్లినిక్స్ కోసం ప్రభుత్వం ఎంత ఖర్చు చేసింది? గడప గడపకూ మన ప్రభుత్వం సమయంలో ప్రజల నుంచి అందిన వినతుల పరిష్కారం కోసం చేసిన వ్యయం వివరాలను వలంటీర్లు ఇంటింటికీ వివరించి చెప్పనున్నారు.



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన సీనియర్ పాత్రికేయులు


99.5% హామీలు నెరవేర్చాం

- జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల హామీనీ నిలబెట్టుకున్నాం
- సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- జర్నలిస్టుల స్థలాల పంపిణీ ప్రక్రియ వేగవంతం చేయాలని అధికారులకు సీఎం ఆదేశం
- స్థలాలు కేటాయిస్తున్నందుకు సీఎం జగన్‌కి ధన్యవాదాలు తెలిపిన పాత్రికేయులు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలన్న నిర్ణయం ద్వారా ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీని నిలబెట్టుకొన్నామని, దాంతోపాటు మేనిఫెస్టోలో పేర్కొన్న 99.5 శాతం హామీలను నెరవేర్చామని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పారు. పలువురు సీనియర్ జర్నలిస్టులు, జర్నలిస్టు సంఘం నాయకులు సీఎం వైఎస్ జగన్‌ను బుధవారం తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో కలుసుకున్నారు. ఈ సమావేశంలో అధికారులు కూడా పాల్గొన్నారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాల పంపిణీ ప్రక్రియను వేగవంతం చేయమని సీఎం జగన్ అధికారులను అక్కడే ఆదేశించారు. జాప్యానికి తావులేకుండా భూముల గుర్తింపు, ఇతర అన్ని అంశాలపై నిర్దిష్టమైన ప్రణాళిక రూపొందించుకొని ముందుకు వెళ్లాలని సీఎం జగన్ అధికారులను ఆదేశించారు. పురోగతిని ఎప్పటికప్పుడు తనకు నివేదించాలన్నారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయిస్తున్నందుకు సీఎం వైఎస్ జగన్‌కి జర్నలిస్టు సంఘం నాయకులు, సీనియర్ పాత్రికేయులు కృతజ్ఞతలు చెప్పారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ రాజశేఖరరెడ్డి ఇళ్ల స్థలాలు ఇచ్చారని వారు గుర్తుచేశారు. అప్పుడు ఇళ్ల స్థలాలు పొందిన జర్నలిస్టులు ఇప్పుడు చాలా సంతోషంగా ఉన్నారన్నారు. మళ్లీ రెండు దశాబ్దాల తర్వాత సీఎం జగన్ మాత్రమే ఇళ్ల స్థలాలు ఇస్తున్నారని అన్నారు. ఇందుకు మన స్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని సీఎంతో అన్నారు. కొందరికే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా అర్హత ఉన్న ప్రతి జర్నలిస్టుకీ ఇళ్ల స్థలాలు ఇవ్వడం సంతోషించదగ్గ విషయమన్నారు. ఈ సమావేశానికి ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి, సమాచార, పౌర సంబంధాల కమిషనర్ టి. విజయకుమార్ రెడ్డి, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు. సీఎం జగన్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపిన పాత్రికేయుల్లో ఏపీ ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు, ఏపీ ప్రభుత్వ సలహాదారు (జాతీయ మీడియా) దేవులపల్లి అమర్, సాక్షి దినపత్రిక రెసిడెంట్ ఎడిటర్ ఎం.రమణమూర్తి, సాక్షి టీవీ మేనేజింగ్ ఎడిటర్ నేమాని భాస్కర్, ఏపీయూడబ్ల్యూజెఎఫ్ నేతలు జి.ఆంజనేయులు, ఎస్.వెంకటరావు, ఏపీ ఎడిటర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వి.వి.ఆర్. కృష్ణంరాజు, ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ ప్రతినిధి విజయ్ భాస్కర్, స్వర్ణాంధ్ర పత్రిక ఎడిటర్ కె.బి.జి. తిలక్, టైమ్స్ ఆఫ్ ఇండియా ప్రతినిధి దారా గోపి, ది హిందూ ప్రతినిధి అప్పాజీ రెడ్డెమ్, దక్కన్ క్రానికల్ ప్రతినిధి ఎండీ ఇలియాస్, సీనియర్ జర్నలిస్టులు కోన సుధాకర్‌రెడ్డి, ఎ.రవీంద్రారెడ్డి, రెహానా, ఎస్.హసీనా తదితరులు ఉన్నారు.

సీఎం జగన్‌ను కలిసిన ఐఎంఏ ఏపీ ప్రతినిధులు

సాక్షి, అమరావతి: ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఏపీ) ప్రతినిధులు బుధవారం తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో సీఎం జగన్‌ను కలిశారు. విజయవాడలో ఈనెల 22 నుంచి 26 వరకు నిర్వహించనున్న జాతీయస్థాయి వైద్యుల క్రీడా ఉత్సవాలకు సీఎం జగన్‌ను వారు ఆహ్వానించారు. ఈ సందర్భంగా వైద్య, ఆరోగ్య శాఖలో విప్లవాత్మక నిర్ణయాలతో ప్రజల ఆరోగ్య రక్షణ కోసం ఏపీ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై హర్షం వ్యక్తం చేస్తూ.. సీఎం జగన్‌ను సన్మానించారు. వైద్యులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను వారు వివరించగా.. సీఎం జగన్ సానుకూలంగా స్పందించారు. వాటిని పరిష్కరిస్తానంటూ హామీ ఇచ్చారు. సమావేశంలో ఏపీ మెడికల్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ సాంబశివారెడ్డి, ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జి.రవికృష్ణ, మాజీ ఐఎంఏ జాతీయ అధ్యక్షుడు, వైద్యుడు డాక్టర్ జి.సమరం, ఐఎంఏ రాష్ట్ర శాఖ ఫైనాన్స్ కార్యదర్శి డాక్టర్ రవీంద్ర నాథ్, జాతీయ వైద్యుల క్రీడా ఉత్సవాల నిర్వాహక కార్యదర్శి డాక్టర్ కార్తీక్ పాల్గొన్నారు.



పోలవరంపై 20న ఢిల్లీలో కీలక భేటీ

సాక్షి, అమరావతి: పోలవరం ప్రాజెక్టును గడువులోగా పూర్తిచేయడానికి ప్రస్తుత సీజన్ (2023-24)లో చేపట్టాల్సిన పనులకు సంబంధించిన కార్యాచరణ ప్రణాళిక (యాక్షన్ ప్లాన్), సవరించిన అంచనా వ్యయం (తొలిదశ పూర్తి) ఖరారే అజెండాగా ఈనెల 20న ఢిల్లీలో కేంద్రం కీలక సమావేశం నిర్వహిస్తోంది. కేంద్ర జల్‌శక్తి శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) చైర్మన్ కుశ్వీందర్‌సింగ్ వోరా, జల్‌శక్తి శాఖ సలహాదారు శ్రీరాం వెదిరె, పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) సీఈవో శివ్‌నందన్‌కుమార్, సభ్య కార్యదర్శి రఘురాం, రాష్ట్ర జలవనరులశాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్, ఈఎన్‌సీ సి.నారాయణరెడ్డి, పోలవరం సీఈ సుధాకర్‌బాబు పాల్గొంటారు. ప్రాజెక్టు పనుల పురోగతిని పీపీఏ సభ్య కార్యదర్శి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించనున్నారు. ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌ల సీపేజీకి అడ్డుకట్ట వేయడం, దెబ్బతిన్న డయాఫ్రమ్ వాల్ స్థానంలో కొత్తది నిర్మించాలా? పాతదానికే మరమ్మతు చేయాలా? వంటి అంశాలపై చర్చించి తుది నిర్ణయం తీసుకోనున్నారు. గడువులోగా ప్రాజెక్టును పూర్తిచేయడానికి వీలుగా ప్రస్తుత సీజన్‌లో చేపట్టాల్సిన పనులను, అందుకు కార్యాచరణ ప్రణాళికను ఖరారు చేయనున్నారు. పోలవరం ప్రాజెక్టు తొలిదశ సవరించిన అంచనా వ్యయాన్ని రూ.31,625.38 కోట్లుగా సీడబ్ల్యూసీ ఖరారు చేసింది. ఇందులో ఇప్పటికే రూ.16,119.57 కోట్ల పనులు పూర్తయ్యాయి. మిగతా పనులకు రూ.15,505.81 కోట్లు అవసరమని కేంద్ర జల్‌శక్తి శాఖకు నివేదిక ఇచ్చింది. సవరించిన అంచనా వ్యయాన్ని ఖరారు చేసేందుకు కేంద్ర ఆర్థికశాఖ రివైజ్డ్ కాస్ట్ కమిటీ (ఆర్‌సీసీ)ని నియమించింది. ఆ కమిటీ అడిగిన వివరాలను రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే పంపింది. ఈనెల 20న జరిగే సమావేశంలో తొలిదశ సవరించిన అంచనా వ్యయంపై చర్చించనున్నారు.

సత్యమేవ జయతే


సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+4 వెల: ₹ 5.50

సంపుటి: 16
సంచిక: 229

గురువారం 9-11-2023



'మహిళల ముఖాలు కళకళలాడుతూ ఉంటేనే కుటుంబమూ, సమాజమూ బాగుంటాయి'



నంబర్‌వన్ శుబ్‌మన్‌గిల్

ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో తొలిసారి అగ్రస్థానానికి.. - 10లో



జర్మనీ నుంచి టెస్లా దిగుమతులు

భారత మార్కెట్లో ఎంట్రీ ఇవ్వాలనే ఆలోచనలో టెస్లా - 11లో

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



నితీశ్ కుమార్ క్షమాపణ

జనాభా నియంత్రణ అంశంపై తాను చేసిన వ్యాఖ్యలపై తీవ్ర దుమారం రేగడంతో బిహార్ సీఎం నితీశ్‌కుమార్ క్షమాపణ చెప్పారు.


వివరాలు 6లో ▸



వందే సాధారణ్ ట్రయల్ రన్

తొలి వందే సాధారణ్ రైలును ముంబై-అహ్మదాబాద్ మధ్య విజయవంతంగా నడిపినట్టు రైల్వే శాఖ తెలిపింది.

వివరాలు 6లో ▸



ఇండోనేసియాలో భూకంపం

ఇండోనేసియాను శక్తిమంతమైన భూకంపం వణికించింది. దీని తీవ్రత రిక్టర్ స్కేల్‌పై 7గా నమోదైంది.

వివరాలు 6లో ▸



రబీలో గోదావరి డెల్టాకు సాగునీరు

గోదావరి డెల్టాకు రబీ కింద సాగునీరు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని కలెక్టర్లను ఆదేశించింది.

వివరాలు 9లో ▸

పిల్లలకు పునర్జన్మ

జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల్లో రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా వైద్యం

వివిధ రకాల ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న చిన్నారులకు సర్కారు అండ

- మెరుగైన వైద్యం అవసరమున్న వారికి ఆరోగ్యశ్రీ కింద చికిత్స.. గుండె, కాక్లియర్ ఇంప్లాంటేషన్ వంటి ఇతర సర్జరీలూ నిర్వహణ
- ఈ క్యాంపుల్లో 7 లక్షల పీడియాట్రిక్ ఓపీలు నమోదు.. వీటిలో 1,247 మందికి పుట్టుకతో గుండె జబ్బులు, వినికిడి లోపం, గ్రహణం మొర్రి, ఇతర పెద్ద సమస్యలు
- వీరిలో 646 మందికి చికిత్స పూర్తి
- చిన్నచిన్న సమస్యలున్న పిల్లలకు శిబిరాల్లోనే వైద్యం.. ఉచితంగా మందులు
- వైద్యం కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లి రావడానికి ప్రయాణ ఛార్జీల కింద రూ.500 అందజేత

8లో



కాకినాడ జిల్లా తాళ్లరేవుకు చెందిన దుర్గావరప్రసాద్, ఆదిలక్ష్మిల కుమార్తె జాహ్నవి గుండె జబ్బుతో బాధపడుతోంది. 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమంలో బాలికను పరీక్షించిన వైద్యులు.. తిరుపతి శ్రీ పద్మావతి చిన్నపిల్లల హృదయాలయానికి రిఫర్ చేయగా.. రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా గుండె ఆపరేషన్ చేయించింది.

ఫ్యాక్ట్‌చెక్

డొక్కు రాతలే దిక్కా రామోజీ..?!

- ఏపీఎస్ ఆర్టీసీపై ఈనాడు అక్కసు రాతలు
- వైఎస్సార్‌సీపీ హయాంలోనే అభివృద్ధి పథంలో ఆర్టీసీ
- వందల సంఖ్యలో కొత్త బస్సులు.. పారదర్శకంగా కొనుగోళ్లు.. కాలపరిమితి ముగిసిన బస్సులు తుక్కుకే
- టీడీపీ ప్రభుత్వ హయాంలో కంటే తగ్గిన బస్సు ప్రమాదాలు

8లో

మహువాపై సీబీఐ విచారణ!



తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ మహువా మొయిత్రా లోక్‌సభలో ప్రశ్నలడిగేందుకు డబ్బులు తీసుకున్నారన్న ఆరోపణలపై సీబీఐ విచారణ జరపనుందని బీజేపీ ఎంపీ నిశికాంత్ దుబే వెల్లడించారు. తన ఫిర్యాదు ఆధారంగా లోక్‌పాల్ ఈ మేరకు ఆదేశించినట్టు తెలిపారు. కాగా, ఈ వివాదంపై నైతిక విలువల కమిటీ నేడు మరోసారి భేటీ కానుంది.

- వివరాలు 6లో

సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులపై కఠిన చర్యలు



- సీఎం కుటుంబంపై అభ్యంతరకర పోస్టులు పెట్టే అకౌంట్లను గుర్తించాం
- వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం
- న్యాయమూర్తిని దూషించిన వారికి నోటీసులిచ్చాం.. ఫేక్ ప్రొఫైల్స్‌తో పోస్టులు పెడితే పోలీసులు పట్టుకోలేరన్న అపోహ వద్దు
- అటువంటి వారిని గుర్తించే పరిజ్ఞానం సీఐడీ వద్ద ఉంది: సీఐడీ అదనపు డీజీ సంజయ్

9లో

భారత వర్సిటీలకు అగ్రాసనం



- క్యూఎస్ ఆసియా యూనివర్సిటీ ర్యాంకింగ్స్‌లో భారత్ టాప్
- 856 విద్యాసంస్థలకు గాను 148 వర్సిటీలతో అగ్రస్థానం
- తమ స్థానాలను సుస్థిరం చేసుకున్న బాంబే, ఢిల్లీ, మద్రాస్ ఐఐటీలు
- తెలుగు రాష్ట్రాల నుంచి 12 వర్సిటీలకు చోటు
- ఆసియాలో అత్యుత్తమ వర్సిటీగా 'పెకింగ్'

- వివరాలు 7లో

ప్రభుత్వాస్పత్రిలో కలెక్టర్ భార్య ప్రసవం

3లో

జగన్ పాలనలోనే గిరిజనులకు మేలు

సీఎం జగన్ వచ్చాకే జీవితాలు బాగు పడ్డాయి

- 70 శాతం పదవుల్లో గిరిజనులు, బడుగు బలహీనవర్గాల నేతలు
- అడగకుండానే ఎస్టీ కమిషన్ వేశారు.. గిరిజన సలహా మండలిని నియమించారు
- జీసీసీ, ట్రైకార్ సంస్థలకు చైర్మన్ పదవులను భర్తీ చేశారు
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, అగ్రవర్ణ పేదలకు సీఎం జగన్ అండగా నిలుస్తున్నారు
- సాలూరు సామాజిక సాధికార సభలో ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర


సాలూరులో జరిగిన సామాజిక సాధికార బస్సుయాత్రలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం రాజన్నదొర

సాక్షి ప్రతినిధి, విజయనగరం: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయిన తర్వాతే గిరిజనులకు మేలు జరిగిందని, వారి జీవితాలు బాగుపడ్డాయని ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర తెలిపారు. సామాజిక సాధికారయాత్రలో భాగంగా బుధవారం పార్వతీపురం మన్యం జిల్లా సాలూరులో జరిగిన బహిరంగసభలో ఆయన ప్రసంగించారు. సీఎం జగన్ వచ్చిన తర్వాతే గిరిజన ప్రాంతాలు అభివృద్ధి చెందాయని, గిరిజన కుటుంబాలు ఆర్థికంగా బలపడుతున్నాయని తెలిపారు. కేబినెట్, ఇతర పదవుల్లో 70 శాతం బడుగు, బలహీన వర్గాలకే అందించిన ఘనత దేశంలో ఒక్క జగన్‌కే దక్కుతుందన్నారు. సీఎం జగన్ గిరిజనులకు ఉప ముఖ్యమంత్రి పదవి ఇచ్చారని, అలా తొలుత పుష్పశ్రీవాణి, తర్వాత తనకు ఆ గౌరవం దక్కిందన్నారు. అడగకుండానే ఎస్టీ కమిషన్ వేశారని, గిరిజన సలహామండలిని నియమించారని, జీసీసీ, ట్రైకార్ సంస్థలకు చైర్మన్ పదవులను భర్తీచేశారని గుర్తు చేశారు. చంద్రబాబు పాలనలో గిరిజనులనే కాదు ఎస్సీలు, బీసీలనూ చిన్నచూపు చూశారని గుర్తుచేశారు. ఎన్నికలకు ముందు ఓ అనామకుడిని తీసుకొచ్చి ఈయనే గిరిజనశాఖ మంత్రి అన్నారని చెప్పారు. సంక్షేమ పథకాల అమల్లోనూ చంద్రబాబుకు, జగన్‌కు ఎంతో వ్యత్యాసం ఉందన్నారు. పింఛన్లు, ఇళ్లు, చేయూత, వైఎస్సార్ రైతుభరోసా.. వంటి ఎన్నో పథకాలతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, అగ్రవర్ణ పేదలకు సీఎం జగన్ అండగా నిలుస్తున్నారని తెలిపారు. ఈ సామాజిక న్యాయం, సుపరిపాలన కొనసాగాలంటే మళ్లీ జగన్‌నే ముఖ్యమంత్రిని చేసుకోవాలని పిలుపునిచ్చారు.


సాలూరులో జరిగిన బహిరంగసభకు హాజరైన జనసందోహంలో ఒక భాగం

అర్హులందరికీ సంక్షేమం: మంత్రి ధర్మాన

జీవితాలను బాగు చేసుకోవడానికి పాలనలో భాగస్వామ్యం, రాజ్యాధికారం కోసం తరాలుగా ఎదురు చూస్తున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల కలను సీఎం వైఎస్ జగన్ సాకారం చేశారని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు చెప్పారు. ఎవరూ ఉద్యమాలు చేయకుండానే పాలనలో పెద్దపీట వేశారని వివరించారు. కులాలు, మతాలు, పార్టీలు, ప్రాంతాలు అంటూ వివక్ష, ఆశ్రిత పక్షపాతం, లంచాలు లేకుండా సంక్షేమ పథకాలను అర్హులైన అందరికీ అందిస్తున్న ముఖ్యమంత్రి దేశంలో ఒక్క జగనే అని స్పష్టం చేశారు. రాజ్యాంగాన్ని తూచా తప్పకుండా అమలుచేసి, సామాజిక న్యాయాన్ని సుసాధ్యం చేసి చూపిన నవతరం నాయకుడు వైఎస్ జగన్ అని చెప్పారు. మూడుసార్లు అవకాశం ఇచ్చినా బీదల సంక్షేమం గురించి ఆలోచించని చంద్రబాబు ఇప్పుడు మళ్లీ ఒక్క అవకాశం ఇవ్వమని అడుగుతున్నాడని ఎద్దేవా చేశారు. హామీలన్నీ తూచా తప్పకుండా అమలుచేస్తున్న సీఎం వైఎస్ జగన్‌ను కాదని, చంద్రబాబు మాయలో పడి ఓటేస్తే మన పీక మనమే కోసుకున్నట్లేనని ధర్మాన హెచ్చరించారు. ఈ ప్రభుత్వాన్ని నిలబెట్టుకోవడం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, అల్పాదాయ వర్గాలకు ఎంతో అవసరమని చెప్పారు.

చిన్నచూపున్న బాబుకు ఓటెందుకు వేయాలి?

నాయీ బ్రాహ్మణుల తోకలు కట్ చేస్తానని, మత్స్యకారులను చితక్కొట్టిస్తానని, బీసీలు ఉన్నత న్యాయస్థానాల్లో జడ్జిలుగా పనికిరారంటూ చిన్నచూపు చూసిన చంద్రబాబుకు ఎందుకు ఓటు వేయాలని శాసన సభ స్పీకర్ తమ్మినేని సీతారాం ప్రశ్నించారు. వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయిన తర్వాత అంబేడ్కర్, గాంధీజీ, జ్యోతిరావు పూలే ఆశయాలను సాకారం చేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, ఎమ్మెల్యేలు శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, విశ్వాసరాయి కళావతి, కంబాల జోగులు, అలజంగి జోగారావు, పుష్ప శ్రీవాణి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు, పరీక్షిత్తురాజు, జీసీసీ చైర్‌పర్సన్ శోభా స్వాతి రాణి తదితరులు పాల్గొన్నారు.

ఇది బడుగు, బలహీన వర్గాల ప్రభుత్వం

సామాన్యుల సంక్షేమమే సీఎం జగన్ ధ్యేయం.. ఆయన దేశానికే రోల్ మోడల్

- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారు
- కనిగిరి సామాజిక సాధికార బస్సు యాత్రలో మంత్రులు
- సీఎం జగన్ రాష్ట్రంలో సామాజిక విప్లవం తెచ్చారు
- దేశంలో మరే ముఖ్యమంత్రి కనీసం ఆలోచన కూడా చేయలేదు
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకే రూ.1.76 లక్షల కోట్లు లబ్ధి చేకూర్చారు
- మంత్రి మేరుగు నాగార్జున


కనిగిరిలో జరిగిన బహిరంగసభలో మాట్లాడుతున్న మంత్రి ఆదిమూలపు సురేష్

సాక్షి ప్రతినిధి, ఒంగోలు : వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల ప్రభుత్వమని మంత్రులు మేరుగు నాగార్జున, ఆదిమూలపు సురేష్ చెప్పారు. సామాన్యుల సంక్షేమమే సీఎం జగన్ ధ్యేయమని, సామాజిక సాధికారత మాటల్లో కాకుండా చేతల్లో చేసి చూపించి దేశానికే రోల్ మోడల్‌గా నిలిచిన ఏకైక ముఖ్యమంత్రి జగన్ అని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను పెద్దన్నలా అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని చెప్పారు. సామాజిక సాధికార బస్సు యాత్రలో భాగంగా బుధవారం ప్రకాశం జిల్లా కనిగిరిలో జరిగిన బహిరంగ సభలో మంత్రులు మాట్లాడారు. మంత్రి మేరుగు నాగార్జున మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ రాష్ట్రంలో సామాజిక విప్లవం తెచ్చారని, దేశంలో ఇప్పటివరకు మరే ముఖ్యమంత్రీ కనీసం ఆలోచన కూడా చేయలేదని చెప్పారు. బడుగు, బలహీన వర్గాల స్థితిగతులు, వారి బాధలు స్వయంగా తెలుసుకుని సీఎం జగన్ న్యాయం చేశారని కొనియాడారు. అనేక పథకాలతో రాష్ట్రవ్యాప్తంగా 2.53 లక్షల కోట్లు ప్రజలకు సంక్షేమం అందించారని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకే రూ.1.76 లక్షల కోట్లు లబ్ధి చేకూర్చిన ఘనత వైఎస్ జగన్‌దేనని అన్నారు.


కనిగిరిలో జరిగిన బహిరంగసభకు హాజరైన జనసందోహంలో ఒక భాగం

బడుగుల ఆత్మ బంధువు సీఎం జగన్: మంత్రి సురేష్

బడుగు, బలహీనవర్గాల ఆత్మ బంధువు సీఎం జగన్ అని మంత్రి ఆదిమూలపు సురేష్ చెప్పారు. పేదరికం పిల్లలకు విద్యను దూరం చేయకూడదనే సంకల్పంతో సీఎం జగన్ నిరుపేదలకు సైతం అంతర్జాతీయ స్థాయిలో ఇంగ్లిష్ మీడియం చదువులు అందుబాటులోకి తెచ్చారని అన్నారు. దళితుడినైన తనను విద్యా శాఖ మంత్రిని చేయడం సాధికారత కాదా అని ప్రశ్నించారు. ఇంగ్లిష్ మీడియంపై గొడవ పెట్టిన టీడీపీ, జనసేన నేతలకు పేద బిడ్డలు మంచి చదువులు చదవడం ఇష్టం లేదా అంటూ ప్రశ్నించారు. పవన్ కళ్యాణ్‌కు దమ్ముంటే ప్రభుత్వ పాఠశాలలో చదివే బడుగు, బలహీన వర్గాల విద్యార్థులతో ఇంగ్లిష్‌లో మాట్లాడాలని సవాల్ చేశారు.

ఇంత మేలు మరే రాష్ట్రంలో జరగలేదు: ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సీఎం వైఎస్ జగన్ చేసిన మేలు ఇప్పటివరకు దేశంలో మరే రాష్ట్రంలోనూ జరగలేదని ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా చెప్పారు. మొట్టమొదటిసారి దేశంలో మంత్రివర్గంలో 70 శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను నియమించడం, ఐదుగురు ఉప ముఖ్యమంత్రుల్లో నాలుగు పదవులు ఇవే సామాజిక వర్గాల వారికివ్వడం సీఎం జగన్‌కే సాధ్యమైందన్నారు. నాలుగు ఎమ్మెల్సీ, 12 రాష్ట్రస్థాయి చైర్మన్ పోస్టులు ఇచ్చిన ఘనత కూడా సీఎం జగన్‌కే దక్కుతోందన్నారు. ఏకంగా ముస్లిం మహిళను మండలి డిప్యూటీ చైర్మన్‌గా నియమించి చరిత్ర సృష్టించారన్నారు.

బీసీలను అణగదొక్కడమే చంద్రబాబు సిద్ధాంతం: ఎంపీ బీద మస్తాన్‌రావు

బీసీలను ఎన్నికల్లో ఓటు బ్యాంకుగా ఉపయోగించుకొని, అధికారంలోకి వచ్చాక అణగదొక్కడమే చంద్రబాబు సిద్ధాంతమని రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు చెప్పారు. 30 ఏళ్ల టీడీపీలో పనిచేసిన తనకు అనేకమార్లు రాజ్యసభ సీటు ఇస్తానని మోసం చేశారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత సీఎం జగన్ నలుగురు బీసీలకు రాజ్యసభకు వెళ్లే అవకాశం కల్పించారని, దేశ చరిత్రలోనే ఇదొక సువర్ణాధ్యాయమని తెలిపారు. యాదవ సామాజిక వర్గానికి చెందిన తాను, కనిగిరి ఎమ్మెల్యే బుర్రా మధుసూదనరావు వంటి తామే సీఎం జగన్ సామాజిక సాధికారత తెచ్చారనడానికి ఉదాహరణ అని చెప్పారు.

కనిగిరిలో రూ.3,471 కోట్లతో అభివృద్ధి : ఎమ్మెల్యే బుర్రా మధుసూదనరావు

సామాన్యుడినైన తనను శాసన సభ్యుడిగా చేసిన ఘనత వైఎస్ జగన్‌దేనని కనిగిరి ఎమ్మెల్యే బుర్రా మధుసూదనరావు చెప్పారు. సీఎం వైఎస్ జగన్ అండతో కనిగిరిలో రూ. 3,471 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని చెప్పారు. కనిగిరిని రెవెన్యూ డివిజన్‌గా చేసి వెనుకబడిన ప్రాంతాన్ని సుందరంగా తీర్చిదిద్దారని కొనియాడారు. 18 వేల ఇళ్లకు ఇంటింటి కుళాయిలు ఇచ్చేందుకు రూ. 125 కోట్లతో పనులు వేగంగా జరుగుతున్నాయని, రూ. 150 కోట్లతో జేజేఎం ద్వారా పనులు చేపడుతున్నామని తెలిపారు. కనిగిరిలో రోడ్లన్నీ అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. కనిగిరి ప్రజలకు మంచి నీటిని అందించేందుకు రూ.1,250 కోట్లతో చేపట్టిన వాటర్ గ్రిడ్ ప్రాజెక్టు టెండర్ల దశలో ఉందని చెప్పారు.

సామాజిక న్యాయం పరిఢవిల్లుతోంది

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సామాజిక సాధికారతను సాకారం చేసిన సీఎం జగన్

- ఈ వర్గాలకు అండగా ఉన్నారు.. రాజకీయంగా సముచిత స్థానం ఇచ్చారు
- పాలకొల్లు సామాజిక సాధికార సభలో మంత్రి చెల్లుబోయిన
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల ఉన్నతికి పాటుపడుతున్న సీఎం జగన్: మంత్రి విశ్వరూప్


పాలకొల్లులో జరిగిన సామాజిక సాధికార బస్సు యాత్ర సభకు హాజరైన జనసందోహంలో ఒక భాగం


పాలకొల్లులో జరిగిన సభలో మాట్లాడుతున్న మంత్రి పినిపే విశ్వరూప్

సాక్షి ప్రతినిధి, ఏలూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో రాష్ట్రంలో సామాజిక న్యాయం పరిఢవిల్లుతోందని రాష్ట్ర సమాచార శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సామాజిక సాధికారత కలను సాకారం చేసిన సీఎం వైఎస్ జగన్ దేశానికే ఆదర్శంగా నిలిచారని తెలిపారు. బుధవారం పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు నియోజకవర్గంలో జరిగిన సామాజిక సాధికార సభలో మంత్రి మాట్లాడారు. దశాబ్దాలుగా రాజకీయ, సామాజిక అభివృద్ధి కోసం ఎదురుచూస్తున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సీఎం జగన్ న్యాయం చేశారని మంత్రి అన్నారు. సీఎం జగన్ ఈ వర్గాలకు అన్ని విధాలుగా అండగా నిలబడటంతోపాటు రాజకీయంగా సముచిత స్థానం కల్పించారని తెలిపారు.

చెబితే తప్పకుండా చేసే నేత సీఎం జగన్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఏదైనా చెబితే దానిని తప్పకుండా చేసే నాయకుడని మంత్రి పినిపే విశ్వరూప్ చెప్పారు. అధికారంలోకి వస్తే పింఛన్‌ను అంచెలంచెలుగా రూ.3 వేలు చేస్తానని చెప్పారని ఆ విధంగానే పెంచి ఈ జనవరి నుంచి రూ.3 వేలు ఇవ్వనున్నారని వివరించారు. 2014లో జగన్ రూ.750 పెన్షన్ ఇస్తానని మేనిఫెస్టోలో ముందుగానే ప్రకటించడంతో చంద్రబాబు రూ.1,000 ఇస్తానని ప్రకటించాడే తప్ప ప్రజలపై ప్రేమ లేదని అన్నారు. 2019లో కూడా జగన్ పెన్షన్‌ను రూ.2 వేలు చేస్తానని ప్రకటించగానే ఎన్నికలకు సరిగ్గా 3 నెలల ముందు చంద్రబాబు రూ.2 వేలు చేసి ప్రజలను మోసం చేయాలని చూశాడని తెలిపారు. సీఎం జగన్ 4.40 లక్షల మందికి ఒకేసారి ఉద్యోగాలు ఇచ్చిన మనసున్న నేత అని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను అక్కున చేర్చుకొని, వారి ఉన్నతికి పాటుపడుతున్న సీఎం జగన్‌కు అందరం మరోసారి మద్దతివ్వాలని కోరారు. సంక్షేమం అభివృద్ధి జరగాలంటే 2024లో కూడా సీఎం జగన్‌కు పట్టం కట్టాలని పిలుపునిచ్చారు.

సంక్షేమం అందిస్తున్న సీఎం జగన్: మండలి చైర్మన్ మోషేన్‌రాజు

శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలు ఏ విధంగా సామాజికంగా, ఆర్థికంగా ఎదగాలని అంబేడ్కర్ భావించారో, అలాగే సీఎం జగన్ ఈ వర్గాలను అభివృద్ధిలోకి తెస్తున్నారని తెలిపారు. ఈ వర్గాలను సామాజికంగా, రాజకీయంగా ముందుకు నడిపిస్తున్నారని చెప్పారు. ఇంగ్లిష్ మీడియం విద్య, అమ్మఒడి వంటి పథకాలతో పేదలను విద్యాధికులను చేస్తున్నారని తెలిపారు.

బడుగుల నాయకుడు సీఎం జగన్ : ఎంపీ నందిగం సురేష్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ బడుగుల నాయకుడని ఎంపీ నందిగం సురేష్ చెప్పారు. రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాలకు ఎన్నో విధాలుగా సంక్షేమాన్ని అందిస్తున్నారన్నారు. విజయవాడలో ఏర్పాటు చేస్తున్న అంబేడ్కర్ వేలు తాడేపల్లిలోని జగన్‌మోహన్‌రెడ్డిని చూపిస్తూ ఆయన ఆలోచనలు, ఆశయాలు కలిగిన వ్యక్తి తాడేపల్లిలో ఉన్నట్లు ఎప్పుడూ చెబుతుందని అన్నారు. చంద్రబాబు తమను జైల్లో పెట్టాలని చూస్తే వైఎస్ జగన్ వాళ్లు ఉండాల్సింది జైల్లో కాదు పార్లమెంటులో అంటూ తనను లోక్‌సభలో కూర్చోబెట్టారని తెలిపారు. ప్రతి పేద పిల్లవాడు ఐఏఎస్, ఐపీఎస్ అయ్యేలా సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వ స్కూళ్లను అత్యున్నతంగా తీర్చిదిద్దుతున్నారని అన్నారు. ఎస్సీ, ఎస్టీ బీసీ, మైనార్టీలు సహా అన్ని వర్గాలు బాగుపడాలంటే 2014లోనూ జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, ఉభయ గోదావరి జిల్లాల వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్, ఎంపీ మిథున్‌రెడ్డి, ప్రభుత్వ చీఫ్ విప్ ప్రసాదరాజు, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్, టీటీడీ పాలకమండలి సభ్యుడు మేకా శేషుబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీఓఎల్‌లో ఏడు ఎఫ్‌పీవోలకు సభ్యత్వం

సాక్షి, అమరావతి: రాష్ట్రానికి చెందిన ఏడు రైతు ఉత్పత్తిదారుల సంఘాల(ఎఫ్‌పీవో)కు జాతీయ సహకార ఆర్గానిక్స్ లిమిటెడ్(ఎన్‌సీఓఎల్)లో సభ్యత్వం లభించింది. దేశవ్యాప్తంగా ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు తగిన ఆదరణతోపాటు ప్రత్యేక మార్కెటింగ్ సౌకర్యం కల్పించడం లక్ష్యంగా ఈ సభ్యత్వాన్ని కల్పించారు. ఈ మేరకు న్యూఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఏడు ఎఫ్‌పీవోలకు ఎన్‌సీఓఎల్‌లో సభ్యత్వం కల్పిస్తూ సర్టిఫికెట్లను అందజేశారు.

పాఠశాల విద్యాశాఖలో పదోన్నతులు

14 మందికి డీడీ, డీఈవోలుగా అవకాశం

సాక్షి, అమరావతి: పాఠశాల విద్యాశాఖలో పదోన్నతులకు అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు(జీవో 282) జారీ చేసింది. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 14 డిప్యూటీ డైరెక్టర్లు, జిల్లా విద్యాశాఖాధికారుల పోస్టులను పదోన్నతులతో భర్తీ చేసేందుకు వీలు కల్పిస్తూ పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ప్రవీణ్ ప్రకాశ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రభుత్వాస్పత్రిలో కలెక్టర్ భార్య ప్రసవం

- మగబిడ్డ జననం..తల్లీబిడ్డ క్షేమం
- ఆదర్శంగా నిలిచిన కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: ఆయన ఆ జిల్లాకే ప్రధాన అధికారి. ఆయన తలచుకుంటే కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్య సేవలు పొందగలరు. కానీ ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందుతున్న మెరుగైన వైద్య సేవల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని నిర్ణయించుకున్నారు. ధైర్యంగా తన భార్యకు ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవం చేయించారు. పలువురికి ఆదర్శంగా నిలిచారు. ఆయన మరెవరో కాదు పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిషాంత్‌కుమార్. వివరాల్లోకి వెళితే...పార్వతీపురం జిల్లా ఆస్పత్రిలో కలెక్టర్ నిషాంత్‌కుమార్ భార్య కరుణ బుధవారం సాయంత్రం మగబిడ్డకు జన్మనిచ్చారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ బి.వాగ్దేవి, వైద్యులు త్రివేణి, చిన్నపిల్లల వైద్యుడు బి.గణేష్ చైతన్య వైద్యసేవలందించి సుఖప్రసవం చేశారు. తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉన్నారు. కలెక్టర్ నిషాంత్ కుమార్ గతంలో రంపచోడవరం ఐటీడీఏ పీవోగా పనిచేసిన సమయంలో అక్కడి సమీపంలోని ప్రభుత్వాస్పత్రిలోనే ఆయన భార్య తొలి సంతానంగా ఆడబిడ్డకు జన్మనిచ్చారు. అలాగే పార్వతీపురంలో పనిచేసిన జాయింట్ కలెక్టర్ ఒ.ఆనంద్ భార్య కూడా ఇటీవల 108 వాహనంలో వెళ్లి పార్వతీపురం జిల్లా ఆస్పత్రిలోనే మగబిడ్డకు జన్మనిచ్చిన సంగతి తెలిసిందే.


కలెక్టర్ దంపతులకు అభినందనలు తెలుపుతున్న పార్వతీపురం ప్రభుత్వాస్పత్రి వైద్యబృందం



సమృద్ధి అనేది... ఆఖరికి మంచి విషయాలకైనా సరే, విలువ ఇవ్వడాన్ని నిరోధిస్తుంది.

– మిగెల్ డె సెర్వాంటీజ్

సాక్షి

గురువారం, 9 నవంబర్ 2023

ఈ నరమేధం ఆగాలి!

నెల దాటిపోయినా, పాలస్తీనాపై ఇజ్రాయెల్ దాడి వ్యవహారానికి ముగింపు కనిపించడం లేదు. గాజా భూఖండంపై భూతల దాడిని ఇజ్రాయెల్ ముమ్మరం చేయడంతో మారణహోమం ముమ్మరమవుతోంది. ఆ ప్రాంతమంతటినీ నిర్జనవాసంగా మార్చేంత వరకు నెతన్యాహూ నిద్ర పోయేలా లేరు. పైపెచ్చు, గాజా ప్రాంతపు భద్రత బాధ్యత ఇక్కపై తమదేనంటూ ఇజ్రాయెల్ ప్రధాని సోమవారం మరో బాంబు పేల్చారు. దాని భావమేమిటో ఆయన విడమరిచి చెప్పనప్పటికీ, గాజాను తన హస్తాల్లో బిగించనున్నట్టు అర్థమవుతూనే ఉంది. గాజాను పునరాక్రమించుకోవడం, లేదంటే కనీసం 2005 సెప్టెంబర్ ముందు లాగా గాజా అంతటా తమ సైన్యమే ఉండేలా చూసుకోవడం ఇజ్రాయెల్ మనసులో మాటగా కనిపిస్తోంది. అదేమీ లేదని నెతన్యాహూ సహచరులు పైకి చెబుతున్నా, ఆ మాటలను నమ్మడం కష్టమే.

సాక్షాత్తూ అమెరికా సైతం తనతో సహా పశ్చిమ దేశాలన్నీ తీవ్రవాద సంస్థగా భావిస్తున్న హమాస్‌తో రేపెప్పుడో యుద్ధం ముగిశాక గాజాను ఇజ్రాయెల్ పునరాక్రమించుకోరాదంటూ బుధవారం హెచ్చరించాల్సి వచ్చింది. అదే సమయంలో గాజాలో హమాస్ పాలన కొనసాగరాదనీ, అదే జరిగితే మళ్ళీ మొన్న అక్టోబర్ 7 తరహా దాడులు పునరావృతం కావచ్చనీ అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ సన్నాయినొక్కు నొక్కారు. గాజా దిగ్బంధనం, భూభాగాన్ని తగ్గించడం, బలవంతాన జనాన్ని ఖాళీ చేయించడం లాంటివేమీ చేయరాదనీ, వెస్ట్ బ్యాంక్‌లోని పాలస్తీనియన్ అథారిటీ పాలన సాగించాలనీ అన్నారు. హమాస్‌ను నిర్వీర్యం చేయడమే లక్ష్యమని పైకి చెబుతున్నప్పటికీ, ఇజ్రాయెల్ దాడులు చేస్తున్న ధోరణి చూస్తే అలా అనిపించడం లేదు.

సరిహద్దులు దాటి హమాస్ చేసిన అక్టోబర్ 7 నాటి దాడిలో ఇజ్రాయెల్‌లో 1400 మంది ప్రాణాలు కోల్పోగా, 240 మంది దాకా బందీలయ్యారు. ఇజ్రాయెల్ నెల రోజుల పైగా సాగిస్తున్న ప్రతీకార దాడిలో ఇప్పటికి 11 వేల మంది దాకా ప్రాణాలు కోల్పోయారని లెక్క. దాడికి ప్రతిదాడిగా మొదలై, తీవ్రవాదం పేరు చెప్పి, అమాయక ప్రజలు సహా అందరినీ కబళిస్తున్న యుద్ధం ఆందోళన కలిగిస్తోంది. పొరుగున ఉన్న భూఖండంలో నరమానవుడు మిగలకుండా నేలమట్టం చేయాలన్న ఇజ్రాయెల్ దుందుడుకుతనం తీవ్రమైనది. ఇదే దూకుడు కొనసాగితే... అప్పుడిక పాలస్తీనా పక్షాన ఇరాన్ తదితర దేశాలు నేరుగా బరిలోకి దిగితే... పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చు.

దేశదేశాల ప్రపంచ వేదిక ఐక్యరాజ్య సమితి (ఐరాస)లో మెజారిటీ దేశాలు శాంతిస్థాపన వైపు మొగ్గి, యుద్ధ విరమణకు తీర్మానం చేయకపోలేదు. అయితే, ఆ శాంతి వచనాలను పట్టించుకున్న నాథుడు లేడు. ఆ తీర్మానాన్ని అమలు చేసేందుకు సమకట్టాల్సిన అగ్రదేశాల్లో అధికభాగం ఈ యుద్ధంలో ఏదో ఒక పక్షం వెనుక పరోక్షంగానైనా నిలబడడం పెద్ద సమస్య. ఐరాస ప్రధాన కార్యదర్శి ఆ మధ్య అన్నట్టు... ఇజ్రాయెల్‌పై హమాస్ దాడి ఉన్నట్టుండి ఏ శూన్యం నుంచో జరగలేదు. అదే సమయంలో ఆయనే వ్యాఖ్యానించినట్టు... పాలస్తీనియన్ల కష్టాలు, కన్నీళ్ళకు పరిష్కారం ఇజ్రాయెల్‌పై హమాస్ చేసిన భయానక దాడి కూడా కాదు. నాణానికి ఉన్న ఈ రెండు వైపులనూ సమగ్రంగా చూడగలిగితేనే ప్రపంచ దేశాలు ఈ సంక్లిష్ట సమస్యకు సరైన జవాబు ఆలోచించగలవు.

అసలు తాజా పరిణామాలకు ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ బాధ్యత కూడా చాలానే ఉంది. అక్టోబర్ 7 హమాస్ దాడికి దారితీసిన ఇజ్రాయెల్ గూఢచర్య వైఫల్యానికీ, అసలు హమాస్ తీవ్రవాదం పెచ్చరిల్లడానికీ, నెల రోజులుగా పాలస్తీనా – ఇజ్రాయెల్‌లలో సాగుతున్న ప్రాణనష్టానికీ ఆయనే బాధ్యుడని సొంత పౌరులే తప్పుబడుతున్నారు. ఇజ్రాయెల్ రాజకీయాల్లోని అస్థిరత సైతం గడచిన కొన్ని వారాల పరిస్థితికి పాక్షికంగా కారణమే. వాటి నుంచి దృష్టి మరల్చడానికే అన్నట్టుంది నెతన్యాహూ వ్యవహారం. హమాస్‌కు అడ్డాలుగా మారాయంటూ, ఆయన ఆస్పత్రులపై బాంబులు వేయించారు. చివరకు నిరాశ్రయులైన పాలస్తీనీయులకు ఆశ్రయమిస్తున్న గాజాలోని అతి ప్రాచీన గ్రీకు ఆర్థొడాక్స్ చర్చినీ వదల్లేదు. గాజాలోని నివాస వసతుల్లో దాదాపు సగానికి పైగా దాడుల్లో నేలమట్టమైన పరిస్థితి. హమాస్ పేరిట సామాన్యులపై సాగుతున్న ఈ అసాధారణ యుద్ధ నేరంపై సహజంగానే నిరసన తలెత్తింది. ఇజ్రాయెల్ పక్షీయులతో సహా అన్ని దేశాలపై ఇప్పుడు తక్షణ కాల్పుల విరమణకు అంతర్జాతీయంగా ఒత్తిడి పెరుగుతోంది.

జీ–7 దేశాల విదేశాంగ మంత్రులు తమ తాజా సమావేశంలో శాశ్వత యుద్ధ విరమణ ఊసెత్తకుండా, అమాయక పాలస్తీనా పౌరులకు సాయం అందించడానికి వీలుగా మానవతా దృక్పథంతో దాడులకు విరామాలు ఇవ్వాలని కోరారు. విస్తృత శాంతి ప్రక్రియకు పూనుకోవాలని మాత్రం అనగలిగారు. ఇవి కంటితుడుపు మాటలే. గాజాలో నరమేధాన్ని మౌనంగా చూస్తున్న ప్రపంచ మానవాళి మొత్తం సమష్టి బాధ్యత వహించాల్సిందే. ఎవరి అంతరాత్మకు వారు జవాబు చెప్పుకోవాల్సిందే. రోజూ 160 మంది పాలస్తీనా పసివాళ్ళు ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. గత మూడు దశాబ్దాల్లో ఎన్నడూ లేనంతగా ఒక పోరులో పదుల సంఖ్యలో జర్నలిస్టులు అసువులు బాశారు. గాజాలో తిండి, నీరు లేక, ఎక్కడికి వెళ్ళాలో తెలియక విలపిస్తూ, ఆత్మీయుల మృతదేహాలను గుర్రపుబండ్లల్లో తీసుకెళుతున్న దృశ్యాల్ని చూసి మనసు కరగనివారు మనుషులు కారు. ఇది త్రాసులో తప్పొప్పుల లెక్కలు తేల్చే తరుణం కాదు. అన్నెం పున్నెం ఎరుగని పిల్లల్నీ, అమాయకుల్నీ ఈ మతి లేని మహా విధ్వంసం నుంచి కాపాడాల్సిన సమయం. చిన్నారుల మరుభూమిగా మారుతున్న గాజా మరింత విధ్వంసంలోకి జారిపోక ముందే యుద్ధానికి తెర దించడం అత్యవసరం.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు. ఆశ్వయుజ మాసం, **తిథి:** బ.ఏకాదశి ఉ.9.32 వరకు, తదుపరి ద్వాదశి, **నక్షత్రం:** ఉత్తర రా.9.45 వరకు, తదుపరి హస్త, **వర్జ్యం:** లేదు, **దుర్ముహూర్తం:** ఉ.9.51 నుండి 10.34 వరకు, తదుపరి ప.2.23 నుండి 3.08 వరకు, **అమృత ఘడియలు:** ప.1.50 నుండి 3.36 వరకు, మతత్రయ ఏకాదశి.

సూర్యోదయం : 6.05
సూర్యాస్తమయం: 5.23
రాహుకాలం : ప.1.30 నుండి 3.00 వరకు
యమగండం : ఉ.6.00 నుండి 7.30 వరకు

శాస్త్ర విజ్ఞానంలోనూ రాజకీయాలా?

విశ్లేషణ



దినేశ్ శర్మ

దేశంలో గడచిన దశాబ్దాల్లో అంతరిక్షం, అణుశక్తి, వాతావరణం వంటి అంశాలను రాజకీయాలకు అతీతంగా ఉంచారు. రాజకీయ నేతలు కూడా ఈ విషయంలో ఆరోగ్యకరమైన, స్పష్టమైన విభజనను పాటించారు. అయితే రాజకీయ మద్దతుకూ, సైన్స్‌ను రాజకీయం చేయడానికీ మధ్య చాలా తేడా ఉంది. శాస్త్ర పరిశోధనలకు కావాల్సినన్ని నిధులు సమకూర్చేందుకు రాజకీయ వర్గాల మద్దతు అవసరం. దేశ విస్తృత ప్రయోజనాలు, లక్ష్యాలు, ఆర్థిక వృద్ధికీ, పరిశోధనలకూ మధ్య పొంతన కుదరాలన్నా ఇది అవసరమే. కానీ చంద్రయాన్ –3 విజయం 2014 తరువాతి ఘనతగా కీర్తించడం భారత అంతరిక్ష పరిశోధన సంస్థ దశాబ్దాలుగా విజయవంతంగా అనుసరిస్తున్న ప్రాజెక్టు ప్లానింగ్ పద్ధతులను అవమానించడమే!


దేశంలోని చాలా శాస్త్రీయ సంస్థలు, పరిశోధన సంస్థలు ఇటీవలి కాలంలో 'సెల్ఫీ పాయింట్'లు ఏర్పాటు చేశాయి. ఇక్కడ సందర్శకులు సెల్ఫీలు తీసుకుని సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేయొచ్చు. ఇన్‌స్టాగ్రామ్ రీళ్లు, ఫేస్‌బుక్ స్టోరీల కాలంలో ప్రభుత్వ సంస్థలు ఇలాంటి గిమ్మిక్కులకు తెగబడటం ఎక్కువైంది. అయితే పరిశోధన సంస్థల విషయంలో ఉద్దేశం వేరు. సెల్ఫీ కేంద్రాలను ఒక నిర్దిష్ట శైలిలో నిర్మించాలని ప్రభుత్వ పెద్దల నుంచి ఆదేశాలు వచ్చాయి. ప్రతిదాంట్లో ప్రధాని ఛాయాచిత్రం ఒకపక్క, ఆ సంస్థ విజయాలు ఇంకోపక్క ప్రదర్శించేలా ఏర్పాట్లు చేశారు.

ప్రాథమిక జ్ఞానం ఉన్నవారికి కూడా దీని వెనుక మతలబు ఏమిటో అర్థం అవుతుంది. ఆయా సంస్థల విజయాలు ఒక వ్యక్తి దయాదాక్షిణ్యాలని పరోక్షంగా చెప్పే ప్రయత్నం ఇది. శాస్త్రీయ పరిశోధన సంస్థలు కూడా సులభంగా ఇందుకు అంగీకరించడం ఆశ్చర్యకరమైన విషయం కాదు. కొందరు ఇంకో అడుగు ముందుకేసి చిన్న పోస్టర్ల స్థానంలో పెద్ద పెద్ద కటౌట్లు పెట్టేశారు.

భారతీయ సైన్స్‌కు ప్రధాని దైవదూత అన్న మాదిరిగా సందేశాలివ్వడం కేవలం సెల్ఫీ పాయింట్లకే పరిమితం కాలేదు. వెబ్‌సైట్లు, సోషల్ మీడియా హ్యాండిల్స్, సైంటిఫిక్ ల్యాబ్స్‌తోపాటు పాఠ్య పుస్తకాల్లోకీ చేరుతోంది. 'ఎన్సీఈఆర్టీ' గత నెలలో విడుదల చేసిన 'చంద్రయాన్ ఉత్సవ' పుస్తక శ్రేణిలోనూ ఇది కనిపించింది. పది పుస్తకాలతో కూడిన ఇవి వేర్వేరు తరగతులకు ఉద్దేశించారు. అన్నింటిలోనూ ప్రధాన ఇతివృత్తం చంద్రయాన్–3 విజయానికి ప్రధాన సూత్రధారి ప్రధాని అని చూపడమే. అది కూడా 2019 నాటి చంద్రయాన్–2 వైఫల్యం తరువాత! సెకండరీ స్టేజ్ (కోడ్ 1.4ఎస్)లో 'గౌరవనీయ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వ లక్షణాల ఫలితంగానే చంద్రయాన్ –3 విజయం సాధించింది' అని స్పష్టంగా చెప్పారు. చంద్రయాన్–2 పాక్షిక విజయంపై వివరిస్తూ... 'వనరులు, శ్రమ, డబ్బు నష్టపోయినా ప్రధాని నిరుత్సాహ పడలేదు. బదులుగా మరింత ఆత్మవిశ్వాసంతో ఇస్రో శాస్త్రవేత్తలు, ప్రజలను చైతన్యవంతులను చేశారు. సరికొత్త దార్శనికత ప్రదర్శించారు' అని రాశారు. ఇందులో ప్రధాని ప్రస్తావన తొమ్మిది సార్లుంది. కానీ 2008లో చంద్రయాన్–1 ద్వారా జాబిల్లిపై నీటి ఉనికిని మొదటిసారిగా గుర్తించిన కీలకమైన విషయాన్ని మాత్రం విస్మరించారు.

ఆత్మ విశ్వాసానికి దెబ్బ...

చంద్రయాన్–3 విజయం 2014 తరువాతి ఘనతగా కీర్తించడం భారత్ అంతరిక్ష పరిశోధన సంస్థ దశాబ్దాలుగా విజయవంతంగా అనుసరిస్తున్న ప్రాజెక్టు ప్లానింగ్ పద్ధతులను అవమానించడమే. ఓ ప్రాజెక్టు విజయానికి రాజకీయ నేతలను కర్తలుగా చేస్తూ పొగడటం సైన్స్‌ను రాజకీయం చేయడమే అవుతుంది. రాజకీయ మద్దతుకూ,



సైన్స్‌ను రాజకీయం చేయడానికీ మధ్య చాలా తేడా ఉంది. శాస్త్ర పరిశోధనలకు కావాల్సినన్ని నిధులు సమకూర్చుకునేందుకు రాజకీయ వర్గాల మద్దతు అవసరం. దేశ విస్తృత ప్రయోజనాలు, లక్ష్యాలు, ఆర్థిక వృద్ధికీ, పరిశోధనలకూ మధ్య పొంతన కుదరాలన్నా ఇది అవసరమే. పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ స్వయంగా దేశ శాస్త్ర పరిశోధన రంగాల తీరుతెన్నులను పర్యవేక్షించారు. సైన్స్‌లో పెట్టుబడుల ఆవశ్యకత గురించి అటు ప్రజలకు, ఇటు అధికారులకు, పార్లమెంటేరియన్లకు అర్థమయ్యేందుకు కృషి చేశారు. ఇవన్నీ ఆయన వెసులుబాటు కల్పించే వాడిగా చేశారు కానీ, నేరుగా పరిశోధన కౌన్సిళ్ల వ్యవహారాల్లో తలదూర్చలేదు.

గడచిన కొన్ని దశాబ్దాల్లోనూ అంతరిక్షం, అణుశక్తి, వాతావరణం వంటి అంశాలను రాజకీయాలకు అతీతంగా ఉంచారు. రాజకీయ నేతలు కూడా ఆరోగ్యకరమైన, స్పష్టమైన విభజనను పాటించారు. శ్రీహరికోట నుంచి జరిగిన ముఖ్యమైన ప్రయోగాల్లో అప్పట్లో ప్రధాని రాజీవ్ గాంధీ రాజకీయంగా బద్ధ శత్రువైన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్.టి. రామారావును వేదిక పైకి ఆహ్వానించిన విషయం గుర్తుచేసుకోవాలి. అటల్ బిహారీ వాజ్‌పేయి ప్రధానిగా ఉండగా చంద్రయాన్–1 ఆలోచన రూపుదిద్దుకుంది. కానీ పలు పార్లమెంటరీ కమిటీల్లో దీనిపై చర్చలు జరిగిన తరువాత గానీ ఆమోదించలేదు. తన పంద్రాగస్టు ప్రసంగంలో వాజ్‌పేయి చంద్రయాన్–1 గురించి తొలిసారి ప్రకటించారు. ఇస్రో ఈ ప్రాజెక్టుకు సోమయాన్ అని పేరు పెడితే వాజ్‌పేయి దాన్ని చంద్రయాన్ అని మార్చారు. అయితే దీన్ని ఎప్పుడూ ఆయన తన వ్యక్తిగత విజయంగా చెప్పుకోలేదు. భారత్– అమెరికా అణు ఒప్పందం తుది దశ చర్చల వివరాలు ప్రతిపక్షాలకూ అందించేందుకు అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ తన సీనియర్ సలహాదారును నియమించారు. అలాగే ప్రతిపక్ష పార్టీల పార్లమెంటు సభ్యులను వాతావరణ మార్పులపై జరిగే సదస్సులకు హాజరయ్యే ప్రతినిధి బృందాల్లో భాగస్వాములను చేశారు.

జోక్యంతో ప్రమాదం...

శాస్త్ర పరిశోధనల విషయంలో రాజకీయాలు ప్రమాదకరం. కేంద్ర శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞాన శాఖల మంత్రి జితేంద్ర సింగ్ పలు మార్లు తన బాస్ అయిన ప్రధాని మోదీ నేతృత్వం కారణంగానే 2014 తరువాత శాస్త్ర రంగంలో అనేక విజయాలు నమోదయ్యాయని పదేపదే చెప్పుకొన్నారు. ఇదే ఇప్పుడు ఎన్సీఈఆర్టీ పుస్తకాల్లోనూ వ్యక్తమైంది. ఇలాంటి ప్రకటనలు ఏళ్లుగా పని చేస్తున్న శాస్త్రవేత్తల నిబద్ధతను తక్కువ చేసి చూపుతాయి. చంద్రయాన్ –1 ఆలోచనకు బీజం 1999లో పడితే వాస్తవరూపం దాల్చింది 2008లో. దీని తరువాత చేపట్టిన ప్రయోగాలు... ఉదాహరణకు చంద్రయాన్ –3, ఆదిత్య ఎల్–1 కూడా 2014కు ముందే మొదలైనవి. వీటి విజయాలకు 2014 తరువాతి రాజకీయ నేతృత్వం కారణమని చెప్పుకోవడం అత్యంత కచ్చితత్వంతో ఎంతోకాలంగా విజయవంతంగా ఇస్రో అమలు చేస్తున్న ప్రాజెక్ట్ ప్లానింగ్, మేనేజ్‌మెంట్ వ్యవస్థలను అవమానించడమే. 2014 కంటే ముందు ప్రయోగించిన ఉపగ్రహాల సంఖ్యను, తరువాతి సంఖ్యను పోల్చడం కూడా సరికాదు. 2014 తరువాత ఇస్రో ప్రయోగించిన ఉపగ్రహాల్లో అత్యధికం మైక్రో శాటిలైట్ల మార్కెట్ పెరగడం పుణ్యంగా వచ్చినవి అని గుర్తుంచుకోవాలి.

ఇంకో విషయం... సైన్స్ విషయాల్లో రాజకీయ జోక్యం పరిశోధన సంస్థల స్వతంత్రత తగ్గిపోయేందుకూ కారణమవుతుంది. ఇది కేంద్రీకృత నిర్ణయాల అమలును ప్రోత్సహిస్తుంది. పరిశోధనల దిశను మారుస్తుంది. శాస్త్ర, సాంకేతిక రంగాలకు ఇప్పుడు కేటాయిస్తున్న నిధులను పరిశీలిస్తే ఈ విషయం స్పష్టమవుతుంది. ఇలాంటి చర్యల వల్ల రాజకీయ సిద్ధాంతాలకు నప్పని శాస్త్రీయ పరిశోధనల ఫలితాలను తొక్కిపెట్టడం వంటివి జరగొచ్చు. జోషీమఠ్‌కు సంబంధించిన ఉపగ్రహ ఛాయాచిత్రాలను ఇస్రో తన వెబ్‌సైట్ నుంచి తొలగించాల్సి రావడం గమనించాలి. సైన్స్ అవార్డులను ప్రస్తుత గవర్నమెంటు రద్దు చేసింది. గుట్టుచప్పుడు కాకుండా అనేక పరిశోధన కేంద్రాలను కూడా మూసేసింది. ఫ్యామిలీ హెల్త్ సర్వేల ఇన్‌ఛార్జ్ శాస్త్రవేత్తను ఇటీవలే సస్పెండ్ చేసి, రాజీనామా చేసేలా చేశారు. జన్యుమార్పిడి పంటల విషయంలో గతంలో స్వతంత్రంగా వ్యవహరించిన 'ద ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీ' కూడా ఇప్పుడు సెల్ఫీ పాయింట్ల ఏర్పాటుకు సంతోషంగా అంగీకరిస్తోంది. ఎగిరే యంత్రాల విషయంలో భారతీయుల జ్ఞానానికి డాక్యుమెంటరీ రుజువుగా వైమానిక శాస్త్రాన్ని ఎన్సీఈఆర్టీ ప్రస్తావిస్తే శాస్త్రవేత్తలు నోరెత్తకుండా ఉన్నారు. ఇవన్నీ సైన్స్ పురోగతికి ఏమాత్రం మేలు చేసేవి కావు.

వ్యాసకర్త సైన్స్ అంశాల వ్యాఖ్యాత
('ది ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

భయమే!



జూలియన్ అసాంజ్ ఒక రాజకీయ నేరస్థుడు. ఆయన రాజకీయ నేరస్థుడిగా ఉన్న ఒకే ఒక్క కారణం... ఆయన మాట్లాడే విషయాలకు వైట్‌హౌస్ (యూఎస్) భయపడటమే!

– ఎడ్వర్డ్ స్నోడెన్, యాక్టివిస్ట్

కొత్త నిర్వచనం



పరిశోధన అంటే... ధనం గురించో, కీర్తి గురించో, మన భావానికి ఒప్పుదల తెచ్చుకోవడం గురించో కాదు. చదవకపోయినా రిటైర్ అయ్యేవరకు వీలైనన్ని పీడీఎఫ్‌లు డౌన్‌లోడ్ చేసిపెట్టుకోవడం!

– నీల్ రెనిక్, పరిశోధకుడు

జనమే పూనుకోవాలి



జరుగుతున్న ఈ పిచ్చితనం మొత్తంలో ఒక్క విషయం గురించైతే నేను నిశ్చయంగా చెప్పగలను. 'ఒకవేళ' ఎప్పటికైనా శాంతి అంటూ వస్తే, అది రెండు సమాజాల్లోని కింది నుంచి పై (బాటమ్ అప్) వ్యవస్థలోని అత్యుత్తమ మనుషుల ద్వారా వస్తుంది. మన పాత, అవినీతిమయ, స్వార్థ, స్వానురక్త 'నాయకులు' ఎప్పటికీ శాంతిని తేలేరు. ఆ బాధ్యత మన మీదే ఉంది.

– ఎమీ దార్, ఇజ్రాయెల్ యాక్టివిస్ట్

పట్టుకుని వేలాడతాం!



చైనీయులు, భారతీయులు, అరబ్బులు వలసవాదం అనుభవించారు. అయినా వాళ్లు బ్రిటిష్ సంస్కృతిని తిరస్కరించారు. ఒక్క ఆఫ్రికన్లు మాత్రమే విదేశీ సంస్కృతులను రక్షించడానికి తమ జీవితాలను త్యాగం చేస్తారు.

– అడేమోలా, పాన్–ఆఫ్రికనిస్ట్

ఇంత కపటమా?



ప్రపంచంలో అత్యంత కపట మనుషులం మనమే. ప్రపంచంలో అత్యధిక జనాభా ఉన్న దేశంగా ఉండటంలో మనకేమీ సిగ్గుండదు. కానీ ఒక ముఖ్యమంత్రి(నితీశ్ కుమార్) బహిరంగంగా కుటుంబ నియంత్రణ చర్యల గురించి మాట్లాడితే మాత్రం సిగ్గుపడతాం.

– సంజయ్ ఘోష్, న్యాయవాది

అది అసభ్యం



ఆయన (బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్) బయటికి మాట్లాడటం కాదు, శాసనసభలో అసభ్యంగా మాట్లాడారు. అది కూడా గుమికూడిన మగ సభ్యుల నవ్వులను స్పష్టంగా మనసులో ఉంచుకున్నారు. దాన్నే శాస్త్రీయ భాషలో అసభ్యతకు తావు లేకుండా చెప్పొచ్చు. ఇలాంటి భాష వల్ల అక్కడ కూర్చున్న మహిళలు సౌకర్యంగా ఉండగలరా?

– అమీత్ దత్తా, న్యాయవాది

ఖండించకూడదా?



యూఏఈ మంత్రి రీమ్ అల్–హాషిమి మీద 'ఫ్రీ పాలస్తీనా' కార్యకర్తలు బురదజల్లే ప్రచారం చేస్తున్నారు. ఇదంతా కూడా న్యాయబద్ధమైన పాలస్తీనా హక్కు కోసం ఆమె నిలబడుతూనే, కేవలం హమాస్ తీవ్రవాదాన్ని ఖండించినందుకు జరుగుతోంది. హమాస్‌ను బట్టబయలు చేసినందుకు కొందరు కోపంగా ఉన్నారు.

– జాహక్ తన్వీర్, కాలమిస్ట్

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

తెలుగు సముద్ధరణ వైతాళికుడు

సందర్భం




డా॥ చింతకుంట శివారెడ్డి

'1825లో తెలుగు మృతి చెంది ఉండడం చూశాను, 30 ఏళ్లలో దానిని పునరుజ్జీవింపచేశాన'ని గర్వంగా చెప్పుకొన్నారు బ్రౌన్. తాళ పత్రాలలో అగ్గిపురుగులకు ఆహుతి అవుతున్న తెలుగు సాహిత్యాన్ని శుద్ధ ప్రతులుగా చేసి, తెలుగుకు తిరిగి ప్రాణంపోసిన మహనీయుడు ఛార్లెస్ ఫిలిప్ బ్రౌన్ (1798– 1884).

జాతి రీత్యా బ్రౌన్ ఆంగ్లేయుడైనప్పటికీ పుట్టుకతో భారతీయుడు. 1798 నవంబర్ 10వ తేదీన రివరెండ్ డేవిడ్ బ్రౌన్, కౌలే దంపతులకు కలకత్తాలో జన్మించారు. మద్రాసు ఫోర్ట్ సెయింట్ జార్జి కాలేజీలో చేరి వెలగపూడి కోదండరామయ్య పంతులు దగ్గర తెలుగులో అక్షరాభ్యాసం చేశారు. శిక్షణలో ఉన్న సివిల్ సర్వెంట్స్ సమావేశంలో అప్పటి మద్రాస్ గవర్నర్ మన్రో 'ఎప్పుడెతై ఇంగ్లీష్ సివిల్ ఆఫీసర్లు – ఆ యా ప్రాంతీయ భాషలు నేర్చుకొని ఆ భాషల్లో స్థానికులతో సంభాషించగలరో ఆనాడే భారతీయులు ఆంగ్లేయులమైన మనల్ని గుర్తిస్తారు, గౌరవిస్తారు' అని ఉద్బోధించారు. అదే సమావేశంలో ఉన్న బ్రౌన్‌పై ఈ మాటలు మంచి ప్రభావాన్ని చూపాయి. దీంతో ప్రాంతీయ భాషల పట్ల ఆయన పరిశోధనాత్మక దృష్టి సారించారు.

మూడేళ్ళపాటు మద్రాసులో ఉద్యోగ శిక్షణ పొందిన తరువాత బ్రౌన్ 1820 ఆగస్టు 20న కడపలో అడుగుపెట్టారు. కలెక్టరుకు అసిస్టెంట్‌గా పనిచేసి అక్కడ నుండి మచిలీపట్నం బదిలీ అయిన తరువాత తిరిగి మూడేళ్ళపాటు కోర్టులో రిజిస్ట్రార్‌గా కడపలో ఉద్యోగ జీవితం గడిపారు. పుస్తకాల ద్వారా మాత్రమే తెలుగు నేర్చుకోవడం కుదరదని గుర్తించి కోర్టులోని వాదులు, ప్రతివాదులు, నేరస్థులు, పరిచారకుల ద్వారా నేర్చుకుని కేవలం రెండేళ్ళ కాలంలోనే తెలుగు మాట్లాడడంలో



ప్రావీణ్యం గడించారు.

కడపలో 15 ఎకరాల తోటను ఒక బంగ్లాతో సహా 1,000 వరహాలకు కొని పదిహేను, ఇరవై మంది పండితులతో కలసి ఆయన 'తెలుగు సాహిత్య సముద్ధరణ మహాయజ్ఞం' జరిపించారు. ఇదే బంగళాలో ఒకవైపు బడి, మరొకవైపు తన సొంత గ్రంథాలయాన్నీ ఏర్పాటుచేసుకున్నారు. ఇదే పవిత్ర క్షేత్రంలోనే జూలూరి అప్పయ్య 'వసుచరిత్ర', 'మనుచరిత్ర'లకు వ్యాఖ్యలు వ్రాశారు. పైడిపాటి వెంకట నరసయ్య వేమన పద్యాలను పరిష్కరించారు. కంభం నరసింహాచార్యులు 'రాఘవ పాండవీయా'నికి వ్యాఖ్య రూపొందించారు. ఈ బంగళా తోటను, అక్కడ సాగే సాహిత్య కృషిని అజమాయిషీ చేస్తూ బ్రౌన్‌కు అత్యంత విశ్వాసపాత్రుడుగా అయోధ్యాపురం కృష్ణారెడ్డి ఉండేవారు .

తన అధ్యయన క్రమంలో 'వేమన' అనే ఒక తెలుగు కవి విస్మరించబడ్డాడని గ్రహించి వేమనకు సంబంధించిన తాళపత్ర గ్రంథాలను సేకరించి వేమన పద్యాలను 'వెర్సెస్ ఆఫ్ వేమన' పేరుతో ఇంగ్లీషులోకి 3238 పద్యాలను అనువదించారు. దాదాపు ముప్ఫైకిపైగా తెలుగు గ్రంథాలను వెలుగులోకి తెచ్చారు. ఆయన పేరును చిర స్థాయిగా నిలిపిన మహోత్కృష్టమైన రచనలు 'ఇంగ్లీషు– తెలుగు', 'తెలుగు–ఇంగ్లీషు' నిఘంటువులు. వీటితోపాటు 'జిల్లా నిఘంటువు', 'మిశ్ర భాషా నిఘంటువు'లను కూడా రూపొందించారు.

ఆయన 1884 డిసెంబర్ 12వ తేదీన తన 81వ ఏట ఇంగ్లండ్‌లో కన్నుమూశారు. 1970వ దశకంలో కడపలో బ్రౌన్ నివసించిన బంగళా తోటను గుర్తించి అక్కడ ఆయన స్మారకార్థం ఒక గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. నేడు ఆ గ్రంథాలయం యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో 'సి.పి. బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం'గా విరాజిల్లుతూ సాహిత్య సేవలందిస్తూ ఉంది.

వ్యాసకర్త సహాయ పరిశోధకులు, సి.పి. బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం, కడప । 94408 59872
(నవంబరు 10న సి.పి. బ్రౌన్ 225 జయంతి)

చైనాకు దీటుగా ఎదుగుతోన్న భారత్!

అభిప్రాయం



జయసూర్య

ప్రపంచంలో అయిదవ భారీ ఆర్థిక వ్యవస్థగా భారత్ తలెత్తుతోంది. 'అంతర్జాతీయ మోనిటరీ ఫండ్' ఇటీవలి నివేదిక ప్రకారం ప్రపంచ ఆర్థికాభివృద్ధిలో భారత్ దాదాపు చైనా స్థాయిలో దోహదం చేయగల పటిష్ఠత సాధిస్తోంది. ప్రపంచ జనాభాలో 35 శాతం పైగా చైనా, భారత్‌లే కలిగి ఉన్నాయి. ఇరుదేశాలూ ఆర్థిక వ్యవస్థ మెరుగుదల కారణంగా చైనా 80 కోట్లు, భారత్ 41 కోట్ల జనాభాను పేదరికం నుంచి తప్పించగలిగాయి. ఐక్యరాజ్య సమితి 'ప్రపంచ స్థాయి 2022 పెట్టుబడుల నివేదిక' ప్రకారం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల రంగంలో 2023లో అగ్ర స్థానంలో ఉన్న 7వ దేశంగా భారత్ స్థానం పొందింది. 2022–23 'ఇండియన్ ఎకానమిక్' సర్వే నివేదిక ప్రకారం రానున్న కాలంలో అతి వేగంగా ఆర్థికాభివృద్ధి సాధించగల దేశంగా 82,000 స్టార్టప్‌లు, 107 యూనీకార్న్ కంపెనీలతో భారత్ డిజిటల్ ఆర్థిక రంగంలో దూసుకుపోతోంది. 2023 జూలైలో మనదేశం 'షాంఘై కో ఆపరేషన్ ఆర్గనైజేషన్' ఆతిథ్య, అధ్యక్ష బాధ్యత, నిర్వర్తించడం విశేషాంశం అయింది.

ప్రపంచం సాధిస్తున్న మొత్తం ఉత్పత్తులలో 20 శాతం పైగా భారత్, చైనాలు భాగస్వామ్యం కలిగి ఉన్నాయి. 2030 నాటికి జీడీపీ వృద్ధి రేటు 7.3 ట్రిలియన్ డాలర్లు సాధించే లక్ష్యంతో మనదేశం చైనాతో సయోధ్య కోరుతోంది. అగ్ర రాజ్యాలైన అమెరికా, చైనాల మధ్య వైరుధ్యం కొనసాగుతున్న తరుణంలో అమెరికాతో భారత్ పరస్పర సహకారం, విశ్వాసం నెలకొల్పే దిశలో అడుగులు వేస్తోంది. భారత రక్షణ రంగాన్ని మరింత స్వయం సమృద్ధితో పటిష్ఠం చేసుకొనే కృత నిశ్చయంతో ప్రధాని నరేంద్ర మోదీ జూన్‌లో, జెట్ ఇంజిన్ సాంకేతిక ఒప్పందాలకు శ్రీకారం చుట్టారు. మన దేశం కంటే 5.5 రెట్లు ఎక్కువ జీడీపీ వృద్ధి రేటు



ఉన్న చైనాతో ఆచితూచి వ్యవహరించే రాజకీయ విజ్ఞత, మెలకువతో కేంద్రం వ్యవహరిస్తోంది. ప్రపంచంలో రెండవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా రూపు దిద్దుకొంటున్న చైనా కూడా కార్పొరేట్ రంగంలో భారీ రుణాల ఒత్తిడి, ఆస్తి సంబంధితంగా తీవ్రమైన అంతర్గత సంక్షోభం, రియల్ ఎస్టేట్ రంగంలో విపరీత వ్యతిరేక పరిణామాల వంటి సవాళ్లను ఎదుర్కోక తప్పడం లేదు. ఒక పక్క సరిహద్దు వివాదాలు కొనసాగుతున్నా సుస్థిర అభివృద్ధి, జన సంక్షేమం, వినూత్న ఆవిష్కరణలు, ఇరు పక్షాల ప్రయోజనాలు లక్ష్యంగా రెండు దేశాల ద్వైపాక్షిక బాంధవ్యం కొనసాగుతోంది.

2049 నాటికి, పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనా 'పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ'ని అమెరికాకు దీటుగా 'వరల్డ్ క్లాస్' మిలటరీగా సంసిద్ధం చేసే కార్యాచరణకు నడుం బిగించింది. 60వ దశకం నుంచి నేటి వరకు కమ్యూనిస్ట్ డ్రాగన్ మన సరిహద్దుల్లో సవాళ్లు విసురుతూనే ఉంది. తాజాగా అరుణాచల్, అక్సాయ్ చిన్ తమ సరిహద్దులలోనివే అంటూ '2023 ఎడిషన్'గా చైనా సహజవనరుల మంత్రిత్వ శాఖ, 'నేషనల్ మ్యాపింగ్ అవగాహనా ప్రచార వారం'లో ఓ మ్యాప్ విడుదల చేసింది.

ఈ పరిస్థితుల్లో అమెరికా మన దేశం పట్ల అత్యంత అనుకూల ప్రోత్సాహ వైఖరితో వ్యవహరిస్తోంది. రక్షణ ఉత్పత్తుల్లో మనం కొనుగోలు చేసేవాటి 80 శాతం ఉత్పత్తి సాంకేతికతలను మనకు బదలాయింపు చేయడానికి ఒప్పుకోవడం చారిత్రాత్మకం. జవహర్‌లాల్ నెహ్రూ 'పంచశీల'కు తూట్లు పొడిచిన చైనా 2023 నాటికి కూడా అదే దుర్నీతి, దురాక్రమణల దాహంతో నేటికీ వెంపర్లాడుతూ ఉండడం కళ్లముందున్న వాస్తవం. అందుకే ఇటు ఆర్థికాభివృద్ధితోపాటూ అటు సైనిక పరంగానూ చైనాకు దీటుగా ఎదగడంలో రాజీలేని కృషి సల్పుతోంది భారత్.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్
మొబైల్: 90149 48336

ఏపీ మోడల్ స్కూల్స్ ఉద్యోగులకు హెల్త్ కార్డులు

సాక్షి, అమరావతి: ఏపీ మోడల్ స్కూల్స్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులకు ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్(ఈహెచ్ఎస్) అమల్లోకి వచ్చింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ బుధవారం ఉత్తర్వులు (జీఓ 271) జారీ చేసింది. దీంతో రాష్ట్రంలో ఉన్న 164 మోడల్ స్కూల్స్‌లో సేవలు అందిస్తున్న దాదాపు 3,260 మంది టీచర్లు, సిబ్బందికి మేలు జరగనుంది. మోడల్ స్కూల్స్ టీచర్లకు హెల్త్ కార్డు అమలుపై మోడల్ స్కూల్స్ ప్రోగ్రెసివ్ టీచర్స్ అసోసియేషన్ హర్షం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా సీఎం వైఎస్ జగన్, విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, విద్యాశాఖ అధికారులకు యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కోమటిరెడ్డి శివశంకర్ రెడ్డి, జి.చంద్రశేఖర్ కృతజ్ఞతలు తెలిపారు.

ట్రిపుల్ ఐటీ డీఎం అభివృద్ధికి కేంద్రం సహకారం

కేంద్ర మంత్రి దేవ్ సిన్హ్ చౌహాన్



కర్నూలు కల్చరల్: ట్రిపుల్ ఐటీ డీఎం అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ సహకారం ఉంటుందని కేంద్ర కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి దేవ్‌సిన్హ్ చౌహాన్ అన్నారు. భవిష్యత్తులో సాంకేతిక విద్యను మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి, రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్‌తో కలిసి ఆయన బుధవారం కర్నూలు ట్రిపుల్ ఐటీ డీఎంను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 151 ఎకరాల్లో రూ.300 కోట్లపైగా నిధులతో ట్రిపుల్ ఐటీ డీఎంను నిర్మిస్తుందని తెలిపారు. ఇక్కడ అసంపూర్తి పనులను త్వరలో పూర్తి చేసేందుకు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఇప్పటికే 5జీ యూజ్ కేస్ ప్రయోగశాలను ఇచ్చామన్నారు. బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి మాట్లాడుతూ కర్నూలు ట్రిపుల్ ఐటీ డీఎంలో జరిగే రీసెర్చ్ నాణ్యత ఐఐటీల కంటే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. వీరి వెంట కర్నూలు ట్రిపుల్ ఐటీ డీఎం డైరెక్టర్ ప్రొఫెసర్ సోమయాజులు తదితరులు పాల్గొన్నారు.

ఐఎన్ఎస్ డేగాను సందర్శించిన రాజస్థాన్ విద్యార్థులు

సాక్షి, విశాఖపట్నం: రాజస్థాన్‌కు చెందిన డైసీ డేస్ ఇంటర్నేషనల్ స్కూల్‌కు చెందిన 200 మంది విద్యార్థులు బుధవారం ఐఎన్ఎస్ డేగాను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఇండియన్ నేవీ ఎయిర్ స్క్వాడ్రన్ ఫాంటమ్స్ బృందం ముఖాముఖి నిర్వహించింది. నౌకాదళంపై విద్యార్థుల్లో అవగాహన కల్పించడంతో పాటు భారత సాయుధ దళాల్లో చేరేలా చిన్నప్పటి నుంచే వారిని ప్రేరేపించేందుకు ఏటా ఈ తరహా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తూర్పు నౌకాదళం అధికారులు చెప్పారు.



ఐఎన్ఎస్ దేగాలో రాజస్థాన్ విద్యార్థులు

నేడు అమ్మవారి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

చంద్రగిరి(తిరుపతి జిల్లా): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలను శుక్రవారం నుంచి ఈ నెల 18వ తేదీ వరకు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు టీటీడీ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. శుక్రవారం ధ్వజారోహణ, 14న గజవాహనం, 18న పంచమీ తీర్థం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా గురువారం సాయంత్రం అమ్మవారి శుక్రవారపు తోటలో అంకురార్పణ ఘట్టాన్ని జరపనున్నారు. ముందుగా అమ్మవారికి విశేష పూజలు నిర్వహించనున్నారు. సాయంత్రం అమ్మవారు ఆలయ మాడ వీధులలో తిరుచ్చిపై ఊరేగుతూ ఉత్సవ నిర్వహణ ఏర్పాట్లను పరిశీలించనున్నారు. అనంతరం శుక్రవారపు తోటలో అమ్మవారిని కొలువుదీర్చనున్నారు. తదుపరి వైదిక కార్యక్రమాలను నిర్వహించి, పాంచరాత్ర ఆగమోక్తంగా ఉత్సవాలకు కావాల్సిన పుట్టమన్నును ఆలయ అర్చకులు సేకరిస్తారు. అనంతరం పుట్టమన్నుతో యాగశాలలో వైదిక కార్యక్రమాలను నిర్వహించి, శుక్రవారం ఉదయం అమ్మవారి ఉత్సవాలకు ఆహ్వానం పలుకుతూ ధ్వజారోహణ ఘట్టంతో ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి.

10న శ్రీవారి దర్శన, గదుల కోటా విడుదల

తిరుమల: డిసెంబర్ 23 నుంచి జనవరి 1వ తేదీ వరకు వైకుంఠ ద్వార దర్శనానికి సంబంధించి రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లు, శ్రీవాణి దర్శన టికెట్లు, గదుల కోటాను నవంబర్ 10న టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. రూ.300 ప్రత్యేక దర్శనానికి సంబంధించి 2.25 లక్షల టికెట్లను ఉదయం 10 గంటలకు, రోజుకు 2 వేల చొప్పున 20 వేల శ్రీవాణి దర్శన టికెట్లను మధ్యాహ్నం 3 గంటలకు, గదుల కోటాను సాయంత్రం 5 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు.

క్లుప్తంగా...

డిసెంబర్‌లో పార్లమెంట్ శీతాకాల సమావేశాలు !

న్యూఢిల్లీ: పార్లమెంటు శీతాకాల సమావేశాలు డిసెంబర్ రెండో వారంలో మొదలవుతాయని సమాచారం. డిసెంబర్ 3న ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడనుండటం తెలిసిందే. ఆ తర్వాత కొద్ది రోజులకే పార్లమెంటు సమావేశాలు మొదలవుతాయని, డిసెంబర్ 25న క్రిస్మస్‌కు ముందు ముగుస్తాయని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. భారతీయ శిక్షా స్మృతి, నేర శిక్షా స్మృతి, సాక్ష్యాధారాల చట్టాల స్థానంలో స్టాండింగ్ కమిటీ ఇటీవలే ఆమోదించిన కొత్త చట్టాలు ఈ సమావేశాల్లో పార్లమెంటు ముందుకు రానున్నాయి. కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్, ఎన్నికల కమిషనర్ల నియామక బిల్లు సైతం పార్లమెంటు వద్ద పెండింగ్‌లో ఉంది. శీతాకాల సమావేశాలు సాధారణంగా నవంబర్ మూడో వారంలో మొదలై క్రిస్మస్ ముందు ముగియడం ఆనవాయితీగా వస్తోంది.

ఇక ఏ ఎన్నికల్లో పోటీ చేయను: సదానంద గౌడ

బనశంకరి: ఇకపై ఏ ఎన్నికల్లోనూ పోటీచేయబోనని కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి, ప్రస్తుత బీజేపీ ఎంపీ డీవీ సదానంద గౌడ ప్రకటించారు. ప్రస్తుతం బెంగళూరు ఉత్తర లోక్‌సభ నియోజకవర్గం నుంచి ఆయన ఎంపీగా ఉన్నారు. బుధవారం హాసన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. 'పార్టీలో అనేక పదవులు అలంకరించాను. ఇంకా ఎక్కువ ఆశించబోను. ఇక ఎన్నికల్లో పాల్గొనబోను. 30 ఏళ్ల రాజకీయ జీవితంలో పార్టీ నాకు అన్ని పదవులు ఇచ్చింది. 10 ఏళ్లు ఎమ్మెల్యేగా, 20 ఏళ్లు ఎంపీగా, ఏడాదిపాటు ముఖ్యమంత్రిగా, నాలుగేళ్లు పార్టీ రాష్ట్ర అధ్యక్షునిగా, ఏడేళ్లు నరేంద్రమోదీ ప్రభుత్వంలో మంత్రిగా సేవలందించా. ఇంకా పదవులు ఆశిస్తే 'స్వార్థపరుడు' అని జనం పిలుస్తారు'' అని ఆయన అన్నారు. ఆయన ఎన్నికల్లో పోటీ చేయకపోయినా రాజకీయాల్లో కొనసాగుతారని ఆయన సన్నిహితులు చెప్పారు.

గిరిజనులు వనవాసీలు కాదు.. ఆదివాసీలు: రాహుల్

అంబికాపూర్: గిరిజనులను అభివృద్ధి చెందడం అధికార బీజేపీకి ఇష్టం లేదని కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. గిరిజనులను ఆదివాసీలు అనడానికి బదులు వనవాసీలు అని బీజేపీ సంబోధిస్తుండడాన్ని ఆయన తప్పుపట్టారు. వనవాసీ, ఆదివాసీకి మధ్య చాలా వ్యత్యాసం ఉందన్నారు. ఆదివాసీ అనే పదం నీరు, అడవి, భూమిపై గిరిపుత్రుల హక్కును సూచిస్తుందని పేర్కొన్నారు. అడవుల్లో నివసించేవారిని వనవాసీ అంటారని చెప్పారు. బుధవారం ఛత్తీస్‌గఢ్‌లోని అంబికాపూర్‌లో ఎన్నికల ప్రచార కార్యక్రమంలో రాహుల్ ప్రసంగించారు. బీజేపీ నాయకులు వారి సొంత బిడ్డలను ఇంగ్లిష్ మీడియం స్కూళ్లకు పంపిస్తూ, ఇంగ్లిష్ నేర్చుకోవద్దని గిరిజనులకు చెబుతున్నారని విమర్శించారు. గిరిజనులు గొప్ప కలలు కనడం కూడా బీజేపీ నేతలకు ఇష్టం లేదన్నారు.

ఇండోనేసియాలో భూకంపం

జకర్తా: శక్తిమంతమైన భూకంపం బుధవారం ఇండోనేసియాను వణికించింది. తూర్పు ప్రాంతంలోని చియాన్ ద్వీపం వరుస ప్రకంపనలతో చిగురుటాకులా వణికిపోయింది. ప్రాణ, ఆస్తి నష్టానికి సంబంధించిన వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. ఈ ద్వీపంలో జనాభా తక్కువగా ఉంటుంది. 'ముందుగా మలుకు ప్రావిన్స్‌లో తీర పట్టణం తువాలుకు 341 కిలోమీటర్ల దూరంలో 6.9 తీవ్రతతో భూమి కంపించింది. తర్వాత అక్కడే 7 తీవ్రతతో మరో భూకంపం సంభవించింది. అనంతరం 5.1 తీవ్రతతో పలుమార్లు భూమి కంపించింది' అని అమెరికా జియోలాజికల్ సర్వే తెలిపింది. వీటివల్ల సునామీ ప్రమాదమేమీ లేదని అధికారులు తెలిపారు. భూకంప కేంద్రాన్ని భూఉపరితలానికి 10 కిలోమీటర్ల లోతులో గుర్తించారు. 27 కోట్ల జనాభా ఉన్న ఇండోనేసియా తరచూ భూకంపాల బారిన పడటం తెలిసిందే. 2004లో ఇక్కడ వచ్చిన 9.1 తీవ్రతతో కూడిన పెను భూకంపం పెను సునామీకి దారి తీయడం, ప్రపంచవ్యాప్తంగా డజను దేశాల్లో 2,30,000కు పైగా ప్రజలు ప్రాణాలు కోల్పోవడం తెల్సిందే.

వ్యక్తిని చంపేసిన రోబో!

సియోల్: దక్షిణ కొరియాలో రోబో బుధవారం ఒక రోబోటిక్స్ సంస్థ ఉద్యోగస్తుడిని పొట్టన పెట్టుకుంది. ఇతను ఆ రోబోను పరీక్షిస్తుండగా ఈ దారుణం జరిగింది. తన సమీపంలో ఉన్నది 'వ్యక్తి' అని ఆ రోబో గుర్తించలేకపోవడమే ఈ ప్రమాదానికి కారణమని ప్రాథమికంగా తెలుస్తోంది. అతడిని కూరగాయల బాక్సుగా పొరబడ్డ రోబో అమాంతంగా అతడిని ఎత్తి కన్వేయర్ పట్టీకేసి నొక్కేసి తల, ఛాతి భాగాలను ఒత్తేసింది. దీంతో అతను రక్తసిక్తమయ్యాడు. విషయం తెల్సుకున్న అక్కడి సిబ్బంది హుటాహుటిన ఆ బాధితుడిని ఆస్పత్రికి తరలించినా లాభం లేకపోయింది. పప్పెర్ బాక్స్‌లను ఎత్తి వాటిని అక్కడే ఉన్న ప్యాలెట్ మీదకు మార్చేలా రోబోట్‌ను డిజైన్‌చేశారు. అది సరిగా పనిచేస్తుందో లేదో అని పరీక్షించేందుకు టెస్ట్‌రన్ జరిపారు. ఆ రోబో సెన్సార్ పనితీరును తనిఖీ చేస్తున్న సమయంలోనే ఈ ప్రమాదం జరిగిందని స్థానిక వార్తాసంస్థ యాన్‌యాప్ తన కథనంలో పేర్కొంది. దక్షిణ గియాంగ్‌సాంగ్ రాష్ట్రంలో ఈ దారుణం చోటుచేసుకుంది. గత మార్చిలో సైతం దక్షిణ కొరియాలో ఆటోమొబైల్ విడి భాగాల తయారీ పరిశ్రమలో ఒక వ్యక్తి ఇదే తరహాలో రోబోట్ చేతిలో తీవ్ర గాయాల పాలయ్యాడు.

సిగ్గుపడాలి

అసెంబ్లీలో నితీశ్ కుమార్ చేసిన వ్యాఖ్యలపై ప్రధాని నరేంద్ర మోదీ ఆగ్రహం

- మహిళ పట్ల గౌరవం లేని నాయకుల వల్ల ఉపయోగం ఏమిటని ధ్వజం
- మహిళల గౌరవాన్ని కాపాడుతానని హామీ
- మధ్యప్రదేశ్‌లో మోదీ ఎన్నికల ప్రచారం

దమోహ్/గుణ: బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ సాక్షాత్తూ అసెంబ్లీలో మహిళలను ఉద్దేశించి దిగజారుడు వ్యాఖ్యలు చేశారని ప్రధాని నరేంద్ర మోదీ మండిపడ్డారు. మహిళలను దారుణంగా అగౌరవపర్చినా ప్రతిపక్ష 'ఇండియా' కూటమి నేతలు నోరు విప్పడం లేదని, కనీసం ఖండించడం లేదని తప్పుపట్టారు. అసెంబ్లీలో చేసిన వ్యాఖ్యల



గుణ జిల్లాలో సభావేదికపై ప్రధాని మోదీని గదతో సత్కరిస్తున్న దృశ్యం

పట్ల నితీశ్ సిగ్గుపడాలని అన్నారు. తల్లులు, అక్కచెల్లెమ్మల పట్ల ఏమాత్రం గౌరవం లేని నాయకులతో ఉపయోగం ఏమిటని ప్రశ్నించారు. మహిళలను చిన్నచూపు చూసే వ్యక్తులకు తగిన బుద్ధి చెప్పాలని ప్రజలకు మోదీ సూచించారు. మహిళల గౌరవాన్ని కాపాడడానికి తాను చేయాల్సిందంతా చేస్తానని హామీ ఇచ్చారు. బుధవారం మధ్యప్రదేశ్‌లోని దమోహ్, గుణ పట్టణాల్లో ఎన్నికల ప్రచార సభల్లో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు తనకు వ్యతిరేకంగా ప్రపంచంలో ఏ కోర్టుకు వెళ్లినా సరే ఉచిత రేషన్ సరుకుల పంపిణీ కార్యక్రమాన్ని కొనసాగిస్తానని తేల్చిచెప్పారు. ప్రతి ఇంట్లోనూ సౌర విద్యుత్ ఉత్పత్తి విధానాన్ని అమలు చేస్తున్నామని, ఇంట్లో వాడుకున్న తర్వాత మిగిలిన కరెంటును ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని పేర్కొన్నారు. దేశంలో ప్రతి పౌరుడూ విద్యుత్ ఉత్పత్తిదారుడే అవుతారని వెల్లడించారు. మధ్యప్రదేశ్‌లో డబుల్ ఇంజన్ ప్రభుత్వం రావడంతో అభివృద్ధి వేగం పుంజుకుందని ప్రధానమంత్రి స్పష్టం చేశారు. రాష్ట్ర బడ్జెట్ రూ.80 వేల కోట్ల నుంచి రూ.3 లక్షల కోట్లకు చేరిందని గుర్తుచేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ గెలిస్తే అభివృద్ధి ఆగిపోతుందని అన్నారు.

'ఉచిత రేషన్' పొడిగింపుపై కాంగ్రెస్ అక్కసు

పేదల ప్రజలకు ఉచిత రేషన్ సరుకుల పంపిణీ పథకాన్ని మరో ఐదేళ్లపాటు పొడిగిస్తామంటూ తాను హామీ ఇవ్వడాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారని, అందుకే ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తామని చెబుతున్నారని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విమర్శించారు. వారిని ఆ పాపం చేయనిద్దామని అన్నారు. తాను మాత్రం పేదల సంక్షేమం కోసం కృషి చేస్తూనే ఉంటానని చెప్పారు. 80 కోట్ల మందికి వచ్చే ఏడేళ్లపాటు ఉచితంగా రేషన్ సరుకులు ఇవ్వబోతున్నామని తెలిపారు. తనను చాలామంది ఇష్టానుసారంగా దూషిస్తున్నారని, అయిప్పటికీ అవినీతిపై పోరాటం ఆపబోనని తేల్చిచెప్పారు. ఎవరెంత తిట్టుకున్నా తాను లెక్కచేయనని అన్నారు. ఛత్తీస్‌గఢ్, రాజస్తాన్‌లో ప్రజలు కాంగ్రెస్‌కు అధికారం అప్పగిస్తే ఆ పార్టీ ముఖ్యమంత్రులు బెట్టింగ్‌ల్లో భాగస్వాములవుతున్నారని, నల్లధనం సృష్టిస్తున్నారని మండిపడ్డారు. ప్రపంచంలో పదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్న మన దేశం తాము 2014లో అధికారంలోకి వచ్చాక ఐదో స్థానానికి చేరుకుందని, 200 ఏళ్లపాటు మన దేశాన్ని పరిపాలించిన ఇంగ్లాండ్‌ను వెనక్కి నెట్టేశామని మోదీ ఉద్ఘాటించారు. ప్రపంచమంతా సంభ్రమాశ్చర్యాలతో మనవైపు చూస్తోందని అన్నారు. తాను మూడోసారి ప్రధానమంత్రి కావడం తథ్యమని, భారత్‌ను ప్రపంచంలో మూడు అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా తీర్చిదిద్దుతానని ప్రకటించారు. మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే '85 శాతం కమిషన్ వ్యవస్థ' మళ్లీ అమల్లోకి వస్తుందంటూ ప్రజలను అప్రమత్తం చేశారు. కాంగ్రెస్‌ను చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు.



బుధవారం బిహార్ అసెంబ్లీ ఆవరణలో ఆందోళనకు దిగిన బీజేపీ ఎమ్మెల్యేలు



ఢిల్లీలోని బిహార్ భవన్ వద్ద బీజేపీ మహిళా కార్యకర్తల నిరసన ప్రదర్శన


నితీశ్ కుమార్ క్షమాపణ

తన వ్యాఖ్యలపై బిహార్ ముఖ్యమంత్రి వివరణ

జనాభా నియంత్రణలో మహిళల అక్షరాస్యత ప్రాధాన్యతను చెప్పాలనుకున్నా..

- నా వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నా..
- శాసన సభ, శాసన మండలిలో, అసెంబ్లీ బయట క్షమాపణ కోరిన నితీశ్

పాట్నా/న్యూఢిల్లీ: జనాభా నియంత్రణ అంశంపై అసెంబ్లీలో తాను చేసిన వ్యాఖ్యలపై తీవ్ర దుమారం రేగడంతో బిహార్ ముఖ్యమంత్రి, జేడీ(యూ) నేత నితీశ్ కుమార్ బుధవారం క్షమాపణ చెప్పారు. శాసన సభ, శాసన మండలిలో, అసెంబ్లీ బయట క్షమాపణ కోరారు. మహిళలు విద్యావంతులైతే గర్భం రాకుండా భర్తతో శృంగారం ఎలా చేయాలో నేర్చుకుంటారని, దానివల్ల జనాభా పెరుగుదల ఆగిపోతుందని నితీశ్ కుమార్ మంగళవారం అసెంబ్లీలో వ్యాఖ్యానించారు. దీనిపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, బీజేపీ నాయకులు, ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ తదితరులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలను దారుణంగా కించపర్చారని నితీశ్‌పై మండిపడ్డారు. తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. నితీశ్ వెంటనే రాజీనామా చేయాలని బిహార్ ప్రతిపక్షాలు పట్టుబట్టాయి. బుధవారం రాష్ట్ర అసెంబ్లీలో అలజడి సృష్టించాయి. నితీశ్ వ్యాఖ్యలను ఖండిస్తూ బీజేపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీ ప్రాంగణంలో ఆయనకు ప్లకార్డులతో స్వాగతం పలికారు. అన్ని వైపుల నుంచి దాడి పెరగడంతో నితీశ్ దిగొచ్చారు. అసెంబ్లీ ప్రాంగణంలో మాట్లాడారు. ''నిన్న సభలో నేను మాట్లాడిన మాటలు కొందరికి నచ్చలేదని అర్థమైంది. మహిళా సాధికారత కోసం మా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను తెలియజెప్పాలన్నదే నా అసలు ఉద్దేశం. జనాభా నియంత్రణలో మహిళల అక్షరాస్యత పాత్ర నానాటికీ పెరుగుతోందని చెప్పాలనుకున్నాను. ఎవరి మనోభావాలైనా దెబ్బతింటే వారిని క్షమాపణ కోరుతున్నా. నా వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నా'' అని నితీశ్ కుమార్ స్పష్టం చేశారు. అనంతరం శాసన సభ, శాసన మండలిలో విపక్షాలు ఆందోళనకు దిగాయి. పోడియం వద్దకు చేరుకొని నినాదాలు చేశాయి. ఉభయ సభల్లోనూ నితీశ్ క్షమాపణ కోరారు.



బిహార్ సీఎం నితీశ్

రేఖా శర్మ, చతుర్వేది మాటల యుద్ధం

నితీశ్ కుమార్ వ్యాఖ్యల విషయంలో జాతీయ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రేఖా శర్మ, శివసేన (ఉద్ధవ్ వర్గం) ఎంపీ ప్రియాంకా చతుర్వేది మధ్య మాటల యుద్ధం కొనసాగింది. నితీశ్ వ్యాఖ్యలను ఖండిస్తూ రేఖ శర్మ తొలుత సోషల్ మీడియాలో పోస్టుచేశారు. నితీశ్ వెంటనే క్షమాపణ చెప్పాలని అన్నారు. ప్రియాంకా చతుర్వేది సహా వివిధ పార్టీల ప్రముఖ మహిళా నేతలను ట్యాగ్ చేశారు. రేఖా శర్మ పోస్టుపై ప్రియాంకా చతుర్వేది స్పందించారు. జాతీయ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ పదవికి రేఖాశర్మ న్యాయం చేయడం లేదని, పక్షపాతంతో వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కీలక పదవిలో ఉన్నవారికి రాజకీయ దురుద్దేశాలు ఉండకూడదని సూచించారు. గతంలో మహిళలకు అవమానాలు ఎదురైనప్పుడు రేఖా శర్మ నోరు మెదపలేదని, నిందితులపై చర్యలు తీసుకోలేదని ఆక్షేపించారు. ప్రియాంకా చతుర్వేది పోస్టుపై రేఖా శర్మ ప్రతిస్పందించారు. గతంలో మీ పార్టీలో(శివసేన)లో ఉన్న ఓ నాయకుడు తప్పు చేస్తే అప్పుడు మీరెందుకు మాట్లాడలేదని నిలదీశారు. సదరు నాయకుడి పేరును ప్రస్తావించలేదు. నితీశ్ కుమార్ క్షమాపణ చెప్పిన తర్వాత కూడా రేఖా శర్మ, ప్రియాంకా చతుర్వేది మధ్య మాటల యుద్ధం కొనసాగింది.

నితీశ్‌పై చర్యలు తీసుకోండి

ముఖ్యమంత్రి నితీశ్ కుమార్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని జాతీయ మహిళా కమిషన్ బిహార్ అసెంబ్లీ స్పీకర్‌ను డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం స్పీకర్ అవధ్‌బిహారీ చౌదరికి లేఖ రాసింది. అసెంబ్లీలో మంగళవారం నితీశ్ చేసిన అభ్యంతకర వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలని కోరింది. మహిళలను కించపర్చేలా ఎవరు మాట్లాడినా సహించబోమని తేల్చిచెప్పింది. నితీశ్ వ్యాఖ్యలను ఖండిస్తున్నామని పేర్కొంది. బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న వ్యక్తి మహిళలను ఉద్దేశించి అభ్యంతరకర వ్యాఖ్యలు చేయడం దారుణమని వెల్లడించింది. నితీశ్ కుమార్ క్షమాపణ జాతీయ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రేఖా శర్మ డిమాండ్ చేశారు.

ఢిల్లీలో బీజేపీ ఆందోళన

మహిళల పట్ల బిహార్ సీఎం నితీశ్ కుమార్ వ్యాఖ్యలను నిరసిస్తూ బుధవారం ఢిల్లీలో బీజేపీ మహిళా నాయకులు, కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. ఢిల్లీలోని బిహార్ భవన్ వద్ద బైఠాయించారు. నితీశ్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నితీశ్ క్షమాపణ చెప్పాలని అన్నారు. ఆయన తక్షణమే పదవి నుంచి తప్పుకోవాలని డిమాండ్ చేశారు.

అభిషేక్ బెనర్జీకి ఈడీ సమన్లు

తొమ్మిదో తేదీన హాజరుకావాలని ఆదేశం

కోల్‌కతా: తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ అభిషేక్ బెనర్జీకి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) మరోసారి సమన్లు జారీ చేసింది. పాఠశాల ఉద్యోగాల కుంభకోణం దర్యాప్తులో భాగంగా నవంబర్ తొమ్మిదో తేదీన(నేడు) కోల్‌కతాలో తమ కార్యాలయంలో విచారణకు హాజరుకావాలని ఆదేశించింది. ఈ విషయాన్ని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమశాఖ మహిళా మంత్రి, పార్టీ అధికార ప్రతినిధి అయిన శశి పంజా చెప్పారు. 'మా పార్టీ జాతీయ స్థాయి ప్రధాన కార్యదర్శి అభిషేక్‌ను ఈడీ కక్షపూరిత రాజకీయాలకు బాధితుడిగా మార్చేసింది' అని ఆమె ఆరోపించారు. సమన్లలో పేర్కొన్న మేరకు అభిషేక్ బెనర్జీ గురువారం ఈడీ ఎదుట హాజరుకానున్నారు. ''వచ్చే సంవత్సరం కీలకమైన ఎన్నికలు సమీపిస్తున్న వేళ తమ నేతలను బెదిరించడానికి బీజేపీ ఇటువంటి రాజకీయాలకు పాల్పడుతోంది'' అని శశి అన్నారు. దీనిపై పశ్చిమబెంగాల్ బీజేపీ రాష్ట్ర విభాగం స్పందించింది. 'కక్షసాధింపు రాజకీయాలపై మాకు నమ్మకం లేదు. జాతీయ దర్యాప్తు సంస్థలు కోర్టు ఆదేశాల మేరకే ఇలా సమన్లు జారీ చేస్తాయి. మీకేమైనా అభ్యంతరాలుంటే కోర్టును ఆశ్రయించండి' అని బీజేపీ అధికార ప్రతినిధి సంబిత్ పాత్రా అన్నారు. ఇప్పటికే అక్టోబర్‌లో బెనర్జీ ఈడీ ఎదుట హాజరైన విషయం విదితమే. సెప్టెంబర్ 13వ తేదీన ఆయనను ఈడీ అధికారులు ఏకంగా తొమ్మిది గంటలపాటు సుదీర్ఘంగా విచారించారు. కీలక 'ఇండియా' కూటమి సమావేశంలో పాల్గొనకుండా టీఎంసీ నేతలను అడ్డుకునేందుకే ఈడీ ఆనాడు అలా చేసిందని అప్పుడే అభిషేక్ ఆరోపించారు. గతంలో బొగ్గు కుంభకోణం కేసులో 2021, 2022 సంవత్సరాల్లో అభిషేక్‌ను ఈడీ అధికారులు రెండు పర్యాయాలు ప్రశ్నించారు.

మహువాపై సీబీఐ విచారణ

- లోక్‌పాల్ ఆమేరకు ఆదేశించింది: బీజేపీ ఎంపీ దూబే వెల్లడి
- నేడు నైతికవిలువల సభా సంఘం భేటీ
- ఆమెపై నివేదికకు ఆమోదం!

న్యూఢిల్లీ: తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ మహువా మొయిత్రా లోక్‌సభలో ప్రశ్నలడిగేందుకు డబ్బులు తీసుకున్నారన్న ఆరోపణలపై సీబీఐ విచారణ జరపనుందని బీజేపీ ఎంపీ నిశికాంత్ దుబే తాజాగా వెల్లడించారు. తన ఫిర్యాదు ఆధారంగా లోక్‌పాల్ ఈ మేరకు ఆదేశించినట్టు వివరించారు. ఈ మేరకు బుధవారం తన సామాజిక మాధ్యమ ఖాతా 'ఎక్స్'లో ట్వీట్‌చేశారు. దీనిపై మొయిత్రా తీవ్రంగా స్పందించారు. ''సీబీఐ ముందుగా అదానీ గ్రూప్ రూ.13 వేల కోట్ల బొగ్గు కుంభకోణం తదితరాలపై విచారణ జరిపితే బాగుంటుంది. ఆ తర్వాత నా అంశానికి రావచ్చు. నాకు ఎన్ని పాదరక్షలున్నాయో లెక్కపెట్టుకోవచ్చు'' అని ఎద్దేవా చేస్తూ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. వ్యాపారవేత్త దర్శన్ హీరానందానీకి మేలు చేసేలా అదానీ గ్రూప్‌పై లోక్‌సభలో మొయిత్రా పలుమార్లు ప్రశ్నలు అడిగారంటూ గత నెలలో దుబే ఆరోపించడం తెలిసిందే. ఇందుకు బదులుగా హీరానందానీ నుంచి డబ్బులతో పాటు ఇతరత్రా పలు రకాలుగా ఆమె భారీ స్థాయిలో లబ్ధి పొందారని ఆమెపై ఆరోపణ. ఎంపీ హోదాలో ఉంటూ డబ్బుల కోసం జాతీయ భద్రతనే ఆమె ప్రమాదంలో పడవేశారని లోక్‌సభ స్పీకర్‌కు దూబే గతంలో ఫిర్యాదు చేయడం తెల్సిందే. దాంతో 15 మంది ఎంపీలతో కూడిన లోక్‌సభ నైతిక విలువల కమిటీ ఈ ఉదంతంపై దర్యాప్తు చేస్తోంది. కమిటీ గత భేటీకి హాజరైన మొయిత్రా, చైర్మన్ తనను అసభ్యకరమైన ప్రశ్నలు అడిగారని ఆరోపిస్తూ వాకౌట్ చేయడం విదితమే. ఈ ఉదంతంపై కమిటీ గురువారం మరోసారి భేటీ కానుంది. డబ్బులకు ప్రశ్నలడిగిన ఉదంతంలో మొయిత్రాను దోషిగా తేలుస్తూ స్పీకర్‌కు కమిటీ నివేదిక సమర్పించనున్నట్టు సమాచారం. అదే జరిగితే దానితో విభేదిస్తూ కమిటీలోని విపక్ష సభ్యులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి (కాంగ్రెస్), కున్వర్ దానిష్ అలీ (బీఎస్పీ) నోట్ ఇస్తారని చెబుతున్నారు.

'వందే సాధారణ్' ట్రయల్ రన్

విజయవంతం

ముంబై: రైల్వే శాఖ దేశంలో తొలిసారిగా ప్రవేశపెడుతున్న 'వందే సాధారణ్' రైలు ట్రయల్ రన్ విజయవంతమైంది. తొలి వందే సాధారణ్ రైలును బుధవారం ముంబై–అహ్మదాబాద్ మధ్య విజయవంతంగా నడిపినట్టు రైల్వే శాఖ పేర్కొంది. సంబంధిత వీడియో సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా షేర్‌అవుతోంది. కొంతకాలం క్రితం ప్రవేశపెట్టిన వందేభారత్ రైళ్లు దేశవ్యాప్తంగా పలు మార్గాల్లో విజయవంతంగా నడుస్తుండటం తెలిసిందే. ఈ నేపథ్యంలో సాధారణ ప్రయాణికుల కోసం అదే తరహాలో 'వందే సాధారణ్' రైళ్లు తేవాలని రైల్వే శాఖ గతంలోనే నిర్ణయించడం తెల్సిందే. వందేభారత్ రైళ్లలో పూర్తిగా ఏసీ కోచ్‌లు ఉండగా 'వందే సాధారణ్' నాన్ ఏసీ కోచ్‌లతో నడవనున్నాయి. వీటిలో మొత్తం 22 స్లీపర్, జనరల్ బోగీలు ఉంటాయి. రెండువైపులా ఇంజన్లుండటం వీటి ప్రత్యేకత. సీసీటీవీ నిఘా, సెన్సార్ ఆధారిత సౌకర్యాలు, తదితర సదుపాయాలను ఈ కోచ్‌లలో కల్పించనున్నారు. ఒక్కో రైలులో 1,800 మంది దాకా ప్రయాణించవచ్చు. ఇవి గంటకు 130 కిలోమీటర్ల వేగంతో దూసుకెళ్తాయని రైల్వే శాఖ చెబుతోంది. దేశంలో 500 కిలోమీటర్లు దాటిన ప్రఖ్యాతిగాంచిన పలు మార్గాల్లో ఈ కొత్తతరహా రైలు సర్వీసులను ప్రారంభించాలని రైల్వేశాఖ యోచిస్తోందని సమాచారం. ముంబై–న్యూఢిల్లీ, పట్నా–న్యూఢిల్లీ, హౌరా–న్యూఢిల్లీ, హైదరాబాద్–న్యూఢిల్లీ, ఎర్నాకులం–గువాహటి మార్గాలు ఈ రూట్‌ల జాబితాలో ఉన్నాయి.

నెల రోజులుగా నెత్తురోడుతోంది

గాజాపై ఇజ్రాయెల్ వైమానిక దాడులు

- సాధారణ నివాస ప్రాంతాలపై క్షిపణుల ప్రయోగం
- గాజాస్ట్రిప్ చిన్నపిల్లల శ్మశానంగా మారుతోంది
- ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో ఆందోళన

ఖాన్ యూనిస్/టెల్ అవీవ్: ఇజ్రాయెల్–హమాస్ మధ్య యుద్ధం మొదలై నెల రోజులు దాటింది. గాజాపై భూతల దాడులను తాత్కాలికంగా నిలిపివేసిన ఇజ్రాయెల్ సైన్యం వైమానిక దాడులను కొనసాగిస్తోంది. బుధవారం గాజా అంతటా క్షిపణులు, రాకెట్లు ప్రయోగించింది. గాజా గత 24 గంటల వ్యవధిలో 214 మంది మరణించారంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. నెల రోజులకుపైగా సాగుతున్న యుద్ధంలో హమాస్ మిలిటెంట్లపై ఇజ్రాయెల్ సైన్యం పైచేయి సాధిస్తోంది. గాజాలో మృతి చెందిన పాలస్తీనియన్ల సంఖ్య 10,569కి చేరుకుంది. గాజాలో పెరిగిపోతున్న మరణాలపై ఐక్యరాజ్యసమితి సెక్రెటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్ ఆందోళన వ్యక్తం చేశారు. గాజా స్ట్రిప్ మొత్తం చిన్నపిల్లల శ్మశాన వాటికగా మారుతోందని చెప్పారు. మృతుల సంఖ్య పెరుగుతోందంటే ఇజ్రాయెల్ సైన్యం తప్పుడు దారిలో పయనిస్తున్నట్లు అర్థమని స్పష్టం చేశారు.

దాడులకు 4 గంటలు విరామం

ఇజ్రాయెల్ హెచ్చరికల నేపథ్యంలో ఉత్తర గాజా నుంచి నిత్యం వేలాది మంది దక్షిణ గాజాకు వలస వెళ్తున్నారు. ఇప్పటిదాకా దాదాపు 70 శాతం మంది వెళ్లిపోయినట్లు అంచనా. గాజా ఆసుపత్రుల్లో గుండెను పిండేసే దృశ్యాలు కనిపిస్తున్నాయి. విద్యుత్ లేక ఆసుపత్రుల్లో ఆపరేషన్లు నిలిచిపోయాయి. ఔషధాలు, వైద్య పరికరాలు లేక క్షతగాత్రులకు చికిత్స అందించడం లేదు. ఇంక్యుబేటర్లలో శిశువులు విగత జీవులుగా మారుతున్నారని డాక్టర్లు చెబుతున్నారు. చాలా హాస్పిటళ్లలో పెట్రోల్, డీజిల్ లేక జనరేటర్లు పనిచేయడంలేదు. ఇజ్రాయెల్ సైన్యం తొలిసారిగా బుధవారం గాజాపై దాడులను 4 గంటలపాటు నిలిపివేసింది. గాజాకు మానవతా సాయం చేరవేయడానికి వీలుగా దాడులు ఆపినట్లు వెల్లడించింది. హమాస్‌పై యుద్ధం ముగిశాక గాజా రక్షణ బాధ్యతను తాము స్వీకరిస్తామంటూ ఇజ్రాయెల్ ప్రధాని చేసిన ప్రకటనపై అమెరికా విదేశాంగ మంత్రి బ్లింకెన్ స్పందించారు. గాజాను ఆక్రమించుకొనే ఆలోచన చేయొద్దని ఇజ్రాయెల్‌కు హితవు పలికారు.



బుధవారం దక్షిణ గాజాలోని రఫా పట్టణంలో ఆహారం కోసం పాలస్తీనియన్ల ఆరాటం

ఇజ్రాయెల్‌కు జీ7 దేశాల మద్దతు

ఇజ్రాయెల్–హమాస్ యుద్ధంపై జీ7 దేశాల విదేశాంగ మంత్రులు, ప్రతినిధులు జపాన్ రాజధాని టోక్యోలో చర్చలు జరిపారు. రెండు రోజులుగా జరుగుతున్న ఈ చర్చలు బుధవారం ముగిశాయి. ఇజ్రాయెల్‌పై హమాస్ మిలిటెంట్ల దాడిని వారు ఖండించారు. ఇజ్రాయెల్‌కు మద్దతు ప్రకటించారు. ఆత్మరక్షణ చేసుకొనే హక్కు ఇజ్రాయెల్‌కు ఉందని తేల్చిచెప్పారు. గాజాలోని పాలస్తీనియన్లకు మానవతా సాయం అందించానికి మార్గం సులభతరం చేయాలని, ఇందుకోసం హమాస్‌పై యుద్ధానికి కొంత విరామం ఇవ్వాలని జీ7 ప్రతినిధులు ఇజ్రాయెల్‌కు సూచించారు. కాల్పుల విరమణ పాటించాలని సూచించకపోవడం గమనార్హం.

50 వేల మందికి 4 టాయిలెట్లు

గాజాలో నెలకొన్న భయానక పరిస్థితులను అమెరికా నర్సు ఎమిలీ చలాహన్ మీడియాతో పంచుకున్నారు. గాజాలో క్షతగాత్రులకు సేవలందించిన ఎమిలీ ఇటీవలే అమెరికా చేరుకున్నారు. 26 రోజుల తర్వాత ఈరోజే స్వేచ్ఛగా ఊపిరి పీల్చుకుంటున్నానని తెలిపారు. గాజాలో 26 రోజుల్లో ఐదు చోట్లకు మారాల్సి వచ్చిందన్నారు. ఒకచోట 35 వేల మంది నిరాశ్రయులు ఉన్నారని తెలిపారు. ముఖాలు, మెడ, కాళ్లు, చేతులపై తీవ్ర గాయాలున్న చిన్నారులు కనిపించారని వెల్లడించారు. 50 వేల మంది తలదాచుకుంటున్న ఓ శిబిరంలో కేవలం 4 మరుగుదొడ్లు ఉన్నాయని పేర్కొన్నారు. అక్కడ రోజుకు కొద్దిసేపు మాత్రమే నీటి సరఫరా జరిగేదని వివరించారు.

మానవ అక్రమ రవాణా కేసులో

పలు రాష్ట్రాల్లో ఎన్ఐఏ దాడులు

న్యూఢిల్లీ: మానవ అక్రమ రవాణా కేసుల విచారణను జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) వేగవంతం చేసింది. బుధవారం దేశవ్యాప్తంగా ఎనిమిది రాష్ట్రాలు, రెండు కేంద్ర పాలిత ప్రాంతాల్లో దాడులు కొనసాగించింది. ఈ కేసుకు సంబంధించి నిందితులను అరెస్టు చేసేందుకు ఏకకాలంలో దాడులు, సోదాలు నిర్వహించింది. త్రిపుర, అస్సాం, పశ్చిమ బెంగాల్, కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ, హరియాణా, రాజస్తాన్ రాష్ట్రాలతో పాటు కేంద్ర పాలిత ప్రాంతాలైన జమ్మూ కశ్మీర్, పుదుచ్చేరిలలో ఈ దాడులు చేశామని బుధవారం వెలువరించిన ఒక ప్రకటనలో ఎన్ఐఏ పేర్కొంది. ఐదు మాడ్యూల్స్‌ను బట్టబయలుచేయడంతోపాటు ఈ కేసుతోసంబంధం ఉన్న 44 మందిని అరెస్ట్‌చేశారు. 44 మందిలో అత్యధికంగా త్రిపురలో 21 మందిని అరెస్ట్‌చేసింది. తెలంగాణలో ఒకరిని అరెస్ట్ చేశారు. జమ్మూ కశ్మీర్‌లో నిర్వహించిన సోదాల్లో మయన్మార్‌కు చెందిన రోహింగ్యా ముస్లిం జాఫర్ అలామ్‌సహా పలువురిని జమ్మూ, సాంబా జిల్లాల్లో బుధవారం అరెస్ట్‌చేశారు. ఇతడితోపాటు ఉన్న మరో వ్యక్తి పరారైనట్లు తెలుస్తోంది. మయన్మార్ నుంచి వలస వచ్చిన రోహింగ్యాలు ఉంటున్న ప్రాంతాల్లో ఈ దాడులు కొనసాగాయి. పాస్‌పోర్టు చట్టాల అతిక్రమణ, మానవ అక్రమ రవాణాకు సంబంధించిన గతంలో నమోదైన కేసుల విచారణలో భాగంగా ఎన్ఐఏ ఈ దాడులు చేసింది. అక్టోబర్‌లో శ్రీలంకకు చెందిన పలువురిని తమిళనాడు మీదుగా బెంగళూరు, మంగళూరుకు అక్రమంగా తరలించిన కేసులో ఇమ్రాన్ ఖాన్ అనే వ్యక్తిని ఎన్ఐఏ అధికారులు అరెస్టు చేశారు.

బాబు ముందస్తు బెయిల్‌పై నేడు విచారణ

సాక్షి, న్యూఢిల్లీ: ఫైబర్‌నెట్ కుంభకోణం కేసులో టీడీపీ అధినేత చంద్రబాబు దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు గురువారం విచారించనుంది. ఏపీ ఫైబర్‌నెట్ ప్రాజెక్టు వర్క్ ఆర్డర్‌కు సంబంధించి జరిగిన అవకతవకల వల్ల రాష్ట్ర ఖజానాకు నష్టం వాటిల్లిందంటూ ఏపీ సీఐడీ కేసు నమోదు చేసింది. ఈ కేసులో ఏపీ హైకోర్టు ముందస్తు బెయిల్ నిరాకరించడంతో మాజీ సీఎం చంద్రబాబు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను జస్టిస్ అనిరుద్ధ బోస్, జస్టిస్ బేలా ఎం త్రివేదిలతో కూడిన ధర్మాసనం విచారించనుంది.

'ఫైబర్‌నెట్' విచారణ ఈ నెల 10కి వాయిదా

సాక్షి, అమరావతి: టీడీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన ఫైబర్‌నెట్ కుంభకోణంలో నిందితులైన చంద్రబాబు సన్నిహితుల స్థిరాస్తుల అటాచ్‌మెంట్‌కు అనుమతి కోరుతూ సీఐడీ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను ఏసీబీ న్యాయస్థానం ఈ నెల 10కి వాయిదా వేసింది. నిబంధనలకు విరుద్ధంగా ఫైబర్‌నెట్ ప్రాజెక్టు కాంట్రాక్టును టీడీపీ ప్రభుత్వం చంద్రబాబు సన్నిహితుడు వేమూరి హరికృష్ణకు చెందిన టెరాసాఫ్ట్ కంపెనీకి కట్టబెట్టడంపై సీఐడీ కేసు నమోదు చేయడం తెలిసిందే. ఈ కుంభకోణంలో కీలక పాత్ర పోషించిన చంద్రబాబు సన్నిహితులకు చెందిన ఏపీ, తెలంగాణలోని ఏడు స్థిరాస్తుల అటాచ్‌మెంట్‌కు అనుమతించాలని ఏసీబీ కోర్టులో సీఐడీ పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై విచారణను ఈ నెల 10కి వాయిదా వేస్తున్నట్లు ఏసీబీ కోర్టు బుధవారం పేర్కొంది.

మద్యం కుంభకోణం కేసులో ముందస్తు బెయిల్ ఇవ్వండి

- హైకోర్టులో కొల్లు రవీంద్ర పిటిషన్

సాక్షి, అమరావతి: తమ పార్టీ నేతలకు చెందిన మద్యం కంపెనీలకు అడ్డగోలుగా అనుమతులు మంజూరు చేసి ఖజానాకు కోట్ల రూపాయల నష్టం కలిగించినందుకు సీఐడీ నమోదు చేసిన కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలంటూ అప్పటి మంత్రి కొల్లు రవీంద్ర హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై హైకోర్టు గురువారం విచారించనుంది. అస్మదీయులకు అడ్డగోలు అనుమతులు ఇవ్వడం ద్వారా ఖజానాకు రూ.1,300 కోట్ల మేర నష్టం కలిగించారంటూ ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ ఎండీ వాసుదేవరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు తదితరులపై సీఐడీ కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే.

చంద్రబాబుపై పీటీ వారెంట్ కేసు విచారణ 29కి వాయిదా

సాక్షి, అమరావతి: టీడీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన ఫైబర్‌నెట్ కుంభకోణం కేసులో చంద్రబాబును అరెస్ట్ చేసేందుకు అనుమతి కోరుతూ సీఐడీ దాఖలు చేసిన పీటీ వారెంట్‌పై విచారణను విజయవాడ ఏసీబీ న్యాయస్థానం ఈ నెల 29కి వాయిదా వేసింది. స్కిల్ స్కామ్ కేసులో చంద్రబాబుకు ఈ నెల 28 వరకూ మధ్యంతర బెయిల్ ఉన్నందున పీటీ వారెంట్‌పై విచారణను ఆ మరుసటి రోజుకు వాయిదా వేస్తూ న్యాయస్థానం బుధవారం ఉత్తర్వులిచ్చింది.

అప్పట్లో నిమ్మగడ్డ ఏమయ్యారు: మేరుగు



ఒంగోలు: కుప్పంలో పొరుగు రాష్ట్రంలోని పౌరుల పేర్లతో దొంగ ఓట్లు చేర్పించినప్పుడు నిమ్మగడ్డ రమేష్ ఏమయ్యారని జిల్లా ఇన్‌చార్జి మంత్రి మేరుగు నాగార్జున ప్రశ్నించారు. బుధవారం ఒంగోలులో మీడియాతో మాట్లాడుతూ.. నిన్నటివరకు రాష్ట్రంలో ఏం జరుగుతుందో నిమ్మగడ్డ రమేష్‌కు తెలియదా అని ప్రశ్నించారు. ప్రభుత్వం త్రికరణ శుద్ధిగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాల్సి ఉందన్నారు. అలాకాకుండా గతంలో కుప్పంలో చేర్పించిన దొంగ ఓట్లను కాపాడుకోవాలనుకుంటే అవకాశం ఉండదని పేర్కొన్నారు. చంద్రబాబు హయాంలోనే దొంగ ఓట్ల సంస్కృతి అయినా, ఓటుకు నోటు అయినా, పక్క రాష్ట్రాల నుంచి రప్పించి ఓట్లు చేర్పించే సంస్కృతి ఉండేదన్నారు. తమ ప్రభుత్వంలో అటువంటి వాటికి ఆస్కారం లేదన్నారు.

భారత వర్సిటీలకు అగ్రాసనం

క్యూఎస్ ఆసియా యూనివర్సిటీ ర్యాంకింగ్స్‌లో ఇండియా టాప్

- 856 విద్యాసంస్థలకు గాను 148 వర్సిటీలతో అగ్రస్థానం
- తమ స్థానాలను సుస్థిరం చేసుకున్న బాంబే, ఢిల్లీ, మద్రాస్ ఐఐటీలు
- 40వ ర్యాంకుతో ఐఐటీ బాంబే జాతీయ స్థాయిలో అత్యుత్తమ వర్సిటీగా గుర్తింపు
- తెలుగు రాష్ట్రాల నుంచి 12 వర్సిటీలకు చోటు
- ఆసియాలో అత్యుత్తమ యూనివర్సిటీగా 'పెకింగ్'



సాక్షి, అమరావతి: ప్రపంచ ప్రఖ్యాత క్వాక్వరెల్లి సైమండ్స్ (క్యూఎస్) ఆసియా వర్సిటీల ర్యాంకింగ్స్‌లో భారత్ అత్యధిక విద్యా సంస్థలతో అగ్రస్థానంలో నిలిచింది. బుధవారం 856 విద్యా సంస్థలతో క్యూఎస్ ఆసియా వర్సిటీ ర్యాంకులను విడుదల చేసింది. ఈ జాబితాలో 148 వర్సిటీలతో భారత్ మొదటి స్థానంలో నిలవడం విశేషం. గతేడాదితో పోలిస్తే కొత్తగా 37 భారతీయ వర్సిటీలు ర్యాంకులు పొందాయి. టాప్-100 ర్యాంకుల్లో ఏడు భారతీయ వర్సిటీలకు చోటు దక్కింది. క్యూఎస్ సంస్థ అంతర్జాతీయంగా ఉన్నత విద్యలో అత్యుత్తమ ప్రమాణాలు కలిగిన వర్సిటీలకు 11 సూచికల్లో విశ్లేషించి ర్యాంకులను ఇస్తోంది.

దేశంలో ఐఐటీ బాంబే టాప్

ఆసియా క్యూఎస్ ర్యాంకుల్లో జాతీయ స్థాయిలో మొదటి మూడు ర్యాంకులు మునుపటి ఎడిషన్‌తో పోలిస్తే స్థిరంగా ఉన్నాయి. ఐఐటీ-బాంబే గతేడాది మాదిరిగానే 40వ ర్యాంకులో కొనసాగుతూ భారత్‌లో ఉత్తమ వర్సిటీగా నిలిచింది. ఆ తర్వాత ఐఐటీ-ఢిల్లీ (46), ఐఐటీ-మద్రాస్ (53) స్థిరంగా ఉన్నాయి. ఐఐఎస్‌సీ బెంగళూరు (58), ఐఐటీ ఖరగ్‌పూర్ (59), ఐఐటీ కాన్పూర్ (63), ఢిల్లీ వర్సిటీ(94) వంద లోపు ర్యాంకులు సాధించాయి. 100-200 ర్యాంకింగ్స్‌లో ఐఐటీ గౌహతి 111, ఐఐటీ రూర్కీ 116వ ర్యాంకులో నిలిచాయి. జవహర్‌లాల్ నెహ్రూ వర్సిటీ 117, బెనారస్ హిందూ వర్సిటీలకు 199, గతేడాది 185 స్థానంలో ఉన్న ఛండీగఢ్ వర్సిటీ 149కి వచ్చింది. కోయంబత్తూరులోని భారతీయార్ వర్సిటీ 205 నుంచి 171కి, అమిటీ వర్సిటీ 200 నుంచి 186కి, వెల్లూరులోని విట్ పది స్థానాలు మెరుగుపర్చుకుని 163 ర్యాంకును సొంతం చేసుకున్నాయి.

ఆసియా టాప్ వర్సిటీ 'పెకింగ్'

భారత్ తర్వాత క్యూఎస్ ఆసియా ర్యాంకింగ్స్‌లో చైనా 133, జపాన్ 96 వర్సిటీలతో రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి. మయన్మార్, కంబోడియా, నేపాల్ తొలిసారిగా జాబితాలో చోటు దక్కించుకున్నాయి. చైనాకు చెందిన పెకింగ్ విశ్వవిద్యాలయం వరుసగా రెండవ ఏడాది టాప్ వర్సిటీగా నిలిచింది. హాంకాంగ్ విశ్వవిద్యాలయం 4వ స్థానం నుంచి రెండవ స్థానానికి ఎగబాకింది. నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ సింగపూర్ (ఎన్‌యూఎస్) ఈ ఏడాది రెండో స్థానం నుంచి మూడవ స్థానానికి పడిపోయింది. నాన్యాంగ్ టెక్నలాజికల్ వర్సిటీ (ఎన్‌టీయూ) ఐదు నుంచి నాలుగో స్థానానికి చేరుకుంది.

ఏపీ నుంచి ఐదు ప్రభుత్వ వర్సిటీలు

తెలుగు రాష్ట్రాల నుంచి 12 వర్సిటీలకు క్యూఎస్ ఆసియా వర్సిటీల జాబితాలో స్థానం లభించింది. యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ జపాన్‌కు చెందిన కుమామోటో వర్సిటీతో సమానంగా 228 ర్యాంకును పంచుకుంటోంది. ఆ తర్వాత ఐఐటీ హైదరాబాద్ (301-350), ఉస్మానియా, తిరుపతిలోని శ్రీవెంకటేశ్వర (451-500), అనంతపురంలోని శ్రీకృష్ణదేవరాయ (551-600), గుంటూరులోని ఆచార్య నాగార్జున (601-650), విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్సిటీ, అనంతపురంలోని జేఎన్‌టీయూ (651-700), ఆ తర్వాతి స్థానాల్లో హైదరాబాద్‌లోని ఐసీఎఫ్ఏఐ, గుంటూరులోని కేఎల్‌యూ, విశాఖలోని గీతమ్, విజ్ఞాన్ వర్సిటీలు ఉన్నాయి.

టాప్ 10 ఆసియా విశ్వవిద్యాలయాలివీ..

- పెకింగ్ విశ్వవిద్యాలయం (చైనా)
- హాంకాంగ్ విశ్వవిద్యాలయం (హాంకాంగ్ ఎస్ఏఆర్)
- నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ సింగపూర్ (సింగపూర్)
- నాన్యాంగ్ టెక్నలాజికల్ యూనివర్సిటీ (సింగపూర్)
- సింగువా విశ్వవిద్యాలయం (చైనా)
- జెజియాంగ్ విశ్వవిద్యాలయం (చైనా)
- ఫుడాన్ విశ్వవిద్యాలయం (చైనా)
- యోన్సీ విశ్వవిద్యాలయం (సౌత్ కొరియా)
- కొరియా విశ్వవిద్యాలయం (సౌత్ కొరియా)
- చైనీస్ యూనివర్శిటీ ఆఫ్ హాంకాంగ్ (హాంకాంగ్ ఎస్ఏఆర్)

లంచం తీసుకున్న ఉన్నతాధికారికి రెండేళ్ల జైలు

విశాఖ లీగల్: విద్యుత్ కనెక్షన్ మంజూరు చేయడానికి లంచం తీసుకున్న ఆంధ్రప్రదేశ్ ట్రాన్స్‌కో అదనపు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మధుసూదనరావుకు రెండేళ్ల జైలు శిక్ష, పదివేల జరిమానా విధిస్తూ నగరంలోని అవినీతి నిరోధక శాఖ ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి కృష్ణారావు బుధవారం తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా ఆరు నెలలు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని ఆ తీర్పులో పేర్కొన్నారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ అందించిన వివరాల ప్రకారం... ఫిర్యాది కోట్నీ ప్రేమ్ కుమార్ శ్రీకాకుళం జిల్లా పలాసకు చెందిన వారు. ఆయన తల్లికి ఒక రైస్ మిల్లు ఉంది. 2013లో ఆ రైస్ మిల్‌కు 25 హెచ్‌పీ పవర్ లైన్ విద్యుత్ కనెక్షన్ మంజూరు కోసం ఏపీ ట్రాన్స్‌కో అధికారులకు దరఖాస్తు చేసుకున్నారు. దాన్ని పరిశీలించిన అప్పటి అడిషనల్ డిప్యూటీ ఇంజినీర్ మధుసూదనరావు రూ.20 వేలు లంచం డిమాండ్ చేశాడు. లంచం తీసుకుంటుండగా విశాఖ అవినీతి శాఖ అధికారులు వల పన్ని పట్టుకున్నారు. నిందితుడు ప్రస్తుతం ఏలూరు విభాగంలో సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నట్టు ఏసీబీ అధికారులు తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించి అధికార దుర్వినియోగానికి పాల్పడినందుకు అవినీతి నిరోధక శాఖ చట్టం కింద మరో రెండేళ్లు కఠిన కారాగార శిక్ష, రూ.10000 జరిమానా న్యాయమూర్తి విధించారు. రెండు శిక్షలు ఏకకాలంలో అమలు జరగాలని న్యాయమూర్తి తమ తీర్పులో స్పష్టం చేశారు.

రఘురామరాజు ఇంప్లీడ్ పిటిషన్‌పై తక్షణ విచారణ అవసరం లేదు

- సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకుంటాం
- ఈ వ్యాజ్యాన్ని అనుమతిస్తే కేసు రాజకీయరంగు పులుముకుంటుంది
- స్పష్టం చేసిన సీజే ధర్మాసనం.. విచారణ 3 వారాలకు వాయిదా

సాక్షి, అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణానికి సంబంధించిన వాస్తవాలను ప్రజలకు తెలిపేందుకు అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) పొన్నవోలు సుధాకర్‌రెడ్డి మీడియా సమావేశం ఏర్పాటు చేయడాన్ని సవాలు చేస్తూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యంలో తనను కూడా ప్రతివాదిగా చేర్చుకుని తన వాదనలు వినాలంటూ నరసాపురం ఎంపీ రఘురామకృష్ణరాజు దాఖలు చేసిన ఇంప్లీడ్ పిటిషన్ విషయంలో హైకోర్టు సానుకూలంగా స్పందించలేదు. ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేయాల్సినంత అవసరం ఏమొచ్చిందని రఘురామకృష్ణరాజును ప్రశ్నించింది. పిటిషనర్ వంటి రాజకీయ నాయకుడు దాఖలు చేసిన ఈ ఇంప్లీడ్ పిటిషన్‌ను అనుమతిస్తే ఈ వ్యవహారం రాజకీయరంగు పులుముకుంటుందని వ్యాఖ్యానించింది. ఈ ఇంప్లీడ్ పిటిషన్ విషయంలో సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకుంటామని పేర్కొంది. ఇదే సమయంలో ఏఏజీ సుధాకర్ రెడ్డి, సీఐడీ చీఫ్ సంజయ్ మాట్లాడిన మాటలకు సంబంధించిన వివరాలను తర్జుమా చేసి తమ ముందు ఉంచకపోవడంపై పిటిషనర్‌ను హైకోర్టు నిలదీసింది. ఏఏజీ, సీఐడీ చీఫ్ ఏ నిబంధనలు ఉల్లంఘించారో, వారిపై ఏం చర్యలు కోరుతున్నారో చెప్పాలంది. నిబంధనల ప్రకారం వారిని తొలగించడమో, సస్పెండ్ చేయడమో చేయాలని పిటిషనర్ న్యాయవాది గిరిబాబు తెలిపారు. చంద్రబాబు కేసు వివరాలను వారు బహిర్గతం చేశారని, ఇది ఎంతమాత్రం సరికాదని చెప్పారు. వాదనలు విన్న ధర్మాసనం విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది. స్కిల్ కుంభకోణం కేసు లేదా ఇతర ఏ కేసుకు సంబంధించిన సమాచారాన్ని కూడా బహిర్గతం చేయకుండా, ఎలాంటి సమావేశాలు నిర్వహించకుండా అదనపు ఏజీ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి, సీఐడీ చీఫ్ సంజయ్‌లను ఆదేశించాలని కోరుతూ ఏపీ యునైటెడ్ ఫోరం ఫర్ ఆర్‌టీఐ క్యాంపెయిన్ అధ్యక్షుడు ఎన్.సత్యనారాయణ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యంలో తనను కూడా ప్రతివాదిగా చేర్చుకోవాలంటూ రఘురామకృష్ణరాజు ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలపై బుధవారం సీజే నేతృత్వంలోని ధర్మాసనం విచారించింది.

విచారణ నుంచి తప్పుకున్న న్యాయమూర్తి

ప్రజా సంక్షేమం నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న పలు విధానపరమైన నిర్ణయాలను ప్రశ్నిస్తూ నర్సాపురం ఎంపీ రఘురామకృష్ణరాజు దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యం(పిల్)పై విచారణ నుంచి న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావు తప్పుకున్నారు. దీంతో జస్టిస్ రఘునందన్‌రావు సభ్యుడిగా లేని బెంచ్ ముందు ఈ వ్యాజ్యాన్ని ఉంచాలని రిజిస్ట్రీని హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి(సీజే) జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ రఘునందన్‌రావు ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

సామాజిక న్యాయానికి ముందడుగు

1,137వ రోజు రిలే నిరాహార దీక్షలలో బహుజన పరిరక్షణ సమితి నాయకులు



తాడికొండ: సామాజిక న్యాయం, సాధికారతకు ప్రభుత్వం ముందడుగు వేసిందని బహుజన పరిరక్షణ సమితి నాయకులు అన్నారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం, తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 1,137వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలకు బుధవారం పలువురు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. ఏపీలో సామాజిక సాధికారత అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు జేజేలు పలుకుతున్నారని అన్నారు. దేశ చరిత్రలో బహుజనులకు ఇంత ప్రాధాన్యత ఇచ్చిన ప్రభుత్వం ఏ రాష్ట్రంలో లేదని, బహుజనుల హక్కులు కాపాడటంలో ఏపీ నెంబర్ వన్ స్థానంలో నిలిచిందనడంలో సందేహం లేదన్నారు. పేద వర్గాలను ఓటు బ్యాంకు రాజకీయాలకు వాడుకొని అధికారంలోకి వచ్చిన తరువాత వారిని సామాజికంగా, ఆర్థికంగా అణగదొక్కుతున్న కులవాద పార్టీలకు రాబోయే ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతామన్నారు. సమితి నాయకులు మాదిగాని గురునాథం, ఈపూరి ఆదాం, పులి దాసు, నూతక్కి జోషి పాల్గొన్నారు.

సీఎం జగన్ పాలనలో రాష్ట్రం సమగ్రాభివృద్ధి

- చంద్రబాబు పాలనతో పోలిస్తే అన్ని రంగాల్లో ముందుకు
- 4.93 లక్షల మందికి సీఎం జగన్ ప్రభుత్వ ఉద్యోగాలిచ్చారు
- చంద్రబాబు ఇచ్చిన ఉద్యోగాలు 34 వేలే
- పారిశ్రామిక ప్రగతిలో 22వ స్థానం నుంచి 3వ స్థానానికి ఎదిగింది
- చంద్రబాబు తీసుకున్న రుణాలకంటే ఇప్పుడు తీసుకుంటున్నవి తక్కువే
- మాజీ మంత్రి కురసాల కన్నబాబు



మాట్లాడుతున్న మాజీ మంత్రి కన్నబాబు

కాకినాడ రూరల్: సీఎం వైఎస్ జగన్ పాలనలో రాష్ట్రం సమగ్రాభివృద్ధి సాధిస్తోందని, సామాజిక న్యాయంలో ఆయన దేశంలోనే ఆదర్శంగా నిలిచారని మాజీ మంత్రి కురసాల కన్నబాబు చెప్పారు. కన్నబాబు బుధవారం ఇక్కడ మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. సీఎం జగన్ చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలతో తలసరి ఆదాయం పెరిగిందని చెప్పారు. చంద్రబాబు పాలనతో పోలిస్తే అన్ని రంగాల్లో రాష్ట్రం ముందుకు వెళ్తోందని తెలిపారు. బాబు హయాంలో తలసరి ఆదాయంలో రాష్ట్రం 17వ స్థానంలో ఉండేదని, సీఎం జగన్ పాలనలో తొమ్మిదో స్థానానికి వచ్చిందని తెలిపారు. జాబు గ్యారెంటీ అని చెప్పుకుని పదవిలోకి వచ్చిన చంద్రబాబు 34,108 ఉద్యోగాలే ఇచ్చారని, జగనన్న వచ్చాక 4.93 లక్షల మందికి ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామని చెప్పారు. వ్యవసాయ రంగంలో 27వ స్థానం నుంచి నంబర్ వన్ స్థానానికి రాష్ట్రం చేరుకుందన్నారు. బాబు హయాంలో పరిశ్రమల వృద్ధి రేటులో రాష్ట్రం 22వ స్థానంలో ఉండగా ఎల్లో మీడియా మాత్రం రెండో స్థానమన్నట్టు బిల్డప్ ఇచ్చేదని తెలిపారు. వైఎస్ జగన్ సీఎం అయిన తర్వాత పరిశ్రమల స్థాపన, వృద్ధి రేటులో రాష్ట్రం మూడో స్థానానికి ఎదిగిందని తెలిపారు. ఎక్కడ 22, ఎక్కడ 3వ స్థానమని ప్రశ్నించారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈలు) వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత 2.5 లక్షలకు పెరిగాయని, అంతకుముందు 37,936 మాత్రమే ఉండేవని అన్నారు. బాబు హయాంలో తీసుకున్న రుణాలకన్నా ఇప్పుడు తీసుకున్నవి తక్కువేనని చెప్పారు. అప్పుడు తీసుకున్న రుణాలు ఎక్కడకు పోయాయని ప్రశ్నించారు. ఇప్పుడు తీసుకున్న రుణాలు నేరుగా లబ్ధిదారుల అకౌంట్‌లో వేస్తున్న సంగతి అందరికీ తెలుసునన్నారు. సంక్షేమ పథకాలతో శ్రీలంకను చేస్తారా అన్న చంద్రబాబు.. ఇప్పుడు ఆయన అధికారంలోకి వస్తే గ్యారెంటీ, షూరిటీ అంటున్నారని, ఆయనకే గ్యారెంటీ, షూరిటీ లేదని వ్యాఖ్యానించారు.

ఎవరికెంత మేలు చేశామో వివరిస్తాం

ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం గురువారం ప్రారంభమవుతుందన్నారు. సచివాలయాల స్థాయిలో జరిగే ఈ కార్యక్రమంలో ఎవరెవరికి ఎంత మేలు చేశామో వివరిస్తామన్నారు. తూర్పు గోదావరి జిల్లాలో ఫిషర్‌మెన్ మహిళకు, మాల వర్గానికి, బీసీలో శెట్టిబలిజ వర్గానికి, ఎస్సీలో మాదిగ సామాజిక వర్గానికి సీఎం జగన్ ఎమ్మెల్సీలుగా అవకాశం ఇచ్చారని, బీసీకి రాజ్యసభ స్థానం ఇచ్చారని చెప్పారు. అందుకనే సామాజిక సాధికార బస్సు యాత్ర జిల్లాలో విజయవంతమైందన్నారు.

ఫారెస్ట్ అధికారి అక్రమార్జన.. రూ.4 కోట్లకు పైగా

అధికారి నివాసాల్లో సోదాలు చేసిన ఏసీబీ

తిరుపతి క్రైం: ఆదాయానికి మించిన ఆస్తులు సంపాదించిన అటవీ అధికారి ఏసీబీకి చిక్కారు. తిరుపతి జిల్లా పూడిపట్ల వద్ద ఉన్న వేంకటేశ్వర జూపార్క్ ఫారెస్ట్ రేంజ్ అధికారి వలపల మాధవరావుకు చెందిన నివాసాల్లో బుధవారం ఏసీబీ అధికారులు ఏడు బృందాలుగా ఏర్పడి ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. మాధవరావు ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నారని 11400 నంబర్‌కు వచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఈ సోదాలు చేపట్టామని మంగళగిరి డీజీపీ కార్యాలయం నుంచి విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ఆయన నివాసం.. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని తిరుపతి, పుంగనూరు, వలపలవారిపల్లె, తెలంగాణలోని హైదరాబాద్ సహా ఆరు చోట్ల సోదాలు నిర్వహించామన్నారు. మొత్తం రూ. 4,66,28,000 విలువైన ఆస్తులున్నట్లుగా గుర్తించామన్నారు. దర్యాప్తు అనంతరం ఆయన్ని నెల్లూరు ఏసీబీ కోర్టులో హాజరు పరుస్తామన్నారు.

సోదాల్లో గుర్తించిన ఆస్తులు..

- తిరుపతిలోని చెర్లోపల్లి వద్ద 245.4 చదరపు గజాల స్థలంలో 5,450 చ.అడుగుల జీప్లస్‌టు ప్లస్ పెంట్ హౌస్ బిల్డింగ్. అవిలాల గ్రామంలో 305 చదరపు గజాల స్థలంలో 10 వేల చ.అడుగుల జీప్లస్‌ఫ్లోర్ భవనం. పుంగనూరు మండలంలోని వలపలవారి పల్లె గ్రామంలో 242 చ.గజాల్లో జీప్లస్1 భవనం. అలాగే.. చిత్తూరు జిల్లాలో పలుచోట్ల 14.09 ఎకరాలు, 4 ఓపెన్ ప్లాట్లు.
- రూ.7 లక్షల విలువైన కారు, రెండు మోటార్ సైకిళ్లు, రూ. 1.64 లక్షల నగదు, రూ. 4 లక్షల బ్యాంకు బ్యాలెన్స్, రూ.8 లక్షల ఫిక్స్‌డ్ డిపాజిట్లు, 1,062 గ్రాముల బంగారం, ఇతర విలువైన వస్తువులు గుర్తించారు.

ప్రస్తుతానికి చంద్రబాబుపై తొందరపాటు చర్యలుండవు

- ఇసుక స్కామ్ కేసులో పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేస్తాం
- హైకోర్టుకు నివేదించిన సీఐడీ న్యాయవాది శివకల్పనారెడ్డి
- తదుపరి విచారణ ఈనెల 22కి వాయిదా

సాక్షి, అమరావతి: ఉచిత ఇసుక విధానం పేరుతో రూ.వేల కోట్ల మేర ఖజానాకు నష్టం కలిగించినందుకు అప్పటి సీఎం చంద్రబాబుపై నమోదైన కేసులో పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేస్తామని హైకోర్టుకు సీఐడీ నివేదించింది. ఇందుకు కొంత గడువు కావాలని కోరింది. ఈ కేసులో ప్రస్తుతానికి చంద్రబాబు విషయంలో తొందరపాటు చర్యలేవీ ఉండవని.. అలాంటి ఉద్దేశం తమకు లేదని హైకోర్టుకు తెలిపింది. దీంతో హైకోర్టు తదుపరి విచారణను ఈ నెల 22వ తేదీకి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ తల్లాప్రగడ మల్లికార్జునరావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉచిత ఇసుక విధానం పేరుతో వేల కోట్ల రూపాయల మేర ఖజానాకు నష్టం కలిగించారంటూ అప్పటి సీఎం చంద్రబాబు, మరికొందరిపై సీఐడీ కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. ఈ కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలంటూ చంద్రబాబు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై జస్టిస్ మల్లికార్జునరావు బుధవారం విచారణ జరిపారు. ఈ సందర్భంగా సీఐడీ తరఫు న్యాయవాది వై.శివకల్పనారెడ్డి స్పందిస్తూ.. ప్రస్తుతానికి చంద్రబాబు విషయంలో ఏ రకంగానూ ముందుకెళ్లే ఉద్దేశం తమకు లేదని తెలిపారు. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేసేందుకు ఈ నెల 20 వరకు గడువు కావాలని కోరారు. దీంతో కౌంటర్ దాఖలుకు న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేస్తూ.. తదుపరి విచారణను ఈ నెల 22కి వాయిదా వేశారు.

క్లుప్తంగా...

బీసీ సీఎం కంటే బీసీ బిల్లు ముఖ్యం: కృష్ణయ్య

సాక్షి, హైదరాబాద్: వెనుకబడిన వర్గాల అభివృద్ధికి బీసీ బిల్లు ఎంతో ముఖ్యమని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య వ్యాఖ్యానించారు. ప్రధాని నరేంద్ర మోదీ తెలంగాణ రాష్ట్రానికి బీసీ వ్యక్తిని ముఖ్యమంత్రి చేస్తామని ప్రకటించడం శుభపరిణామమే అని, కానీ అంతకంటే ముఖ్యమైంది బీసీ బిల్లు అని పేర్కొన్నారు. చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని పార్లమెంటులో బీసీ బిల్లు ప్రవేశపెట్టాలంటూ 30 ఏళ్లుగా ఉద్యమాలు చేస్తున్నామన్నారు. ఇటీవల జరిగిన పార్లమెంటు సమావేశాల్లో మహిళాబిల్లు పెట్టినప్పుడు బీసీ మహిళలకు సబ్‌కోటా కల్పించాలని పలు పార్టీలు మద్దతు తెలిపాయని, అన్ని పార్టీలు మద్దతు ఇచ్చినా బీసీ సబ్‌కోటాకు ఇబ్బందులేమున్నాయని కృష్ణయ్య ప్రశ్నించారు. దేశంలోని అనేక రాష్ట్రాల్లో బీసీ ముఖ్యమంత్రులున్నారని, తమిళనాడులో స్టాలిన్, బిహార్‌లో నితీశ్‌కుమార్, కర్ణాటకలో సిద్ధరామయ్య, మధ్యప్రదేశ్‌లో శివరాజ్ సింగ్ చౌహాన్, రాజస్థాన్‌లో అశోక్ గెహ్లోట్, ఛత్తీస్‌గఢ్‌లో భూపేశ్ బఘేల్ తదితరులు బీసీ వర్గానికి చెందిన వారేనన్నారు. బీసీల అభివృద్ధికి ఏపీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన పథకాలు దేశానికి ఆదర్శనీయమన్నారు. కేంద్ర ప్రభుత్వం కూడా వెంటనే బీసీ బిల్లుపై దృష్టి పెట్టాలన్నారు. ఈమేరకు కృష్ణయ్య ప్రధానికి బుధవారం లేఖరాశారు.

ఏపీ అభివృద్ధికి చర్యలు

బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి

కోడుమూరు రూరల్: ఆంధ్రప్రదేశ్ విభజన అశాస్త్రీయంగా జరిగిన నేపథ్యంలో అభివృద్ధికి కేంద్రం అన్ని చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి అన్నారు. బుధవారం కర్నూలు జిల్లా కోడుమూరులో జరిగిన బీజేపీ శక్తి కేంద్ర, పోలింగ్ బూత్ అధ్యక్షుల సమావేశానికి కేంద్ర సమాచార, ప్రసారాల శాఖ మంత్రి దేవుసిన్హ్ చౌహాన్‌తో పాటు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పురందేశ్వరి మాట్లాడుతూ.. ప్రధాని మోదీ అవినీతి రహిత పాలనతో దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారన్నారు. కర్నూలులో రూ.3 వేల కోట్లతో డీఆర్‌డీఏ, రూ.4 వేల కోట్లతో సోలార్ పార్క్ ఏర్పాటుతో పాటు 1.54 లక్షల ఇళ్లను జిల్లాకు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ప్రధానమంత్రి కౌశల్ వికాశ్ యోజన కింద యువతలో నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు కేంద్రాన్ని ఏర్పాటు చేసి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తోందన్నారు. కర్నూలు నుంచి నందికొట్కూరు మీదుగా ఆత్మకూరు వరకు హైవే రోడ్డు నిర్మాణానికి రూ.1,254 కోట్లను కేంద్రం మంజూరు చేసిందన్నారు.

పిల్లలకు పునర్జన్మ

జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల్లో రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా వైద్యం

వివిధ రకాల ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న చిన్నారులకు సర్కారు అండ

మెరుగైన వైద్యం అవసరమున్న వారికి ఆరోగ్యశ్రీ కింద చికిత్స

■ దుర్గావరప్రసాద్, ఆదిలక్ష్మి దంపతులది కాకినాడ జిల్లా తాళ్లరేవు గ్రామం. ప్రసాద్ గుమస్తాగా పనిచేస్తుంటాడు. వీరి మూడేళ్ల కుమార్తె జాహ్నవికి పుట్టుకతోనే గుండెజబ్బు ఉంది. మూడేళ్లు పైబడ్డాక ఆపరేషన్ చేయడానికి వీలుంటుందని అప్పట్లో వైద్యులు చెప్పారు. ఇంతలో గత నెలలో తాళ్లరేవులో 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహించింది. దీంతో ఆదిలక్ష్మి జాహ్నవిని ఆరోగ్య సురక్ష శిబిరానికి తీసుకెళ్లింది. వైద్యులు కాకినాడ జిల్లా బాలల సత్వర చికిత్సా కేంద్రానికి(డీఈఐసీ) రిఫర్ చేశారు. 25న పాపను డీఈఐసీకి తీసుకుని వెళ్లగా పలు వైద్య పరీక్షల అనంతరం తిరుపతిలోని శ్రీ పద్మావతి చిన్న పిల్లల హృదయాలయానికి వెళ్లాల్సిందిగా సూచించి ప్రయాణ ఖర్చుల కోసం డబ్బులిచ్చారు. 29న పాపను హృదయాలయానికి తీసుకెళ్లగా ఈనెల 2న గుండెకు ఆపరేషన్‌ను విజయవంతంగా నిర్వహించారు. 'ఒక్క రూపాయి ఖర్చులేకుండా ప్రభుత్వమే నా బిడ్డకు గుండె ఆపరేషన్ చేయించింది. ప్రస్తుతం పాప ఆరోగ్యం బాగుంది. ఆస్పత్రికి రానుపోను డబ్బులు కూడా ఇచ్చారు. పాప విశ్రాంత సమయంలో భృతి కింద వైఎస్సార్ ఆరోగ్య ఆసరా కింద కూడా సాయం ఖాతాలో జమవుతుందన్నారు. ఈ మేలును జన్మలో మరువలేం'.. అని ఆదిలక్ష్మి ఎంతో సంతోషంతో అంటోంది.



■ నెల్లూరు జిల్లా విడవలూరు మండలానికి చెందిన రైతు అనిల్ దంపతులకు ముగ్గురు పిల్లలు. రెండో కుమార్తె మధుప్రియకు గ్రహణం మొర్రి సమస్య ఉండటంతో పుట్టిన వెంటనే తిరుపతిలోని బర్డ్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు నిర్వహించిన పరీక్షల్లో గుండెకు రంధ్రం ఉన్నట్లు నిర్ధారించారు. పాప పెద్దయ్యాక ఆపరేషన్ చేయడానికి వీలుంటుందని చెప్పారు. ప్రస్తుతం పాపకు మూడేళ్లు దాటాయి. దీంతో పాప గుండెకు ఆపరేషన్ చేయించాలని అనుకుంటున్న సమయంలో ప్రభుత్వం ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రారంభించింది. వైద్య సిబ్బంది ఇంటింటి సర్వేలో పాప సమస్యను తల్లిదండ్రులు వివరించారు. దీంతో వైద్య శిబిరానికి హాజరు కావాలని సిబ్బంది చెప్పారు. గ్రామంలో శిబిరం నిర్వహించిన రోజు పాపను తీసుకెళ్లగా వైద్యులు తొలుత నెల్లూరు ఆస్పత్రికి రిఫర్ చేశారు. ఇక్కడి నుంచి మధుప్రియను హృదయాలయానికి తరలించారు. ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా ఆపరేషన్ పూర్తయింది. 'మా కోసమే ప్రభుత్వం ఆరోగ్య సురక్ష పెట్టిందా అనిపిస్తోంది. రూపాయి ఖర్చులేకుండా ఉచితంగా ఆపరేషన్ చేశారు. ఆరోగ్యశ్రీ లేకపోయి ఉంటే మాకు ఆపరేషన్ చేయించడం స్థోమతకు మించిన అంశం'.. అని అనిల్ చెబుతున్నాడు.

సాక్షి, అమరావతి: ..జాహ్నవి, మధుప్రియల తరహాలో వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న చిన్నారుల భవితకు సీఎం జగన్ ప్రభుత్వం 'జగనన్న ఆరోగ్య సురక్ష' ద్వారా పునర్జన్మ ప్రసాదిస్తోంది. ఈ కార్యక్రమంలో ప్రతి ఇంటిని జల్లెడ పట్టి ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారిని గుర్తించి వారికి ఉచితంగా వైద్యసేవలు అందిస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో పుట్టుకతో న్యూరల్ ట్యూబ్ లోపం, డౌన్స్ సిండ్రోమ్, గ్రహణం మొర్రి, పెదవి చీలిక, వంకర పాదాలు, నడుం భాగం వృద్ధిలోపం, గుండె జబ్బులు, పుట్టుకతో వచ్చే చెవుడు, రెటినోపతి ఆఫ్ ప్రీ మెచ్యూరిటీ, మేథోపరమైన అసమానత, వయసుకు అనుగుణంగా మాటలు రాకపోవటం, ఆటిజమ్ సహా ఇతర 30 రకాల వ్యాధులతో బాధపడుతున్న చిన్నారులను వైద్యశాఖ గుర్తిస్తోంది. వీరికి అవసరమైన వైద్య పరీక్షలు, చికిత్సలను ప్రభుత్వం ఉచితంగా అందిస్తోంది.

7.12 లక్షల పీడియాట్రిక్ ఓపీలు..

గతనెల సెప్టెంబర్ 30 నుంచి మంగళవారం (ఈనెల ఆరో తేదీ) వరకూ రాష్ట్రవ్యాప్తంగా 12,138 సురక్ష శిబిరాలు నిర్వహించగా ఏకంగా 58.81 లక్షల ఓపీలు నమోదయ్యాయి. ఇందులో 7,12,639 పీడియాట్రిక్ ఓపీలున్నాయి. వీటిలో 1,247 మంది పుట్టుకతో గుండె జబ్బులు, వినికిడి లోపం, గ్రహణం మొర్రి, ఇతర పెద్ద సమస్యలతో బాధపడుతున్నట్లు గుర్తించారు. వీరందరినీ సురక్ష శిబిరంలోని వైద్యులు డీఐఈసీలకు రిఫర్ చేశారు. మిగిలిన చిన్నచిన్న సమస్యలున్న పిల్లలందరికీ శిబిరాల్లోనే వైద్యంచేసి, ఉచితంగా మందులు అందజేశారు. మరోవైపు.. ప్రయాణ ఛార్జీలతో సహా మెరుగైన వైద్యం కోసం డీఐఈసీలకు రిఫర్ చేసిన పిల్లలకు రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యశ్రీ కింద పూర్తి ఉచితంగా వైద్యం చేయిస్తోంది. అంతేకాక.. వైద్యం కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లి రావడానికి ప్రయాణ ఛార్జీల కింద రూ.500లను కూడా అందిస్తోంది. రూ.లక్షల్లో ఖర్చయ్యే గుండె ఆపరేషన్లను అత్యాధునిక వైద్య సదుపాయాలున్న ఆస్పత్రుల్లో ఉచితంగా నిర్వహిస్తున్నారు. వినికిడి లోపం ఉన్న వారికి కాక్లియర్ ఇంప్లాంటేషన్ చేయిస్తున్నారు. ఇలా.. ఆస్పత్రులకు రిఫర్ చేసిన 1,247 మంది చిన్నారుల్లో 646 మందికి ఇప్పటికే చికిత్స పూర్తయింది. అత్యధికంగా తూర్పుగోదావరి జిల్లాలో 165 మంది చిన్నారులను రిఫర్ చేయగా వంద శాతం పిల్లలకు చికిత్సలు నిర్వహించారు.

పిల్లల ఆరోగ్యానికి ఆరోగ్యశ్రీ అండ

ఆరోగ్యశ్రీ ద్వారా రాష్ట్రంలోని నిరుపేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లల ఆరోగ్యాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది. వినికిడి లోపం ఉన్న చిన్నారుల రెండు చెవులకు బైలేటరల్ కాక్లియర్ ఇంప్లాంటేషన్ చికిత్సను సీఎం జగన్ ఆరోగ్యశ్రీలో చేర్చారు. రూ.12 లక్షలు ఖర్చయ్యే ఈ సర్జరీని పూర్తి ఉచితంగా నిర్వహిస్తున్నారు. ఇక 2019 నుంచి ఈ ఏడాది ఆగస్టు నాటికి వినికిడి లోపంతో బాధపడుతున్న 566 మంది చిన్నారులకు రూ.34 కోట్ల నిధులతో ప్రభుత్వం కాక్లియర్ ఇంప్లాంటేషన్ సర్జరీలు నిర్వహించింది. గుండె జబ్బులున్న పిల్లల కోసమైతే సీఎం జగన్ తిరుపతిలో ప్రత్యేకంగా హృదయాలయం ఏర్పాటుచేశారు. ఇక్కడ ఇప్పటివరకు రెండు వేల మంది చిన్నారులకు పునర్జన్మ ప్రసాదించారు.

ఎలాంటి ఆర్థిక భారం లేకుండా వైద్యసేవలు..



ఆరోగ్య సురక్ష ద్వారా రిఫరల్ కేసుల్లో సంబంధిత వ్యక్తులపై ఎలాంటి ఆర్థిక భారంలేకుండా రాష్ట్ర ప్రభుత్వం వైద్యసేవలు అందిస్తోంది. ఆస్పత్రులకు వెళ్లి రావడానికి ప్రయాణ ఛార్జీల కింద రూ.500 చొప్పున కూడా అందిస్తోంది. రిఫరల్ కేసులపై ప్రత్యేక ఫోకస్ పెట్టాం. స్థానిక మెడికల్ ఆఫీసర్లు, వైద్య సిబ్బంది ద్వారా ప్రతి రిఫరల్ కేసును ఆస్పత్రికి తరలిస్తున్నాం. అక్కడ పూర్తి ఉచితంగా పరీక్షలు, చికిత్సలు, మందులు అందించేలా చూస్తున్నాం. – జె. నివాస్, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్

'రాగి'తో కర్బన ఉద్గారాలకు చెక్!

- విద్యుత్ ఉపకరణాల్లో రాగి వినియోగంతో పర్యావరణానికి మేలు
- పారిశ్రామిక, గృహోపకరణాల మోటార్లలో రాగి వాడకంతో 30 శాతం విద్యుత్ ఆదా
- ఎలక్ట్రికల్ కారు, ఎలక్ట్రికల్ బస్సులో రాగి వినియోగంతో 40 శాతం ఎక్కువ శక్తి
- గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలను భారీగా తగ్గించే లోహం
- ఇంటర్నేషనల్ కాపర్ అసోసియేషన్ నివేదిక వెల్లడి

సాక్షి, అమరావతి: కర్బన ఉద్గారాల కట్టడికి విద్యుత్ పరికరాల్లో రాగి వినియోగం దోహదపడుతోందని అంతర్జాతీయ సంస్థలు చెబుతున్నాయి. దీనికి తగ్గట్లే భారత్‌లో ఎలక్ట్రికల్ గ్రిడ్ భాగాలు, గ్రీన్ ఎనర్జీ–విండ్ టర్బైన్‌లు, సోలార్ ప్యానెల్‌లు, మాడ్యూల్స్ తయారీలో రాగి వాడకం పెరుగుతోందని ఇంటర్నేషనల్ కాపర్ అసోసియేషన్ ఇచ్చిన 'కాపర్–ది పాత్వే టు నెట్ జీరో' నివేదిక వెల్లడించింది. ఈ నివేదిక ప్రకారం.. పారిశ్రామిక, గృహోపకరణాల మోటార్లలో రాగి వాడకం వల్ల 30 శాతం విద్యుత్ ఆదా అవుతోంది. ఎలక్ట్రికల్ కారులో 40 కిలోలు, ఎలక్ట్రికల్ బస్సులో 70 కిలోల రాగి వినియోగించడం వల్ల పెట్రోల్, డీజిల్ కార్లతో పోల్చితే 40 శాతం ఎక్కువ శక్తి ఉత్పత్తి అవుతుందని నివేదిక పేర్కొంది. విద్యుత్ నిల్వ కోసం ఉపయోగించే లిథియం అయాన్ బ్యాటరీల్లో రాగిని ఎక్కువగా వాడటం వల్ల అవి త్వరగా వేడెక్కకుండా కాపాడవచ్చని తెలిపింది. విద్యుత్ తీగలు, ఎలక్ట్రికల్ డిస్ట్రిబ్యూషన్ వ్యవస్థలో కూడా రాగిని వినియోగిస్తే విద్యుత్ పంపిణీ నష్టాలు తగ్గుతాయని వెల్లడించింది. కేబుల్స్, మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్ల కోసం వీలైనంత రాగిని ఉపయోగించడం వల్ల విద్యుత్ నష్టాలు గణనీయంగా తగ్గుతాయని నివేదిక పేర్కొంది. ఒక టన్ను కాపర్ కాథోడ్ ఉత్పత్తిలో 3.5 టన్నుల కార్బన్‌డయాక్సైడ్ విడుదల అవుతుందని.. కానీ దానిని ఎలక్ట్రికల్ ఉత్పత్తుల తయారీలో వాడటం వల్ల ఆ పరికరాల సామర్థ్యాన్ని బట్టి భారీగా కార్బన్‌డయాక్సైడ్‌ను తగ్గిస్తాయని వెల్లడించింది. అంతేకాకుండా వివిధ ఉత్పత్తుల్లో ఉపయోగించే ప్రతి టన్ను రాగితో వాటి వినియోగదారులు.. ఆయా ఉత్పత్తుల జీవితకాలంలో 25 వేల డాలర్ల నుంచి 25 లక్షల డాలర్ల వరకు ఆదా చేసే అవకాశం ఉందని కాపర్ అసోసియేషన్ అంచనా వేసింది. కాగా, రాష్ట్రంలో మొత్తం విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంలో పునరుత్పాదక విద్యుత్ వాటా సుమారు 37 శాతంతో దేశంలోనే ఏపీ ముందంజలో ఉంది. అయితే ఇలా ఉత్పత్తి అయిన విద్యుత్‌ను సరఫరా చేసే పరికరాల్లో రాగిని వాడటం వల్ల గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలను 40 శాతం ఎక్కువగా తగ్గించవచ్చని.. తద్వారా పర్యావరణానికి మేలు జరుగుతుందని నివేదిక తెలిపింది.

ఈనాడు వికారాలూ.. వికృత వేషాలు

- వార్త ఒకటి.. ఫొటో మరోటి..
- ఓటరు జాబితాలో పేరు మార్పునకు మహిళా వలంటీర్ దరఖాస్తు
- కానీ, దురుద్దేశంతో ఆమె ఫొటో తీసి కథనంతో ప్రచురణ



శ్రీకాకుళం రూరల్: పిచ్చి ముదిరితే రకరకాల విన్యాసాలు చేయడం పరిపాటి. ఇప్పుడు ఈనాడు పరిస్థితి కూడా అలాగే ఉంది. రాష్ట్ర ప్రభుతాన్ని రోజూ ఏదో రకంగా అభాసుపాల్జేయాలన్న ఏకైక లక్ష్యంతో పనిచేస్తూ ఇష్టానుసారం ఏదిపడితే అది అడ్డగోలుగా రాసిపారేస్తోంది. ఈనెల 6న ఆ పత్రిక ప్రధాన సంచికలో 'తవ్వేకొద్దీ అక్రమాలు.. అవకతవకలు' పేరిట ఓ కథనం ప్రచురించింది. ఆ వార్తకు.. అందుకు వినియోగించిన ఫొటోకు అసలు ఏమాత్రం సంబంధంలేదని ఉన్నతాధికారులు తేల్చిచెప్పారు. శ్రీకాకుళం జిల్లా శ్రీకాకుళం రూరల్ మండలం బైరివానిపేటకు చెందిన వలంటీర్ శిమ్మ రోజా ఓటరు కార్డులో తన పేరును బగ్గ రోజాగా పేరు మార్చాలంటూ ఈ నెల 4, 5 తేదీల్లో నిర్వహించిన ఓటరు స్పెషల్ డ్రైవ్‌లో ఫారం–8 ఇచ్చేందుకు గ్రామ సచివాలయానికి వెళ్లింది. ఆ సమయంలో అక్కడే ఉన్న టీడీపీ సానుభూతిపరులు, ఓ విలేకరి కలిసి ఆమెతో మాటలు కలిపి ఓటరు జాబితాలో పేరు ఉందో లేదో చూసుకోవాలంటూ కూర్చోబెట్టి ఫొటో తీశారు. తర్వాత రోజు 6వ తేదీన ఈనాడులో 'తవ్వేకొద్దీ అక్రమాలు.. అవకతవకలు' పేరిట వార్త ప్రచురించి అందుకు ఈ ఫొటో వాడారు. బీఎల్ఓ సమక్షంలో ఓటరు జాబితాను పరిశీలిస్తున్న వలంటీర్ రోజా అని ఫొటోకు క్యాప్షన్ రాసి ప్రచురించారు. ఈ విషయమై శ్రీకాకుళం ఎంపీడీఓ శిమ్మ రామ్మోహన్ బుధవారం బైరివానిపేట సచివాలయాన్ని సందర్శించి వలంటీర్ రోజా, బీఎల్ఓ రాంబాబులతో మాట్లాడి విషయాన్ని ఆరా తీశారు. ఓటరు లిస్టు పరిశీలనకు వలంటీర్‌కు ఎలాంటి సంబంధంలేదని, కేవలం ఫారం–8 అందజేసి పేరును సరిచేయాలని మాత్రమే దరఖాస్తు అందజేసినట్లు బీఎల్ఓ వివరణ ఇచ్చారు.

సైబర్ బాధిత దేశాల్లో భారత్ టాప్

- మూడేళ్లలో 278 శాతం పెరిగిన సైబర్ దాడులు
- చైనా నుంచే అత్యధికంగా ముప్పు
- అంతర్జాతీయ సైబర్ భద్రతా ఏజెన్సీ 'సైఫిర్మా' నివేదిక వెల్లడి



సాక్షి, అమరావతి: భారత్‌లోని ప్రభుత్వ సంస్థలు, ప్రముఖ ప్రైవేటు కంపెనీలపై విదేశాల నుంచి సైబర్ దాడులు అంతకంతకూ అధికమవుతున్నాయి. విదేశాల నుంచి సైబర్ దాడులు జరుగుతున్న దేశాల్లో భారత్ మొదటి స్థానంలో నిలిచింది. 2021 నుంచి 2023 మధ్య కాలంలో భారత్‌లోని సంస్థలపై సైబర్ దాడులు 278 శాతం పెరిగాయని సింగపూర్‌కు చెందిన అంతర్జాతీయ సైబర్ భద్రతా సంస్థ 'సైఫిర్మా' తాజా నివేదిక వెల్లడించింది. గతంలో పాకిస్తాన్ నుంచి భారత్‌పై సైబర్ దాడులు ఎక్కువగా జరగగా.. ప్రస్తుతం చైనా నుంచి అత్యధికంగా దాడులకు పాల్పడుతున్నారని ఆ నివేదిక తెలిపింది. అందులోనూ చైనా ప్రభుత్వ సంస్థల కేంద్రంగానే.. భారతీయ సంస్థలపై సైబర్ దాడులకు పాల్పడటం గమనార్హం. భారత్‌పై అత్యధికంగా సైబర్ దాడులకు పాల్పడుతున్న దేశాల జాబితాలో రెండు, మూడు స్థానాల్లో రష్యా, ఉత్తర కొరియా ఉన్నాయి. భారత్‌లోని ప్రభుత్వ సంస్థలు, ప్రైవేటు కంపెనీలపై సైబర్ దాడుల్లో.. 72 శాతం విదేశాల్లోని ప్రభుత్వ సంస్థల కేంద్రంగానే జరుగుతున్నాయి.

ప్రభుత్వ సంస్థలే ప్రధాన లక్ష్యం..

ప్రపంచవ్యాప్తంగా గత మూడేళ్లలో 13 శాతం సైబర్‌దాడులు భారతీయ సంస్థలు, కంపెనీలపైనే జరిగాయి. అమెరికా 9.6 శాతంతో రెండో స్థానంలో, ఇండోనేసియా 9.3 శాతంతో మూడో స్థానంలో, చైనా 4.5 శాతంతో నాలుగో స్థానంలో నిలిచాయి. అలాగే భారత్‌లోని ప్రభుత్వ సంస్థలపై 20.4 శాతం, ఐటీ–బీపీవో కంపెనీలపై 14.3 శాతం, ఉత్పాదక సంస్థలపై 11.6 శాతం, వైద్య సంస్థలపై 10 శాతం, విద్యా సంస్థలపై 10 శాతం, ఆన్‌లైన్ రిటైల్ సంస్థలపై 9.8 శాతం, బ్యాంకింగ్ రంగ సంస్థలపై 9.5 శాతం, ఆటోమొబైల్ రంగ సంస్థలపై 8.3 శాతం, ఎయిర్‌లైన్ కంపెనీలపై 6.1 శాతం మేర సైబర్ దాడులు జరిగాయని నివేదిక వెల్లడించింది.

అణగారిన వర్గాలకు భగవంతుని దగ్గర చేస్తాం

టీటీడీ బోర్డు చైర్మన్ కరుణాకర్‌రెడ్డి



డీవీఆర్‌కె ప్రసాద్‌కు నియామకపత్రాన్ని అందజేస్తున్న టీటీడీ చైర్మన్ కరుణాకర్‌రెడ్డి

హిమాయత్‌నగర్ (హైదరాబాద్): సమాజానికి, అణగారిన వర్గాలకు భగవంతున్ని దగ్గర చేయడం కోసం టీటీడీ దళిత గోవింద అనే కార్యక్రమం తీసుకువచ్చిందని టీటీడీ బోర్డు చైర్మన్ బి.కరుణాకర్‌రెడ్డి అన్నారు. రామకోటిలా గోవింద కోటి రాసిన వారికి వేంకటేశ్వర స్వామి వారి వీఐపీ బ్రేక్ దర్శనం ఏర్పాట్లు చేయాలని నిర్ణయించామని చెప్పారు. హిమాయత్ నగర్ టీటీడీ లోకల్ అడ్వయిజరీ కమిటీ అధ్యక్షుడిగా డీవీఆర్‌కే ప్రసాద్ ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమానికి కరుణాకర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బుధవారం హిమాయత్‌నగర్ టీటీడీ కళ్యాణ మండపంలో జరిగిన ఈ కార్యక్రమంలో టీటీడీ చైర్మన్‌తో పాటు నూతన కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ, హైందవ ధర్మాన్ని అందరూ ముందుకు తీసుకువెళ్లాల్సిన అవసరముందని, హైందవ ధర్మ వ్యాప్తి కోసం వేద సారాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు వేద విశ్వవిద్యాలయం ఏర్పాటు చేస్తున్నామన్నారు. వేద సంస్కృతిని కాపాడటంతో పాటు వేద విద్యార్థుల ఆర్థిక స్థితిగతులు మెరుగుపడేలా ఎప్పటికప్పుడు టీటీడీ అనుబంధ విశ్వ విద్యాలయాలు కృషి చేస్తున్నాయన్నారు. అనంతరం డీవీఆర్‌కె ప్రసాద్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా డీవీఆర్‌కె ప్రసాద్ మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి బాధ్యతను కేటాయించినందుకు సీఎం వైఎస్ జగన్‌కు, టీటీడీ బోర్డు చైర్మన్ బి.కరుణాకర్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

డొక్కు రాతలే దిక్కా రామోజీ..?!

- ఏపీఎస్‌ఆర్టీసీపై ఈనాడు అక్కసు రాతలు
- ప్రగతిపథంలో దూసుకెళుతున్న సంస్థపై విషప్రచారం
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలోనే అభివృద్ధి పథంలో ఆర్టీసీ
- వందల సంఖ్యలో కొత్త బస్సులు.. పారదర్శకంగా కొనుగోళ్లు
- కేంద్ర నిబంధనల మేరకు కాలపరిమితి ముగిసిన బస్సులు తుక్కుకే
- తొలిసారి ప్రవేశపెట్టిన విద్యుత్ బస్సులతో ప్రయాణికులకు సౌకర్యం
- టీడీపీ ప్రభుత్వ హయాంలో కంటే తగ్గిన బస్సు ప్రమాదాలు
- ఆర్టీసీ పట్ల పెరుగుతున్న ప్రజల ఆదరణ.. పెరిగిన రాబడి
- అయినా ఆర్టీసీపై పనిగట్టుకుని దుష్ప్రచారం చేస్తున్న రామోజీ



సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వంపై దుష్ప్రచారమే పనిగా పెట్టుకున్న రామోజీరావు.. ప్రగతి రథచక్రంలా పరుగెడుతున్న ఆర్టీసీపై పనిగట్టుకుని విషం చిమ్మారు. అవాస్తవాలన్నీ పోగేసి ప్రజలను తప్పుదారి పట్టించేందుకు 'డొక్కు బస్సులే దిక్కా' అంటూ ఈనాడులో ఓ కథనాన్ని అచ్చేశారు. వాస్తవాలన్నీ ప్రభుత్వ ఉద్యోగులుగా మారిన ఆర్టీసీ ఉద్యోగులకు తెలుసు. ప్రతి నెల ఒకటో తేదీనే జీతాలు అందుకుంటున్న వారి కుటుంబాలకు తెలుసు. కొత్త బస్సుల్లో ప్రయాణిస్తున్న ప్రయాణికులకు తెలుసు. తొలిసారిగా విద్యుత్ బస్సుల్లో వెళుతున్న తిరుమల–తిరుపతి భక్తులకు తెలుసు. ఎవరేమనుకుంటే నాకేంటి.. నా 'పచ్చ'పార్టీకి ఇష్టంగా రాయడమే నాకు తెలుసు అన్నట్లు రామోజీరావు తన వక్రబుద్ధిని ఆ కథనంలో బయటపెట్టుకున్నారు. ఏపీఎస్‌ఆర్టీసీ ప్రగతిపథంలో పరుగెడుతోంది అని చెప్పడానికి నాలుగేళ్లలో పెరిగిన సంస్థ రాబడే నిదర్శనం. ఆర్టీసీలో ప్రయాణం సురక్షితం అనడానికి టీడీపీ ప్రభుత్వ హయాం కంటే గణనీయంగా తగ్గిన బస్సు ప్రమాదాలే తార్కాణం. అందువల్లే ఆర్టీసీవి కొత్త బస్సులు.. రామోజీవి డొక్కు రాతలు అని అటు ప్రయాణికులు, ఇటు సిబ్బంది ఏకాభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. బోరుకు వచ్చింది ఈనాడు పత్రికే అని గుర్తించాలని రామోజీకి హితబోధ చేస్తున్నారు.

కొత్త బస్సులు కనబడటంలేదా?

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఆర్టీసీ కొత్త బస్సుల కొనుగోలు వేగవంతం చేసింది. 2019–20లో 406 కొత్త బస్సులను కొనుగోలు చేసింది. కోవిడ్ మొదటి, రెండు వేవ్‌ల తరువాత ఆర్టీసీలో ఉన్న 2,584 బస్సులను రూ. 50 కోట్లు వెచ్చించి ఆధునీకరించింది. ఇక పాత బస్సుల స్థానంలో కొత్తగా 900 డీజిల్ బస్సులను అద్దె విధానంలో ప్రవేశపెట్టింది. రాష్ట్రంలో తొలిసారిగా 100 ఈ–బస్సులను తిరుమల–తిరుపతి ఘాట్ రోడ్డులో ప్రవేశపెట్టిన ఘనత కూడా ఈ ప్రభుత్వానికే దక్కింది. తాజాగా 1,500 కొత్త డీజిల్ బస్సులను కొనుగోలు చేయాలని ఆర్టీసీ నిర్ణయించింది. పారదర్శకంగా కొనుగోలు కోసం టెండర్ల ప్రక్రియను జ్యుడిషియల్ ప్రివ్యూకు పంపింది. కేంద్ర ప్రభుత్వం పాలసీ ప్రకారం 15 ఏళ్ల కాలపరిమితి ముగిసిన వాటిని ఎప్పటికప్పుడు ఆర్టీసీ తొలగిస్తోంది. ఈ నాలుగేళ్లలో 214 బస్సులను తుక్కుగా మార్చింది. ఈ ఆర్థిక సంవత్సరంలో మరో 52 బస్సులను తుక్కుగా మార్చనుంది.

మౌలిక వసతులు అభివృద్ధి

రాష్ట్రంలో ఆర్టీసీ మౌలిక వసతులను నాలుగేళ్లలో ప్రభుత్వం గణనీయంగా అభివృద్ధి చేసింది. బస్‌స్టేషన్ల పునరుద్ధరణ, నిర్మాణం కోసం రూ. 110 కోట్లు వెచ్చించింది. రాజాం, విజయనగరం, నరసాపురం, హనుమాన్ జంక్షన్, గుడివాడ, మచిలీపట్నం, పామర్రు, జగ్గయ్యపేట, దోర్నాల, సింగరాయకొండ, కడప, కోయిలకుంట్ల, వేంపల్లి, ప్రొద్దుటూరు, రాయచోటి, బేతంచర్ల, డోన్, ఆత్మకూరులలో బస్‌స్టేషన్లు నిర్మించింది. రాజమహేంద్రవరం, అనంతపురం, తిరుపతి, నరసరావుపేటలలో మెడికల్ డిస్పెన్సరీలను విస్తరించి ఆధునీకరించింది. రూ. 34 కోట్లతో పులివెందులలో బస్‌స్టేషన్, బస్‌డిపో నిర్మించింది.

పెరుగుతున్న ఆదరణ.. ఆదాయం..

ఆర్టీసీ చేపడుతున్న చర్యల ఫలితంగా ఆర్టీసీ బస్సులపట్ల ప్రజలకు ఆదరణ అంతకంతకూ పెరుగుతోంది. నాలుగేళ్లుగా పెరుగుతున్న ఆర్టీసీ రాబడే అందుకు నిదర్శనం.

- 2019–20లో ఆర్టీసీకి రూ. 4,781 కోట్ల రాబడి రాగా 2022–23కు అది రూ. 5,574 కోట్లకు పెరిగింది.
- 2019–20లో కి.మీటర్‌కు రూ. 31.31 చొప్పున రాబడి రాగా 2022–23లో కి.మీటర్‌కు రూ. 37.91కు పెరిగింది.
- ఇక కార్గో సేవల ద్వారా 2018–19లో రూ. 101 కోట్లు రాబడి రాగా 2022–23లో రూ. 169 కోట్లు వచ్చింది.
- వాణిజ్య ఆదాయం 2018–19లో రూ. 227 కోట్లు రాగా 2022–23లో రూ. 300 కోట్లకు పెరిగింది.

టీడీపీ ప్రభుత్వ హయాంలో ఆర్టీసీ బస్సు ప్రమాదాలు

ఏడాది	ప్రమాదాలు
2014-15	1,440
2015-16	1,217
2016-17	1,206
2017-18	1,244
2018-19	1,186

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఆర్టీసీ బస్సు ప్రమాదాలు

ఏడాది	ప్రమాదాలు
2019-20	974
2020-21	392
2021-22	617
2022-23	907
2023-24 (ఇప్పటివరకు)	462

సక్రమంగా నిర్వహణ.. నిధులు మంజూరు

■ ఆర్టీసీ బస్సులకు స్పేర్‌పార్ట్‌ల కొనుగోలు, ఇతర నిర్వహణ వ్యయం కోసం నిధుల్లో కోత విధించారన్న ఈనాడు రాతలు పూర్తి అవాస్తవం. నాలుగేళ్లలో పూర్తిస్థాయిలో స్పేర్ పార్ట్‌లు, నిర్వహణ కోసం స్టోర్స్ విభాగానికి ఆర్టీసీ పూర్తిస్థాయిలో నిధులు కేటాయించింది.

ఏడాది	నిధుల కేటాయింపు
2019-20	రూ. 163.11 కోట్లు
2020-21	రూ. 91.65 కోట్లు
2021-22	రూ. 168.51 కోట్లు
2022-23	రూ. 231.29 కోట్లు

2020-21, 2021-22లో కోవిడ్ మొదటి, రెండో వేవ్‌లలో ఆర్టీసీ బస్సు సర్వీసులు బాగా కుదించింది. దాంతో స్పేర్ పార్టుల కోసం బడ్జెట్ ప్రతిపాదనలు తగ్గాయి.

ప్రమాదాల నివారణకు ప్రత్యేక కార్యాచరణ

ఆర్టీసీ బస్సు ప్రమాదాల నివారణకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యమిస్తోంది. డ్రైవర్లకు పూర్తిస్థాయిలో ఎప్పటికప్పుడు శిక్షణ తరగతులు నిర్వహిస్తోంది. డ్రైవర్లతో సహా ఆర్టీసీ ఉద్యోగులకు తరచూ ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తోంది. రోజువారీ విధుల్లో చేరే ముందు డ్రైవర్లకు తప్పనిసరిగా బ్రీత్ ఎనలైజర్ పరీక్షలు చేస్తోంది. 2018 తరువాత బస్సు ప్రమాదాలు గణనీయంగా తగ్గుముఖం పట్టాయి. టీడీపీ హయాంతో పోలిస్తే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో బస్సు ప్రమాదాలు బాగా తగ్గాయి.

సిబ్బంది సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యం..

ఆర్టీసీ ఉద్యోగుల దీర్ఘకాల డిమాండ్‌ను నెరవేరుస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేశారు. సంస్థ ఉద్యోగుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపిస్తోంది. ఆర్టీసీ ఉద్యోగుల జీతాల కోసం ప్రతినెల రూ. 275 కోట్లు వెచ్చిస్తోంది. జనవరి, 2020 నుంచి ఇప్పటివరకు రూ. 11,711 కోట్లు జీతాల కోసం చెల్లించింది. తీవ్రమైన కోవిడ్ పరిస్థితుల్లోనూ ప్రతి నెల ఒకటో తేదీనే ఆర్టీసీకి జీతాలు చెల్లించడం పట్ల ఉద్యోగులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ చర్యలతో సంస్థపై ఆర్థికభారం తగ్గడంతో దీర్ఘకాలంగా ఉన్న బకాయిలను చెల్లిస్తోంది. ఇప్పటికే బ్యాంకు రుణాలు రూ. 1,121 కోట్లు, పీఎఫ్ బకాయిలు రూ. 996 కోట్లు, సీసీఎస్‌బకాయిలు రూ. 269 కోట్లు, ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలు రూ. 374 కోట్లు కలిపి మొత్తం రూ. 2,760 కోట్ల బకాయిలను చెల్లించడం ప్రాధాన్యం సంతరించుకుంది. సర్వీసులో ఉంటూ మరణించిన ఉద్యోగుల కుటుంబాల్లో అర్హులైన 693 మందికి ఇప్పటివరకు కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు కల్పించింది. ప్రభుత్వ ఉద్యోగులతోసమానంగా ఆర్టీసీ ఉద్యోగులకు కూడా పీఆర్సీ–2022ను అమలు చేసింది. ఉద్యోగులకు రూ. కోటి ప్రమాద బీమా కోసం ఎస్‌బీఐతో కార్పొరేట్ సాలరీ ప్యాకేజీ కింద ఒప్పందం కుదుర్చుకుంది. ఉద్యోగులకు క్యాష్‌లెస్ హెల్త్‌స్కీమ్‌ను సమర్థంగా అమలు చేస్తోంది. హయ్యర్ పెన్షన్ విధానాన్ని వర్తింపజేసింది. ప్రభుత్వంలో విలీనం చేసిన నాటికి ఉన్న ఉద్యోగులకు ఆర్టీసీ నిబంధనల మేరకే పదోన్నతులు కల్పించాలని నిర్ణయించింది.


ప్రమాద బాధ్యులపై చర్యలు

విజయవాడ పండిట్ నెహ్రూ బస్ స్టేషన్‌లో ముగ్గురి మృత్యువాతకు కారణమైన ప్రమాద ఘటనపై ఆర్టీసీ తీవ్రంగా స్పందించింది. విచారణ నిర్వహించి ప్రమాదానికి బాధ్యులుగా నిర్ధారించిన డ్రైవర్, ట్రాఫిక్ సూపర్ వైజర్‌లను సస్పెండ్ చేసింది.

క్లుప్తంగా...

ఆరోగ్యశ్రీ సేవలను మరింత విస్తృతం చేయండి

అధికారులకు సీఎస్ జవహర్‌రెడ్డి ఆదేశం



సాక్షి, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రభుత్వాస్పత్రులు, పీహెచ్‌సీలు, సీహెచ్‌సీల్లో ఆరోగ్యశ్రీ సేవలను మరింత విస్తృతం చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) డాక్టర్ కెఎస్.జవహర్‌రెడ్డి వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. ఆయన బుధవారం రాష్ట్ర సచివాలయంలో ప్రభుత్వాస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలపై వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యశ్రీకి సంబంధించిన ప్రీ ఆథరైజేషన్లను మరింత మెరుగుపర్చాలని ఆదేశించారు. వచ్చే సమావేశంలో ఆరోగ్యశ్రీకి సంబంధించి ఆస్పత్రుల వారీ సమీక్షిస్తామన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష, ఫ్యామిలీ డాక్టర్ తదితర కార్యక్రమాలపై ప్రజల నుంచి మంచి సంతృప్తస్థాయి రావాలని ఆయన సూచించారు. వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు, రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ జె.నివాస్, ఆరోగ్యశ్రీ సీఈవో హరేంధిరప్రసాద్, ఏపీ వైద్యవిధాన పరిషత్ కమిషనర్ ఎస్.వెంకటేశ్వర్లు ఆరోగ్యశ్రీ సేవలు అందుతున్న తీరు తదితర అంశాలను వివరించారు.

ఆరోగ్య వర్సిటీలో రీసెర్చ్ మెథడాలజీ వర్క్‌షాప్

సాక్షి, అమరావతి: డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయంలో గురు, శుక్రవారాల్లో రీసెర్చ్ మెథడాలజీ వర్క్‌షాప్‌ను నిర్వహిస్తున్నట్టు వర్సిటీ రీసెర్చ్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ డాక్టర్ సుమితాశంకర్ బుధవారం తెలిపారు. దేశవ్యాప్తంగా ప్రముఖ డాక్టర్లు, పరిశోధకులు వర్క్‌షాప్‌లో పాల్గొంటారన్నారు.

ఎల్లో మీడియా కథనం అవాస్తవం

గృహనిర్మాణ సంస్థ డీఈఈల సంఘం

సాక్షి, అమరావతి: ఏపీ గృహనిర్మాణ సంస్థ పరిధిలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (డీఈఈ)లకు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఈఈ)లుగా ప్రమోషన్ కల్పించడంలో డబ్బులు చేతులు మారాయని ఎల్లోమీడియాలో వచ్చిన కథనం పూర్తిగా అవాస్తవం అని సంస్థ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్స్ (డీఈఈ) అసోసియేషన్ అధ్యక్షుడు వి.దాశరథిశర్మ, కార్యనిర్వాహక అధ్యక్షుడు ఆర్.కె.ఎస్.కె.రాజు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సీనియారిటీ ప్రకారం నిబంధనలకు లోబడి ప్రమోషన్లు ఇస్తే అవాస్తవ ఆరోపణలతో వార్తలు రాయడం సరికాదని ఖండించారు. ప్రమోషన్ల ప్రక్రియలో తామెవ్వరికీ డబ్బులు ఇవ్వలేదని ఎండీకి తెలిపినట్లు వివరించారు.

కన్ఫర్డ్ ఐఏఎస్‌లుగా ఇద్దరు అధికారులు

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వంలో ఉన్న ఇద్దరు అధికారులకు కన్ఫర్డ్ ఐఏఎస్‌లుగా పదోన్నతి లభించింది. డాక్టర్ నీలకంఠారెడ్డి, బొమ్మినేని అనిల్ కుమార్‌రెడ్డిలకు ఐఏఎస్‌లుగా పదోన్నతి కల్పిస్తూ డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ ట్రైనింగ్(డీఓపీటీ) బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

ఓటర్ల జాబితా అవకతవకలపై ఢిల్లీ వెళతాం

- టీడీపీ పొలిటికల్ యాక్షన్ కమిటీ సమావేశంలో పలు నిర్ణయాలు

సాక్షి, అమరావతి: ఓటర్ల జాబితాలలో అవకతవకలను రాష్ట్ర ఎన్నికల సంఘం పట్టించుకోవడం లేదని, ఈ అంశాన్ని ఢిల్లీలోని కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ) దృష్టికి తీసుకెళతామని టీడీపీ తెలిపింది. ఉండవల్లిలోని చంద్రబాబు నివాసంలో బుధవారం నిర్వహించిన పార్టీ పొలిటికల్ యాక్షన్ కమిటీ సమావేశంలో నారా లోకేశ్, అచ్చెన్నాయుడు, యనమల రామకృష్ణుడు, నక్కా ఆనంద్ బాబు తదితరులు వివిధ అంశాలపై చర్చించారు. మీడియాకు టీడీపీ విడుదల చేసిన వివరాల ప్రకారం.. ప్రభుత్వానికి వ్యతిరేకంగా త్వరలో వంద రోజుల కార్యాచరణ ప్రణాళికతో ముందుకెళ్లాలని నిర్ణయించారు. త్వరలో టీడీపీ, జనసేన పార్టీలు నియోజకవర్గ స్థాయిల్లో ఉమ్మడి ఆత్మీయ సమావేశాలు నిర్వహించాలని, ఉమ్మడి మేనిఫెస్టో, ప్రభుత్వ వైఫల్యాలపై చార్జిషీట్లు వేసే అంశంపై సమావేశాల్లో చర్చించాలని తీర్మానించారు. కాగా, టీడీపీ నేత అచ్చెన్నాయుడు తదితరులు బుధవారం వెలగపూడి సచివాలయంలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌ను కలిశారు.

జనసేనను బీజేపీకి తాకట్టు పెట్టిన పవన్: సీపీఎం

గన్నవరం: రెండు తెలుగు రాష్ట్రాల్లో జనసేన పార్టీని అధ్యక్షుడు పవన్ బీజేపీకి తాకట్టు పెట్టారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు విమర్శించారు. చిరంజీవి ప్రజారాజ్యం పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేసినట్లుగానే, రానున్న రోజుల్లో జనసేన పార్టీని పవన్ బీజేపీలో విలీనం చేయడం ఖాయమన్నారు. సీపీఎం చేపట్టిన రాష్ట్రవ్యాప్త ప్రజారక్షణ భేరి యాత్రలో భాగంగా బుధవారం కృష్ణాజిల్లా, గన్నవరంలోని మూడు బొమ్మల సెంటర్‌లో సభ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. తెలంగాణ ఎన్నికల ప్రచార సభలో దేశానికి మూడోసారి ప్రధానిగా మోదీ, ఏపీలో తాను సీఎం కావాలని పవన్ అభిప్రాయపడడం శోచనీయమన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష

30 వ రోజు

నిర్వహించిన మొత్తం శిబిరాలు
12,188

నమోదైన ఓపీలు
59,06,725

నిర్వహించిన వైద్య పరీక్షలు
6,43,56,537

మెరుగైన వైద్యం కోసం ఆస్పత్రులకు రిఫర్ చేసినవారి సంఖ్య
85,947



తూర్పుగోదావరి జిల్లా కొత్తతుంగపాడులో ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరంలో వృద్ధురాలికి కళ్లద్దాలు అందజేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో సెల్వి సాల్మన్



గుంటూరు రూరల్ బొంతపాడులో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో మందుల కిట్లు అందజేస్తున్న వైద్యులు



తిరుపతి జిల్లా మంగళం రణధీర్‌పురం ఆరోగ్య సురక్ష శిబిరానికి వచ్చిన ప్రజలు

సీమ సిగలో మరో ఉద్యాన కళాశాల

పులివెందులలో నేడు సీఎం వైఎస్ జగన్ ప్రారంభం

- ఏపీ కార్ల్ భవనాల్లో తాత్కాలిక ఏర్పాటు.. నేటి నుంచి తరగతులు
- 60 సీట్లతో బీఎస్సీ హానర్స్ (హార్టి) కోర్సుతో శ్రీకారం
- ఇప్పటికే 46 సీట్ల భర్తీ.. మిగిలిన సీట్లు నెలాఖరులోగా భర్తీ
- 100 ఎకరాల్లో రూ.110 కోట్లతో కళాశాల నిర్మాణానికి త్వరలో టెండర్లు
- అడ్మినిస్ట్రేషన్, తరగతి గదులు, లేబొరేటరీలు, హాస్టల్స్, స్టాఫ్ క్వార్టర్స్ నిర్మాణం
- ఏపీపీఎస్సీ ద్వారా 30 మంది టీచింగ్, 60 మంది నాన్ టీచింగ్ స్టాఫ్ భర్తీకి చర్యలు



ఏపీ కార్ల్‌లోని ఉద్యాన కళాశాల కోసం కేటాయించిన భవన సముదాయం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో మరో ఉద్యాన కళాశాల అందుబాటులోకి వస్తోంది. రాయలసీమ జిల్లాల్లో ఉద్యాన విద్యకు ఊతమిచ్చేందుకు వీలుగా పులివెందులలో ఏర్పాటుచేసిన ప్రభుత్వ ఉద్యాన కళాశాలను గురువారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రారంభించనున్నారు. వైఎస్సార్ ఉద్యాన వర్సిటీ పరిధిలో నాలుగు ప్రభుత్వ కళాశాలలు (వెంకట్రామన్నగూడెం, అనంతరాజుపేట, పార్వతీపురం, చిన్నాలతరపి).. మరో నాలుగు అనుబంధ కళాశాలలు (అనంతపురం, తాడిపత్రి, వీఎస్ పురం, మార్కాపురం) ఉన్నాయి. దాదాపు అన్ని కళాశాలలు బీఎస్సీ హానర్స్ (హార్టి) కోర్సును అందిస్తున్నాయి. ప్రభుత్వ కళాశాలల పరిధిలో 520, ప్రైవేటు కళాశాలల పరిధిలో 200 సీట్లు ఉన్నాయి. అలాగే, నాలుగు ప్రభుత్వ, ఏడు ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలలు కూడా యూనివర్సిటీకి అనుబంధంగా ఉన్నాయి.

రాయలసీమలో రెండో ఉద్యాన కళాశాల..

ఇక వైఎస్సార్ జిల్లా అనంతరాజుపేటలో ఇప్పటికే ఉద్యాన కళాశాల ఉంది. తాజాగా.. పులివెందులలో కొత్తగా మరో కళాశాలను ప్రభుత్వం మంజూరు చేసింది. ఉద్యాన పంటల హబ్‌గా పులివెందుల ఇప్పటికే గుర్తింపు పొందిన నేపథ్యంలో ఈ ప్రాంతంలో ఉద్యాన విద్యకు ఊతమిచ్చేలా ప్రభుత్వం కొత్తగా కళాశాల ఏర్పాటుచేసింది. బీఎస్సీ ఆనర్స్ (హార్టి) కోర్సులో 60 సీట్లతో ఈ కళాశాల ఏర్పాటవుతోంది. ఇప్పటికే రెండు విడతల కౌన్సెలింగ్ ద్వారా 46 సీట్లను భర్తీచేశారు. మిగిలిన సీట్లను చివరి రౌండ్ కౌన్సెలింగ్ ద్వారా భర్తీచేయనున్నారు. పులివెందులలోని ఆంధ్రప్రదేశ్ సెంటర్ ఫర్ అడ్వాన్స్‌డ్ రీసెర్చ్ ఆన్ లైవ్‌స్టాక్ (ఏపీ కార్ల్) భవన సముదాయంలో తాత్కాలికంగా ఏర్పాటుచేసిన కళాశాలను గురువారం సీఎం జగన్ ప్రారంభిస్తారు.

100 ఎకరాల్లో రూ.110 కోట్లతో భవనాలు..

మరోవైపు.. ఈ కళాశాల కోసం 100 ఎకరాలు అవసరమని గుర్తించారు. ఆ మేరకు భూ కేటాయింపునకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. భవన సముదాయాల కోసం ఇప్పటికే రూ.110 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో పరిపాలనా భవనం, తరగతి గదులు, అత్యాధునిక లేబొరేటరీలు, విద్యార్థుల కోసం హాస్టల్ భవనాలు, సిబ్బంది కోసం క్వార్టర్స్, వెహికల్ పార్కింగ్ షెడ్లు నిర్మించనున్నారు. ఇందుకు సంబంధించి త్వరలో టెండర్లు పిలిచేందుకు సన్నాహాలు చేస్తున్నారు. కొత్తగా ఏర్పాటుచేస్తున్న ఈ కళాశాల కోసం రాష్ట్ర ప్రభుత్వం 30 టీచింగ్, 60 నాన్ టీచింగ్ పోస్టులను మంజూరు చేసింది. టీచింగ్ పోస్టుల్లో ప్రధానంగా 21 అసిస్టెంట్ ప్రొఫెసర్లు, 6 అసోసియేట్ ప్రొఫెసర్లు, 3 ప్రొఫెసర్ పోస్టులున్నాయి. వీటిని ఏపీపీఎస్సీ ద్వారా త్వరలో భర్తీ చేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లుచేస్తోంది. ఈ పోస్టులు భర్తీచేసే వరకు విద్యాబోధనకు ఇబ్బందిలేకుండా అనంతరాజుపేట, వెంకట్రామన్నగూడెంలలోని ఉద్యాన కళాశాలల నుంచి ఐదుగురు అధ్యాపకులను పులివెందుల ఉద్యాన కళాశాలకు బదిలీ చేశారు. వీరంతా ఇప్పటికే విధుల్లో చేరారు. ఇక పులివెందులలో ఉద్యాన కళాశాల ప్రారంభోత్సవం సందర్భంగా విస్తృత ఏర్పాట్లు చేశామని వర్సిటీ వీసీ డాక్టర్ తోలేటి జానకీరామ్ 'సాక్షి'కి తెలిపారు. కౌన్సెలింగ్ ద్వారా బీఎస్సీ ఆనర్స్ (హార్టి)లో చేరిన విద్యార్థులకు గురువారం నుంచి తరగతులు ప్రారంభించనున్నట్లు ఆయన చెప్పారు.

అన్నమయ్య, వైఎస్సార్ జిల్లాల్లో.. నేడు, రేపు సీఎం జగన్ పర్యటన

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ గురు, శుక్రవారాల్లో అన్నమయ్య, వైఎస్సార్ జిల్లాల్లో పర్యటించనున్నారు. తాడేపల్లి నివాసం నుంచి గురువారం ఉ.10 గంటలకు బయల్దేరి రాయచోటిలో శాసనమండలి డిప్యూటీ చైర్మన్ జకియా ఖానం కుమారుడి వివాహ వేడుకలో పాల్గొంటారు. ఆ తర్వాత మాజీ ఎంపీ కుటుంబ సభ్యుల వివాహ వేడుకలో పాల్గొంటారు. తర్వాత పులివెందుల చేరుకుని శ్రీకృష్ణుడి ఆలయ ప్రారంభోత్సవంలో పాల్గొంటారు. అనంతరం పులివెందులలో శిల్పారామాన్ని ప్రారంభిస్తారు. ఆ తర్వాత శ్రీ స్వామి నారాయణ్ గురుకుల్ స్కూల్‌కు శంకుస్థాపన.. ఏపీ కార్ల్ ప్రాంగణంలో అగ్రికల్చర్, హార్టికల్చర్ కళాశాలలు, స్టేట్ ఆఫ్ ఆర్ట్ సెంట్రల్ టెస్టింగ్ లేబొరేటరీ.. అగ్రికల్చర్, హార్టికల్చర్ ల్యాబ్‌ల ప్రారంభోత్సవం.. అక్కడ నుంచి ఆదిత్య బిర్లా యూనిట్ విజిట్ అనంతరం సీవీ సుబ్బారెడ్డి నివాసానికి వెళ్తారు. అక్కడ నుంచి ఇడుపులపాయ చేరుకుని రాత్రికి బసచేస్తారు. శుక్రవారం 10వ తేదీ ఉ.8.30 గంటలకు ఇడుపులపాయలో ఆర్‌కే వ్యాలీ పోలీస్‌స్టేషన్‌ను ప్రారంభిస్తారు. ఆ తర్వాత ఎకో పార్క్ వద్ద వేముల మండలం ప్రజాప్రతినిధులతో సమావేశమవుతారు. అక్కడి నుంచి బయల్దేరి మధ్యాహ్నానికి తాడేపల్లి నివాసానికి చేరుకుంటారు.

రబీలో గోదావరి డెల్టాకు సాగునీరు

డెల్టా ఎమ్మెల్యేలు, కలెక్టర్లు, నీటిపారుదల శాఖ అధికారులతో సీఎంఓ అధికారుల భేటీ

సాక్షి, అమరావతి: గోదావరి డెల్టాకు రబీ కింద సాగునీరు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ప్రణాళిక సిద్ధంచేసుకోవాలని ఆయా జిల్లాల కలెక్టర్లను ఆదేశించింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆదేశాల మేరకు సీఎంఓ అధికారులు బుధవారం కీలక సమావేశాన్ని నిర్వహించారు. గోదావరి డెల్టా ప్రాంత ఎమ్మెల్యేలు, తూర్పుగోదావరి, కాకినాడ, కోనసీమ, పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల కలెక్టర్లు, వ్యవసాయ, నీటి పారుదల శాఖ అధికారులు, ముఖ్యమంత్రి కార్యదర్శులు సమావేశమయ్యారు. గోదావరి డెల్టా కింద రబీ సాగుకు అవసరమైన నీటి వనరుల పరిస్థితులను వారు సమీక్షించారు. వర్షాభావ పరిస్థితులు ఉన్నప్పటికీ సమర్థవంతమైన నీటి నిర్వహణ ద్వారా రబీకి నీరు విడుదలకు ఈ సమావేశంలో నిర్ణయించారు. ఇందుకు ఒక ప్రణాళికను సిద్ధంచేయాలని ఆయా జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. నీటివనరులు వృథా కాకుండా చివరి భూములకు చేరేలా సమర్థవంతమైన నీటి నిర్వహణకు వారాబందీ సహా అందుబాటులో ఉన్న పద్ధతులను అనుసరించాలని నిర్ణయించారు. చివరి భూముల్లో పంటలు ఎండిపోకుండా తీసుకోవాల్సిన చర్యలపైనా సమావేశంలో చర్చించారు. సాగునీరు అందని భూములకు డీజిల్ ఇంజిన్ల ద్వారా అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

కొరత లేకుండా చూడాలి..

డెల్టాలో ప్రతి ఎకరాకు సాగునీటిని అందించడానికి అవసరమైన అత్యవసర పనులు మంజూరుచేసి వాటిని వెంటనే చేపట్టాలని, లస్కర్ల సహా ఎక్కడా కొరత లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఇక మెట్ట భూముల్లో ఆరుతడి పంటలు, అపరాల సాగును ప్రోత్సహించాలని, ఆ మేరకు రైతుల్లో అవగాహన పెంచేలా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. గోదావరి డెల్టా కింద ఉన్న వివిధ జిల్లాల రైతు సలహా మండళ్లతో చర్చించి నీటి విడుదలకు అవసరమైన తేదీలను ఖరారుచేయాలని కలెక్టర్లకు నిర్దేశించారు. కచ్చితమైన షెడ్యూలు ప్రకటించి ఆ మేరకు నీటిని అందించేలా చూసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. అలాగే, ఉన్న నీటి వనరులను జాగ్రత్తగా వాడుకునేలా రైతులకు ఈ సలహా మండళ్ల ద్వారా అవగాహన కల్పించేందుకు గ్రామస్థాయిలో కూడా చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు చెప్పారు. పంటకాలం పూర్తయ్యేంత వరకూ ఇరిగేషన్, వ్యవసాయ, పౌరసరఫరాల శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. మరోవైపు.. రబీ ప్లాన్‌ను సిద్ధంచేసుకోవాలని సమావేశంలో వ్యవసాయ శాఖాధికారులను ఆదేశించారు. అవసరమైన విత్తనాలు, సాగు పద్ధతుల మీద రైతుల్లో అవగాహన పెంచేలా గ్రామస్థాయి వరకూ ప్రణాళిక రూపొందించాలని సూచించారు. కాగా, ప్రభుత్వ నిర్ణయంపట్ల రాజానగరం ఎమ్మెల్యే రాజా, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కన్నబాబు, అనపర్తి ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి, ముమ్మిడివరం ఎమ్మెల్యే సతీష్, ఉంగుటూరు ఎమ్మెల్యే శ్రీనివాస్, భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ హర్షం వ్యక్తంచేశారు. ఈ సమావేశంలో ఐదు జిల్లాల కలెక్టర్లు, నీటిపారుదల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్, సీఎం కార్యదర్శులు ధనుంజయ్‌రెడ్డి, ముత్యాలరాజు, అగ్రికల్చరల్ కమిషనర్ హరికిరణ్ పాల్గొన్నారు.

ఏపీ రిజిస్ట్రేషన్ల విధానంపై జమ్మూ సర్కారు అధ్యయనం

ఇక్కడి రిజిస్ట్రేషన్ల విధానంపై ఆ రాష్ట్ర అదనపు ఐజీ సాజద్ ప్రశంస

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో అమలవుతున్న రిజిస్ట్రేషన్ల విధానాన్ని జమ్మూ కాశ్మీర్ ప్రభుత్వం అధ్యయనం చేస్తోంది. ఇందుకోసం ఆ రాష్ట్ర రిజిస్ట్రేషన్ల శాఖ అదనపు ఐజీ సాజద్ హుస్సేన్ గనయ్, జమ్మూ సబ్ రిజిస్ట్రార్ వినయ్‌కుమార్ రెండు రోజుల నుంచి రాష్ట్రంలో పర్యటిస్తున్నారు. రిజిస్ట్రేషన్ల సేవలు బాగున్నాయనే సమాచారంతో వారు ఇక్కడికి వచ్చి రిజిస్ట్రేషన్లు తీరు, ఉపయోగిస్తున్న సాఫ్ట్‌వేర్, ఇతర సర్వీసులను పరిశీలించారు. కొద్దిరోజుల క్రితం వరకు అమలు చేసిన కార్డ్ సాఫ్ట్‌వేర్ ద్వారా రిజిస్ట్రేషన్లు చేస్తున్న విధానం, కొత్తగా అమలు చేస్తున్న కార్డ్ ప్రైమ్ విధానం గురించి తెలుసుకున్నారు. కార్డ్ ప్రైమ్ విధానంలో వినియోగదారులే డాక్యుమెంట్లు తయారు చేసుకోవడం, ఆన్‌లైన్‌లో ఫీజుల చెల్లింపు, స్లాట్ బుకింగ్, ఈ–సిగ్నేచర్, ఆటో మ్యుటేషన్ సర్వీసులు వారిని అమితంగా ఆకట్టుకున్నాయి. అన్ని రాష్ట్రాల కంటే ఇది ఎంతో మెరుగ్గా ఉందని చెప్పినట్టు మన రాష్ట్ర అధికారులు తెలిపారు. ఈ విషయాన్ని తమ రాష్ట్ర అధికారులకు తెలియజేయగా ఏపీ సర్వీసుల పూర్తి నివేదికను తీసుకురావాల్సిందిగా ఆదేశించినట్టు సమాచారం. మొదట తాడేపల్లిలోని స్టాంపులు, రిజిస్ట్రేషన్ల ప్రధాన కార్యాలయంలో కమిషనర్ అండ్ ఐజీ వి.రామకృష్ణ, అదనపు ఐజీ ఉదయ భాస్కర్‌తో విడివిడిగా సమావేశమై పూర్తి వివరాలు తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో సర్వీసులు ఎలా అందుతున్నాయో విజయవాడలోని గాంధీనగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లి చూశారు. గురువారం మచిలీపట్నం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లనున్నారు. ఈ నెల 10వ తేదీ వరకు జమ్మూ, కాశ్మీర్ అధికారులు రాష్ట్రంలోనే ఉండి మరిన్ని వివరాలు తెలుసుకోనున్నారు.

సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులపై కఠిన చర్యలు

- సీఎం కుటుంబంపై అభ్యంతరకర పోస్టులు పెడుతున్న అకౌంట్లను గుర్తించాం
- వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం
- న్యాయమూర్తిని దూషించిన వారికి నోటీసులిచ్చాం
- ఫేక్ ప్రొఫైల్స్‌తో పోస్టులు పెట్టినా.. గుర్తించే పరిజ్ఞానం ఉంది
- సీఐడీ అదనపు డీజీ సంజయ్



సాక్షి, అమరావతి: సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెడుతున్నవారిపై కఠిన చర్యలు చేపడుతున్నట్లు సీఐడీ అదనపు డీజీ సంజయ్ హెచ్చరించారు. బుధవారం సచివాలయంలో సీఐడీ ఎస్పీ(సైబర్ నేరాలు) హర్షవర్ధన్ రాజుతో కలసి అదనపు డీజీ సంజయ్ మీడియాతో మాట్లాడారు. సీఎం జగన్ కుటుంబసభ్యులపై అసభ్యకర పోస్టులు పెడుతున్న ఐదు అకౌంట్లను గుర్తించామని చెప్పారు. టీడీపీ కార్తీక్‌రెడ్డి, సమరసింహారెడ్డి, చిత్ర లహరి, వైసీపీ మొగుడు అనే పేర్లతో ఉన్న సోషల్ మీడియా అకౌంట్ల నుంచి అసభ్యకరమైన పోస్టులు పెడుతున్నట్టు నిర్ధారణ అయ్యిందన్నారు. వాటిని నడుపుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అలాగే మహిళా న్యాయమూర్తిని దూషిస్తూ పోస్టులు పెట్టిన 26 అకౌంట్లకు సంబంధించి.. 21 మందిని గుర్తించామని చెప్పారు. వారిలో టీడీపీ నేత బుద్దా వెంకన్న సహా 19 మందికి నోటీసులు జారీ చేశామన్నారు. టీడీపీ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి పేరుతో సోషల్ మీడియా అకౌంట్ నిర్వహిస్తున్న ఆయన తమ్ముడి కుమారుడు గోరంట్ల రామ్ మహిళా న్యాయమూర్తిపై అవమానకరమైన పోస్టులు పెట్టినట్లు గుర్తించామని.. ఆయనకు కూడా నోటీసులు జారీ చేశామని చెప్పారు. మరో ఇద్దరికి నోటీసులు జారీ చేయనున్నట్టు తెలిపారు. మిగిలిన ఐదు అకౌంట్లకు సంబంధించిన వారిని కూడా గుర్తించి చర్యలు చేపడతామన్నారు.

విదేశాల్లో ఉన్నా తప్పించుకోలేరు..

ఇతర దేశాల్లో ఉంటూ అసభ్యకర పోస్టులు పెడుతున్నవారిని గుర్తించి.. సంబంధిత దేశాల రాయబార కార్యాలయాలను సంప్రదించి వారిపై కఠిన చర్యలకు ఉపక్రమిస్తున్నామని సంజయ్ చెప్పారు. ఎక్కువగా అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియా దేశాలను కేంద్రంగా చేసుకుని ఇలాంటి పోస్టులు పెడుతున్నట్టు గుర్తించామన్నారు. ఫేక్ ప్రొఫైల్స్‌తో అసభ్యకర పోస్టులు పెడుతున్నవారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఫేక్ ప్రొఫైల్స్‌తో పోస్టులు పెడితే ఎవరూ గుర్తించలేరనే అపోహ వద్దని సూచించారు. అటువంటి వారిని గుర్తించే పరిజ్ఞానం సీఐడీ వద్ద ఉందని హెచ్చరించారు. ఏదో ఒక రాజకీయ పార్టీపై అభిమానంతోనో, మరో పార్టీపై వ్యతిరేకతతోనో అసభ్యకర పోస్టులు పెట్టి భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులను అరికట్టేందుకు సైబర్ హైజీన్, సైబర్ ఎథిక్స్ పేరుతో అవగాహన సదస్సులు నిర్వహించామని చెప్పారు. త్వరలో సోషల్ మీడియా ప్రతినిధులతో విజయవాడ, విశాఖపట్నంలో అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు.

2,972 సైబర్ బుల్లీయింగ్ షీట్లు

సీఐడీకి చెందిన సోషల్ మీడియా విభాగం అసభ్యకర పోస్టులను గుర్తించి.. వెంటనే తొలగించే ప్రక్రియను కొనసాగిస్తోందని అదనపు డీజీ సంజయ్ చెప్పారు. రెండు నెలల్లో అటువంటి 31 కొత్త సోషల్ మీడియా అకౌంట్లను గుర్తించామన్నారు. అసభ్యకర పోస్టులు పెడుతున్న, షేర్ చేస్తున్న వారిపై ఇప్పటికే 2,972 సైబర్ బుల్లీయింగ్ షీట్లు తెరిచామని చెప్పారు.సమాజంలోని వివిధ వ్యక్తులపై వస్తున్న అసభ్యకర పోస్టులను గుర్తించి సోషల్ మీడియా సంస్థలకు నోటీసులు పంపి ఆయా పోస్టులను తొలగించామన్నారు. 2022లో 1,450 పోస్టులు, 2023లో ఇప్పటివరకు 2,164 పోస్టులను తొలగించినట్టు చెప్పారు. టీడీపీ మహిళా నేతతో పాటు ప్రతిపక్ష పార్టీ నేతలపై పెట్టిన 45 అసభ్యకర పోస్టులపై తక్షణమే స్పందించి తొలగించామని వెల్లడించారు.

మార్పు వివరించి తీర్పు కోరతాం

నేటి నుంచి 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం: సజ్జల

- డిసెంబర్ 19 వరకు గ్రామగ్రామాన.. ఇంటింటా ప్రచారం
- మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుల నేతృత్వంలో నిర్వహణ
- గ్రామానికి చేసిన మేలును వివరిస్తూ సచివాలయాల్లో బోర్డుల ఆవిష్కరణ
- సచివాలయం ప్రధాన కూడలిలో వైఎస్సార్‌సీపీ జెండా ఆవిష్కరణ
- 'ఆపు బాబూ నాటకం.. జగనే మా నమ్మకం' ద్వారా ప్రజా తీర్పు కోరతాం



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో నాలుగున్నరేళ్లుగా సంక్షేమాభివృద్ధి పథకాలు, సుపరిపాలనతో సాకారమైన విప్లవాత్మక మార్పులను వివరించి ప్రజల ఆశీర్వాదం కోరడం, మరోసారి చంద్రబాబు–పవన్ కళ్యాణ్ వంచన ఎత్తుగడలను ఎండగట్టడమే లక్ష్యంగా గురువారం నుంచి 'వై ఏపీ నీడ్స్ జగన్' (ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే..) కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా దుష్ట చతుష్టయం కుట్రలను ఛేదిస్తూ మరో సారి ప్రజల్లోకి వెళ్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం, పార్టీపరంగా ఏకకాలంలో నిర్వహించే ఈ కార్యక్రమం డిసెంబర్ 19వతేదీతో ముగుస్తుందన్నారు. బుధవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు.

సంక్షేమంతో అభివృద్ధి

సీఎం వైఎస్ జగన్ ఇప్పటికే 99.5 శాతం హామీలను అమలు చేశారు. మేనిఫెస్టో అమలే గీటురాయిగా ఎన్నికలకు వెళ్లగలుగుతున్నాం. నాలుగున్నరేళ్లలో సీఎం జగన్ ప్రజలకు ఏం చేశారనేందుకు అందరూ సాక్షులే. అర్హతే ప్రామాణికంగా అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలను అందించారు. రాష్ట్రంలో 1.60 కోట్ల కుటుంబాలు ఉంటే అర్హత ఉన్న 1.40 కోట్ల కుటుంబాలకు సంక్షేమ ఫలాలు అందాయి. డీబీటీ ద్వారా పేదల ఖాతాల్లో రూ.2.40 లక్షల కోట్లను నేరుగా జమ చేశారు. పేదలకు సంక్షేమం అందినప్పుడే అభివృద్ధిలోకి వస్తారు. ఆర్బీఐ, నీతి ఆయోగ్ లాంటి కేంద్ర సంస్థల నివేదికలే ఇందుకు నిదర్శనం.

అభివృద్ధి అంటే ఇదీ

చంద్రబాబు సర్కారు దిగిపోయే నాటికి స్థూల దేశీయోత్పత్తిలో రాష్ట్రం 22వ స్థానంలో ఉంటే 2021–22 నాటికి మొదటి స్థానానికి చేరుకున్నట్లు ఆర్బీఐ నివేదిక వెల్లడిస్తోంది. దేశంలో తలసరి ఆదాయంలో 2019నాటికి రాష్ట్రం 17వ స్థానంలో ఉంటే ప్రస్తుతం తొమ్మిదో స్థానానికి చేరుకుంది. చంద్రబాబు హయాంలో కేవలం 34 వేల ప్రభుత్వ పోస్టుల్ని భర్తీ చేయగా సీఎం జగన్ అధికారంలోకి వచ్చాక ఆర్టీసీ విలీనంతో కలిపితే రాష్ట్రంలో భర్తీ చేసిన ఉద్యోగాల సంఖ్య ఏకంగా 4.93 లక్షలు. ఇందులో పర్మినెంట్ ఉద్యోగాలు 2,13,662. ఇంకా కొన్ని వ్యవస్థల్లో రిక్రూట్‌మెంట్‌లు జరుగుతూనే ఉన్నాయి. వ్యవసాయ రంగాన్ని తీసుకుంటే చంద్రబాబు హయాంలో దేశవ్యాప్తంగా మన రాష్ట్రం ఆఖరున -6.5 శాతం వృద్ధి రేటుతో 27వ స్థానంలో ఉండగా ఇప్పుడు 8.2 శాతం వృద్ధి రేటుతో 6వ స్థానానికి చేరుకుంది. వైఎస్ జగన్ సీఎం అయ్యాక 2.5 లక్షల కొత్త ఎంఎస్ఎంఈ యూనిట్‌లు వచ్చాయి. 16.5 లక్షల కొత్త ఉద్యోగాలు యువతకు దక్కాయి. రాష్ట్రం పారిశ్రామికాభివృద్ధి రేటులో చంద్రబాబు హయాంలో 3.2 శాతం (దేశంలో 22వ స్థానం) ఉంటే ఇప్పుడు 12.8 శాతం (దేశంలో 3వ స్థానం) సాధించాం. నాలుగు భారీ పోర్టులు, 9 ఫిషింగ్ హార్బర్‌లతోపాటు రాష్ట్ర రహదారులు, సెంట్రల్ హైవే నిర్మాణాలు పెద్ద ఎత్తున కొనసాగుతున్నాయి. దాదాపు రూ.16,700 కోట్లతో నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను సీఎం జగన్ సమూలంగా మార్చేశారు. రూ.17 వేల కోట్లకు పైగా వ్యయంతో ప్రభుత్వ ఆస్పత్రుల ఆధునికీకరణతోపాటు కొత్త మెడికల్ కాలేజీలను ప్రభుత్వ రంగంలో అందుబాటులోకి తెస్తున్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా కోటికి పైగా ధృవీకరణ పత్రాలు జారీ చేయడమే కాకుండా పలు సమస్యల్ని తక్షణమే పరిష్కరించాం. జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా 12 వేల క్యాంపులు నిర్వహించి 6.4 కోట్ల పరీక్షలు చేపట్టాం.

కార్యక్రమంలో ప్రధాన అంకాలు

'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం ద్వారా మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుల నేతృత్వంలో ప్రజా ప్రతినిధులంతా గ్రామ సర్పంచ్‌తో కలిసి మధ్యాహ్నం 3–4 గంటల సమయంలో సచివాలయాన్ని సందర్శిస్తారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధిని వివరించే బోర్డులను ఆవిష్కరిస్తారు. ప్రధాన కూడలిలో పార్టీ జెండాను ఎగురవేస్తారు. సాయంత్రం గ్రామ పెద్దలు, పార్టీ నాయకులు, ప్రభావశీలురతో చర్చలు జరిపి సూచనలు స్వీకరిస్తారు. రాత్రికి అక్కడే బస చేస్తారు. మరుసటి రోజు అదే గ్రామంలో సచివాలయాల కన్వీనర్లు, గృహ సారథులు, పార్టీ మద్దతుదారులు, సీఎం జగన్ అభిమానులతో కలసి ఇంటింటా ప్రచారాన్ని ప్రారంభిస్తారు. వలంటీర్లు వారితోపాటు వెళ్లి సీఎం జగన్ చేకూర్చిన సంక్షేమం, అభివృద్ధిని వివరించే పుస్తకాన్ని ప్రతి ఇంట్లో అన్నదమ్ములు, అక్కచెల్లెమ్మలకు అందిస్తారు. ఆ తర్వాత పార్టీ నేతలు 2014లో చంద్రబాబు ఇచ్చిన వాటిల్లో ప్రధానమైన పది హామీలను, 2019లో వైఎస్ జగన్ ఇచ్చిన హామీల్లో ప్రధాన హామీలతో కూడిన కరపత్రాన్ని ప్రతి ఇంటా చదివి వినిపించి అమలు చేశారా? లేదా? అన్నది ఆరా తీస్తారు. 'ఆపు బాబూ నాటకం.. జగనే మా నమ్మకం' పేరిట ప్రజాతీర్పు పుస్తకంలో ఇంటి పెద్ద పేరును ఫోన్ నెంబర్‌తో సహా నమోదు చేసి పది హామీల అమలులో సీఎం జగన్, చంద్రబాబు సాధించిన మార్కులను పొందుపరుస్తారు. ఆంధ్రప్రదేశ్ ఇంకా అభివృద్ధి చెందాలంటే ఎవరు కావాలని అడిగి బాక్స్‌లో టిక్ చేస్తారు. జగన్ పాలనపై సంతృప్తి వ్యక్తం చేస్తే బ్రోచర్‌పై 'స్టాంపు' ముద్ర వేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేస్తారు. ప్రజాతీర్పులో వెల్లడైన అంశాలను క్రోడీకరించి ప్రకటిస్తాం. దీన్ని రాజకీయ కార్యక్రమంగా కాకుండా ప్రభుత్వ అధికారిక కార్యక్రమంగానే చూడాలి. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లు పాల్గొంటారు.



ఉప్పల్ టి20 మ్యాచ్ బెంగళూరుకు తరలింపు

భారత్, ఆస్ట్రేలియా మధ్య టి20 సిరీస్‌లో భాగంగా హైదరాబాద్‌లో జరగాల్సిన చివరిదైన ఐదో టి20 మ్యాచ్ వేదిక మారింది. షెడ్యూల్ ప్రకారం డిసెంబర్ 3న ఈ మ్యాచ్ ఉప్పల్‌లోని రాజీవ్‌గాంధీ స్టేడియంలో జరగాల్సి ఉంది. అయితే అదే రోజు తెలంగాణ రాష్ట్ర శాసనసభ ఎన్నికల ఫలితాలు ఉన్న నేపథ్యంలో తాము భద్రత కల్పించలేమని పోలీసులు స్పష్టంగా చెప్పేశారు. దాంతో ఈ మ్యాచ్‌ను బీసీసీఐ బెంగళూరుకు మార్చింది. ఈ విషయంపై హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) కొత్త కమిటీ బీసీసీఐ అధికారులతో సమావేశమైంది. మరో తేదీన తమకు మ్యాచ్ నిర్వహించే అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేసినా... ఆసీస్ టీమ్ స్వదేశం తిరిగి వెళ్లే ఏర్పాట్లలో మార్పు చేసే అవకాశం లేదని చెప్పిన బోర్డు ఈ మ్యాచ్‌ను బెంగళూరులో నిర్వహించేందుకు సిద్ధమైంది. ఐదు మ్యాచ్‌ల టి20 సిరీస్‌లో భాగంగా ఈ నెల 23న విశాఖపట్నంలో భారత్, ఆస్ట్రేలియా మధ్య తొలి పోరు జరుగుతుంది.

నంబర్‌వన్ గిల్

- ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో తొలిసారి అగ్రస్థానానికి
- బౌలింగ్‌లో సిరాజ్‌కు మళ్లీ టాప్ ర్యాంక్





దుబాయ్: అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో భారత ఓపెనర్ శుబ్‌మన్ గిల్ 830 రేటింగ్ పాయింట్లతో నంబర్‌వన్ స్థానానికి చేరుకున్నాడు. ఏప్రిల్ 2021 నుంచి టాప్ ర్యాంక్‌లో కొనసాగుతున్న పాకిస్తాన్ కెప్టెన్ బాబర్ ఆజమ్ (824)ను గిల్ రెండో స్థానానికి నెట్టాడు. 2023లో అద్భుత ఫామ్‌లో ఉన్న గిల్ 26 వన్డేల్లో 63 సగటుతో 1449 పరుగులు చేశాడు. సచిన్, ధోని, కోహ్లి తర్వాత భారత్ తరఫున వన్డేల్లో ఐసీసీ నంబర్‌వన్ ర్యాంక్‌ను అందుకున్న నాలుగో ఆటగాడిగా గిల్ నిలిచాడు. బౌలింగ్‌లో హైదరాబాదీ పేసర్ మొహమ్మద్ సిరాజ్ (709 రేటింగ్ పాయింట్లు) మరోసారి నంబర్‌వన్ ర్యాంక్‌ను సొంతం చేసుకున్నాడు. గతంలో రెండుసార్లు 'టాప్'నకు చేరి ఆ తర్వాత తన స్థానాన్ని కోల్పోయిన సిరాజ్ వరల్డ్ కప్‌లో 10 వికెట్ల ప్రదర్శనతో మళ్లీ అగ్ర స్థానానికి వచ్చాడు. నంబర్‌వన్‌గా ఉన్న షాహిన్ అఫ్రిది (పాక్) ఐదో స్థానానికి పడిపోయాడు. భారత్ నుంచి టాప్-10లో కుల్దీప్ (4వ స్థానం), బుమ్రా (8వ స్థానం), షమీ (10వ స్థానం)లో ఉన్నారు. ప్రస్తుతం ఐసీసీ ర్యాంకింగ్స్‌లో భారత్ ఆధిపత్యం కొనసాగుతోంది. కొన్నాళ్లుగా టెస్టు, వన్డే, టి20 టీమ్ ర్యాంకింగ్స్‌లో భారత జట్టే టాప్ ర్యాంక్‌లో ఉంది. టి20 బ్యాటింగ్‌లో సూర్యకుమార్.. టెస్టు బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో అశ్విన్... టెస్టు ఆల్‌రౌండర్ల ర్యాంకింగ్స్‌లో జడేజా నంబన్‌వన్‌గా ఉన్నారు.

బెన్ స్టోక్స్ సెంచరీ

- ఎట్టకేలకు ఇంగ్లండ్ ఖాతాలో రెండో విజయం
- 160 పరుగులతో నెదర్లాండ్స్ చిత్తు



బెన్ స్టోక్స్

పుణే: వరల్డ్‌కప్‌లో వరుసగా ఐదు మ్యాచ్‌లలో ఓడి సెమీఫైనల్ అవకాశాలు కోల్పోయిన తర్వాత ఇంగ్లండ్ టోర్నీలో తమ రెండో విజయాన్ని నమోదు చేసింది. టోర్నీ తొలి పోరులో న్యూజిలాండ్ చేతిలో ఓడి, అనంతరం బంగ్లాదేశ్‌పై నెగ్గిన ఇంగ్లండ్.. ఆపై వరుసగా అఫ్గానిస్తాన్, దక్షిణాఫ్రికా, శ్రీలంక, భారత్, ఆస్ట్రేలియా జట్ల చేతిలో చిత్తయింది. బుధవారం జరిగిన మ్యాచ్‌లో ఇంగ్లండ్ 160 పరుగుల తేడాతో నెదర్లాండ్స్‌పై ఘన విజయం సాధించింది. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 339 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' బెన్ స్టోక్స్ (84 బంతుల్లో 108; 6 ఫోర్లు, 6 సిక్స్‌లు) సెంచరీ సాధించగా... డేవిడ్ మలాన్ (74 బంతుల్లో 87; 10 ఫోర్లు, 2 సిక్స్‌లు), క్రిస్ వోక్స్ (45 బంతుల్లో 51; 5 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. ఒకదశలో 133/1తో మెరుగైన స్థితిలో కనిపించిన ఇంగ్లండ్.. తర్వాతి 15 ఓవర్లలో 59 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి 192/6 స్కోరుతో కష్టాల్లో పడింది. ఈ దశలో స్టోక్స్, వోక్స్ ఏడో వికెట్‌కు 13.3 ఓవర్లలోనే 129 పరుగులు జోడించి జట్టును ఆదుకున్నారు. అనంతరం నెదర్లాండ్స్ 37.2 ఓవర్లలో 179 పరుగులకే ఆలౌటైంది. తేజ నిడమనూరు (34 బంతుల్లో 41 నాటౌట్; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) టాప్ స్కోరర్‌గా నిలవగా... స్కాట్ ఎడ్వర్డ్స్ (38), వెస్లీ బరేసి (37), సైబ్రాండ్ (33) ఫర్వాలేదనిపించారు. తాజా విజయంతో ఏడో స్థానానికి చేరిన ఇంగ్లండ్ 2025 చాంపియన్స్ ట్రోఫీకి అర్హత సాధించే అవకాశాలను ప్రస్తుతానికి సజీవంగా ఉంచుకుంది.

స్కోరు వివరాలు

ఇంగ్లండ్ ఇన్నింగ్స్: బెయిర్‌స్టో (సి) మీకెరెన్ (బి) దత్ 15; మలాన్ (రనౌట్) 87; రూట్ (బి) వాన్ బీక్ 28; స్టోక్స్ (సి) సైబ్రాండ్ (బి) వాన్ బీక్ 108; బ్రూక్ (సి) అకెర్‌మన్ (బి) డి లీడ్ 11; బట్లర్ (సి) తేజ (బి) మీకెరెన్ 5; అలీ (సి) డి లీడ్ (బి) దత్ 4; వోక్స్ (సి) ఎడ్వర్డ్స్ (బి) డి లీడ్ 51; విల్లీ (సి) సైబ్రాండ్ (బి) డి లీడ్ 6; అట్కిన్సన్ (నాటౌట్) 2; రషీద్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 21; **మొత్తం (50 ఓవర్లలో 9 వికెట్లకు) 339. వికెట్ల పతనం:** 1-48, 2-133, 3-139, 4-164, 5-178, 6-192, 7-321, 8-327, 9-334. **బౌలింగ్:** ఆర్యన్ దత్ 10-0-67-2, వాన్ బీక్ 10-0-88-2, మీకెరెన్ 10-0-57-1, డి లీడ్ 10-0-74-3, వాన్‌డర్ మెర్వ్ 3-0-22-0, అకెర్‌మన్ 7-0-31-0.

నెదర్లాండ్స్ ఇన్నింగ్స్: వెస్లీ బరేసి (రనౌట్) 37; మ్యాక్స్ ఒ డౌడ్ (సి) అలీ (బి) వోక్స్ 5; అకెర్‌మన్ (సి) బట్లర్ (బి) విల్లీ 0; సైబ్రాండ్ (సి) వోక్స్ (బి) విల్లీ 33; ఎడ్వర్డ్స్ (సి) మలాన్ (బి) అలీ 38; డి లీడ్ (బి) రషీద్ 10; తేజ నిడమనూరు (నాటౌట్) 41; వాన్ బీక్ (సి) మలాన్ (బి) రషీద్ 2; వాన్‌డర్ మెర్వ్ (సి) రషీద్ (బి) అలీ 0; దత్ (బి) రషీద్ 1; మీకెరెన్ (స్టంప్డ్) బట్లర్ (బి) అలీ 4; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (37.2 ఓవర్లలో ఆలౌట్) 179. వికెట్ల పతనం:** 1-12, 2-13, 3-68, 4-90, 5-104, 6-163, 7-166, 8-167, 9-174, 10-179. **బౌలింగ్:** వోక్స్ 7-0-19-1, విల్లీ 7-2-19-2, అట్కిన్సన్ 7-0-41-0, మొయిన్ అలీ 8.2-0-42-3, ఆదిల్ రషీద్ 8-0-54-3.

ప్రపంచకప్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే.
భారత్	8	8	0	16	2.456
దక్షిణాఫ్రికా	8	6	2	12	1.376
ఆస్ట్రేలియా	8	6	2	12	0.861
న్యూజిలాండ్	8	4	4	8	0.398
పాకిస్తాన్	8	4	4	8	0.036
అఫ్గానిస్తాన్	8	4	4	8	-0.338
ఇంగ్లండ్	8	2	6	4	-0.885
బంగ్లాదేశ్	8	2	6	4	-1.142
శ్రీలంక	8	2	6	4	-1.160
నెదర్లాండ్స్	8	2	6	4	-1.635

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

ప్రపంచకప్‌లో నేడు

న్యూజిలాండ్ X శ్రీలంక
వేదిక: బెంగళూరు
మధ్యాహ్నం 2 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్‌స్టార్ యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

రెండు స్వర్ణాలపై జ్యోతి సురేఖ గురి

వ్యక్తిగత, టీమ్ విభాగాల్లో ఫైనల్ చేరిన భారత స్టార్ • ఆసియా ఆర్చరీ చాంపియన్‌షిప్

బ్యాంకాక్: ఆసియా ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో భారత స్టార్, ఆంధ్రప్రదేశ్ అమ్మాయి వెన్నం జ్యోతి సురేఖ రెండు స్వర్ణ పతకాల కోసం విజయం దూరంలో నిలిచింది. విజయవాడకు చెందిన 27 ఏళ్ల జ్యోతి సురేఖ మహిళల కాంపౌండ్ వ్యక్తిగత, టీమ్ విభాగాల్లో ఫైనల్లోకి ప్రవేశించింది. సెమీఫైనల్లో జ్యోతి సురేఖ 148-145తో హువాంగ్ జౌ (చైనీస్ తైపీ)పై నెగ్గింది. నేడు జరిగే ఫైనల్లో భారత్‌కే చెందిన పర్ణీత్ కౌర్‌తో సురేఖ ఆడుతుంది. రెండో సెమీఫైనల్లో పర్ణీత్ కౌర్ 147-145తో విక్టోరియా లియాన్ (కజకిస్తాన్)ను ఓడించింది. భారత్‌కే చెందిన ప్రపంచ చాంపియన్ అదితి స్వామి ప్రిక్వార్టర్ ఫైనల్లో 145-146తో బొన్నా అక్తర్ (బంగ్లాదేశ్) చేతిలో అనూహ్యంగా ఓడిపోయింది. మహిళల కాంపౌండ్ టీమ్ సెమీఫైనల్లో జ్యోతి సురేఖ, అదితి స్వామి, పర్ణీత్ కౌర్‌లతో కూడిన భారత జట్టు 228-217తో థాయ్‌లాండ్ జట్టును ఓడించింది. నేడు జరిగే ఫైనల్లో చైనీస్ తైపీ జట్టుతో సురేఖ బృందం ఆడుతుంది. మరోవైపు పురుషుల కాంపౌండ్ టీమ్ విభాగంలో అభిషేక్ వర్మ, ప్రియాంశ్, ప్రథమేశ్‌లతో కూడిన భారత జట్టు కాంస్య పతకం గెలిచింది.



జాతీయ అండర్-9 చెస్ చాంప్ సంహిత



సాక్షి, హైదరాబాద్: జాతీయ అండర్-9 చెస్ చాంపియన్‌షిప్ బాలికల విభాగంలో తెలంగాణ అమ్మాయి పుంగవనం సంహిత టైటిల్ సాధించింది. జంషెడ్‌పూర్‌లో బుధవారం ముగిసిన ఈ టోర్నీలో సంహిత నిర్ణీత 11 రౌండ్ల తర్వాత 10 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచి చాంపియన్‌గా అవతరించింది. సంహిత పది గేముల్లో గెలిచి, ఒక గేమ్‌లో ఓడిపోయింది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పంచుమర్తి భవన్య, రిషిత ఎనిమిది పాయింట్లతో వరుసగా నాలుగు, ఐదు స్థానాల్లో నిలిచారు. మరోవైపు అండర్-9 ఓపెన్ విభాగంలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వి.జయప్రకాశ్ తొమ్మిది పాయింట్లతో మూడో స్థానాన్ని దక్కించుకున్నాడు.

క్వార్టర్ ఫైనల్లో అనిరుధ్ జోడీ పరాజయం



సాక్షి, హైదరాబాద్: మొజెల్ ఓపెన్ ఏటీపీ-250 టెన్నిస్ టోర్నీలో హైదరాబాద్ ప్లేయర్ అనిరుధ్ చంద్రశేఖర్ పోరాటం ముగిసింది. ఫ్రాన్స్‌లోని మెట్జ్ నగరంలో బుధవారం జరిగిన పురుషుల డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో అనిరుధ్ (భారత్)-స్టీవెన్స్ బార్ట్ (నెదర్లాండ్స్) ద్వయం 2-6, 4-6తో నాలుగో సీడ్ సాదియో దుంబియా-ఫాబియన్ రెబుల్ (ఫ్రాన్స్) జంట చేతిలో ఓడిపోయింది. తొలి రౌండ్‌లో అనిరుధ్-స్టీవెన్స్ 6-3, 6-4తో థియో అరిబెజ్-లుకా శాంచెజ్ (ఫ్రాన్స్)లపై నెగ్గారు. అనిరుధ్-స్టీవెన్స్ జోడీకి 5,220 యూరోల (రూ. 4 లక్షల 65 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 45 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. ప్రస్తుతం ఏటీపీ డబుల్స్ ర్యాంకింగ్స్‌లో అనిరుధ్ 91వ ర్యాంక్‌లో ఉన్నాడు.

భారత్ సెమీస్ ప్రత్యర్థి ఎవరో?

నాలుగో బెర్త్ రేసులో న్యూజిలాండ్, పాకిస్తాన్, అఫ్గానిస్తాన్



రచిన్ రవీంద్ర

ప్రపంచకప్‌లో భారత్, దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా జట్లు ఇప్పటికే సెమీఫైనల్ చేరుకున్నాయి. లీగ్ దశలో 40 మ్యాచ్‌లు ముగియగా... మరో 5 మ్యాచ్‌లు మిగిలి ఉన్నాయి. వీటిలో భారత్-నెదర్లాండ్స్, ఆస్ట్రేలియా-బంగ్లాదేశ్ మ్యాచ్‌లకు ప్రాధాన్యత లేదు. దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా జట్లు మాత్రమే రెండు, మూడు స్థానాల్లో ఉంటాయి కాబట్టి ఒక సెమీస్‌లో ఈ రెండు జట్లు తలపడతాయి. 'టాప్' ర్యాంక్‌ను ఖరారు చేసుకున్న భారత్ నాలుగో స్థానంలో నిలవనున్న జట్టుతో మరో సెమీఫైనల్లో తలపడతుంది. ఒకవేళ పాకిస్తాన్ ముందంజ వేస్తే మాత్రం భారత్ 16న కోల్‌కతాలో పాక్‌తో రెండో సెమీఫైనల్ ఆడుతుంది. న్యూజిలాండ్, అఫ్గానిస్తాన్‌లలో ఒక జట్టు సెమీస్‌కు చేరితే భారత్ 15న ముంబైలో తొలి సెమీఫైనల్ ఆడుతుంది. ప్రస్తుతం నాలుగో సెమీఫైనల్ బెర్త్ కోసం న్యూజిలాండ్, పాకిస్తాన్, అఫ్గానిస్తాన్ మధ్య పోటీ ఉంది. మూడు జట్లకు ప్రస్తుతం సమాన పాయింట్లు (8) ఉన్నా... తక్కువ రన్‌రేట్‌తో (-0.338) అఫ్గానిస్తాన్ వెనుకబడి ఉంది. రేసులో కనీసం నిలవాలంటే శుక్రవారం తమ ఆఖరి పోరులో ఆ జట్టు భారీ తేడాతో దక్షిణాఫ్రికాను ఓడించాల్సి ఉంటుంది. దానికి ముందు నేడు జరిగే మ్యాచ్‌లో శ్రీలంకతో న్యూజిలాండ్ తలపడుతుంది. పాకిస్తాన్ (0.036)కంటే మెరుగైన రన్‌రేట్ ఉండటం న్యూజిలాండ్ (0.398)కు సానుకూలాంశం. లంకపై గెలిస్తే చాలు కివీస్ ముందంజ వేసినట్లే. పాక్ శనివారం తమ చివరి పోరులో ఇంగ్లండ్‌పై భారీ తేడాతో నెగ్గాల్సి ఉంటుంది. ఇంగ్లండ్ బలహీనంగా కనిపిస్తున్నా సరే... ఇది పాక్‌కు అంత సులువు కాదు. అయితే అందరికంటే చివరగా మ్యాచ్ ఆడనుండటంతో పాక్‌కు తాము ఏం చేయాలనే దానిపై స్పష్టత ఉంటుంది. నేడు లంక చేతిలో కివీస్ ఓడినా...వర్షంతో మ్యాచ్ రద్దయినా రన్‌రేట్‌తో సంబంధం లేకుండా ఇంగ్లండ్‌పై పాక్ గెలిస్తే చాలు సెమీఫైనల్ చేరుతుంది.

సినిమా

ఇటలీ నుంచి ఇంటికి...



• ప్రభాస్

దాదాపు రెండు నెలల ఇటలీ ట్రిప్‌ను ముగించుకుని బుధవారం తిరిగి హైదరాబాద్ చేరుకున్నారు ప్రభాస్. ఇక ముందుగా విడుదలకు సిద్ధంగా ఉన్న 'సలార్' చిత్రం తొలి భాగం 'సలార్: సీజ్‌ఫైర్' సినిమా షూటింగ్‌ను పూర్తి చేస్తారట ప్రభాస్. ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ప్రభాస్ హీరోగా నటిస్తున్న 'సలార్: సీజ్‌ఫైర్' చిత్రం డిసెంబరు 22న విడుదలకు సిద్ధమవుతున్న సంగతి తెలిసిందే. ఆ తర్వాత నాగ్ అశ్విన్ తెరకెక్కిస్తున్న 'కల్కి 2898 ఏడీ', మారుతి దర్శకత్వంలోని 'రాజాడీలక్స్' (ప్రచారంలో ఉన్న టైటిల్) సినిమాల షూటింగ్స్‌లో సమాంతరంగా పాల్గొనేలా ప్రభాస్ ప్లాన్ చేస్తున్నారని సమాచారం.

విజయవాడకు భారతీయుడు



• కమల్ హాసన్

హీరో కమల్‌హాసన్, దర్శకుడు శంకర్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న తాజా చిత్రం 'ఇండియన్ 2' (తెలుగులో 'భారతీయుడు 2'). 1996లో కమల్, శంకర్ కాంబినేషన్‌లోనే రూపొంది, బ్లాక్ బస్టర్‌గా నిలిచిన 'ఇండియన్' సినిమాకు సీక్వెల్‌గా 'ఇండియన్ 2' రూపొందుతోంది. ఈ సినిమా తాజా షెడ్యూల్ చిత్రీకరణ విజయవాడలో ప్రారంభం కానున్నట్లుగా తెలిసింది. ఆల్రెడీ దర్శకుడు శంకర్ కొన్ని లొకేషన్స్‌ను ఫైనలైజ్ చేశారని తెలిసింది. దాదాపు పదిరోజుల పాటు జరిగే ఈ సినిమా షూటింగ్‌లో కమల్‌హాసన్‌తో పాటు ప్రధాన తారాగణం పాల్గొనగా, కీలక సన్నివేశాల చిత్రీకరణను ప్లాన్ చేశారు. అలాగే విజయవాడ షెడ్యూల్ తర్వాత వైజాగ్‌లో కూడా కొంత షూటింగ్ జరుగుతుందని సమాచారం. కాజల్ అగర్వాల్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో రకుల్‌ప్రీత్ సింగ్, బాబీ సింహా, సిద్ధార్థ్ కీలక పాత్రలు చేస్తున్నారు. ఈ సంగతి ఇలా ఉంచితే.. 'ఇండియన్ 2'కు కొనసాగింపుగా ప్లాన్ చేసిన 'ఇండియన్ 3' షూటింగ్‌ను కూడా ఆల్రెడీ శంకర్ ఆరంభించారని, ఇందుకు కమల్ అదనంగా 40 రోజుల కాల్షీట్స్‌ను కేటాయించవలసి వచ్చిందని భోగట్టా. 'ఇండియన్ 2'ని వచ్చే ఏడాది ఏప్రిల్‌లో, 'ఇండియన్ 3'ని దీపావళికి విడుదల చేస్తారనే టాక్ వినిపిస్తోంది.


మాస్ జాతర



• అల్లు అర్జున్

జాతరలో మాస్ ఫైట్ చేస్తున్నారు పుష్పరాజ్. అల్లు అర్జున్ హీరోగా సుకుమార్ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా 'పుష్ప'. ఈ చిత్రం తొలి భాగం 'పుష్ప: ది రైజ్' సూపర్ హిట్‌గా నిలిచింది. ప్రస్తుతం 'పుష్ప' మలిభాగం 'పుష్ప: ది రూల్' సినిమా షూట్‌తో బిజీగా ఉన్నారు అల్లు అర్జున్, సుకుమార్. ఈ చిత్రంలో పుష్పరాజ్ పాత్రలో నటిస్తున్నారు అల్లు అర్జున్. ప్రజెంట్ ఈ చిత్రం షూటింగ్ హైదరాబాద్‌లోని ఓ స్టూడియోలో జరుగుతోంది. జాతర నేపథ్యంలో వచ్చే ఓ పాట, ఆ జాతరకు ముడిపడి ఉన్న ఓ భారీ యాక్షన్ సీక్వెన్స్‌ను చిత్రీకరిస్తున్నారని ఫిల్మ్ నగర్ సమాచారం. ఈ జాతర బ్యాక్‌డ్రాప్ సీన్స్ అన్నీ ఇంట్రవెల్ సమయంలో రానున్నాయని భోగట్టా. రష్మికా మందన్నా హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో అనసూయ, సునీల్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఆగస్టు 15న విడుదల కానుంది.

సంక్రాంతికి కెప్టెన్ మిల్లర్



• సందీప్ కిషన్

సంక్రాంతికి థియేటర్స్‌కు రావడానికి రెడీ అయ్యారు 'కెప్టెన్ మిల్లర్'. ధనుష్ టైటిల్ రోల్ చేస్తున్న హై బడ్జెట్ పీరియాడికల్ ఫిల్మ్ ఇది. అరుణ్ మాథేశ్వరన్ దర్శకత్వంలో జి.శరవణన్, సాయి సిద్ధార్థ్ నిర్మిస్తున్నారు. ప్రియాంకా అరుళ్ మోహనన్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో శివరాజ్ కుమార్, సందీప్ కిషన్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. కాగా ఈ సినిమాను వచ్చే ఏడాది సంక్రాంతి సందర్భంగా విడుదల చేయనున్నట్లు యూనిట్ పేర్కొంది. తెలుగు, తమిళ, హిందీ భాషల్లో ఏకకాలంలో విడుదల కానున్న ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాశ్‌కుమార్.

న్యూజిల్యాండ్‌లో కన్నప్ప



• విష్ణు

విష్ణు మంచు హీరోగా ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వంలో 'కన్నప్ప' చిత్రం తెరకెక్కుతోంది. అవా ఎంటర్‌టైన్మెంట్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ పతాకంపై మోహన్‌బాబు నిర్మిస్తున్నారు. ఈ చిత్రం షూటింగ్ న్యూజిల్యాండ్‌లో జరుగుతున్న సందర్భంగా విష్ణు మంచు మాట్లాడుతూ– ''దేవుడి సృష్టిలో న్యూజిల్యాండ్ అనేది అందమైన పెయింటింగ్‌లాంటిది. 'కన్నప్ప' సినిమాకు పర్ఫెక్ట్ లొకేషన్. 'లార్డ్ ఆఫ్ ది రింగ్స్' వంటి హాలీవుడ్ చిత్రాన్ని ఇక్కడే షూట్ చేశారు. మా 'కన్నప్ప' షూటింగ్ 80 శాతం ఇక్కడే జరగనుంది. రాబోవు తరాల వారికి గుర్తుండిపోయేలా ఓ కళా ఖండంగా 'కన్నప్ప'ను తెరకెక్కిస్తున్నాం'' అన్నారు. ఈ చిత్రంలో హీరో ప్రభాస్‌తో పాటు మోహన్‌లాల్, శివ రాజ్‌కుమార్, శరత్‌కుమార్ వంటి అగ్రనటులు ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు.

అలుపెరుగని కలం యోధుడా...



• సురేశ్ బాబు, ప్రభాకర్ జైనీ

ప్రముఖ ప్రజాకవి, స్వాతంత్ర్య సమరయోధుడు కాళోజీ నారాయణరావు జీవితం ఆధారంగా రూపొందిన చిత్రం 'ప్రజాకవి కాళోజీ'. ప్రభాకర్ జైనీ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో కాళోజీ పాత్రలో మూల విరాట్ నటించారు. విజయలక్ష్మి జైనీ నిర్మించిన ఈ సినిమా విడుదలకు ముస్తాబవుతోంది. యస్‌యస్ ఆత్రేయ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'అలుపెరుగని అవిశ్రాంత కలం యోధుడా...' పాటను నిర్మాత డి. సురేష్ బాబు విడుదల చేసి, మాట్లాడుతూ–''ఈ పాట చాలా బాగుంది. ఇలాంటి వీరుల కథతో సినిమా తీసిన విజయలక్ష్మి, ప్రభాకర్‌లకు అభినందనలు'' అన్నారు. ''ప్రజా ఉద్యమ నాయకుడైన కాళోజీగారి బయోపిక్ తీసినందుకు సెన్సార్ సభ్యులు అభినందించారు. ఇకపైనా ఇలాంటి గొప్ప వ్యక్తుల సినిమాలు తీసేందుకు ప్రేక్షకుల ప్రోత్సాహం కావాలి'' అన్నారు ప్రభాకర్ జైనీ. ''ఇలాంటి మంచి సినిమాలో పాటలు రాసే అవకాశం వచ్చినందుకు సంతోషంగా ఉంది'' అన్నారు బిక్కి కృష్ణ. ఈ చిత్రానికి కెమెరా: రవి కుమార్ నీర్ల, నేపథ్య సంగీతం: మల్లిక్ యంవీకే.

టచ్చింగ్.. టచ్చింగ్



• కార్తీ, అనూ ఇమ్మాన్యుయేల్

కార్తీ, అనూ ఇమ్మాన్యుయేల్ జంటగా నటించిన చిత్రం 'జపాన్'. రాజు మురుగన్ దర్శకత్వంలో ఎస్‌ఆర్ ప్రకాశ్‌బాబు, ఎస్‌ఆర్ ప్రభు నిర్మించిన ఈ సినిమా పాన్ ఇండియా స్థాయిలో రేపు (శుక్రవారం) రిలీజవుతోంది. ఈ చిత్రాన్ని తెలుగు రాష్ట్రాల్లో అన్నపూర్ణ స్టూడియోస్ విడుదల చేస్తోంది. జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతం అందించిన ఈ సినిమాలోని 'టచ్చింగ్.. టచ్చింగ్..' అంటూ సాగే పూర్తి వీడియో సాంగ్‌ని విడుదల చేశారు మేకర్స్. ఈ పాటకు భాస్కరభట్ల సాహిత్యం అందించగా, ఇంద్రావతి చౌహాన్‌తో కలిసి హీరో కార్తీ పాడారు. ''జపాన్' నుంచి ఇప్పటికే విడుదలైన పాటలకు అద్భుతమైన స్పందన వచ్చింది. 'టచ్చింగ్ టచ్చింగ్..' పాటలో కార్తీ, అనూ డ్యాన్స్, కెమిస్ట్రీ అదిరిపోతుంది. కార్తీ వాయిస్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది'' అని మేకర్స్ అన్నారు.

అలా జీవితం మారిపోవాలి - సాయి రాజేష్



• సాయి రాజేష్, హెబ్బాపటేల్, దినేష్, శ్రీధర్

''అలా నిన్ను చేరి' టీజర్, ట్రైలర్, సంగీతం బాగున్నాయి. 'బేబి' సినిమాతో మా జీవితాలు మారిపోయాయి. 'అలా నిన్ను చేరి'తో దినేష్ జీవితం మారిపోవాలి. ఈ సినిమాని ప్రేక్షకులు ఆదరించాలి. శ్రీదేవిగారికి ఆర్జీవీగారిలా.. హెబ్బా పటేల్‌కు నేను పెద్ద ఫ్యాన్‌ని'' అని దర్శక-నిర్మాత సాయి రాజేష్ అన్నారు. దినేష్ తేజ్, హెబ్బా పటేల్, పాయల్ రాధాకృష్ణలు ప్రధాన పాత్రల్లో మారేష్ శివన్ తెరకెక్కించిన చిత్రం 'అలా నిన్ను చేరి'. కొమ్మాలపాటి శ్రీధర్ సమర్పణలో కొమ్మాలపాటి సాయి సుధాకర్ నిర్మించిన ఈ సినిమా రేపు (శుక్రవారం) విడుదలవుతోంది. హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ సినిమా ప్రీ రిలీజ్ వేడుకకి సాయి రాజేష్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. కొమ్మాలపాటి శ్రీధర్, కొమ్మాలపాటి సాయి సుధాకర్ మాట్లాడుతూ– ''మంచి ఫీల్ గుడ్ మూవీ 'అలా నిన్ను చేరి'. అన్ని వర్గాల వారికి నచ్చుతుంది'' అన్నారు. ''మా సినిమా ఏ ఒక్కర్నీ నిరాశపరచదు'' అన్నారు మారేష్ శివన్, దినేష్ తేజ్. ''నాకు మంచి పాత్ర ఇచ్చిన దర్శక-నిర్మాతలకు థ్యాంక్స్'' అన్నారు హెబ్బా పటేల్. ఈ వేడుకలో పాయల్ రాధాకృష్ణ, కెమెరామేన్ ఆండ్రూ, సంగీత దర్శకుడు సుభాష్ ఆనంద్ మాట్లాడారు.

వారి రుణం తీర్చుకోలేను - సుధీర్



• డాలీషా, సుధీర్

''నేనీ రోజు ఈ స్థాయికి చేరుకున్నానంటే నా అభిమానుల ప్రేమే కారణం. టీవీ షోలు చేసినా, సినిమాలు చేసినా నా ఫ్యాన్స్ సపోర్ట్ చేశారు.. వారి రుణం ఎప్పటికీ తీర్చుకోలేను. త్వరలోనే 'కాలింగ్ సహస్ర' సినిమాతో థియేటర్స్‌లో సందడి చేస్తాం''అని హీరో సుధీర్ అన్నారు. అరుణ్ విక్కీరాలా దర్శకత్వంలో సుధీర్, డాలీషా జంటగా నటించిన చిత్రం 'కాలింగ్ సహస్ర'. షాడో మీడియా ప్రొడక్షన్స్, రాధా ఆర్ట్స్‌పై విజేష్ తయాల్, చిరంజీవి పమిడి, వెంకటేశ్వర్లు కాటూరి నిర్మించిన ఈ సినిమా త్వరలో రిలీజ్ కానుంది. మోహిత్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'కనుల నీరు రాలదే..' అనే లిరికల్ సాంగ్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రెస్‌మీట్‌లో సుధీర్ మాట్లాడుతూ– ''మోహిత్ మంచి సంగీతాన్ని అందించారు. జిత్తు మాస్టర్ ఈ పాటని చక్కగా కొరియోగ్రఫీ చేశారు'' అన్నారు. ''సినిమా చాలా బాగా వచ్చింది.. ప్రేక్షకులు ఆదరించాలి'' అన్నారు వెంకటేశ్వర్లు కాటూరి, విజేష్ తయల్. ''కాలింగ్ సహస్ర' తర్వాత సుధీర్ సూపర్ స్టార్ అవుతాడు'' అన్నారు అరుణ్ విక్కీరాల. ఈ కార్యక్రమంలో డాలీషా, కెమెరామేన్ శశికిరణ్, మ్యూజిక్ డైరెక్టర్ మోహిత్, నిర్మాత బెక్కెం వేణుగోపాల్, రామచంద్రరావు మాట్లాడారు.



అజయ్ దేవగన్, రణ్‌వీర్ సింగ్, అక్షయ్ కుమార్, టైగర్ ష్రాఫ్, దీపికా పదుకోన్, కరీనాకపూర్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న సినిమా 'సింగమ్ ఎగైన్'. ఈ సినిమాలో అవనీ కామత్ పాత్రలో కరీనా కపూర్ నటిస్తున్నట్లుగా వెల్లడించారు మేకర్స్. ''ఫోర్స్‌లో రీ జాయిన్ అవుతున్నాను. సింగమ్ స్ట్రైక్స్ అవనీ కామత్‌ని కలవండ'' అని అవనీ కామత్ ఫస్ట్ లుక్‌ను షేర్ చేశారు కరీనా కపూర్.

సాక్షి **బిజినెస్**
గురువారం
9-11-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	33	64,976
నిఫ్టీ ▲	37	19,443

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (రాత్రి రెండు రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	13,629	▼	11
డోజోన్స్	34,116	▼	37
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,407	▼	4
డాక్స్	15,223	▲	71
షాంఘై	3,052	▼	5
నికాయ్	32,166	▼	15

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (24 క్యారట్)	59,830
బంగారం (22 క్యారట్)	56,980
వెండి (కిలో)	76,500

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.44	84.56
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	100.25	103.45
€	యూరో	ఎస్‌బీఐ	86.59	90.56
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	53.95	55.96
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	51.85	54.75
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	59.20	61.65
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.21	22.78
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.59	23.45
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.31	12.39

వచ్చే ఏడాది స్విగ్గీ మెగా ఐపీవో?

7 ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకుల ఎంపిక!



ముంబై: ఫుడ్ డెలివరీ కంపెనీ స్విగ్గీ వచ్చే కేలండర్ ఏడాది(2024)లో పబ్లిక్ ఇష్యూకి వచ్చే అవకాశముంది. పీఈ దిగ్గజం సాఫ్ట్‌బ్యాంక్‌కు పెట్టుబడులున్న సంస్థ ఇందుకు సలహాదారులుగా 7 ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకులను ఎంపిక చేసుకోనున్నట్లు తెలుస్తోంది. ఈ జాబితాలో కొటక్ మహీంద్రా క్యాపిటల్, సిటీ, జేపీ మోర్గాన్, బీవోఎఫ్ఏ సెక్యూరిటీస్, జెఫరీస్, ఐసీఐసీఐ సెక్యూరిటీస్, అవెండస్ క్యాపిటల్ చేరే అవకాశమున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. కాగా.. స్విగ్గీ ఐపీవో పరిమాణాన్ని బిలియన్ డాలర్లు(సుమారు రూ. 8,300 కోట్లు)గా అంచనా వేస్తున్నారు. 2024 మార్చిలో స్విగ్గీ క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి ప్రాస్పెక్టస్‌ను దాఖలు చేయనున్నట్లు అంచనా. వెరసి మార్కెట్లు అనుకూలిస్తే జూలై–ఆగస్ట్‌కల్లా ఐపీవో వెలువడవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. గతంలో అంటే 2022 నవంబర్‌లో యూఎస్ తరహాలో సెబీ సైతం రహస్య(కాన్ఫిడెన్షియల్) ఫైలింగ్స్‌కు తెరతీసింది. తద్వారా కంపెనీ పబ్లిక్ ఇష్యూ వివరాలను వెల్లడించేవరకూ సమాచారం వెల్లడికాదు. ఐపీవో కోసం తొలిసారి డీటీహెచ్ ప్లాట్‌ఫామ్ టాటా ప్లే(టాటా స్కై) రహస్య ఫైలింగ్ చేపట్టింది.



స్వదేశ్ స్టోర్ ప్రారంభం

రిలయన్స్ రిటైల్ స్వదేశ్ తొలి ఔట్‌లెట్‌ను హైదరాబాద్‌లో బుధవారం ప్రారంభించిన సందర్భంగా జ్యోతి వెలిగిస్తున్న రిలయన్స్ ఫౌండేషన్ ఫౌండర్, చైర్‌పర్సన్ నీతా అంబానీ.

భారత్ ఆర్గానిక్స్ బ్రాండ్ ఆవిష్కరణ

న్యూఢిల్లీ: కేంద్ర హోమ్, సహకార శాఖల మంత్రి అమిత్ షా నేషనల్ కోఆపరేటివ్ ఆర్గానిక్స్ లిమిటెడ్ (ఎన్‌సీఓఎల్)– 'భారత్ ఆర్గానిక్స్' బ్రాండ్‌ను ఆవిష్కరించారు. రాబోయే సంవత్సరాల్లో ఇది భారత్ అలాగే విదేశాలలో అత్యంత ''విశ్వసనీయ'' బ్రాండ్‌గా ఉద్భవించనుందని ఉద్ఘాటించారు. ఇందులో భాగంగా, జాతీయ వృక్ష సంరక్షణ సంస్థ (ఎన్‌పీపీఓ) ఆమోదించిన ప్రస్తుత 34 ల్యాబ్‌ల సంఖ్యను దేశవ్యాప్తంగా మరింత పెంచనున్నట్లు వివరించారు. ప్రారంభంలో ఎన్‌సీఓఎల్ భారతదేశంలో ఆర్గానిక్ ఉత్పత్తులను విక్రయిస్తుందని, అటు తర్వాత ఇతర దేశాల్లోకి విక్రయాలను విస్తరిస్తుందని అమిత్ షా తెలిపారు. 'సహకార సంస్థల ద్వారా ఆర్గానిక్ ప్రొడక్టుల ప్రమోషన్' అన్న అంశంపై ఎన్‌సీఓఎల్ న్యూఢిల్లీలో నిర్వహించిన ఒక సిపోజియంలో ఎన్‌సీఓఎల్ లోగో, వెబ్‌సైట్, బ్రోచర్, కొన్ని ఉత్పత్తులను కూడా షా ఆవిష్కరించారు. నేషనల్ డైరీ డెవలప్‌మెంట్ బోర్డ్ (ఎన్‌డీడీబీ) సేంద్రీయ ఎరువును కూడా ఆయన ఈ కార్యక్రమంలో విడుదల చేశారు. ఐదు సహకార సంఘాలకు ఎన్‌సీఓఎల్ సభ్యత్వ ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. నేషనల్ డైయిరీ డెవలప్‌మెంట్ బోర్డ్ (ఎన్‌డీడీబీ)చీఫ్ ప్రమోటర్‌గా మల్టీ స్టేట్ కోఆపరేటివ్ సొసైటీస్ యాక్ట్, 2002 కింద ఈ ఏడాది జనవరి 25న ఎన్‌సీఓల్ రిజిస్టర్ అయ్యింది. గుజరాత్ కేంద్రంగా పనిచేస్తోంది. ప్రభుత్వం ఇటీవల ఏర్పాటు చేసిన మూడు కొత్త సహకార సంస్థలలో ఎన్‌సీఓఎల్ ఒకటి. మిగిలిన రెండు సహకార సంఘాలు విత్తనాలు– ఎగుమతుల రంగంలో ఉన్నాయి. దేశవ్యాప్తంగా 7.89 కోట్ల సహకార సంఘాలు ఉండగా వీటిలో మొత్తం 29 కోట్ల మంది సభ్యులు ఉన్నారు.



'భారత్ ఆర్గానిక్స్' ఉత్పత్తులను ఆవిష్కరిస్తున్న కేంద్ర హోమ్, సహకార శాఖ మంత్రి అమిత్ షా. కేంద్ర సహాయ మంత్రి బీఎల్ వర్మ

టాటా పవర్ లాభం అప్

క్యూ2లో రూ. 1,017 కోట్లు



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) రెండో త్రైమాసికంలో ప్రయివేట్ రంగ విద్యుత్ దిగ్గజం టాటా పవర్ పటిష్ట ఫలితాలు సాధించింది. జూలై–సెప్టెంబర్(క్యూ2)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 9 శాతం వృద్ధితో రూ. 1,017 కోట్లను అధిగమించింది. గతేడాది(2022–23) ఇదే కాలంలో రూ. 935 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 14,181 కోట్ల నుంచి రూ. 16,030 కోట్లకు ఎగసింది. ఈ కాలంలో కంపెనీ క్లీన్ ఎనర్జీ పోర్ట్‌ఫోలియో 5,500 మెగావాట్ల మైలురాయికి చేరినట్లు టాటా పవర్ సీఈవో, ఎండీ ప్రవీర్ సిన్హా పేర్కొన్నారు. వెరసి మొత్తం విద్యుదుత్పాదక సామర్థ్యంలో 38%కి చేరినట్లు వెల్లడించారు. తమిళనాడులో కొత్తగా ఏర్పాటు చేస్తున్న సోలార్ సెల్, మాడ్యూల్ తయారీ ప్లాంట్ తొలి మాడ్యూల్‌ను రూపొందించినట్లు తెలియజేశారు. ఈ బాటలో క్యూ4(జనవరి–మార్చి)కల్లా తొలి సెల్‌ను విడుదల చేసే వీలున్నట్లు పేర్కొన్నారు.

ఫలితాల నేపథ్యంలో టాటా పవర్ షేరు 2% బలపడి రూ. 255 వద్ద ముగిసింది.

జర్మనీ నుంచి టెస్లా దిగుమతులు!

న్యూఢిల్లీ: జర్మనీ ఫ్యాక్టరీలో తయారైన కార్లను దిగుమతి చేసుకోవడం ద్వారా భారత మార్కెట్లో ఎంట్రీ ఇవ్వాలని ఎలక్ట్రిక్ కార్ల దిగ్గజం టెస్లా భావిస్తోంది. చైనాలోనూ ఫ్యాక్టరీ ఉన్నప్పటికీ ఆ దేశంతో నెలకొన్న ఉద్రిక్తతలరీత్యా అక్కణ్నుంచి దిగుమతులపై భారత్ అంత సుముఖంగా లేకపోవడంతో టెస్లా ఈ అంశాన్ని పరిశీలిస్తున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. చైనా నుంచి కార్లను దిగుమతి చేసుకోవద్దంటూ టెస్లా టాప్ మేనేజ్‌మెంట్‌కు కేంద్ర ప్రభుత్వ శాఖలు సూచించినట్లు వివరించాయి. దీంతో భారత్‌తో సత్సంబంధాలున్న జర్మనీ నుంచి దిగుమతి చేసుకునే అవకాశం ఉన్నట్లు పేర్కొన్నాయి. జర్మనీలోని బ్రాండెన్‌బర్గ్‌లో టెస్లాకు గిగాఫ్యాక్టరీ ఉంది. భారత మార్కెట్లో 25,000 యూరోల (సుమారు రూ. 20 లక్షలు) కారును ప్రవేశపెట్టే యోచనలో కంపెనీ ఉన్నట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో ఈ పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది. మరోవైపు, జర్మనీ నుంచి దిగుమతి చేసే విద్యుత్ వాహనాలపై కస్టమ్స్ సుంకాల నుంచి మినహాయింపులు ఇవ్వాలని కూడా టెస్లా కోరుతున్నట్లు సంబంధిత వర్గాలు వివరించాయి. ఒకవేళ వాటిపై సుంకాలను 20–30 శాతం మేర తగ్గిస్తే టెస్లా మాత్రమే కాకుండా జర్మనీ కేంద్రంగా కార్యకలాపాలు సాగించే మెర్సిడెస్, బీఎండబ్ల్యూ, ఆడి వంటి పలు లగ్జరీ కార్ల తయారీ సంస్థలకు కూడా ప్రయోజనం లభించవచ్చని పేర్కొన్నాయి.



నష్టాల్లో బీహెచ్‌ఈఎల్

క్యూ2లో రూ. 238 కోట్లు



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ దిగ్గజం బీహెచ్‌ఈఎల్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023–24) రెండో త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జూలై–సెప్టెంబర్ (క్యూ2)లో లాభాలను వీడి రూ. 238 కోట్లకుపైగా నికర నష్టం ప్రకటించింది. గతేడాది(2022–23) ఇదే కాలంలో రూ. 12 కోట్ల నికర లాభం లాభం ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 5,419 కోట్ల నుంచి తగ్గి రూ. 5,305 కోట్లకు పరిమితమైంది. కాగా.. ఈ ఏడాది క్యూ1(ఏప్రిల్–జూన్)లోనూ కంపెనీ రూ. 344 కోట్ల కన్సాలిడేటెడ్ నికర నష్టం ప్రకటించిన సంగతి తెలిసిందే.

ఫలితాల నేపథ్యంలో బీహెచ్‌ఈఎల్ షేరు 3 శాతం నీరసించి రూ. 125 వద్ద ముగిసింది.

యాంఫీ కొత్త సీఈవోగా వెంకటనాగేశ్వర్ చలసాని



ముంబై: మ్యూచువల్ ఫండ్స్ అసోసియేషన్ యాంఫీ కొత్త సీఈవోగా వెంకటనాగేశ్వర్ చలసాని నియమితులయ్యారు. వరుసగా రెండు సార్లు సీఈవోగా వ్యవహరించిన ఎన్ఎస్ వెంకటేష్ స్థానంలో ఆయన బాధ్యతలు చేపడతారు. బ్యాంకింగ్, ట్రెజరీ విభాగంలో చలసానికి దాదాపు నాలుగు దశాబ్దాల అనుభవం ఉంది. ఆయన ప్రభుత్వ రంగ దిగ్గజం ఎస్‌బీఐలో డిప్యూటీ ఎండీగా వ్యవహరించడంతో పాటు ఆర్‌బీఐ, ఆర్థిక శాఖలు ఏర్పాటు చేసిన కమిటీల్లోనూ సభ్యుడిగా సేవలు అందించారు. దేశీ మ్యూచువల్ ఫండ్ వ్యవస్థను మరింత పటిష్టం చేసే దిశగా ఇటు పరిశ్రమ, అటు నియంత్రణ సంస్థతో కలిసి పని చేస్తానని ఈ సందర్భంగా ఆయన చెప్పారు.

ఒడిదుడుకులున్నా స్వల్ప లాభాలు

ముంబై: ట్రేడింగ్‌లో సూచీలు తీవ్ర ఒడిదుడుకులకు లోనైనా బుధవారం స్వల్ప లాభాలతో ముగిశాయి. ఇంట్రాడేలో 273 పాయింట్ల రేంజ్‌లో కదలాడిన సెన్సెక్స్ చివరికి 33 పాయింట్లు పెరిగి 64,976 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 63 పాయింట్ల పరిధిలో కదలాడింది. ఆఖరికి 37 పాయింట్ల లాభంతో 19,443 వద్ద నిలిచింది. ఉదయం స్తబ్దుగా మొదలైన సూచీలు రోజంతా లాభ, నష్టాల మధ్య ఊగిసలాడాయి. ఆటో, ఎఫ్ఎంసీజీ, ఫార్మా, ఇంధన, ఆయిల్‌అండ్‌గ్యాస్ రంగాలకు చెందిన చిన్న, మధ్య తరహా షేర్లు రాణించాయి. ఫలితంగా బీఎస్ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు వరుసగా 0.80%, 0.60 శాతం ర్యాలీ చేశాయి. మరోవైపు ఫైనాన్సియల్ సర్వీసెస్, ఐటీ, బ్యాంకులు, టెక్ రంగాల షేర్లలో లాభాల స్వీకరణ చోటు చేసుకుంది. విదేశీ ఇన్వెస్టర్లు 11 రోజూ అమ్మకాలకు పాల్పడుతూ రూ.85 కోట్ల విలువైన ఈక్విటీను విక్రయించారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.524 కోట్ల షేర్లను కొన్నారు. ఫెడ్ రిజర్వ్ చైర్మన్ పావెల్ ప్రసంగానికి ముందు ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు బలహీనంగా ట్రేడవుతున్నాయి.

- సెప్టెంబర్ క్వార్టర్‌లో నికర లాభం రెండున్నర రెట్లు వృద్ధి చెందడంతో అపోలో టైర్స్ షేరు 6.50% పెరిగి రూ.410 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో 7% బలపడి రూ.412 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది.
- ఇటీవల లిస్టైన ఐడియాఫోర్జ్ టెక్నాలజీ షేరు 7% పతనమై రూ.809 వద్ద ముగిసింది. సెప్టెంబర్ క్వార్టర్‌లో కంపెనీ లాభం 77.6% క్షీణించడంతో షేరు అమ్మకాల ఒత్తిడికి లోనైంది. ట్రేడింగ్‌లో 10% నష్టపోయి రూ.785 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకింది.
- ప్రభుత్వరంగ చమురు శుద్ధి కంపెనీలైన హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్, ఐఓసీ షేర్లు వరుసగా 7%, 3%, 1% చొప్పున లాభపడ్డాయి. అంతర్జాతీయ క్రూడాయిల్ ధరలు 3 నెలల కనిష్టానికి దిగిరావడంతో పాటు రెండో త్రైమాసికంలో మూడు సంస్థల నికరలాభం రూ.27,295 కోట్లుగా నమోదవడం కలిసొచ్చింది.



ప్రొటీన్ ఈగవ్ టెక్ ఐపీవోకు క్యూ

చివరి రోజుకల్లా 24 రెట్లు బిడ్స్

ఐటీ ఆధారిత సొల్యూషన్ల కంపెనీ ప్రొటీన్ ఈగవ్ టెక్ పబ్లిక్ ఇష్యూ సక్సెస్ అయ్యింది. చివరి రోజు బుధవారానికల్లా 24 రెట్లు అధికంగా స్పందన లభించింది. కంపెనీ 43,78,700 షేర్లను ఆఫర్ చేయగా.. 10.44 కోట్లకుపైగా షేర్ల కోసం డిమాండ్ నమోదైంది. అర్హతగల సంస్థాగత కొనుగోలుదారుల(క్విబ్) నుంచి 47 రెట్లు, సంస్థాగతేతర ఇన్వెస్టర్ల నుంచి 32 రెట్లు, రిటైలర్ల నుంచి 9 రెట్లు అధికంగా బిడ్స్ దాఖలయ్యాయి. రూ. 752–792 ధరల శ్రేణిలో చేపట్టిన ఇష్యూ ద్వారా కంపెనీ రూ. 490 కోట్లు సమీకరించింది.

సెలెక్ట్ మొబైల్స్ 'గ్రేట్ ఫెస్టివల్ డేస్' ఆఫర్లు



హైదరాబాద్: దీపావళి సందర్భంగా సెలెక్ట్ మొబైల్స్ 'గ్రేట్ ఫెస్టివల్ డేస్' పేరుతో ఆఫర్లు ప్రకటించింది. ప్రత్యేకంగా ప్రవేశపెట్టిన 'స్కాన్ అండ్ విన్' కాన్సెప్ట్ ద్వారా స్మార్ట్ ఫోన్‌పై 25% డిస్కౌంట్ పొందవచ్చని సంస్థ సీఎండీ గురు తెలిపారు. ఎల్ఈడీ టీవీ రూ.999లకు, ఒకటి కొంటే ఒకటి ఉచితం వంటి ఆఫర్లు, డీల్స్‌ని సొంతం చేసుకోవచ్చన్నారు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఈజీఈఎంఐపై 10% తక్షణ తగ్గింపు, ఐసీఐసీఐ ఫైనాన్స్‌పై రూ.10 వేల వరకు, బజాజ్ ఫిన్‌సర్వ్‌పై రూ.9 వేల వరకు క్యాష్‌బ్యాక్, ఎస్‌బీఐ క్రెడిట్, డెబిట్ కార్డులపై 5%, క్లైవర్‌పే పై 15% వరకు క్యాష్ బ్యాక్ పొందవచ్చు. స్మార్ట్ ఫోన్‌లకు మాత్రమే పరిమితం కాకుండా టీవీ, ల్యాప్‌టాప్, యాక్సెసరీస్‌లపైనా గ్రేట్ సేవింగ్ ఆఫర్లు పొందవచ్చని గురు వివరించారు.

పంచతంత్రం

ఆ ఐదు స్థానాలు...!

మధ్యప్రదేశ్‌లో అందరి దృష్టీ వాటిపైనే ● బుధ్నీలో సీఎం శివరాజ్, ఛింద్వారాలో కమల్‌నాథ్

మధ్యప్రదేశ్‌లో ఎన్నికల ప్రచారం పీక్స్‌కు చేరుతోంది. కాంగ్రెస్, అధికార బీజేపీ హోరాహోరీగా తలపడుతున్నాయి. పోలింగ్‌కు పది రోజులు కూడా లేదు. పుంఖానుపుంఖాలుగా ప్రకటించిన, ప్రకటిస్తున్న పథకాలే తమ అధికారాన్ని కాపాడతాయని బీజేపీ ఆశ పడుతోంటే ఈసారి ఎలాగైనా నెగ్గాలని కాంగ్రెస్ అన్ని ప్రయత్నాలూ చేస్తోంది. ఈ క్రమంలో ఐదు అసెంబ్లీ స్థానాలు మాత్రం అందరి దృష్టినీ ఆకర్షిస్తున్నాయి. ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు కమల్‌నాథ్ బరిలోకి దిగుతున్న సీట్లు కూడా వీటిలో ఉండటం విశేషం!



బుధ్నీ

ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ పోటీ చేస్తున్న అసెంబ్లీ స్థానమిది. 2006 ఏడాదిలో దీనిని ఆయన తన కంచుకోటగా మార్చుకున్నారు. ప్రతిసారీ ఘన విజయం సాధిస్తూ వస్తున్నారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో 58, 999 ఓట్ల మెజారిటీతో నెగ్గారు. మొత్తం పోలైన ఓట్లలో 60 శాతం ఆయనకే దక్కా యి. 2013 లోనైతే 70 శాతం ఓట్ల షేరు తో ఏకంగా 84,805 ఓట్ల మెజారిటీ సా ధించారు! 2008లో శివరాజ్ 62 శాతం ఓ ట్ల షేరుతో 41,525 ఓట్ల మెజారిటీతో నెగ్గా రు. బీజేపీ అధిష్టానం ఈసారి రాష్ట్రంలో ఎవరినీ సీఎం అభ్యర్థిగా ప్రకటించని నేపథ్యంలో ఒకవేళ పార్టీ నెగ్గినా శివరాజ్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారా, లేదా అన్నదానిపై అందరిలోనూ అనుమానాలున్నా యి. కానీ బుధ్నీ నుంచి ఆయన మరోసారి విజయబావుటా ఎగరేస్తారనడంలో ఎవరికీ ఎలాంటి సందేహం లేదు.



శివరాజ్‌సింగ్



విక్రం మస్తాల్

అభ్యర్థులు
శివరాజ్‌సింగ్ చౌహాన్ (బీజేపీ)
విక్రం మస్తాల్ (కాంగ్రెస్)

ఛింద్వారా

ఈ స్థానం పీసీసీ అధ్యక్షుడు కమల్‌నాథ్ కంచుకోట. ఛింద్వారా లోక్‌సభ స్థానం నుంచి రికా ర్డు స్థాయిలో ఏకంగా తొ మ్మిది సార్లు నెగ్గిన ఘన చరిత్ర ఆయన సొంతం. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన ఆ శీర్వాదంతో అనుయాయుడు దీపక్ సక్సేనా కాంగ్రెస్ అభ్యర్థిగా ఇక్కడ బరిలో దిగి సునాయాసంగా విజయం సాధించారు. కమల్‌నాథ్ ఛింద్వారా ఎంపీగానే ఆ ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్‌ను విజయపథంలో నడిపారు. అనంతరం ఆయన ముఖ్యమంత్రిగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైంది. దాంతో కమల్‌నాథ్ అసెంబ్లీకి వెళ్లేందుకు వీలుగా దీపక్ రాజీనామా చేశారు. అలా 2019లో ఛింద్వారాలో జరిగిన ఉప ఎన్నికలో 25,800 ఓట్ల మెజారిటీతో ఇక్కడ కమల్‌నాథ్ నెగ్గారు. ఈసారి కూడా ఆయన విజయం ఖాయంగా కనిపిస్తోంది.



కమల్‌నాథ్



వివేక్ బంటీ

అభ్యర్థులు
కమల్‌నాథ్ (కాంగ్రెస్)
వివేక్ బంటీ సాహూ (బీజేపీ)

లహర్

కాంగ్రెస్‌కు కంచుకోట వంటి అసెంబ్లీ స్థానమిది. ఆ పార్టీ సీనియర్ నేత గోవింద్ సింగ్ 1990 నుంచీ ఇక్కడ వరుసగా గెలుస్తూ వస్తున్నారు. మాజీ ముఖ్యమంత్రి దిగ్విజయ్‌సింగ్ అనుచరునిగా ముద్ర పడ్డ ఆయన ఈసారీ ఇక్కడ హాట్ ఫేవరెట్. అయితే అంబరీశ్ వర్మ ఆయనకు గట్టి పోటీ ఇస్తారని బీజేపీ ధీమాగా ఉంది.



అంబరీశ్ శర్మ



గోవింద్ సింగ్

అభ్యర్థులు
అంబరీశ్ శర్మ (బీజేపీ)
గోవింద్ సింగ్ (కాంగ్రెస్)

– సాక్షి, నేషనల్ డెస్క్

నర్సింగ్‌పూర్

ఈ అసెంబ్లీ స్థానం బీజేపీకి చాలా మంచి పట్టు ఉన్న స్థానం. ఈసారి పార్టీ తరఫున గట్టి ఓబీసీ నేత, కేంద్ర మంత్రి ప్రహ్లాద్‌సింగ్ పటేల్ బరిలో దిగుతున్నారు. అక్కడి సిట్టింగ్ ఎమ్మెల్యే జలరాం సింగ్ పటేల్ ప్రహ్లాద్‌సింగ్ తమ్ముడే. 2013లో ఇక్కడ ఆయనే నెగ్గారు. ఆ అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన ఏకంగా 48,481 ఓట్ల మెజారిటీతో నెగ్గారు. 2018లో మాత్రం జలరాం మెజారిటీ 14,903 ఓట్లకు తగ్గింది. ఏకంగా కేంద్ర మంత్రే బరిలో దిగడంతో ఈసారి కూడా ఇక్కడ బీజేపీ హవాయే కొనసాగుతుందని భావిస్తున్నారు.



ప్రహ్లాద్‌సింగ్



లఖన్‌సింగ్

అభ్యర్థులు
ప్రహ్లాద్‌సింగ్ పటేల్ (బీజేపీ)
లఖన్‌సింగ్ పటేల్ (కాంగ్రెస్)

ఇండోర్-1

ఈసారి హోరాహోరీ పోరు జరగనున్న ప్రముఖ అసెంబ్లీ స్థానాల్లో ఇదొకటి. ఇక్కడ 2008, 2013 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ నెగ్గింది. 2018లో ఈ స్థానాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కాంగ్రెస్ బలమైన నేత సంజయ్ శుక్లాను బరిలో దింపింది. అయినా ఆయన కేవలం 8,163 ఓట్ల మెజారిటీతో గట్టెక్కారు. ఈసారి ఇండోర్–1 స్థానాన్ని ఎలాగైనా తిరిగి చేజిక్కించుకోవాలని బీజేపీ పట్టుదలగా ఉంది. అందుకే సీనియర్ నేత, జాతీయ ప్రధాన కార్యదర్శి కైలాస్ విజయవర్గీయను బరిలో దించింది.



కైలాస్ విజయవర్గీయ



సంజయ్ శుక్లా

అభ్యర్థులు
కైలాస్ విజయవర్గీయ (బీజేపీ)
సంజయ్ శుక్లా (కాంగ్రెస్)

మధ్యప్రదేశ్‌లో 'రెబెల్స్‌తో తలనొప్పి'

బీజేపీ, కాంగ్రెస్‌ల సమీకరణాలపై రెబెల్స్ ప్రభావం

కీలకంగా మారిన సుమారు 12 స్థానాలు

రెబెల్స్‌ను ఒప్పించే పనిలో బిజీగా కాంగ్రెస్, బీజేపీలు

సాక్షి, న్యూఢిల్లీ: మధ్యప్రదేశ్‌లో అధికారాన్ని కాపాడుకొనేందుకు బీజేపీ, అధికారాన్ని దక్కించుకొనేందుకు కాంగ్రెస్ పార్టీ సర్వశక్తులు ఒడ్డుతున్నాయి. అదే సమయంలో ఈ రెండు పార్టీలకు తిరుగుబాటు నేతలు పెద్ద తలనొప్పిగా మారారు. టికెట్లను నిరాకరించడంతో సొంత పార్టీలపైనే తిరుగుబాటు బావుటా ఎగరేయడంతో తప్పనిసరి పరిస్థితుల్లో కాంగ్రెస్ పార్టీ 39 మందిని, బీజేపీ 35 మంది నాయకులను తమ పార్టీల నుంచి బహిష్కరించింది. అయితే పలువురు మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎంపీలు రెబెల్స్‌గా బరిలో నిలవడంతో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు తలపట్టుకున్నాయి. కాగా ఈ నెల 17న అసెంబ్లీ ఎన్నికలకు పోలింగ్ జరుగనుండడంతో ఒకవైపు ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా సహా కేంద్రమంత్రులు బీజేపీ గెలుపు కోసం ప్రచారాన్ని ఉధృతంగా చేస్తుంటే, మరోవైపు కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ, మల్లికార్జున ఖర్గే వంటి వారు బీజేపీ ప్రచారాన్ని దీటుగా ఎదుర్కొంటున్నారు.

39 మందిని బహిష్కరించిన కాంగ్రెస్

మొత్తం 230 స్థానాలు ఉన్న మధ్యప్రదేశ్‌లో ఈసారి మెజారిటీ సీట్లు సాధిస్తామని, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామన్న ధీమాతో ఉన్న కాంగ్రెస్, బీజేపీలకు రెబెల్స్ తలనొప్పిగా మారారు. ఇప్పటికే తమ పార్టీ అభ్యర్థులకు పోటీగా స్వతంత్రంగా కానీ, సమాజ్‌వాదీ పార్టీ, బహుజన్‌సమాజ్ పార్టీ, ఆమ్ ఆద్మీ పార్టీ టికెట్లు సాధించి బరిలో నిలిచిన 39 మంది కాంగ్రెస్ నాయకులను కాంగ్రెస్ పార్టీ ఆరేళ్ల పాటు పార్టీ నుంచి బహిష్కరించింది. బీజేపీ 35 మంది రెబెల్స్‌ను పార్టీ నుంచి బహిష్కరించింది. కీలకంగా ఉన్న సుమారు 12 స్థానాల్లో రెబెల్స్ బరిలో దిగడం, వారు ఆయా స్థానాల్లో తమదైన ముద్ర వేయడంతో ఈ రెండు పార్టీల అభ్యర్థుల విజయావకాశాలపై నీలినీడలు కమ్ముకున్నాయి. వీరిలో ఎక్కువ మంది నాయకులు బీజేపీ, కాంగ్రెస్‌ల నుంచి టిక్కెట్లు రాకపోవడంతో రెబెల్స్‌గా నామినేషన్ దాఖలు చేశారు. కొందరు స్వతంత్ర అభ్యర్థులు ఎన్నికల్లో గెలిచి ప్రజలకు మరింత మెరుగైన సేవ చేస్తామని హామీలు ఇస్తున్నారు. గత ఎన్నికలతో పోలిస్తే ఈసారి వీరి సంఖ్య కాస్త ఎక్కువగానే ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. వీరిలో కొందరు మాజీ ఎంపీలు, ఎమ్మెల్యేలు సైతం ఉండటం గమనార్హం. గత శాసనసభ ఎన్నికల్లో నలుగురు స్వతంత్ర అభ్యర్థులు గెలుపొందగా... ఈసారి వీరిలో ప్రదీప్ జైస్వాల్, విక్రమ్ సింగ్ రాణాలు బీజేపీ టికెట్‌పై పోటీ చేస్తున్నారు. కాగా, సురేంద్ర సింగ్ షేరా, కేదార్ డాబర్ కాంగ్రెస్ అభ్యర్థులుగా బరిలో దిగారు. రాష్ట్రంలో బీజేపీ, కాంగ్రెస్‌లకు స్వతంత్ర అభ్యర్థులు సుమారు 12 స్థానాల్లో పెద్ద అవరోధంగా తయారయ్యారు. సిట్టింగ్ ఎమ్మెల్యే అంతర్‌సింగ్ దర్బార్‌కు కాంగ్రెస్ పార్టీ డాక్టర్ అంబేడ్కర్‌నగర్ మహూ అసెంబ్లీ స్థానం సీటు నిరాకరించడంతో ఆయన స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. సివ్నీ మాల్వా నుంచి ఓం రఘువంశీ, మల్హర్‌ఘడ్ నుంచి శ్యామ్‌లాల్ జోక్‌చంద్, ఆలోట్ నుంచి ప్రేమ్‌చంద్ గుడ్డు, ధార్ నుంచి కుల్దీప్ సింగ్ బుందేలా, గోటేగావ్ నుంచి శైలేంద్ర చౌదరి, హోషంగాబాద్ నుంచి భగవతి చౌరే, భోపాల్ నార్త్ నుంచి నసీర్ ఇస్లాం, ఆమీర్ అకీల్‌లు, బడ్‌నగర్ నుంచి రాజేంద్రసింగ్ సోలంకీ, హుజూర్ నుంచి మాజీ ఎమ్మెల్యే జితేంద్ర డాగా, బర్గి నుంచి జైకాంత్ సింగ్, సిహోరా నుంచి మాజీ మంత్రి కౌశల్య గోటియా, జమునా మరావిలు స్వతంత్రులుగా బరిలో దిగారు. గోటేగావ్, బడ్‌నగర్‌లో గతంలో ప్రకటించిన అభ్యర్థులను కాంగ్రెస్ పార్టీ మార్చింది. దీంతో మనస్తాపానికి గురైన కాంగ్రెస్ నేతలు రెండు స్థానాల్లో స్వతంత్ర అభ్యర్థులుగా పోటీకి దిగి నిరసన జెండా ఎగరేశారు. అయితే స్వతంత్రులుగా పోటీచేయకుండా వారిని నిలువరించేందుకు కాంగ్రెస్, బీజేపీలు తీవ్రంగా ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. కాంగ్రెస్‌తో పోలిస్తే బీజేపీ పరిస్థితి కాస్త మెరుగ్గానే ఉందని చెప్పొచ్చు. బీజేపీ సీట్లు నిరాకరించడంతో సిద్ధి నుంచి కేదార్‌నాథ్ శుక్లా, బుర్హాన్‌పూర్ నుంచి హర్షవర్ధన్ సింగ్ చౌహాన్, నివారి నుంచి రాష్ట్ర మంత్రి నంద్‌రాం కుష్వా హా, టీకమ్‌గఢ్ నుంచి కేకే శ్రీవాత్సవ, జబల్‌పూర్ నార్త్‌సెంట్రల్ స్థానం నుంచి కమ్లేశ్ అగర్వాల్‌లు స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేస్తున్నారు.

గత 52 ఏళ్లుగా ఎన్నికల్లో పోటీ

- పేదలకు భూములు, సదుపాయాల కల్పనే లక్ష్యం
- రాజస్తాన్‌లో 78 ఏళ్ల ఉపాధిహామీ కూలీ పోరాటం

జైపూర్: 78 ఎనిమిదేళ్ల వయసులోనూ ఉపాధిహామీ కూలీగా పనిచేస్తూనే పేదలకు భూములు, సదుపాయాలు దక్కాలంటూ అలుపెరుగని రాజకీయ ఉద్యమం కొనసాగిస్తూ స్ఫూర్తిగా నిలుస్తున్నారు తీతర్ సింగ్. రాజస్తాన్‌లోని కరణ్‌పూర్ నియోజకవర్గం దళిత సామాజికవర్గానికి చెందిన తీతర్.. గడిచిన 52 ఏళ్లలో పంచాయతీ ఎన్నికలు మొదలు లోక్‌సభ ఎన్నికల దాకా ప్రతీ ఎన్నికల్లో పోటీ చేయడం విశేషం. నవంబర్ 25వ తేదీ జరిగే రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌లో తన అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. గత 20 ఎలక్షన్‌లలో ఒక్కసారి కూడా డిపాజిట్ దక్కలేదు. 'అయినా సరే పోరాటం ఆపేది లేదు. పేదలకు భూములు సమకూర్చే బాధ్యతలను ఈ ప్రభుత్వాలు విస్మరించాయి. అందుకే ఈ వంతు ప్రయత్నంగా ఇలా ప్రతిసారీ ఎన్నికల్లో పోటీచేస్తున్నా' అని తీతర్ సింగ్ చెప్పారు.

ఎన్నికల విధులకు వెళ్లొస్తూ..

- ఛత్తీస్‌గఢ్‌లో ముగ్గురు టీచర్ల దుర్మరణం

కొండగావ్: ఛత్తీస్‌గఢ్ తొలి విడత ఎన్నికల పోలింగ్ ముగిసినవేళ అక్కడ విషాదం సంభవించింది. పోలింగ్ విధులు ముగించుకొని వస్తుండగా రోడ్డు ప్రమాదానికి గురై ముగ్గురు ఉపాధ్యాయులు ప్రా ణాలు కోల్పోయారు. వీరు ప్రయాణిస్తున్న వాహనం ఓ ట్రక్కును ఢీకొట్టడంతో ఈ దుర్ఘటన జరిగింది. కొండగావ్ జిల్లా కేంద్రంలో ఈవీఎంలు అప్పగించి వీరంతా తిరుగు పయనమయ్యారు. మార్గమధ్యంలో బహిగావ్ గ్రామం దగ్గర బుధవారం ఉదయం ఈ ప్రమా దం జరిగిందని పోలీసులు వెల్లడించారు. ప్రమాదంలో ఇద్దరు ఉపాధ్యాయులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరొకరు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతులను శివ్ నేతమ్, సంత్రం నేతమ్, హరీంద్ర యాకీలుగా గుర్తించారు.

రెండేళ్లలో 2,030 గుండె శస్త్రచికిత్సలు

- ఎనిమిది మందికి గుండె మార్పిడి
- శ్రీపద్మావతి చిన్నపిల్లల హృదయాలయం సేవలు అద్భుతం
- టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి



తిరుపతి తుడా/తిరుమల: టీటీడీ ఆధ్వర్యంలోని శ్రీపద్మావతి చిన్నపిల్లల హృదయాలయంలో రెండేళ్ల కాల వ్యవధిలో రికార్డు స్థాయిలో 2,030 మందికి గుండె శస్త్ర చికిత్సలు చేశారని టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి తెలిపారు. అలాగే ఎనిమిది మందికి గుండె మార్పిడి శస్త్రచికిత్సలు చేయగా, ఏడు విజయవంతమయ్యాయని సంతోషం వ్యక్తం చేశారు. బుధవారం తిరుపతిలోని శ్రీ పద్మావతి చిన్నపిల్లల హృదయాలయంలో ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ శ్రీనాథ్ రెడ్డితో కలిసి ఈవో ధర్మారెడ్డి మీడియాతో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌లో చిన్నపిల్లల కోసం ఆస్పత్రి ఉండాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2021లో ఈ ఆస్పత్రిని ప్రారంభించారని తెలిపారు. ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ శ్రీనాథ్ రెడ్డి నేతృత్వంలో 15 మంది వైద్య బృందం శస్త్రచికిత్సల్లో 95 శాతం సక్సెస్ రేట్ సాధించడం అభినందనీయమన్నారు. ఇటీవల రాష్ట్రంలోనే ఉత్తమ ఆస్పత్రిగా అవార్డు అందుకోవడం అందుకు నిదర్శనమన్నారు. ఆరోగ్యశ్రీతో పాటు కేంద్ర ప్రభుత్వ హెల్త్ స్కీమ్ కింద ఉచితంగా శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ శ్రీనాథ్ రెడ్డి మాట్లాడుతూ త్వరలో 350 పడకలతో సూపర్ స్పెషాలిటీ చిన్నపిల్లల ఆస్పత్రి నిర్మాణం పూర్తి కానుందని తెలిపారు. అనంతరం గుండె మార్పిడి చేసుకున్న గుంటూరుకు చెందిన సుమతి(31), కైకలూరుకు చెందిన కరుణాకర్(39)ను డిశ్చార్జి చేశారు. కాగా, అలిపిరి నడకమార్గం ప్రారంభంలో పాదాల మండపం వద్ద ఉన్న ఒక విశ్రాంతి మండపం కూలిపోయే స్థితిలో ఉందని, మరమ్మతులు చేయడానికి వీలు లేకపోవడం వల్ల పునర్నిర్మాణం తప్పనిసరి అని సాంకేతిక నిపుణులు నివేదిక సమర్పించారని విలేకరులు అడిగిన ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ఈ మండపం నిర్మాణం విషయమై కొందరు వ్యక్తులు పురావస్తు శాఖ అనుమతి తీసుకుని నిర్మించాలని వ్యక్తీకరించారని చెప్పారు. ఈ అంశాన్ని దృష్టిలో ఉంచుకుని ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియాకు లేఖ రాశామని, పురావస్తు శాఖ అనుమతి అవసరమా లేదా తెలియజేయాలని కోరామని తెలియజేశారు.

13 నుంచి పీజీ సెట్ ప్రవేశాలకు వెబ్ కౌన్సెలింగ్

ఏయూ క్యాంపస్: రాష్ట్ర వ్యాప్తంగా పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన ఏపీ పీజీ సెట్ చివరి దశ ప్రవేశాల వెబ్ కౌన్సెలింగ్ ఈ నెల 13–15 వరకు జరుగుతుందని కన్వీనర్ ఆచార్య భాస్కరరెడ్డి తెలిపారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ ముగిసిందని, ఈ నెల 10న ఆన్‌లైన్‌లో సర్టిఫికెట్ల పరిశీలన చేస్తామన్నారు. ఈ నెల 16న అభ్యర్థులు తమ వెబ్ ఆప్షన్లను మార్పు చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ నెల 18న సాయంత్రం 6 గంటలకు సీట్లు కేటాయిస్తామన్నారు. ఈ నెల 20 నుంచి 23వ తేదీ వరకు విద్యార్థులు తమకు కేటాయించిన కళాశాలల్లో రిపోర్టింగ్ చేయాలని సూచించారు.

జొన్నగిరిలో విలువైన వజ్రం లభ్యం

తుగ్గలి: ఓ పేదింటి మహిళా కూలీని అదృష్టం వజ్రం రూపంలో తలుపుతట్టింది. కర్నూలు జిల్లా తుగ్గలి మండలం జొన్నగిరిలో బుధవారం వ్యవసాయ తోటలో మిరప కాయలు కోసేందుకు వెళ్లిన ఓ మహిళా కూలీకి విలువైన వజ్రం లభ్యమైనట్లు సమాచారం. దాదాపు ఐదు క్యారెట్లకు పైగా ఉన్న ఈ వజ్రాన్ని ఓ వ్యాపారి రూ.10.30లక్షలు, రెండు తులాల బంగారం ఇచ్చి కొనుగోలు చేసినట్లు తెలిసింది. తొలకరి వర్షాల నుంచి ఏటా ఈ ప్రాంతంలో వజ్రాలు లభ్యమవుతుండడం సర్వసాధారణమైన విషయం. రాష్ట్రం నుంచే కాకుండా తెలంగాణ, కర్ణాటక నుంచి కూడా ప్రజలు ఇక్కడికి వజ్రాన్వేషణకు వచ్చి తమ అదృష్టాన్ని పరీక్షించుకోవడం పరిపాటి.

సమగ్ర శిక్ష సేవలు అభినందనీయం

కార్యవర్గ సమావేశంలో
చైర్మన్ ప్రవీణ్ ప్రకాశ్ ప్రశంస

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో విద్యాభివృద్ధికి సమగ్ర శిక్ష ద్వారా కృషి చేయాలని పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ అన్నారు. బుధవారం విజయవాడలోని సమగ్ర శిక్ష రాష్ట్ర కార్యాలయంలో కార్యవర్గ చైర్మన్, పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ అధ్యక్షతన సమగ్ర శిక్ష 7వ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేష్ కుమార్ వైస్ చైర్మన్‌గాను, సమగ్ర శిక్ష ఎస్పీడీ శ్రీనివాసరావు కన్వీనర్‌గా వ్యవహరించారు. ప్రవీణ్ ప్రకాశ్ మాట్లాడుతూ.. జాతీయ స్థాయిలో సమగ్ర శిక్ష ద్వారా అత్యుత్తమ కార్యక్రమాలు అమలు చేసే రాష్ట్రాలుగా ఏపీతో పాటు హరియాణా, యూపీ నిలిచాయని చెప్పారు. ఈ రాష్ట్రాలకు తాము అమలు చేసిన కార్యక్రమాల నివేదికలను ప్రదర్శించే అవకాశం కేంద్రం కల్పించడం గర్వకారణమన్నారు.

కేంద్ర విద్యుత్ శాఖ అదనపు కార్యదర్శిగా శ్రీకాంత్

ఆంధ్రప్రదేశ్ కేడర్‌కు చెందిన 1998 బ్యాచ్ ఐఏఎస్ అధికారి



సాక్షి, అమరావతి: కేంద్ర విద్యుత్, పునరుత్పాదక మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శిగా నాగులపల్లి శ్రీకాంత్ నియమితులయ్యారు. ఆంధ్రప్రదేశ్ కేడర్‌కు చెందిన 1998 బ్యాచ్ ఐఏఎస్ అధికారి అయిన శ్రీకాంత్ రాష్ట్రంలో సీఆర్‌డీఏ తొలి కమిషనర్‌గా, ఇంధనశాఖ కార్యదర్శిగా, ఏపీ ట్రాన్స్‌కో సీఎండీగా పనిచేశారు. గతేడాది ఫిబ్రవరిలో కేంద్ర సర్వీసులకు వెళ్లి కేబినెట్ సెక్రటేరియట్‌లో జాయింట్ సెక్రటరీగా చేరారు. తాజాగా బుధవారం ఆయనకు కేంద్ర విద్యుత్ శాఖ కీలక బాధ్యతలు అప్పగించింది. రాష్ట్ర ఇంధన రంగంలో వినూత్న మార్పులకు శ్రీకారం చుట్టి అభివృద్ధి పథంలో నడిపించిన శ్రీకాంత్‌కు కేంద్రంలోనూ అదే విద్యుత్ శాఖలో ఉన్నత పదవి లభించడంపై రాష్ట్ర విద్యుత్ సంస్థల ఉన్నతాధికారులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు అభినందనలు తెలిపారు. కాగా, ఏపీ విద్యుత్ రంగానికి తన వంతుగా అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తానని శ్రీకాంత్ ఈ సందర్భంగా వెల్లడించారు.

సమ్మేటివ్ అసెస్‌మెంట్-1 పరీక్షల తేదీల మార్పు

ఈ నెల 24 నుంచి డిసెంబర్ 6వ తేదీ వరకు నిర్వహణ

సాక్షి, అమరావతి: సమ్మేటివ్ అసెస్‌మెంట్-1 పరీక్షల నిర్వహణ తేదీలను మార్పు చేస్తూ పాఠశాల విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. ఎస్ఏ పరీక్షలను ఈ నెల 24 నుంచి డిసెంబర్ 6వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ బి.ప్రతాప్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. వాస్తవానికి ఈ పరీక్షలు ఈ నెల 15 నుంచి 25వ తేదీ వరకు జరగాల్సి ఉంది. అయితే, ఈ నెల 14 నుంచి 20 వరకు గ్రంథాలయ వారోత్సవాలు ఉండడంతో షెడ్యూల్‌లో మార్పు చేశారు.

సమ్మేటివ్ పరీక్షలు ఇలా..

- షెడ్యూల్ ప్రకారం ఈ నెల 24 నుంచి డిసెంబర్ 6వ తేదీ వరకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు 6, 8, 10వ తరగతులకు, మధ్యాహ్నం 1.30 నుంచి సాయంత్రం 4.45 గంటల వరకు 7, 9 తరగతులకు పరీక్షలు ఉంటాయి.
- ప్రాథమిక స్థాయిలో 1 నుంచి 5 తరగతులకు ఈ నెల 28 నుంచి డిసెంబర్ 2వ తేదీ వరకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు పరీక్షలు ఉంటాయి.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794.

సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా

గురువారం ၊ 9 ၊ నవంబర్ ၊ 2023



బాల్య వివాహాలను అరికట్టాలి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బాల్యవివాహాలను అడ్డుకోవాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కరపత్రాలను బుధవారం ఆవిష్కరించారు.



విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

చిలకలపూడి(మచిలీపట్నం): సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో బుధవారంప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు కృష్ణా జేసీ అపరాజిత సింగ్ ట్యాబ్‌లను పంపిణీ చేశారు.

దుర్గమ్మ సేవలో దేవదాయ కమిషనర్



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దేవదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ బుధవారం ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మను దర్శించుకున్నారు. ఆలయ ఈవో కేఎస్ రామారావు, అధికారులు సాదరంగా స్వాగతం పలికారు.

న్యూస్‌రీల్

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జిల్లాలో ఈనెల 14 నుంచి 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ టి.జమలపూర్ణమ్మ తెలిపారు. ఈ ఉత్సవాలను విజయవంతం చేయాలని సిబ్బందికి ఆమె పిలుపునిచ్చారు. స్థానిక ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో బుధవారం ఆమె 56 వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల కరపత్రిక, వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ప్రతి రోజు విద్యార్థులకు వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించాలని, ఉత్సవాలకు ప్రజా ప్రతినిధులను ఆహ్వానించాలని సూచించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎంవీడీటీ నగేష్, ఠాగూర్ గ్రంథాలయ అధికారి కె.రమాదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

దుర్గగుడి కీలక విభాగాలలో తనిఖీలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గ గుడి ఈవోగా బాధ్యతలు స్వీకరించిన కేఎస్ రామారావు తొలి సారిగా ఆలయంలోని కీలక విభాగాలను బుధవారం పరిశీలించారు. మహామండపం నాల్గో అంతస్తులోని ఇంజినీరింగ్ విభాగం, అకౌంట్స్ విభాగం, ఆర్జిత సేవల విభాగం, టోల్ ఫ్రీ కేంద్రం, దర్శన టికెట్ల విభాగాలను తనిఖీ చేశారు. ఆయా విభాగాల అధికారులతో మాట్లాడిన అనంతరం రికార్డులను పరిశీలించారు. ఆయా విభాగాలలో సిబ్బంది రోజు వారీ విధుల గురించి ఆరా తీయడమే కాకుండా పలు సూచనలు చేశారు. దుర్గగుడి ఈవోగా ఆయా విభాగాలకు నేరుగా వెళ్లి అధికారులను, సిబ్బందిని కలుసుకున్నట్టు ఈవో తెలిపారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసే భక్తులకు మెరుగైన సదుపాయాలను కల్పించడం దేవస్థానం బాధ్యతని, ప్రతి ఒక్క సిబ్బంది విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

నిత్యాన్నదానానికి రూ.1.74 లక్షలు విరాళం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి హైదరాబాద్‌కు చెందిన భక్తులు బుధవారం రూ.1.74 లక్షల విరాళాన్ని అందజేశారు. హైదరాబాద్ పటాన్‌చెరువు ప్రాంతానికి చెందిన ఆర్.అశోక్‌గౌడ్ ఆలయ అధికారులను కలిసి నిత్యాన్నదానానికి ఈ మొత్తాన్ని అందించారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం దాతలకు ఆలయ అధికారి మధు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేష వస్త్రాలను అందజేశారు.

బ్యాడ్మింటన్ బాలికల విజేత కృష్ణా



మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): నగరంలోని చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న 67వ ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అండర్-19 అంతర్ జిల్లాల బాలబాలికల బ్యాడ్మింటన్ పోటీల ఫైనల్స్‌లో బాలికల విభాగంలో కృష్ణా జిల్లా జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. విశాఖపట్నం జట్టు ద్వితీయ స్థానం, కడప జిల్లా జట్టు తృతీయ స్థానంలో ఉన్నాయి.
బాలుర విభాగంలో చిత్తూరు జిల్లా జట్టు ప్రథమ, పశ్చిమ గోదావరి జిల్లా జట్టు ద్వితీయ, కృష్ణాజిల్లా జట్టు తృతీయ స్థానాల్లో నిలిచాయి. బుధవారం సాయంత్రం జరిగిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి జి.భానుమూర్తిరాజు హాజరై విజేతల జట్లకు బహుమతులు అందజేశారు. పీబీ సిద్ధార్థ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ వెంకటేశ్వర్లు, కృష్ణాజిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి వి.రవికాంత, వివిధ జిల్లాల జట్ల మేనేజర్లు కార్యక్రమంలో పాల్గొన్నారు.

జగన్ మళ్లీ సీఎం కావడం
చారిత్రక అవసరం

- ఎమ్మెల్యేలు వెలంపల్లి, మల్లాది విష్ణు
- నేటి నుంచి వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం ప్రారంభం



జిల్లా పార్టీ కార్యాలయంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం సందర్భంగా పార్టీ పతాకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యేలు వెలంపల్లి శ్రీనివాసరావు, మల్లాది విష్ణు, మేయర్ రాయన భాగ్యలక్ష్మి, దేవినేని అవినాష్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపిన సీఎం వైఎస్ జగనే ఈ రాష్ట్రానికి మళ్లీ కావాలని వైఎస్సార్‌సీపీ ఎన్టీఆర్ జిల్లా పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. బుధవారం భవానీపురంలోని వైఎస్సార్‌సీపీ ఎన్టీఆర్ జిల్లా కార్యాలయంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంపై మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ గురువారం నుంచి జిల్లా వ్యాప్తంగా 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా నాలుగున్నరేళ్ల కాలంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ప్రజలకు వివరిస్తారన్నారు.వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2019లో ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశాక రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా భావించారన్నారు. కరోనా కష్టకాలంలోనూ రాష్ట్రంలో అభివృద్ధి ముందుకెళ్లేలా పనిచేశారన్నారు. ఏ రాష్ట్రమైనా బాగుందని చెప్పాలంటే ఆర్థిక వ్యవస్థ ప్రధానమని, ఇందులో జీఎస్‌డీపీ, తలసరి ఆదాయం రెండూ ప్రామాణికంగా తీసుకుంటారన్నారు. చంద్రబాబు దిగిపోయే నాటికి జీఎస్‌డీపీ వృద్ధిరేటు 22వ స్థానంలో, తలసరి ఆదాయం 17వ స్థానంలో, వ్యవసాయ రంగం చివరి స్థానంలో ఉందన్నారు. వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయ్యాక జీఎస్‌డీపీ నంబర్ వన్ స్థానం, తలసరి ఆదాయంలో 9వ స్థానం, వ్యవసాయ రంగంలో 6వ స్థానానికి ఎగబాకిందన్నారు. చంద్రబాబు ఐదేళ్ల పాలనలో కేవలం 34 వేల ప్రభుత్వ ఉద్యోగాలిస్తే, జగన్ నాలుగున్నరేళ్లలోనే 4.93 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించారని, వీటిలో 2.13 లక్షలు శాశ్వత ఉద్యోగాలు కల్పించారన్నారు. ఇలా ఏ రంగంలో చూసినా జగన్ పాలనలో రాష్ట్రం అగ్రస్థానాన నిలిచిందన్నారు. అందుకే ఈ రాష్ట్రానికి మళ్లీ సీఎంగా వైఎస్ జగనే రావాలని ప్రజలు ముక్త కంఠంతో కోరుకుంటున్నారన్నారు.

పేదరికం తగ్గించిన ఘనత జగన్‌దే

ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాట్లాడుతూ ఏపీకి జగనే ఎందుకు కావాలి? అనే నినాదంతో చేపట్టబోయే కార్యక్రమంలో 20 అంశాలను ప్రజల ముందు పెట్టబోతున్నామన్నారు. చంద్రబాబు పాలనకు వైఎస్ జగన్ పరిపాలనకు తేడా ఏమిటో ప్రజలకు వివరిస్తామన్నారు. రాష్ట్రంలో పేదరికం తగ్గించిన ఘనత వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. అవినీతిని సమూలంగా పారదోలారన్నారు. ఆర్బీకేలను మేధావులు ప్రశంసిస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రానికి వైఎస్ జగన్ మళ్లీ సీఎం కావడం చారిత్రక అవసరమన్నారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ వైఎస్ జగన్ పాలనలో మహిళా సాధికారత సాధ్యమైందన్నారు. తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్ మాట్లాడుతూ జగన్ మళ్లీ సీఎం కావడం కోసం ప్రజలతో కలిసి సైనికుల్లా పనిచేస్తామన్నారు. అనంతరం పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు.

ఓటమి నుంచి పాఠాలు నేర్వాలి

- వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్
- ముగిసిన సీఎం జగన్ ఆల్ ఇండియా జూనియర్ బ్యాడ్మింటన్ ర్యాంకింగ్ టోర్నీ



విజేతలతో మంత్రి కాకాణి గోవర్ధన్

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని, ఓటమి నుంచి పాఠాలు నేర్చుకుంటూ ముందుకు సాగాలని వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖా మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. ఈ నెల 1వ తేదీన ప్రారంభమైన ఏపీ సీఎం జగన్ ఆల్ ఇండియా జూనియర్ ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా విజయవాడ బందరు రోడ్డులోని దండమూడి రాజగోపాలరావు మున్సిపల్ స్టేడియం ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై టోర్నమెంట్‌లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే నెలలో ఆడుదాం..ఆంధ్రా పేరుతో మండల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు క్రీడలను నిర్వహిస్తున్నారని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.ద్వారకానాథ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి క్రీడా రంగానికి ఇస్తున్న ప్రోత్సాహానికి కృతజ్ఞతగా మొదటిసారిగా జాతీయస్థాయి టోర్నమెంట్‌కు ఒక రాష్ట్రానికి చెందిన ముఖ్యమంత్రి పేరుతో నిర్వహించామన్నారు. సభ అనంతరం మంత్రి విజేతలకు జ్ఞాపిక, నమూనా చెక్కును అందజేశారు.

మాదకద్రవ్యాల వినియోగంపై నిఘా పెంచాలి

నార్కో సమన్వయ కమిటీ సమావేశంలో కలెక్టర్ ఢిల్లీరావు



నార్కో సమన్వయ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విద్యా సంస్థల యాజమాన్యాలు, సంబంధిత అధికారులు మాదకద్రవ్యాల వినియోగంపై పటిష్ఠ నిఘా ఉంచాలని, అప్రమత్తతతో కట్టడి చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం కలెక్టర్ ఢిల్లీరావు అధ్యక్షతన నార్కో సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. సమావేశంలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు నార్కోటిక్ డ్రగ్స్, సైకోట్రోఫిక్ సబ్‌స్టాన్సెస్ (ఎన్‌డీపీఎస్)పై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. గంజాయి టెస్టింగ్ డెమోను ప్రదర్శించారు. ఈ ఏడాది ఇప్పటివరకు పోలీసు శాఖ ద్వారా 206 గంజాయి కేసులు నమోదు చేసి 539 మందిని అరెస్టు చేశామని, సెబ్ ద్వారా 40 కేసులు నమోదు చేసి 101 మందిని అరెస్టు చేసినట్లు వివరించారు. కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై విద్యాసంస్థల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. మాదకద్రవ్యాలు వినియోగించే వారిని గుర్తించి కౌన్సెలింగ్ చేయాలని సూచించారు. వారి ద్వారా లభించే సమాచారం ఆధారంగా నెట్‌వర్క్‌ను ఛేదించాలన్నారు. గంజాయి, మాదకద్రవ్యాల ఉత్పత్తి, రవాణా, వినియోగం ఈ మూడు దశలపై అధికారులు పటిష్ఠ నిఘా పెట్టి నిర్మూలనకు కృషి చేయాలని సూచించారు. మందుల దుకాణాలను తరచూ తనిఖీ చేసి రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించేలా చూడాలన్నారు. వైద్యుల ప్రిస్కిప్షన్ లేకుండా మందులు విక్రయించే దుకాణాలపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. సమావేశంలో సబ్ కలెక్టర్ అదితిసింగ్, తిరువూరు ఆర్డీఓ కె.మాధవి, ఐసీడీఎస్ పీడీ జి.ఉమాదేవి, అడిషనల్ డీసీపీ పి.వెంకటరత్నం ,డీఈఓ సీవీ రేణుక, డీఎం అండ్ హెచ్ఓ ఎం. సుహాసిని తదితరులు పాల్గొన్నారు.

బ్లాక్ బోర్డు డిజైనింగ్‌కు పేటెంట్ హక్కు



తమ్మినేని నారాయణమూర్తి

జూపూడి(ఇబ్రహీంపట్నం): ఎన్టీఆర్ జిల్లా జూపూడిలోని నిమ్రా కళాశాలల అకడమిక్ డైరెక్టర్ తమ్మినేని నారాయణమూర్తికి లండన్‌లోని సేనాన్ ఐపీ సంస్థ సెమీ ఆటోమెటిక్ ఎక్స్‌టెండబుల్ బ్లాక్‌బోర్డు డిజైన్‌కు మేధో సంపత్తి(పేటెంట్) హక్కు ప్రదానం చేశారు. ఎప్పుడైనా..ఎక్కడికైనా సులువుగా తీసుకెళ్లి విద్యాబోధన చేసేందుకు అనువుగా బ్లాక్ బోర్డు డిజైన్ చేసినందుకు ఈ హక్కు పొందారు. కళాశాలలో బుధవారం జరిగిన అభినందన సభలో నారాయణమూర్తిని డెప్యూటీ డైరెక్టర్ గులాం గౌస్, మెడికల్ కళాశాల డీన్ డాక్టర్ ఫారూఖీ, వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్ అభినందించారు.

మరో అవకాశం

- 2021-22, 2022-23లో ఫెయిలైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి
- ఉత్తీర్ణులైతే రెగ్యులర్ సర్టిఫికెట్
- నెలాఖరు వరకు ఫీజు కట్టవచ్చు
- అమ్మ ఒడి పథకానికి అర్హత



ఇంటర్మీడియెట్ విద్యార్థినులు(ఫైల్)

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రాష్ట్రంలో విద్యా సంస్కరణలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలుచేస్తోంది.విద్యార్థులు మధ్యలో చదువు ఆపకుండా ప్రభుత్వం అన్ని రకాలుగా చర్యలు తీసుకుంటోంది. అమ్మ ఒడి, జగనన్న విద్యాదీవెన, జగనన్న వసతి దీవెన వంటి కార్యక్రమాలు విద్యారంగాన్ని మరింత పరిపుష్టం చేయటం వాటి ఫలితాలు అందరినీ ఆకర్షిస్తున్నాయి. దీనిలో భాగంగా ఇంటర్ ఫెయిల్ అయిన విద్యార్థుల కోసం నూతన నిర్ణయాలు తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం మరో అవకాశాన్ని కల్పిస్తోంది. ఇంటర్ ఫెయిలైన వారికి రీ-అడ్మిషన్ ఇవ్వడమే కాకుండా ఉత్తీర్ణులైతే వారికి సప్లమెంటరీకి బదులు రెగ్యులర్ సర్టిఫికెట్ జారీ చేయనుంది.

ఈ విద్యా సంవత్సరం నూతన నిర్ణయం

పదో తరగతి తర్వాత విద్యార్థులకు ఇంటర్మీడియట్ చాలా కీలకం. దీన్ని పూర్తి చేసిన తర్వాత వివిధ రంగాల వైపు అడుగులు వేసి డిగ్రీలు చేయటానికి అవకాశముంటుంది. ఇంటర్ ఫెయిల్ అయిన విద్యార్థులకు అడ్వాన్స్‌డ్ సప్లమెంటరీ పరీక్షలు నిర్వహించినా ఉత్తీర్ణులు కానటువంటి వారు ఉన్నారు. అటువంటి వారి కోసం ప్రభుత్వం ఈ ఏడాది నూతన విధానాన్ని ప్రవేశపెట్టింది. దీనిలో భాగంగా ద్వితీయ సంవత్సరం పరీక్షలు తప్పిన విద్యార్థులు మరోసారి కళాశాలలో చేరవచ్చు. తరగతులకు హాజరుకావచ్చు. రెగ్యులర్ విద్యార్థులుగా మారొచ్చు

రెండు సంవత్సరాల విద్యార్థులకు అవకాశం

ఇంటర్మీడియెట్ బోర్డు తాజాగా ఈ ఏడాది తీసుకొచ్చిన విధానంలో 2021-2022, 2022-2023 విద్యా సంవత్సరాల్లో ద్వితీయ సంవత్సరం ఇంటర్మీడియెట్ తప్పిన విద్యార్థులకు మేలు జరుగుతుంది. వారు రానున్న పబ్లిక్ పరీక్షలు రాసి ఉత్తీర్ణులైతే వారికి సప్లమెంటరీ కాకుండా రెగ్యులర్ విద్యార్థులుగా గుర్తిస్తూ సర్టిఫికెట్లు జారీ అవుతాయి. 2023 మార్చిలో పరీక్షలు రాసిన విద్యార్థుల్లో 83 శాతం ఉత్తీర్ణత ఉంది. పాస్ కాని వారికి సదవకాశమిది.

ప్రభుత్వ పథకాలకు అవకాశం

ఈ విధానంలో ఫీజులు చెల్లించి రెగ్యులర్‌గా తరగతులకు హాజరయ్యే విద్యార్థులకు ప్రభుత్వ పథకాలకు అర్హత ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ప్రధానంగా విద్యార్థులకు ఎటువంటి ఆర్థిక భారం పడకూడదనే లక్ష్యంతో అమ్మ ఒడికి అర్హత కలిగించే నిర్ణయాన్ని ప్రభుత్వం తీసుకుంది.

విద్యార్థులకు మేలు చేసే నిర్ణయం

ప్రభుత్వం విద్యార్థులకు మేలు చేసే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకుంది. నూతనంగా ఈ ఏడాది నుంచే ప్రారంభించిన విద్యా విధానంలో ఫీజులు చెల్లించిన విద్యార్థులు రెగ్యులర్ విద్యార్థుల్లా తరగతులకు హాజరై పాఠాలను వినే అవకాశం కల్పిస్తాం. తద్వారా పరీక్షల్లో ఉత్తీర్ణులయ్యే అవకాశాలు పెరుగుతాయి. గతంలో పరీక్షలు తప్పి 'సప్లిమెంటరీ రాసిన విద్యార్థులకు పాస్ సర్టిఫికెట్‌లో సప్లిమెంటరీ విద్యార్థులుగా నమోదు చేసేవారు. నూతన విధానంలోఅతనికి కూడా రెగ్యులర్ విద్యార్థిగానే సర్టిఫికెట్ జారీ చేస్తారు. ఈ నెలాఖరు వరకూ ఫీజు చెల్లించడానికి ప్రభుత్వం గడువుగా నిర్ణయించింది. విద్యార్థులు జ్ఞానభూమి పోర్టల్ ద్వారా పరీక్ష ఫీజులు చెల్లించాలి.

–రవికుమార్, ఆర్ఐఓ, ఉమ్మడి కృష్ణాజిల్లా

ప్రగతి పథంలో కేడీసీసీ బ్యాంకు



మాట్లాడుతున్న తాతినేని పద్మావతి

కృష్ణలంక(విజయవాడతూర్పు): ఖాతాదారులకు సకాలంలో రుణాలు అందజేస్తూ ప్రగతి పథంలో కృష్ణాజిల్లా సహకార కేంద్ర బ్యాంకు(కేడీసీసీబీ) దూసుకుపోతోందని బ్యాంకు చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి అన్నారు. గవర్నర్‌పేటలోని ఎం.బి.వి జ్ఞాన కేంద్రంలో బుధవారం కేడీసీసీబీ మహాజన సభ జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న పద్మావతి మాట్లాడుతూ తాను పదవీ బాధ్యతలు స్వీకరించినప్పుడు బ్యాంకు వ్యాపారం రూ.10,020 కోట్లు కాగా నేడు రూ.10,580 కోట్లకు చేరిందన్నారు. కేవలం 3 నెలల కాలంలో రూ.600 కోట్ల అభివృద్ధి సాధించామన్నారు. సన్న, చిన్నకారు రైతులు ఎంతో మందికి రుణాలు ఇస్తున్నామని, రైతు తీసుకున్న రుణానికి మైక్రోన్సూర్ కంపెనీ ద్వారా బీమా చేసుకునే అవకాశాన్ని కల్పించి రైతు కుటుంబాన్ని, బ్యాంక్‌ను నష్టపోకుండా చూస్తున్నామన్నారు. సహకార సంఘాలకు గ్రామీణ రైతాంగాన్ని ఇంకా దగ్గర చేసే క్రమంలో మైక్రో ఏటీఎంలను ప్రవేశపెట్టామని, వీటి ద్వారా రైతుకి ఏ బ్యాంకులో అకౌంట్ ఉన్నా సంఘంలో డబ్బులు డిపాజిట్ చేసుకోవచ్చు, విత్‌డ్రా చేసుకోవచ్చన్నారు. జగనన్న కాలనీ ఇళ్ల లబ్ధిదారులైన డ్వాక్రా గ్రూప్‌లోని మహిళలకు 70 శాతం పూర్తయిన ఇళ్లకు సహకార గృహ మిత్ర పథకం ద్వారా రూ.2 లక్షల వరకు రుణం ఇస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ఉత్తమ సహకార బ్యాంకు అవార్డు, జాతీయ స్థాయిలో నాస్కాబ్ ఉత్తమ సహకార బ్యాంక్ అవార్డు అందుకున్నామని తెలిపారు. కార్యక్రమంలో బ్యాంకు డైరెక్టర్లు కొమ్మినేని రవిశంకర్, గుమ్మడపు రవీంద్ర రాణా, గడిదేసి పెద్ద వెంకయ్య, తలుపుల వెంకట కృష్ణారావు, పడమట సుజాత, భూక్యా రాణి, ఆప్కాబ్ ఎండీ ఆర్.శ్రీనాథ్‌రెడ్డి, సీఈఓ శ్యామ్ మనోహర్, జనరల్ మేనేజర్లు చంద్రశేఖర్, రంగబాబు, సహకార సంఘ అధ్యక్షులు పాల్గొన్నారు.

నేడు మెగా లోన్‌మేళా

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో వివిధ బ్యాంకుల ఆధ్వర్యంలో మెగా లోన్‌మేళా నిర్వహిస్తున్నట్లు బందరు పార్లమెంట్ సభ్యుడు వల్లభనేని బాలశౌరి బుధవారం తెలిపారు. ఈ లోన్‌మేళా ఉదయం 10 గంటల నుంచి నగరంలోని రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న శుభం కన్వెన్షన్ హాలులో జరుగుతుందన్నారు. ఈ లోన్‌మేళాలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఎస్‌బీఐ, ఇండియన్ బ్యాంక్ అధికారులు పాల్గొంటారన్నారు. మత్స్యకారులు, కౌలు రైతులు, డ్వాక్రా మహిళలు, విద్యావంతులైన నిరుద్యోగులకు వారికి అవసరమైన రుణాలను మంజూరు చేస్తారన్నారు.

వణికిస్తున్న వరుణుడు

- ఉపరితల ఆవర్తన ప్రభావంతో మారిన వాతావరణం
- జిల్లాలో పలు చోట్ల ఓ మోస్తరు నుంచి భారీ వర్షం
- ఆందోళనలో వరి రైతులు



ఈడుపుగల్లులో వరి పొలాలపై కమ్మిన కారు మబ్బులు

కంకిపాడు: ఉపరితల ఆవర్తన ప్రభావంతో వాతావరణం ఒక్కసారిగా మారి మబ్బులు కమ్మింది. జిల్లా వ్యాప్తంగా పలు చోట్ల ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. కోతకు సిద్ధమవుతున్న వరి చేలకు ఈ వర్షం చేటు చేస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

పట్టిన ముసురు

ఉపరితల ఆవర్తనం, ఈశాన్య గాలుల ప్రభావంతో ముసురు పట్టింది. బుధవారం ఉదయం వాతావరణం పొడిగా, మధ్యాహ్నం ఉక్కపోత, ఎండ తీవ్రత ఉంది. సాయంత్రం 4 గంటల సమయంలో వాతావరణం ఒక్కసారిగా మబ్బులు కమ్మేసి చిరుజల్లులతో పాటు అక్కడక్కడా ఓ మోస్తరు వర్షం కురిసింది. జిల్లాలోని పెనమలూరు, కంకిపాడు, ఉయ్యూరు, గన్నవరం నియోజకవర్గంలోని ఉంగుటూరు, బాపులపాడు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. పామర్రు నియోజకవర్గంలోని పలు మండలాల్లో మోస్తరు వర్షం పడింది. సుమారు రెండు గంటలకు పైగా వర్షం కురిసి, అనంతరం చిరుజల్లులు కొనసాగాయి.

వరి రైతుల్లో ఆందోళన

దివి సీమ ప్రాంతంలో ఖరీఫ్ సాగు రైతులకు ఈ వర్షం మేలు చేస్తుంది. అయితే తొలకరి కురవగానే బోర్ల కింద, కాలువ నీటిపై ఆధారపడి ముందస్తుగా ఖరీఫ్ సాగు చేపట్టే పెనమలూరు, గన్నవరం, పామర్రు తదితర నియోజకవర్గాల్లో రైతాంగానికి ఆందోళనకరంగా మారింది. జిల్లాలో 3,69,116 ఎకరాల్లో వరి సాగు జరిగింది. దీపావళి పండుగ అనంతరం కొనుగోలు కేంద్రాలు అందుబాటులోకి రానున్నాయి. ఈ నేపథ్యంలో చాలా చోట్ల రైతులు వరి కోతలు చేపట్టి పంటను మార్కెట్‌కు తరలించేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. మరికొన్ని చోట్ల వరి కంకులు సుంకు పోసుకునే స్థితిలో ఉన్నాయి. వర్షం కారణంగా కంకులు తాలుగా మారే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. కోతకు సిద్ధంగా ఉన్న చేలు నేలవాలితే ధాన్యం నాణ్యత దెబ్బతింటుందని వాపోతున్నారు.

నేటి నుంచి 'పల్లెకు పోదాం'

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): పేద, బలహీన వర్గాల సంక్షేమం కోసం ఏ రాష్ట్రంలోనూ అమలు చేయని విధంగా రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ఆదర్శ రాష్ట్రంగా నిలిచిందని జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి వారిని చైతన్యం చేసేందుకు పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 9 నుంచి 23 వరకు జరిగే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి పల్లెకు పోదాం కార్యక్రమంపై బుధవారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో తొలి విడతగా 257 గ్రామ, వార్డు సచివాలయాలలో ప్రభుత్వ సంక్షేమ పథకాల సమాచారాన్ని డిస్‌ప్లే బోర్డుల ద్వారా ప్రజలకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమాన్ని పూర్తి స్థాయిలో విజయవంతం చేసేందుకు మండల స్థాయి అధికారులు పర్యవేక్షణ చేపట్టాలన్నారు. సచివాలయాలలో డిస్‌ప్లే బోర్డుల ఏర్పాటుకు సంబంధించిన సమాచారాన్ని ప్రజలకు ముందుగానే తెలియజేయాలన్నారు. కాన్ఫరెన్స్‌లో జేసీ డాక్టర్ పి.సంపత్‌కుమార్, సబ్‌కలెక్టర్ అదితి సింగ్, గ్రామ, వార్డు సచివాలయ ప్రత్యేకాధికారి కె.అనురాధ, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

లైంగిక దాడి కేసులో నిందితుడికి రిమాండ్

పెనమలూరు: మండలంలోని యనమలకుదురుకు చెందిన బాలికకు మాయమాటలు చెప్పి, ఆమెపై లైంగిక దాడికి పాల్పడిన యువకుడిని పెనమలూరు పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. నిందితుడిని విజయవాడ కోర్టులో హాజరుపర్చగా కోర్టు రిమాండ్ విధించింది. పెనమలూరు సీఐ టి.వి.వి.రామారావు కథనం మేరకు.. యనమలకుదురుకు చెందిన బాలిక (16) విజయవాడలోని ఓ ప్రైవేటు కాలేజీలో ఇంటర్‌మీడియెట్ మొదటి సంవత్సరం చదువుతోంది. బాలిక తండ్రి తాపీ పనులు చేస్తాడు. గుడివాడ నుంచి వలస వచ్చిన షేక్ ఖాదర్‌వలీ (30) బాలిక తండ్రి వద్ద పనికి చేరాడు. బాలికపై కన్నేసిన ఖాదర్‌వలీ ఆమె ఇంటికి రాకపోకలు సాగిస్తూ ఆమెకు మాయమాటలు చెప్పి ఈ ఏడాది సెప్టెంబర్ 25వ తేదీన కిడ్నాప్ చేసి విశాఖపట్నం తీసుకు వెళ్లి ఓ గదిలో ఉంచి లైంగికదాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు, దర్యాప్తు చేపట్టి విశాఖపట్నం వెళ్లి ఖాదర్‌వలీని అరెస్టు చేశారు. విజయవాడ తీసుకొచ్చి కోర్టులో హాజరు పరిచారు. బాలికను వైద్య పరీక్షలకు పంపారు. నిందితుడికి గతంలోనే వివాహమైంది. అతని ప్రవర్తన నచ్చక భార్య వదిలేసి వెళ్లిపోయింది.

ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి వివరాలు లభ్యం

పెడన: రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి వివరాలు లభించాయని రైల్వే హెడ్ కానిస్టేబుల్ కుమార్ తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం పెడన బైపాస్ రోడ్డులోని రైలు గేట్ సమీపంలో గుడివాడ–మచిలీపట్నం రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ వివరాలతో పత్రికల్లో వార్త ప్రచురితమైంది. పత్రికల్లో వచ్చిన ఫొటో ఆధారంగా మృతుడిని కుటుంబ సభ్యులు గుర్తించారని రైల్వే హెడ్ కానిస్టేబుల్ తెలిపారు. పెడన పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీకి చెందిన తుమ్మలచర్ల శ్రీనివాసరావు(52) కొంత కాలంగా క్యాన్సర్‌తో బాధపడుతూ ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారని వివరించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించామని తెలిపారు.

కృష్ణానదిలో వృద్ధుడి మృతదేహం

ఇబ్రహీంపట్నం(మైలవరం): మండలంలోని ఫెర్రీ కాళికాదేవి ఆలయం సమీపంలో కృష్ణా నది ఒడ్డున పడివున్న వృద్ధుడి మృతదేహాన్ని ఇబ్రహీంపట్నం పోలీసులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. ఆ మృతదేహం ఆనవాళ్లతో సామాజిక మాధ్యమాల ద్వారా పోలీసులు విస్తృత ప్రచారం చేశారు. మృతుడిని కొండపల్లికి చెందిన చీదిరాల అంకమయ్య (82)గా కుటుంబ సభ్యులు గుర్తించారు. ఆదివారం తెల్లవారుజామున ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు అదే రోజు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. అయితే అంకమయ్య కృష్ణా నది వద్ద విగతజీవిగా కనిపించాడు. అతను ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు నిర్ధారించారు. మృతదేహాన్ని విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

శృంగేరి పీఠానికి హంసలదీవి ఆలయం దత్తత

- అధికారికంగా రికార్డులు అప్పగించిన దేవదాయ అధికారులు
- ఆలయ స్థిరాస్తులు, స్వామివార్ల బంగారం కూడా అప్పగింత

కోడూరు(అవనిగడ్డ): రాష్ట్రంలో ప్రసిద్ధిగాంచిన హంసలదీవి రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయాన్ని కర్నాటకలోని శృంగేరి పీఠం దత్తత తీసుకుంది. దేవదాయ అధికారులు వేణుగోపాలుడి ఆలయానికి సంబంధించిన రికార్డులు, స్థిరాస్తులను శృంగేరి పీఠం ప్రతినిధులకు బుధవారం అధికారికంగా అప్పగించారు. ప్రస్తుతం వేణుగోపాలుడి ఆలయం విజయవాడ దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థాన దత్తత ఆలయంగా కొనసాగుతోంది. 23 ఏళ్ల కితం దేవదాయ శాఖ నుంచి దుర్గగుడి అధికారులు వేణుగోపాలుడి ఆలయాన్ని దత్తత తీసుకొని అభివృద్ధి పనులు నిర్వహించారు. స్వామి ఉత్సవాలు, ధూపదీప నైవేద్యాలు, అర్చకుల జీతభత్యాలు మొత్తం దుర్గగుడి ఆధీనంలోనే కొనసాగింది. ఈ నేపథ్యంలో వేణుగోపాలుడి ఆలయాన్ని తమకు దత్తత ఇవ్వాలని శృంగేరి పీఠం గత ఏడాది ప్రభుత్వానికి లిఖితపూర్వకంగా దరఖాస్తు పంపింది. దీంతో ఇక్కడ పరిస్థితులను పరిశీలించిన ప్రభుత్వం ఈ ఏడాది జనవరి నెలలో వేణుగోపాలుడి ఆలయాన్ని శృంగేరి పీఠానికి అప్పగించాలంటూ అధికారంగా జీఓను విడుదల చేసింది.

రికార్డులు, స్థిరస్తుల అప్పగింత

వేణుగోపాలుడి ఆలయంలో దేవదాయ శాఖ డెప్యూటీ కమిషనర్ ఎం.విజయరాజు, ఏసీ శాంతి శృంగేరి పీఠం ప్రతినిధులతో బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆలయ కింద ఉన్న





హంసలదీవి వేణుగోపాలుడి ఆలయం(ఇన్‌సెట్) రికార్డులను శృంగేరీ పీఠం ప్రతినిధి సుబ్రహ్మణ్య అవధానికి అందిస్తున్న డీసీ విజయరాజు

39.40 ఎకరాల చెరువులు, 10.60 ఎకరాల అర్చకుల మాగాణి భూమికి సంబంధించిన రికార్డులను శృంగేరీ పీఠం ప్రతినిధి, టీటీడీ వేదపాఠశాల ప్రిన్సిపాల్ కుప్పా శివసుబ్రహ్మణ్య అవధానికి అప్పగించారు. వాటితో పాటు 23 ఏళ్ల నుంచి ఉన్న ఆలయ రికార్డులను కూడా అందించారు. స్వామివార్లకు ఉన్న 300 గ్రాముల బంగారం, ఎనిమిది కిలోల వెండి ఆభరణాలను కూడా అప్పగించారు. ఆలయం కింద ఉన్న రూ.16 లక్షల ఫిక్స్‌డ్ డిపాజిట్లను ప్రభుత్వానికి అప్పగించనున్నట్లు డీసీ విజయరాజు తెలిపారు. ఇక నుంచి వేణుగోపాలుడి ఆలయానికి సంబంధించిన అన్ని కార్యక్రమాలు శృంగేరి పీఠం ఆధ్వర్యంలో కొనసాగుతాయని, ప్రభుత్వ నిబంధనల మేరకు పీఠం సభ్యులు వ్యవహరించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. స్వామి వారి బ్రహ్మోత్సవాలు, పవిత్రోత్సవాలు, ప్రత్యేక పర్వదినాలు, అభివృద్ధిపై దేవదాయ శాఖ పర్యవేక్షణ ఉంటుందని డీసీ స్పష్టం చేశారు. పది సంవత్సరాలపాటు ఆలయం దత్తత కొనసాగుతుందని పేర్కొన్నారు.

వేణుగోపాలుడికి ప్రత్యేక పూజలు

వేణుగోపాలుడికి డీసీ విజయరాజు, ఏసీ శాంతి, వేదపాఠశాల ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్య అవధాని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామిని దర్శించుకొని ఇక్కడ విశిష్టతను పండితులు అడిగి తెలుసుకున్నారు. వారిని పండితులు దుశ్శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ కగ్గా శ్రీనివాసరావు, ఈఓ సుధాకర్, సిబ్బంది పర్యవేక్షించారు.

మాజీ సైనికుల సమస్యల పరిష్కారానికి కృషి

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మాజీ సైనికుల సమస్యల పరిష్కరించేందుకు ఎన్టీఆర్ జిల్లా సైనిక బోర్డు కృషి చేస్తోందని బోర్డు చైర్మన్, జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు. విజయవాడ నగరంలో మాజీ సైనికుల సంక్షేమ భవన నిర్మాణానికి స్థల సేకరణతో పాటు కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగాల భర్తీలో మాజీ సైనికులకు ప్రాధాన్యం ఇచ్చేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా సైనిక బోర్డు సమావేశం బుధవారం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ.. మాజీ సైనికుల కోటాలో గతంలో జిల్లాకు చెందిన మాజీ సైనికులు, వారి భార్యలకు కేటాయించిన అసైన్డ్ వ్యవసాయ భూములను క్రమబద్ధీకరించడంలో ఎదురైన సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఆ దిశగా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేస్తామన్నారు. భూములకు సంబంధించి ఏవైనా సమస్యలు ఎదురైతే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. భూములను క్రమబద్ధీకరించి రిజిస్ట్రేషన్ అవకాశం కల్పిస్తామన్నారు. మాజీ సైనికుల సంక్షేమ భవనాన్ని నిర్మించేందుకు అవసరమైన స్థల సేకరణకు చర్యలు తీసుకోవాలని మునిసిపల్, రెవెన్యూ అధికారులకు సూచించారు. మాజీ సైనికులకు ఆస్తి పన్ను చెల్లింపులో కల్పిస్తున్న రాయితీని కొనసాగించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. మాజీ సైనికుల సంబంధించి సీఎస్‌డీ క్యాంటీన్, ఎక్స్ సర్వీస్‌మెన్ కాంట్రిబ్యూటరీ, హెల్త్ స్కీమ్ పాలిక్లినిక్‌లు ప్రస్తుతం అద్దె భవనంలో నిర్వహిస్తున్నామని, వీటికి సొంత భవనం నిర్మించుకునేందుకు అవసరమైన భూమిని కేటాయించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాల్లో ప్రాధాన్యత కల్పిస్తామన్నారు. మాజీ సైనిక సంక్షేమ నిధికి విరాళాలను సేకరించాల్సిన అవసరం ఉందన్నారు. ఇప్పటికే డ్వామా, మెప్మా, డీఆర్‌డీఏ పీడీలు చొరవ తీసుకుని విరాళాలు సేకరించారని, వీరిని స్ఫూర్తిగా తీసుకుని మిగిలిన శాఖల అధికారులు విరాళాలు సేకరించాలని కోరారు. స్వయం ఉపాధి పథకం కింద నైపుణ్య శిక్షణ అందించి ఉపాధి అవకాశాలను కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. మాజీ సైనికుల సమస్యల పరిష్కారానికి జిల్లా కలెక్టరేట్‌లో ప్రత్యేక మానిటరింగ్ సెల్‌ను ఏర్పాటు చేసేందుకు సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తామన్నారు. గతంలో జిల్లా ప్రజలకు విశిష్ట సేవలందించి ప్రజా కలెక్టర్‌గా మన్ననలు పొందిన మేజర్ ఎ.వి.ఎస్.రెడ్డి కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని కలెక్టర్ ఢిల్లీరావు తెలిపారు. సమావేశంలో బోర్డు కార్యదర్శి డాక్టర్ కె.కల్యాణవీణ, జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.వి.నాగేశ్వరరావు, నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ శకుంతల, తిరువూరు ఆర్డీఓ కె.మాధవి, జిల్లా పరిశ్రమల అధికారి ఎ.సుధాకర్, సాంఘిక సంక్షేమ అధికారి వి.వి.విజయభారతి, ఖజానా అధికారి రెహమాన్, లీడ్ బ్యాంక్ మేనేజర్ ఎం. ప్రియాంక, కమిటీ సభ్యులు నరసింహారావు, జి.శివనాగేశ్వరరావు, ఫణి పూర్ణచంద్రరావు, వి.మురళీకృష్ణ పాల్గొన్నారు.



సైనిక్ బోర్డు సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు

ఖననం చేసిన పసికందు మృతదేహం స్వాధీనం



రిజర్వ్ ఫారెస్ట్‌లో పూడ్చిన పసికందు మృతదేహాన్ని వెలికి తీయిస్తున్న పోలీసులు

ఇబ్రహీంపట్నం(మైలవరం): మండలంలోని కొండపల్లి ఖిల్లా రోడ్డు చివర రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతంలో గుర్తుతెలియని పసిబాలుడి మృతదేహాన్ని పోలీసులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం రాత్రి కొందరు రెండు బైకులపై పసికందును గుడ్డలో చుట్టి తీసుకెళ్లడం, ఆ తర్వాత మరికొందరు పొలుగు, పారతో వెళ్లడాన్ని స్థానికులు చూసి, సీఐ పి.శ్రీనుకు సమాచారం ఇచ్చారు. ఆ ప్రాంతానికి చేరుకున్న పోలీసులు తవ్వి చూడగా అందులో వారం రోజుల వయసున్న బాలుడి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. బాలుడి చేతికి వైద్యశాలలో చికిత్స నిమిత్తం ఉపయోగించే ఐవీ క్యానులా ఉండటంతో అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతిచెంది ఉంటాడని భావిస్తున్నారు. బాలుడి అంత్యక్రియలను గోప్యంగా చేయడాన్ని పోలీసులు అనుమానించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ పి.శ్రీను తెలిపారు.

మంగినపూడి బీచ్ అభివృద్ధికి చర్యలు

కృష్ణా జిల్లా కలెక్టర్ రాజాబాబు

కోనేరుసెంటర్(మచిలీపట్నం): మంగినపూడి బీచ్ అభివృద్ధికి అధికారులు ప్రణాళికలు రూపొందించాలని కృష్ణా జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు ఆదేశించారు. ఆయన బుధవారం మంగినపూడిబీచ్‌ను సందర్శించి అక్కడి వసతులపై ఆరా తీశారు. తొలుత ముఖద్వారం వద్దకు చేరుకున్న కలెక్టర్ అక్కడ వసతుల కల్పనకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ప్రాధాన్యత కలిగిన మంగినపూడిబీచ్‌ను పర్యాటక ప్రాంతంగా రూపుదిద్దేంకు అవసరమైన అంచనాలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. మరుగుదొడ్ల నిర్మాణం పనులను వీలైనంత త్వరగా చేపట్టాలన్నారు. వాటిని ఉపయోగించుకునే వారి నుంచి నామమాత్రపు ఫీజు వసూలు చేసి, వచ్చిన ఆదాయాన్ని తిరిగి మరుగుదొడ్ల నిర్వహణకే ఉపయోగించాలని సూచించారు. పార్కింగ్ స్థలాలను ఏర్పాటుచేసి, పార్కింగ్ ఫీజులు వసూలు చేసి వచ్చిన నిధులను బీచ్ అభివృద్ధికి ఉపయోగించుకోవాలని సూచించారు. సీసీ కెమెరాలను ఏర్పాటుచేసి ఆయా ప్రాంతాల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఐమాస్ట్ లైట్లను ఏర్పాటుచేయాలని, జంగిల్ క్లియరెన్స్ చర్యలు చేపట్టాలని, వ్యర్థాలను సేకరించేందుకు వీలుగా డస్ట్‌బిన్‌లను ఏర్పాటుచేయాలని సూచించారు. ప్లాస్టిక్ వస్తువులను వారంలో ఒకసారి స్వచ్ఛభారత్ కార్యక్రమం ద్వారా శుభ్రం చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. డ్వామా పీడీ జి.వి. సూర్యనారాయణ, జిల్లా పర్యాటక అధికారి ఆర్.అరుణ, పర్యాటక మేనేజర్ రామలక్ష్మణ్, పరిశ్రమలశాఖ జీఎం ఆర్.వెంకట్రావు, బందరు తహసీల్దార్ శ్రీవిద్య, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.



మంగినపూడి బీచ్ అభివృద్ధి పనులపై అధికారులతో చర్చిస్తున్న కలెక్టర్ రాజాబాబు

సీఎం పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

మైనార్టీ సంక్షేమ శాఖ స్పెషల్ సెక్రటరీ మహమ్మద్ ఇంతియాజ్



సమావేశంలో మాట్లాడుతున్న ఇంతియాజ్, కలెక్టర్ ఢిల్లీరావు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు తదితరుల

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియంలో ఈ నెల 11వ తేదీ భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకుని నిర్వహించే కార్యక్రమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హాజరవుతారని మైనార్టీ సంక్షేమ శాఖ స్పెషల్ సెక్రటరీ మహమ్మద్ ఇంతియాజ్ తెలిపారు. సీఎం పర్యటనకు ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమ ఏర్పాట్లను కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు, ఇంతియాజ్ బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఆయా శాఖల అధికారులు తమకు కేటాయించిన పనులు సమన్వయంతో పూర్తి చేయాలన్నారు. ముఖ్యమంత్రి పర్యటన విజయవంతానికి చేపట్టాల్సిన పనులపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో విద్యా పురస్కారాలు ప్రదానం చేస్తారని పేర్కొన్నారు. ఎటువంటి లోటుపాట్లకు తావివ్వకుండా బాధ్యతాయుతంగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఆర్‌అండ్‌బీ, ట్రాన్స్‌కో, రవాణా, ఆర్టీసీ తదితర శాఖల అధికారులు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే మల్లాది విష్ణువర్ధన్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి పర్యటనకు హాజరయ్యే మైనారిటీ సోదరులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా అన్ని సదుపాయాలు కల్పించాలని అధికారులను కోరారు. సభా వేదిక ఏర్పాటు, సభా ప్రాంగణం ముస్తాబు, వీఐపీల పార్కింగ్, సిట్టింగ్, బారికేడ్ల ఏర్పాటు, తాగునీటి సరఫరా, భద్రత ఏర్పాట్లు, ట్రాఫిక్ మళ్లింపు, నిరంతర విద్యుత్ సరఫరా తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్ కుమార్, మునిసిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, డీఆర్వో ఎస్.వి. నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ముగిసిన సౌత్ జోన్ క్యారమ్స్ టోర్నీ

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ఇండియన్ అకౌంట్స్ అండ్ ఆడిట్ డిపార్ట్‌మెంట్ (ఐఏఅండ్‌ఏడీ) ఆధ్వర్యంలో నిర్వహించిన సౌత్ జోన్ క్యారమ్స్ టోర్నమెంట్ బుధవారం సాయంత్రం ముగిసింది. విజయవాడ బందరు రోడ్డులోని ఏజి అండ్ ఏడీ ప్రధాన కార్యా లయం ఆవరణలో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి ఇంటర్నేషనల్ క్యారమ్ ప్లేయర్, అర్జున అవార్డుగ్రహీత మరియ ఇరుదయం హాజరై విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాలకు చెందిన 54 మంది క్రీడాకారులు ఈ టోర్నమెంట్‌లో పాల్గొన్నారు.

విజేతలు వీరే..

మెన్స్ టోర్నమెంట్ చాంపియన్ షిప్‌ను ఆడిట్ జనరల్ ఆంధ్రప్రదేశ్ అండ్ తెలంగాణ ఏ టీమ్ సొంతం చేసుకుంది. మెన్స్ సింగిల్స్‌లో ఆర్.డి.దినేష్‌బాబు విజయం సాధించగా, రన్నరప్‌గా వి.అనిల్‌కుమార్ నిలిచాడు. ఉమెన్ సింగిల్స్ విజేతగా డి.స్వర్ణలత, రన్నరప్‌గా ఆర్.షర్మిల, వెటరన్ మెన్ సింగిల్స్ విజేతగా పి.శశిధరన్, రన్నరప్‌గా ఎన్.రామస్వామి నిలిచారు. ఐఏఅండ్‌ఏడీ అధికారులు చంద్రమౌళి సింగ్, రాకేష్ నాయక్, గౌతమ్ అల్లాడ, జేఎస్.శర్మ, ఎం.నాగరాజు, ఎం.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



చాంపియన్‌గా నిలిచిన ఏపీ అండ్ టీఎస్-ఏ జట్టు


ఆర్కే కళాశాలలో నలుగురు బాలికలకు అస్వస్థత

ఇబ్రహీంపట్నం(మైలవరం): మండలంలోని కేతనకొండ ఆర్కే ఇంజినీరింగ్ కళాశాల హాస్టల్లో చదువుతున్న నలుగురు విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. సోమవారం రాత్రి జరిగిన ఈ ఘటన ఆలస్యంగా బుధవారం వెలుగుచూసింది. అస్వస్థతకు గురైన నలుగురు విద్యార్థినులను కళాశాల యాజమాన్యం గొల్లపూడి ఆంధ్ర వైద్యశాలలో చేర్పించి చికిత్స అందించింది. చికిత్స అనంతరం వారిని తల్లిదండ్రులకు అప్పగించామని యాజమాన్యం తెలిపింది. ఈ విషయంపై కళాశాల ప్రిన్సిపాల్ కె.రామకృష్ణయ్యను వివరణ కోరగా.. సుమారు వెయ్యి మంది కలిగిన హాస్టల్లో నలుగురు బాలికలను జ్వరం, జలుబు, ఫిట్స్ వంటి అనారోగ్య కారణాలతో వైద్యశాలలో చేర్పించి చికిత్స అందించామని తెలిపారు. ఫుడ్ పాయిజన్ అనే ఆరోపణలు తీసుకురావడం బాధాకరమని పేర్కొన్నారు.

గుడిలో చోరీకి పాల్పడిన వ్యక్తి అరెస్ట్

పటమట(విజయవాడతూర్పు): అర్ధరాత్రిపూట గుడిలోకి చొరబడి గర్భగుడి ఎదురుగా ఉన్న హుండీలో నగదు దొంగిలించిన వ్యక్తిని బుధవారం పటమట పోలీసులు అరెస్ట్ చేశారు. పటమట పోలీసుల కథనం మేరకు.. ఈ నెల ఆరో తేదీన విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు రైల్వే స్టేషన్ రోడ్డులో ఉన్న శ్రీ అభయాంజనేయ స్వామి గుడి ఐరన్‌గ్రిల్ తాళం పగలకొట్టి గర్భగుడి ముందు ఉన్న హుండీలోని నగదును గుర్తు తెలియని దొంగలు దోచుకువెళ్లారని గుడి ధర్మకర్త మేకలహరిబాబు పటమట పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన పోలీసులు పక్కా సమాచారంతో పాయకాపురం, కండ్రిక పంటకాల్వకు చెందిన దాసరి దానియేల్(29) అలియాస్ గుర్కా దొంగతనానికి పాల్పడ్డాడని గుర్తించి అరెస్ట్ చేశారు. నిందితుడిపై ఇప్పటికే వివిధ పోలీస్ స్టేషన్లలో 29 కేసులు నమోదయ్యాయని గుర్తించారు. గుడివాడ టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో క్రైమ్, సస్పెక్ట్ షీట్ కూడా ఉందని పోలీసులు తెలిపారు. నిందితుడిని బుధవారం అరెస్ట్ కోర్టుకు హాజరు పరచగా రిమాండ్ విధించారు.

వైఎస్సార్ టీఎఫ్ కృష్ణా జిల్లా ఉపాధ్యక్షుడిగా రాజు



కంకిపాడు(పెనమలూరు): వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ కృష్ణా జిల్లా ఉపాధ్యక్షుడు కంకిపాడు మండలం గొడవర్రు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఇంగ్లిషు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న జె.జి.కె.రాజు నియమితులయ్యారు. ఈ మేరకు విజయవాడలోని అసోసియేషన్ కార్యాలయంలో నియామకపత్రం అందుకుంటున్నట్లు బుధవారం ఓ ప్రకటనలో రాజు తెలిపారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యాభివృద్ధికి, పాఠశాలల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. విద్యావ్యవస్థ పటిష్టతకు చేస్తున్న కృషి నచ్చి వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్‌లో చేరానన్నారు. తనకు ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించటం సంతోషంగా ఉందన్నారు. ఫెడరేషన్ రాష్ట్ర సలహాదారు, ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు పి.అశోక్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సుధీర్, రాష్ట్ర కార్యదర్శి తోట సాంబశివరావుకు కృతజ్ఞతలు తెలిపారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

కంచికచర్ల(నందిగామ): అప్పుల బాధతో ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండలంలోని పరిటాలలో బుధవారం జరిగింది. ఎస్ఐ పి.వి.ఎస్.సుబ్రహ్మణ్యం కథనం మేరకు.. నందిగామ మండలం తక్కెళ్లపాడుకు చెందిన మాతంగి ఏసుబాబు అలియాస్ ఏసయ్య(30) ఇబ్రహీంపట్నం మండలం కేతనకొండ గ్రామానికి చెందిన సునీతను మూడేళ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. కొంతకాలం నుంచి వారు కేతనకొండ గ్రామంలో నివసిస్తూ తక్కెళ్లపాడు గ్రామంలో ఇల్లు కట్టుకుంటున్నారు. కేతనకొండ నుంచి తక్కెళ్లపాడు వెళ్లేందుకు పరిటాల గ్రామం వరకు వచ్చిన ఏసయ్య చేసిన అప్పులు తీర్చలేనని భయంతో ఆ గ్రామంలోని ఓ నర్సరీ డొంకరోడ్డులో చెట్టుకు ఉరేసుకున్నాడు. అతడిని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. చెట్టుకు వేలాడుతున్న వ్యక్తిని కిందకు దించి చూడగా అప్పటికే మృతిచెందాడు. చేసిన అప్పులు తీర్చలేక తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని తన తమ్ముడికి ఏసయ్య సెల్ఫీ వీడియో పంపించాడు. ఏసయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం నందిగామ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రాయల్ ఎన్‌ఫీల్డ్‌తో ఉపాధి కల్పన శాఖ ఒప్పందం

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): యువతలో నైపుణ్యాల పెంపునకు ప్రయివేటు రంగ సంస్థల సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఉపాధి కల్పన, శిక్షణ శాఖ డైరెక్టర్ డాక్టర్ బి.నవ్య సూచించారు. నగరంలోని ఉపాధి కల్పన శాఖ కార్యాలయంలో రాయల్ ఇన్‌ఫీల్డ్ సంస్థతో ఉపాధి కల్పన శాఖ ఒప్పందం పత్రాల మార్పిడి బుధవారం జరిగింది. ఒప్పందంలో భాగంగా ఆ సంస్థ నిధులతో ప్రభుత్వ ఐటీఐ కళాశాల ఆవరణలో అధునాతన టెక్నాలజీతో పూర్తి స్థాయి వర్క్‌షాప్‌ను ఏర్పాటు చేస్తారు. ద్విచక్ర వాహనాల ఆటోమొబైల్ రంగంలో అధునాతన టెక్నాలజీతో ఐటీఐ విద్యార్థులకు శిక్షణ ఇస్తారు. ఉపాధి కల్పన శాఖ జాయింట్ డైరెక్టర్ జి.బాలసుబ్రహ్మణ్యం, అసిస్టెంట్ డైరెక్టర్ నాగవర్ధరాజు, విజయవాడ ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.కనకారావు, రాయల్ ఎన్‌ఫీల్డ్ సంస్థ నేషనల్ ట్రైనింగ్ హెడ్ కబిలన్, ఆ సంస్థ సౌత్ ఇండియా హెడ్ నరసింహారావు పాల్గొన్నారు.



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న అధికారులు, కంపెనీ ప్రతినిధులు

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

గూడూరు (పెడన): మండలంలోని తరకటూరు పాలెం సమీపంలో విజయవాడ – మచిలీపట్నం జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి ఆర్టీసీ అద్దె బస్సు ఢీకొన్న ప్రమాదంలో పైడిపాముల వంశీ (22) మృతిచెందాడు. మొవ్వ మండలం మంత్రిపాలెంనకు చెందిన వంశీ ముగ్గురు స్నేహితులతో కలిసి రెండు ద్విచక్రవాహనాలపై పెడన బయలుదేరారు. అదే సమయంలో విజయవాడ నుంచి మచిలీపట్నం వస్తున్న ఆర్టీసీ అద్దె బస్సు వెనుక నుంచి ద్విచక్రవాహనాలను బలంగా ఢీకొంది. తీవ్రంగా గాయపడిన వంశీ మృతిచెందగా మిగిలిన ముగ్గురు స్వల్పంగా గాయపడ్డారు. గూడూరు ఎస్ఐ శేషకుమార్ బస్సు డ్రైవరుపై కేసు నమోదు చేశారు. వంశీ మృతదేహానికి బందరు ప్రభుత్వాస్పత్రిలో బుధవారం పోస్ట్ మార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.




హైవేపై బైఠాయింపు

వంశీ మృతిపై ఆగ్రహం వ్యక్తం చేసిన కుటుంబ సభ్యులు న్యాయం చేయాలంటూ బుధవారం మధ్యాహ్నం ప్రమాదం జరిగిన ప్రదేశంలో జాతీయ రహదారిపై బైఠాయించారు. బాధితుల ఆందోళనతో రోడ్డుపై వాహనాలు భారీగా నిలిచిపోయాయి. అదే సమయంలో అటుగా వచ్చిన మచిలీపట్నం ఎమ్మెల్యే పేర్ని నాని బాధితులతో మాట్లాడి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. దీంతో బాధితులను ఆందోళన విరమించారు.

రూ.8.64 లక్షల నిషేధిత సిగరెట్ ప్యాకెట్లు స్వాధీనం

రామవరప్పాడు(గన్నవరం): నిషేధిత పొగాకు ఉత్పత్తుల అక్రమ రవాణా జరుగుతోందని సమాచారం రావడంతో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి టి.కనకరాజు ఆధ్వర్యంలో సిబ్బంది బుధవారం గూడవల్లిలో దాడులు చేసి రూ.8.64 లక్షల విలువైన సిగరెట్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. గ్రామంలోని గోదాములో ఐటీసీ రోడ్‌లో డెలివరీ హబ్ సెక్యూరిటీ సీనియర్ మేనేజర్, విజిలెన్స్ సిబ్బందితో తనిఖీలు నిర్వహించి, ఆరు కార్టన్ బాక్స్‌లను గుర్తించారు. వాటిలో 14,400 సిగరెట్ ప్యాకెట్లు నిషేధిత పొగాకు ఉత్పత్తులుగా ధ్రువీకరించి స్వాధీనం చేసుకున్నారు. ఆ స్టాక్‌ను పటమట స్టేషన్ హౌస్‌కు అప్పగించారు. ఈ నిషేధిత పొగాకు ఉత్పత్తుల అక్రమ రవాణా, లావాదేవీలు జరిపిన వారిపై కేసులు నమోదు చేయాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు.



తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ అధికారులు

క్లుప్తంగా

తోటి వారికి సాయం చేయడంలోనే ఆనందం



మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): తోటి వారికి సాయం చేయడంలోనే నిజమైన ఆనందం దాగి ఉందని లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ జీఎస్ శంకర గుప్తా అన్నారు. గాయత్రినగర్‌లోని అంత్ర ఫంక్షన్ హాలులో లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ–వీఆర్‌కే నగర్ మహిళా క్లబ్ ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ గవర్నర్స్ వార్షిక సందర్శన (యానువల్ విజిట్) జరిగింది. శంకర గుప్తా అతిథిగా హాజరై క్లబ్ సభ్యులను ఉద్దేశించి మాట్లాడారు. సేవా కార్యక్రమాల్లో లయన్స్ క్లబ్ సభ్యులు ఎల్లప్పుడూ ముందుంటారన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటడం, ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం వంటి కార్యక్రమాలు తమ క్లబ్స్ ద్వారా నిర్వహిస్తున్నామని చెప్పారు. వీఆర్‌కె నగర్ మహిళా క్లబ్ అధ్యక్షురాలు జీ.లక్ష్మి, కార్యదర్శి సీహెచ్ శోభారాణి, కోశాధికారి టి.విజయకుమారి, లయన్ జోనికుమారితో పాటుగా లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

అలరించిన విష్ణుభొట్ల గాత్ర కచేరి



విజయవాడ కల్చరల్: సద్గురు సంగీత సభ 30 వార్షికోత్సవం సందర్భంగా దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు సంగీత కళాశాలలో బుధవారం విఖ్యాత సంగీత సోదరీమణులు విష్ణుభొట్ల కృష్ణవేణి, సరస్వతి నిర్వహించిన గాత్ర కచేరి అలరించింది. వాగ్గేయకార కీర్తనలను మధురంగా ఆలపించారు. స్వామి నిన్నుకోరి, శ్రీజాలంధర, కమలాంబ సంరక్షంతు, నీదయరాదా తదితర కీర్తనలను మధురంగా ఆలపించారు. వయోలిన్‌పై ఎన్‌సీ మాధవ్, మృదంగంపై బీవీఎస్ ప్రసాద్, ఘటంపై రామకృష్ణ వాద్య సహకారం అందించారు. కార్యక్రమాలను ప్రారంభించిన సద్గురు సంగీతసభ ప్రధాన కార్యదర్శి గౌరీనాథ్ మాట్లాడుతూ దక్షిణ భారత దేశంలో చెన్నై తర్వాత సంగీత ఉత్సవాలు విజయవాడలోనే జరుగుతాయని తెలిపారు. దేశ విదేశాల్లో లబ్ధ ప్రతిష్టులైన విద్వాంసులు కచేరీలు నిర్వహిస్తారని తెలిపారు. సంగీతసభ్యులు గాయత్రి గౌరీనాథ్, జే ప్రభాకర శాస్త్రి ప్రసాద్ శర్మ, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. విష్ణుభొట్ల సోదరీమణులను నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు.

విద్యాసంస్థల వద్ద పొగాకు ఉత్పత్తులు విక్రయించవద్దు



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యాసంస్థల సమీపాల్లో పొగాకు ఉత్పత్తులు విక్రయించరాదని ఎన్టీఆర్ జిల్లా డీవైఈవో కేవీఎస్ కుమార్ తెలిపారు. విద్యాశాఖ, పోలీసు ఇతర ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో నో టుబాకో డే పేరుతో నగరంలో ప్రచార కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వన్‌టౌన్‌తో పాటుగా వివిధ ప్రాంతాల్లోని విద్యాసంస్థల సమీప ప్రాంతాల్లో దుకాణాల్లో పరిశీలించి అవగాహన పరిచారు. ఈ సందర్భంగా కేవీఎస్ కుమార్ మాట్లాడుతూ విద్యాసంస్థల సమీప ప్రాంతాల్లోని దుకాణాల్లో ఎటువంటి టుబాకో వస్తువులు విక్రయించకూడదన్నారు. ప్రధానంగా విద్యార్థులు వాటికి దూరంగా ఉండే విధంగా సమాజంలో అందరూ కృషి చేయాలని కోరారు. టుబాకో వస్తువుల వినియోగం వలన అనేక వ్యాధుల బారిన పడటమే కాకుండా విలువైన జీవితాలను నాశనం చేసుకున్నవారవుతారన్నారు. వీటిపై ప్రభుత్వం ఆయా శాఖల ఆధ్వర్యంలో ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో అర్బన్ ఇన్‌స్పెక్టర్ కొండా రవికుమార్ వివిధ శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జస్టిస్ చంద్రశేఖరరావు సేవలు చిరస్మరణీయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): పద్మ భూషణ్ జస్టిస్ పాటిబండ్ల చంద్రశేఖరరావు (పీసీ రావు) విద్యా సంస్థలకు, విద్యార్థులకు చేసిన సేవలు చిరస్మరణీయమని వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు, పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావు పేర్కొన్నారు. న్యాయకోవిదులు, అంతర్జాతీయ సముద్రజల వివాదాల ట్రిబ్యునల్ మాజీ అధ్యక్షులు చంద్రశేఖరరావు సంస్మరణార్థం ఆయన సతీమణి పి.భారతి (ఐఏఎస్ విశ్రాంత అధికారి), కుటుంబసభ్యులు విద్యాధరపురం కబేళా వద్దగల ప్రభుత్వ జూనియర్ కళాశాల (ఉర్దూ) ప్రహరీ నిర్మాణం, మూడు అదనపు తరగతి గదులు, సైకిల్ స్టాండ్ నిమిత్తం షెడ్, కళావేదిక నిర్మాణాలకు ఆర్థిక సహాయాన్ని అందించిన క్రమంలో బుధవారం కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కార్పొరేటర్ మైలవరపు మాధురి లావణ్య తదితరులున్నారు.

ఆరోగ్యాంధ్రప్రదేశ్ స్థాపనే ధ్యేయం

వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని



వైద్య పరీక్షలు పరిశీలిస్తున్న దేవినేని అవినాష్

పటమట(విజయవాడతూర్పు): ఆరోగ్యాంధ్రప్రదేశ్ స్థాపనే ధ్యేయంగా ప్రభుత్వం కృషి చేస్తుందని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. పటమట 12వ డివిజన్ 50వ సచివాలయం శ్రీనివాసా కల్యాణ మండపంలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో అవినాష్ ముఖ్య అతిథిగా పాల్గొని వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నాడు నేడు ద్వారా రూ.కోట్లు వెచ్చించి ఆస్పత్రులను అభివృద్ధి చేసిందని చెప్పారు.

ప్రభుత్వ ఆసుపత్రులలో కార్పొరేట్ స్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు నిపుణులైన డాక్టర్లను నియమించి పేదవారికి మెరుగైన వైద్యం అందిస్తున్నారని తెలిపారు. ఆరోగ్య శ్రీ పరిధిని విస్తరించడమే కాకుండా వెయ్యి రూపాయలు దాటిన ప్రతి వైద్య సేవను దాని పరిధిలోకి తీసుకొచ్చారని పేర్కొన్నారు. గతంలో ఎవరూ చేయని విధంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చేపట్టి ప్రతి సచివాలయం వద్ద మెడికల్ క్యాంప్‌లు పెట్టి ఉచితంగా వైద్య పరీక్షలు చేస్తున్నారని తెలిపారు. అవసరమైన వారికి ఆరోగ్య శ్రీ హాస్పిటల్స్‌లో వైద్యం అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా డీఎంహెచ్‌వో సుహాసిని, డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, ఎండీ రిజ్వాన్, 12వ డివిజన్ అధ్యక్షులు ఖలీమ్, రాష్ట్ర డాక్టర్ సెల్ ఉపాధ్యక్షుడు మెహబూబ్, పార్టీ మహిళ నాయకురాలు ధనేకుల ఇందిర పార్టీ ఇతర ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. 15వ డివిజన్ 71వ సచివాలయం రఘు రోడ్డులో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేశారు. ఈ క్యాంపును విజయవాడ నగర పాలక సంస్థ డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ ప్రారంభించారు. అనంతరం ఆమె క్యాంపులో నిర్వహించే వైద్య పరీక్షలు గురించి వైద్యారోగ్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మాజీ డెప్యూటీ మేయర్ ఆళ్ల చల్లా రావు, డివిజన్ ప్రెసిడెంట్ వెంకటరెడ్డి, జనరల్ మెడిసిన్ డాక్టర్ జోగానందరావు, డాక్టర్ పూజిత, గైనకాలజిస్ట్ డాక్టర్ అనురాధ, ఆప్తమాలజిస్ట్ డాక్టర్ శివాని, ఆర్థోపెటిస్ట్ డాక్టర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు..

లబ్బీపేట(విజయవాడతూర్పు): నాలుగున్నరేళ్లలో సంక్షేమ పథకాలతో ప్రజలకు చేసిన మేలును ప్రతి ఇంటికీ వెళ్లి వివరించనున్నట్లు వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. బుక్‌లెట్ల ద్వారా జగనన్న ప్రభుత్వ పనితీరుపై ప్రజల అభిప్రాయాన్ని తెలుసుకోనున్నట్లు పేర్కొన్నారు. కాగా రాష్ట్ర వ్యాప్తంగా గురువారం నుంచి ఆంధ్రాకు జగనన్న ఎందుకు కావాలి కార్యక్రమం ప్రారంభం కానుండగా, తూర్పు నియోజకవర్గంలో సైతం ప్రతిరోజూ ఐదు సచివాయాల్లో కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. గత చంద్రబాబు ప్రభుత్వంలో చేసిన మోసాలను, అబద్ధపు మాటలను ప్రజలకు తెలియచేస్తూ, నేడు జగనన్న ప్రభుత్వంలో ఇచ్చిన మాట తప్పకుండా అమలు చేస్తున్న విధానాలను ప్రజలకు వివరించనున్నట్లు తెలిపారు. నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలు, ఆస్పత్రిలు అభివృద్ధి చెందాయని, కార్పొరేట్‌కు దీటుగా సేవలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో అవినీతి రహిత సంక్షేమ పాలన అందించిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా రూ.2.80 లక్షల కోట్లు పేదల ఖాతాల్లో జమచేసినట్లు తెలిపారు. పార్టీ సచివాలయ కన్వీనర్లు, మండలస్థాయి నాయకులు, ప్రజా ప్రతినిధులు, బూత్ కమిటీ కన్వీనర్లు, వాలంటీర్లు ప్రతి ఒక్కరూ కార్యక్రమంలో భాగస్వాములవ్వాలని పిలుపునిచ్చారు.

గడువులోగా ఆర్‌యూబీ పనులు పూర్తి చేయాలి



మధురానగర్ ఆర్‌యూబీ పనులు పరిశీలిస్తున్న కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడ తూర్పు): మధురానగర్‌లో రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణం పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని నగర పాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. మధురానగర్ ఆర్‌యూబీ పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ నెల 28వ తేదీలోగా నిర్మాణ పనులు పూర్తిచేయాలని సూచించారు. అలాగే మధురానగర్ రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణ పనులలో కనెక్టింగ్ బ్రిడ్జిని త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. మిగిలిన రిటైనింగ్ వాల్ పనులు కూడా త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. లైటింగ్ లో ఎటువంటి లోపాలు లేకుండా చూడాలని చెప్పారు. రైల్వే అండర్ బ్రిడ్జి లోపల ఉండే రోడ్డు పనులను త్వరగా పూర్తి చేయాలని, అవసరమైతే పని వాళ్ళను పెంచి పనులన్నీ సమాంతరంగా ఒకేసారి త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈఈ శ్రీనివాసరావు, ఇంజినీరింగ్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే డివిజన్ ఆదాయం రూ.3,143.69 కోట్లు



మాట్లాడుతున్న డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): ప్రస్తుత ఆర్థిక సంవత్సరం అక్టోబర్ చివరినాటికి విజయవాడ డివిజన్ రూ. 3,143.69 కోట్ల స్థూల ఆదాయం సాధించినట్లు విజయవాడ రైల్వే డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్ తెలిపారు. డివిజినల్ రైల్ యూజర్స్ కన్సల్టేటివ్ కమిటీ (డీఆర్‌యుసీసీ) 132వ సమావేశం బుధవారం డీఆర్ఎం కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌యుసీసీ చైర్మన్, డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జరిగిన అభివృద్ధి పనుల గురించి వివరించారు. అక్టోబర్ నాటికి రూ.3,143.69 కోట్ల ఆదాయం సాధించగా అందులో ప్రయాణికుల సెగ్మెంట్ నుంచి రూ. 813.78 కోట్లు, సరుకు రవాణా నుంచి రూ. 2,232.16 కోట్లు, ఇతర మార్గాల ద్వారా రూ.97.75 కోట్లు వచ్చినట్లు వెల్లడించారు. అమృత్ భారత్ పథకం ద్వారా డివిజన్‌లో 20 ప్రధాన రైల్వే స్టేషన్‌లలో ఆధునికీకరణ పనులు, ప్రయాణికుల సౌకర్యాలను మెరుగుపర్చినట్లు వివరించారు. విజయవాడ–గూడూరు సెక్షన్‌లో 24.16 కిలోమీటర్ల విద్యుదీకరణతో మూడవ లైన్ నిర్మాణం, ముస్తాబాద్–రాయనపాడు మధ్య ఆర్ఓబీ (రోడ్ ఓవర్ బ్రిడ్జి) నిర్మాణంతో 6 కిలోమీటర్ల నూతన లైన్ నిర్మాణం చేపట్టామని తెలిపారు. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు డివిజన్ వ్యాప్తంగా అమృత్ భారత్ పథకం ద్వారా ప్రధాన రైల్వే స్టేషన్‌లలో 16 ఎఫ్ఓబీలు, తొమ్మిది స్టేషన్‌లలో 23 ఎస్కలేటర్లు, నాలుగే స్టేషన్‌లలో 28 లిఫ్టుల నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. ప్రయాణికుల భద్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని పేర్కొన్నారు. రైళ్ల నిర్వహణ, ట్రాక్‌ల పటిష్టత పనులు చేపట్టినట్లు చెప్పారు. అనంతరం డీఆర్‌యుసీసీ సభ్యులతో కలసి పలు విషయాలపై సమీక్షించారు. కార్యక్రమంలో డీఆర్‌యుసీసీ సభ్యులు, ఏడీఆర్ఎం ఎమ్.శ్రీకాంత్, సీనియర్ డీసీఎం వావిలపల్లి రాంబాబు, సీనియర్ డీఓఎం నరేంద్రవర్మ, సీనియర్ డీఈఈ సురేష్‌బాబు, సీనియర్ డీఈ వరుణ్‌బాబు, పీఆర్ఓ నుస్రత్ మండ్రుప్కర్, ఇతర అధికారులు, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

రేపటి నుంచి స్వర్ణోత్సవాలు



భారతీ తీర్థ మహాస్వామి సన్యాసాశ్రమ స్వీకార మహోత్సవాలు బ్రోచర్ ఆవిష్కరిస్తున్న అతిథులు

విజయవాడ కల్చరల్: భారతీయ ఆధ్యాత్మిక ప్రపంచంలో తనదైన ముద్ర వేసుకున్న జగద్గురువులు శృంగేరీ పీఠాధిపతులు భారతీ తీర్థ మహాస్వామి సన్యాసాశ్రమం స్వీకరించి 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు 10 వ తేదీ నుంచి డిసెంబరు 29 వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు శివరామకృష్ణ క్షేత్రం ధర్మాధికారి హనుమత్ ప్రసాద్ తెలిపారు. రామకోటిలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు తెలిపారు. ఆదిశంకరులు స్థాపించిన శృంగేరీ పీఠం భారతీ సనాతన ధర్మం, వేద సంస్కృతికి కృషి చేస్తుందని తెలిపారు. గురుపరంపరలో సాగే పీఠంలో అనేక ఆధ్యాత్మిక కార్యక్రమాలకు వేదికగా నిలుస్తుందన్నారు. ఉత్తరాధికారి విధుశేఖర భారతి ఆశీస్సులతో ప్రతి రోజూ జగదుర్గువుల వైభవం అంశంగా ప్రసంగాలు ఏర్పాటు చేస్తునట్లు తెలిపారు. 10 నుంచి 19 వ తేదీ వరకు శంకర విజయం అంశంగా ఆచార్య శలాక రఘునాథ శర్మ, 20 నుంచి 26 వరకు సురేశ్వరాచార్య మహాస్వామి అంశంగా విశ్వనాథ గోపాల కృష్ణ శాస్త్రి, 27 నంచి 30 వ తేది వరకు విద్యారణ్య మహాస్వామి అంశంగా ముదిగొండ శంకరయ్య, డిసెంబరు 1 వ తేదీ నుంచి 5 వ తేదీ వరకు సచ్చిదానంద నృసింహభారతీ స్వామి వైభవం అంశంగా తంగిరాల రాజేంద్ర ప్రసాద్ శర్మ, 6 నుంచి 12 వ తేదీ వరకు చంద్రశేఖర భారతీ స్వామి అంశంగా పురాణం మహేశ్వర స్వామి వైభవం, 13 వ తేదీ నుంచి 19 వ తేదీ వరకు విద్యాతీర్థ మహాస్వామి అంశంగా 20 వ తేదీ నుంచి 29 వరకు భారతీ తీర్థ స్వామి అంశంగా ఆధ్యాతిక ప్రసంగాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. వేద పండితులు వీరుభొట్ల ఫణిశర్మ మాట్లాడుతూ 50 రోజులపాటు నిత్యం పరమేశ్వరునకు అభిషేకాలు, రుద్రపారాయణం, జరుగుతుందని తెలిపారు. చంద్రమౌళీశ్వర శర్మ పాల్గొన్నారు.

328 మందికి ఉచిత వైద్య పరీక్షలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యాన భవానీపురం రైతుబజార్‌లో బుధవారం ఎంజె నాయుడు సూపర్ స్పెషాలిటీ హాస్పటల్ నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో సుమారు 328 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. హాస్పటల్ గౌరవ చైర్మన్ వావిలాల రజనీకాంత శర్మ, భవానీపురం రైతుబజార్ ఎస్టేట్ ఆఫీసర్ పోతుకూరు బాలాజి ప్రారంభించి రైతుబజార్‌లోని స్టాల్ హోల్డర్స్, కొనుగోలుదారులకు సేవలు అందించారు.

నీటి వనరులు సద్వినియోగం చేసుకోవాలి

హెడ్ వాటర్ వర్క్స్‌లో నీటి దీపావళి



హెడ్ వాటర్ వర్క్స్‌లో నీటి దీపావళి కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, ఎస్‌హెచ్‌జీ మహిళలు

పటమట(విజయవాడతూర్పు): నగర పాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశాల మేరకు మున్సిపల్ కార్పొరేషన్ ఇంజినీరింగ్ విభాగం బుధవారం విద్యాధరపురం 38వ డివిజన్ పరిధిలోని డాక్టర్ కెఎల్ రావు మున్సిపల్ హెడ్ వాటర్ వర్క్స్‌లో నీటి దీపావళి కార్యక్రమాన్ని నిర్వహించారు. కేంద్ర, పట్టణాభివృద్ధి, గృహనిర్మాణ మంత్రిత్వ శాఖ సూచనల మేరకు మెప్మా, నగరపాలక సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో నీటి దీపావళి కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వయం సహాయక సంఘాల నుంచి ఎంపిక చేసిన 50 మంది అమృత్ మిత్రలతో హెడ్ వాటర్ వర్క్స్ ఆవరణలో తాగు నీటి వనరులను సంరక్షించుకోవల్సిన ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. తొలుత ఫిల్టర్ బెడ్‌ను సందర్శించిన వారికి నగరపాలక సంస్థ అధికారులు నీటిని శుద్ధి చేసే విధానాన్ని వివరించారు. ఈ సందర్భంగా నగరపాలక సంస్థ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నారాయణమూర్తి మాట్లాడుతూ నగరంలో 14 లక్షల మంది జనాభాకు నిత్యం తాగు నీరు అందిస్తున్నామని తెలిపారు. నీటిని వృథాగా డ్రెయినేజీల్లోకి వదలటం, రీసైక్లింగ్ లేకపోవడం వంటి అనేక కారణాలతో నీటి నిల్వలు, భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయని చెప్పారు. ఎన్నో వ్యయప్రయాసలకోర్చి అందిస్తున్న రక్షిత మంచి నీటిని సద్వినియోగం చేసుకోవల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ముఖ్యంగా ప్రతి మహిళ నీటి సంరక్షణలో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ మెప్మా టెక్నికల్ ఇన్‌చార్జి డాక్టర్ పవన్ కుమార్ పాల్గొన్నారు.

పురస్కారాల కోసం దరఖాస్తు చేసుకోండి

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ (సాహిత్య, సామాజిక, సాంస్కృతిక సేవా సంస్థ), హైదరాబాద్ వారి 18వ వార్షికోత్సవాల్లో భాగంగా విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దుతున్న అధ్యాపకులు, ఉపాధ్యాయులను గుర్తించి అక్షరబ్రహ్మ, సేవాబ్రహ్మ పురస్కారాలతో సత్కరించనున్నట్లు అకాడమీ అధ్యక్షుడు డాక్టర్ ఇ.ఎస్.ఎస్. నారాయణ మాస్టారు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులు, అధ్యాపకులకు అక్షర బ్రహ్మ, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఉపాధ్యాయ పురస్కారంతో సత్కరిస్తామన్నారు. అలాగే వృద్ధులు, అనాథలు, దివ్యాంగులు వంటి పలు సామాజిక రంగాల్లో సేవలందిస్తున్న సమాజ సేవకులకు 'సేవా బ్రహ్మ' పురస్కారంతో సన్మానిస్తామన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన ఉపాధ్యాయులు, అధ్యాపకులు, సేవాతత్పరులు వారు చేస్తున్న సేవా కార్యక్రమాల వివరాలతో ఈ నెల 25వ తేదీలోగా ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ, డోర్ నెం. 1-20-164, గోకుల్ నగర్, వెంకటాపురం, పోస్టు : తిరుమలగిరి, సికింద్రాబాద్ 15 నకు పంపించాలని కోరారు. ఎంపిక చేసిన వారిని వచ్చే నెల 11వ తేదీ ఆదివారం హైదరాబాద్‌లో పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమంలో ప్రముఖుల చేతులమీదుగా సత్కరిస్తామని తెలిపారు. మరింత సమాచారం కోసం 9652347207 ఫోన్ చేయాలని కోరారు.

బెజవాడలో భారీ వర్షం



బెజవాడలో బుధవారం సాయంత్రం కుండపోత వర్షం కురిసింది. ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. వర్షానికి రోడ్లన్నీ జలమయమ్యాయి. బెంజిసర్కిల్, పటమట, మొగల్రాజపురం, క్రీస్తురాజపురం, గుణదల, అజిత్‌సింగ్‌నగర్, రాజరాజేశ్వరిపేట, భవానీపురం, కృష్ణలంక, చిట్టినగర్ తదితర ప్రాంతాలన్నీ వర్షం ముంచెత్తింది. ఆయా ప్రాంతాల్లో వీఎంసీ ఇంజినీరింగ్ విభాగం అధికారులు, సిబ్బంది రోడ్లపై నిలిచిన నీటిని ఎయిర్‌టెక్ మిషన్లతో తోడేశారు. బందరురోడ్డు, ఏలూరురోడ్డు, బెంజిసర్కిల్, పోలీస్‌కంట్రోల్‌రూం, లోబ్రిడ్జి, ఆర్టీసీ బస్టాండ్ తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ కొద్దిసేపు స్తంభించింది. ఆయా ప్రాంతాల్లోని పోలీసుల చొరవతో ట్రాఫిక్ క్రమబద్ధీకరించారు.

–పటమట (విజయవాడ తూర్పు)







కడప పెద్ద దర్గాలో ఎమ్మెల్సీ రుహుల్లా ప్రత్యేక ప్రార్థనలు



పెద్ద దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్సీ రుహుల్లా

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్ర ప్రజలకు మరింత మెరుగైన పాలన అందించేందుకు రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అఖండ మెజార్టీతో గెలుపొందాలని, మన సీఎం జగనన్న అ'ద్వితీయంగా' సీఎం పీఠాన్ని తిరిగి అధిరోహించాలని ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా కడపలోని అమీన్ పీర్ దర్గాలో బుధవారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కడప పెద్ద దర్గాను సందర్శించిన ఆయనకు దర్గా ముజావర్లు ఇస్లాం సాంప్రదాయం ప్రకారం ముందుగా సత్కరించారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని ఆయన ప్రార్థనలు చేశారు. నిరంతరం పేదవర్గాల సంక్షేమం అభివృద్ధి కోసం ఆలోచన చేస్తూ అమలు చేస్తున్న సీఎం జగనన్నకు ఆ అల్లాహ్ ఆశీస్సులు ఎళ్లవేళలా పుష్కలంగా ఉండాలని దువా చేశారు.

సీఐడీ ఆఫీసులో ఉద్యోగం పేరుతో మోసం

పాయకాపురం(విజయవాడరూరల్): సీఐడీ ఆఫీసులో ఉద్యోగం పేరుతో నమ్మించి ఓ వ్యక్తి నుంచి పెద్ద మొత్తంలో డబ్బు కాజేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. బాధితుడు బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు నున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కండ్రిక బోస్‌నగర్‌కు చెందిన మోక సువర్ణరాజు డిగ్రీ చదివి ఉద్యోగ ప్రయత్నంలో ఉన్నాడు. ఈ క్రమంలో చిన్నప్పటి స్నేహితుడైన వాంబేకాలనీకి చెందిన రవికుమార్ ఓ పెళ్లిలో కలిశాడు. తాను సీఐడీ ఆఫీసులో అకౌంటెంటుగా పనిచేస్తున్నానని రవికుమార్ చెప్పాడు. ఉద్యోగం ఇప్పిస్తానని సువర్ణరాజును నమ్మించాడు. పలు దఫాలుగా సువర్ణరాజు నుంచి రూ.12 లక్షలు రవికుమార్ తీసుకున్నాడు. ఎంతకీ ఉద్యోగం రాకపోవడంతో డబ్బులు కోసం రవికుమార్‌ను ఒత్తిడి చేశాడు. ఈ నేపథ్యంలో సీఐడీ ఆఫీసులో ఎగ్జిక్యూటివ్‌గా ఉద్యోగం వచ్చిందని నమ్మబలికాడు. 2022 జూన్ 30వ తేదీలోగా జాయిన్ కావాలని సువర్ణరాజుకు వాట్సాప్‌లో అపాయిమెంట్ లెటర్ పంపించాడు. ఆ లెటర్ తీసుకొని సువర్ణరాజు సీఐడీ ఆఫీసుకు వెళ్లాడు. అక్కడి అధికారులు ఆ లెటరు చూసి ఫేక్ అని చెప్పారు. దీంతో తాను మోసపోయానని గ్రహించి డబ్బులు కోసం రవికుమార్‌పై తీవ్రంగా ఒత్తిడి చేస్తున్నాడు. రోజులు గడుస్తున్నా డబ్బులు ఇవ్వకపోవడంతో చేసేది లేక న్యాయం చేయాలని సువర్ణరాజు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేశారు.

ఆయుర్వేదం.. మన సనాతన వైద్య విధానం



గన్నవరం రూరల్: ఆయుర్వేదం భారతీయ సనాతన వైద్య విధానమని గూడవల్లి ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల డాక్టర్ కె.సునీత అన్నారు. బుధవారం మండలంలోని జక్కులనెక్కలం గ్రామ పంచాయితీ కార్యాలయంలో నిర్వహించిన ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని సర్పంచ్ మాకుల చిరంజీవి ప్రారంభించారు. ఈ శిబిరంలో 42మందికి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కీళ్ల వాతం, గ్యాస్ ట్రబుల్, దగ్గు, జలుబు, చర్మ వ్యాధులు రోగులకు మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన అవగాహన కార్యక్రమంలో డాక్టర్ సునీత మాట్లాడుతూ జీవన విధానం మార్పు ద్వారా రోగాలకు దూరంగా ఉండాలని చెప్పారు. యోగ సాధన, ఆహారం మార్పుల ద్వారా ప్రతి ఒక్కరు ఆరోగ్యవంతులుగా ఉండాలన్నారు. బయట లభించే ఆహార పదార్థాలు తినరాదని చెప్పారు. నూనె, కారం, మసాలాలు తగ్గించుకోవాలన్నారు. రోజూ గంట పాటు వ్యాయామం చేయటం మంచిదన్నారు. ప్రాథమిక దశలో ప్రభుత్వం అందించే వైద్య సేవలను వినియోగించుకోవటం ద్వారా ఆరోగ్యంతో జీవించాలని చెప్పారు. ప్రభుత్వం ఆయుష్ శాఖ ద్వారా ఉచితంగా మందులు, వైద్య సేవలు అందిస్తుందని వివరించారు. సిబ్బంది పుట్టా కోటేశ్వరరావు, డి.ప్రదీప్, సచివాలయం కార్యదర్శి బెజవాడ చైతన్య, రైతులు పాల్గొన్నారు.

IV
సాక్షి ఫ్యామిలీ
విజయవాడ
గురువారం ॥ 9-11-2023



ఆపరేషన్ బ్యూటీ

పెళ్లి సంబంధాల్లో 'కొత్త' డిమాండ్

పెళ్లి సంబంధం కుదరగానే వారి వారి స్థోమత మేరకు పెళ్లి ఎంత గ్రాండ్‌గా చేయాలనే ఆలోచన చేస్తుంటారు పెద్దవాళ్లు. పెళ్లిలో కాబోయే అత్తగారి డిమాండ్ మేరకు వధువు అమ్మానాన్నలు నడుచుకుంటూ ఉంటారు. ఇందులో భాగంగా ఇటీవల మరో కొత్త డిమాండ్ కూడా వచ్చి చేరింది. కాబోయే పెళ్లికూతురు వివాహ వేడుకలో దేదీప్యమానంగా వెలిగిపోవాలి. అందరూ 'అందమైన కోడలిని సెలెక్ట్ చేసుకున్నారు అనే కితాబులు అందుకోవాలి. అందుకు, ఏ చికిత్స చేయించుకున్నా సరే!' అంటున్నారు. మరి, కాబోయే వధువులు వేడుకకు సిద్ధం కావడానికి ఎలాంటి కేర్ తీసుకుంటున్నారు. ఈ క్రమంలో అందం పట్ల తీసుకుంటున్న చికిత్సలు.. వికటిస్తున్న పరిమాణాలు ఏమిటి? భేష్ అనదగిన విధానాలేమిటి? అనే విషయాలపై తప్పనిసరిగా దృష్టి పెట్టాలి.

''ఓ మల్టీనేషనల్ కంపెనీలో పనిచేస్తున్న సుష్మ పెళ్లి వచ్చే డిసెంబర్‌లో జరగనుంది. పెళ్లి ఫిక్స్ అయ్యాక అత్తగారు నవ్వుతూ – 'అమ్మాయీ, నీ వంటి రంగు బ్రైట్ చేయించుకో. ఫెయిర్ నెస్ కోసం ఇంజెక్షన్లు మార్కెట్‌లో దొరుకుతాయని విన్నాను. వాటిని ట్రై చేయి. ఏ ట్రీట్‌మెంట్ అయినా తీసుకో. కానీ, పెళ్లి టైమ్‌కి అందంగా తయారవ్వాలి' అని ఆర్డర్ వేసింది. ఆమె తన కోడలు పందిట్లో చందమామలా కనిపించాలని, కోడలు మొహం చూసి బంధుమిత్రులంతా నిశ్చేష్టులవ్వాలని కోరుకుంటుంది. 'అత్తగారి డిమాండ్ ఇప్పుడు నాకు ఆందోళన కలిగిస్తోంది' అంటోంది సుష్మ. ఇందుకోసం బ్యూటీ ట్రీట్‌మెంట్స్‌తో పాటు చర్మ ఛాయలో కూడా తేడా వచ్చేలా మార్పులు చేసుకోవడానికి తెగ కష్టపడుతోంది. 'పెళ్లి అంటేనే ఎంతో ఉత్సాహం. ఫొటోల్లో, వీడియోల్లో బాగా కనిపించాలని, అందరిలో ప్రత్యేకంగా వెలిగిపోవాలని నాకూ ఉంటుంది. ఇందుకు బ్యూటీ పార్లర్స్‌కి వెళ్లడం, మేకప్ చేయించుకోవడం సాధారణంగా జరుగుతుంటుంది. కానీ, ఇప్పుడు ప్రత్యేకంగా ట్రీట్‌మెంట్స్ కూడా చేయించుకోవాల్సి వస్తోంది. పెళ్లి ఖర్చులే కాకుండా ఈ కొత్త తరహా ఖరీదైన ఖర్చు తలనొప్పిగా మారింది అంటున్నారు అమ్మనాన్నలు' అని బాధపడుతోంది సుష్మ.

★ ★ ★

కాబోయే అత్తగారు కోరడంతో రూప (పేరు మార్చడమైంది) తన కంటి కింది భాగం లోతుగా ఉండటం వల్ల 'అండర్ ఐ ఫిల్లర్' ఇంజక్షన్ చేయించుకుంది. దీంతో కంటి కింది భాగంలో రక్తం గడ్డకట్టి, వాపు వచ్చి, బయటకు రాలేని పరిస్థితి. త్వరలో పెళ్లి. ఆ క్లాట్ అంత తొందరగా తగ్గదు. దిక్కుతోచని పరిస్థితి.

★ ★ ★

శిల్ప అందం కోసం బొటాక్స్ ట్రీట్‌మెంట్ చేయించుకుంది. డోస్ ఎక్కువ మోతాదులో ఇవ్వడం వల్ల ముఖంలో ఎక్స్‌ప్రెషన్స్ ఇవ్వడానికి వీలు లేకుండా మారిపోయింది.

★ ★ ★

అందం పెంచుకునే విషయంలో ఒకరో ఇద్దరు కాదు అమ్మాయిలు ఎప్పుడూ తమ ప్రయత్నాలు చేస్తూనే ఉంటారు. ఇక పెళ్లి అంటే చెప్పనక్కర్లేదు. ప్రీ వెడ్డింగ్ షూట్ నుంచి ప్రతి సంబరాన్నీ పదిలపరుచుకోవడానికి ఎన్నో పాట్లు పడతారు. దీంట్లో భాగంగా బ్యూటీ కాన్షియస్ అమ్మాయిల్లోనూ, అబ్బాయిల్లోనూ పెరిగింది. ఈ విషయంలో ఎలాంటి చికిత్స, జాగ్రత్తలు తీసుకోవాలో తెలుసుకోవడం మంచిది అంటున్నారు డెర్మటాలజిస్ట్ డాక్టర్ స్వప్న ప్రియ. వాటిలో...

ఇంట్లో ప్రయోగాలు..

చాలా మంది అందానికి ఇంటి చిట్కాలు పాటిస్తుంటారు. సహజంగా లభించే వాటితో బ్యూటీప్యాక్‌లు వేసుకుంటూ ఉంటారు. వాటి ద్వారా ఎంత సమయంలో ఎంత ప్రయోజనం ఉంటుందో కూడా చూడాలి. ఎందుకంటే, కొంతమందికి స్కార్స్, పింపుల్స్, యాక్నె, డల్ స్కిన్, కలర్ ఛేంజ్, చుండ్రు... ఇలా చాలా సమస్యలు ఎదుర్కొంటూ ఉంటారు. వాటికి చికిత్సనే సరైన మార్గం. ఆహారానికి సంబంధించినవి తప్పనిసరిగా పెళ్లికి రెండు నుంచి మూడు నెలల ముందు మార్పులు చేసుకోవాలి. సహజంగా చర్మంలో మార్పులు రావాలంటే పోషకాహారం మంచి ఎంపిక. అప్పుడే మంచి ఫలితం ఉంటుంది.

బ్యూటీ స్పాలో చికిత్స మంచిదేనా?

స్కిన్ టైటనింగ్, రింకిల్స్, స్కిన్ హైడ్రేషన్.. వంటి ట్రీట్‌మెంట్స్ బ్యూటీ స్పాలలో చేయించుకుంటారు. దీనికి కూడా ముందు సరైన కౌన్సెలింగ్ అవసరం. ఒక్కో వ్యక్తి చర్మ తత్వం ఒక్కో విధంగా ఉంటుంది. ఈ విధానంలో చర్మం రికవరీ అవడానికి కూడా సమయం పడుతుంది.

ఇంజక్షన్లు సరైనవేనా...

కృత్రిమంగా కొలాజన్, స్కిన్ బూస్టర్స్.. అని తీసుకుంటున్నారు. ఎవరో చెప్పారని కొంతమంది నర్సులను ఇంటికి పిలిపించుకొని ఇంజక్షన్లు చేయించుకుంటారు. మంచి లుక్ కోసం ట్రై చేయచ్చు. కానీ, వాటి డోసుల్లో తేడాలొస్తే మొత్తం తిరగబడుతుంది.

ఆన్‌లైన్‌లో చూసి ...

సోషల్ మీడియా ప్రభావం వల్ల ఆన్‌లైన్‌లో బ్యూటీ ఉత్పత్తులు తెప్పించుకొని, అప్లై చేసుకోవడం చూస్తుంటాం. వాటి వల్ల ఇబ్బందుల పాలైన వారు చాలా మంది ఉంటారు. ఎందుకంటే, అవి వారికి ఎంత వరకు నప్పుతాయో తెలియదు.

కెమికల్ పీలింగ్

కెమికల్ పీల్‌లో బయటి నుంచి చర్మంలోకి ఎలాంటి రసాయనాలు చొప్పించరు. మృతకణాలను తొలగిస్తారు, చర్మం పై పొర నుండి టానింగ్, పిగ్మెంటేషన్ తగ్గి కొత్త పొర కనిపిస్తుంది. అయితే, దీని ద్వారా చర్మంపై కొత్త సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. నిపుణుల సలహా అవసరం. ఇంకొన్ని పీఆర్‌పీ చికిత్సలు చర్మ నిగారింపును తీసుకువస్తాయి. అయితే, వధువులు కాబోయే అమ్మాయిలు పెళ్లికి 3 నుండి 6 నెలల ముందు ఈ కాస్మెటిక్ విధానాలను ప్రారంభించాలి. ఎందుకంటే వారి సిట్టింగ్‌లలో కనీసం 3 వారాల గ్యాప్ ఉండాలి.

లైటర్ టోన్‌లకు డిమాండ్

పెళ్లి చేసుకోబోయే అమ్మాయిలు తమ ప్రీ–బ్రైడల్ విధానంలో రంగు ఫెయిర్‌గా మారడం పట్ల ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. నిజానికి, సూర్యకిరణాల నుండి మన చర్మాన్ని మనం రక్షించుకోనప్పుడు, చర్మంలో పాచెస్ ఏర్పడతాయి. కొన్నిసార్లు సూర్యకాంతి కుడి వైపున, మరి కొన్నిసార్లు ఎడమ వైపున ఎక్కువగా పడుతుంది. సూర్యుని అతినీలలోహిత కిరణాలు చర్మ కణాలను దెబ్బతీస్తాయి. పిగ్మెంటేషన్‌ను ప్రేరేపిస్తాయి. దీంతో అంతటా 'చర్మపు రంగు' ఒకే విధంగా ఉండదు. అంటే ముఖం మీద చాలా చోట్ల టాన్ ఉంటుంది. ఈవెన్ టోన్‌ని కలిగి ఉండాలంటే ఇంటి నుంచి బయటకు వెళ్లే ముందు ముఖంపై సన్‌స్క్రీన్‌ని అప్లై చేయడం చాలా ముఖ్యం.

కాస్మెటిక్ ఫిల్లర్స్...

నిఖిత పెదవులు చాలా సన్నగా ఉంటాయి. రంగు చాలా తక్కువ. ఒకరోజు ఆమె కాబోయే అత్తగారు ఫోన్ చేసి 'నీ ముఖంలో పెదవులు కనిపించడం లేదు. ఏదైనా చికిత్స తీసుకో' అంది. దీంతో నిఖిత నర్సులను కాస్మెటిక్ ఫేషియల్ ఫిల్లర్లను ఆశ్రయించింది. దీనిని లిప్ ఫిల్లర్ అని కూడా అంటారు. దీర్ఘకాలిక ఫలితాల కోసం, ప్రతి 6 నుండి 8 నెలలకు ఇంజెక్షన్లు చేయాలి. కాస్మెటిక్ ఫేషియల్ ఫిల్లర్లే కాకుండా, హైలురానిక్ యాసిడ్ ఫిల్లర్ ఇంజక్షన్లు కూడా ఈ రోజుల్లో బాగా ప్రాచుర్యం పొందాయి. ఈ డెర్మా ఫిల్లర్‌లతో పెదవులు హైడ్రేటెడ్‌గా ఉంటాయి. పగుళ్లు రావు. పూర్తి పరిమాణంలో కనిపిస్తాయి. అలాగే, కొందరు అమ్మాయిలు అత్తింటి వారు బరువు తగ్గమన్నారు కదా అని లైపోసక్షన్ వంటి చికిత్సలు చేయించుకుంటారు. దీని వల్ల చర్మంపై చారలు ఏర్పడతాయి. అవి అంత త్వరగా పోవు. ముక్కు, పెదాలు, బ్రెస్ట్ సరిచేసుకోవడానికి కాస్మాటిక్ సర్జరీలు కూడా చేయించుకుంటారు. ఏ చికిత్స అయినా కనీసం ఆరు నెలల ముందు చేయించుకుంటే వచ్చే సైడ్‌ఎఫెక్ట్‌నూ నివారించవచ్చు.

సహజమైన మెరుపే మేలు



డాక్టర్ స్వప్నప్రియ
సీనియర్ డర్మటాలజిస్ట్

పెళ్లి 10–15 రోజులు ఉందనగా ఏ బ్యూటీ ట్రీట్‌మెంట్ చేయించుకోకూడదనే విషయం ముందు గ్రహించాలి. కనీసం ఆరు లేదా మూడు నెలల ముందు బ్యూటీ చికిత్సలు చేయించుకోవచ్చు. దీని ద్వారా సైడ్ ఎఫెక్ట్స్ ఉంటే నివారించుకునే అవకాశం ఉంటుంది. కృత్రిమ అందాన్ని ఎవరూ ఇష్టపడరు. ఎప్పుడైనా సహజమైన మెరుపును ఇచ్చే బ్యూటీ ట్రీట్‌మెంట్ మాత్రమే మంచిదని గమనించాలి. అయినా తప్పదు అనుకునేవారు స్కిన్ బూస్టర్స్, ఇతర ట్రీట్‌మెంట్ వైపుగా వెళ్లచ్చు. ఇందుకు నిపుణుల పర్యవేక్షణ అవసరం.



టిప్

డ్రై ఫ్రూట్స్ గిఫ్ట్ ఇస్తున్నారా?

దీపావళికి డ్రైఫ్రూట్స్‌ను గిఫ్ట్‌గా ఇస్తుంటారు చాలామంది. అయితే డ్రైఫ్రూట్స్‌ను కొనేటప్పుడు కచ్చితంగా ఇవి గమనించుకోవాలి.

- నట్స్ రంగు ఎలా ఉందో చూడాలి. సహజంగా ఉండాల్సిన దానికంటే మరింత ముదురు రంగులో ఉంటే అవి పాడైనట్టు. రుచిగా కూడా ఉండవు కాబట్టి కొనకపోవడమే మంచిది.
- వీలైతే ఒకటి రెండు నట్స్‌ను నీటిలో వేసి, పదినిమిషాల తరువాత కొరికి చూడాలి. నానిన తరువాత కూడా గట్టిగా ఉంటే అవి చాలా పాతవి. ఇవి ఆరోగ్యానికి అంత మంచిది కాదు కాబట్టి తీసుకోకూడదు. చాలా షాపులు తిన డానికి శాంపిల్స్ ఇవ్వవు. ఇలాంటప్పుడు ఆ డ్రైఫ్రూట్స్‌ను తక్కువ పరిమాణంలో కొనుక్కుని పరిశీలించాలి
- నట్స్‌ని వాసన చూడాలి. ఘాటైన వాసన వస్తే అవి చాలా పాతవి. వీటికి కొద్దిగా తేమ తగిలితే వెంటనే బూజు పట్టి త్వరగా పాడవుతాయి. ఇవి తినడం ఆరోగ్యానికి మంచిది కాదు
- నట్స్ ప్యాకెట్ మీద ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ ముద్ర, నిబంధనలకు అనుగుణంగా ఉందో లేదో చూడాలి. ఎప్పుడు ప్యాకింగ్ అయ్యింది? ఎప్పటిలోగా తినాలో సూచించే డేట్స్‌ను సరిగా చూసుకోవాలి. ఈ డేట్స్ ముద్రించని ప్యాకెట్స్‌ను కొనకూడదు
- ప్యాకెట్ మీద ముద్రించిన సమాచారాన్ని జాగ్రత్తగా చదవాలి. ప్రిజర్వేటివ్‌లు కలిపిన నట్స్‌ను కొనకపోవడమే మంచిది.



ప్రతి స్త్రీ దుర్గ వలే...

ప్రతి స్త్రీలో ఒక దుర్గ ఉంటుంది. కాని ఆ దుర్గను అదిమి పెట్టేలా కుటుంబం, సమాజం ఆమెను తీర్చి దిద్దుతాయి. దాంతో తన మీద ఏ అన్యాయం జరిగినా చెప్పలేని స్థితికి చేరుతుంది. 'నువ్వు దుర్గవి. పోరాడు' అని చెప్తారు బెంగళూరులోని 'దుర్గ ఇండియా' టీమ్ సభ్యులు. ప్రియా వరదరాజన్ అనే యాక్టివిస్ట్ ఏర్పాటు చేసిన ఈ గ్రూప్ స్త్రీలను కుటుంబ హింస నుంచి... లైంగిక వేధింపుల నుంచి కాపాడటానికి పని చేస్తోంది. వారి పోరాటానికి శక్తినిస్తోంది.

'ప్రతి ఒక్కరూ మార్పు కోసం ఎదురు చూస్తారు. మనమే మార్పు కోసం ప్రయత్నిద్దామని ఎందుకు అనుకోరు... ఎదురు చూస్తూ కూచుంటే మార్పు వస్తుందా?' అంటారు ప్రియా వరదరాజన్.

బెంగళూరులో 'దుర్గ ఇండియా' అనే సంస్థ స్థాపించి స్త్రీల సమస్యలపై పని చేస్తున్న ప్రియ ఇటీవల బెంగళూరు మాల్‌లో ఒక వ్యక్తి స్త్రీలను అసభ్యంగా తాకడం గురించి ప్రస్తావిస్తూ 'పబ్లిక్ ప్లేసుల్లో– బహిరంగ ప్రదేశాల్లో గాని ఆన్‌లైన్‌లోగాని స్త్రీల గౌరవ మర్యాదలకు భంగం కలిగిస్తే అలాంటి వారిపై చర్య తీసుకునేందుకు ఆ బాధిత మహిళకు అండగా నిలవడం మేము చేసే పని. చట్టాలు ఎన్ని ఉన్నా, పోలీసులు, మహిళా పోలీసులు ఎందరు ఉన్నా మహిళలకు సాటి మహిళ అండగా ఉంటే కలిగే ధైర్యం వేరు. తోటి మహిళలతో వారు చెప్పుకునేవి వేరు. అలాంటి వారికి యోగ్యులైన కౌన్సెలర్లతో కౌన్సెలింగ్ చేయించి దిలాసా ఇప్పిస్తాము. అంతే కాదు బాధితులను వెంటబెట్టుకొని– ఆ స్టేషన్‌కుపో ఈ స్టేషన్‌కు పో అనే బాధ లేకుండా బెంగళూరులో వన్ స్టాప్ సెంటర్స్‌లో ఫిర్యాదు చేయిస్తాము. తోడుగా మేమొస్తే బాధితులు ఫిర్యాదు చేయడానికి జంకరు. ఎటొచ్చీ వారికి తోడు నిలిచే స్త్రీల బృందాలు అన్నిచోట్లా ఉండాలి' అంటుంది ప్రియ.

ఐ యామ్ ఎవ్రి ఉమన్

పదేళ్ల క్రితం ప్రియా వరదరాజన్ 'ఐ యామ్ ఎవ్రి ఉమన్' పేరుతో ఒక బ్లాగ్ రాయడం మార్పు కోసం ఆమె వేసిన మొదటి అడుగు. ఆ బ్లాగ్‌కు క్రమంగా చాలామంది మహిళా ఫాలోయర్లు వచ్చారు. వారు తమ అనుభవాలను ప్రియతో పంచుకోసాగారు. 'అందరిదీ ఒకే కథ. అందరూ మరొక స్త్రీ లాంటి వారే అని నాకు అర్థమైంది. స్త్రీల కోసం పని చేయాల్సిన అవసరం తెలియజేసింది. స్త్రీల కోసం పని చేయడం అంటే వారి పట్ల భావజాలాన్ని మార్చడమే' అంటుంది ప్రియ.

మగాడు ఎందుకు అలా చేస్తాడు?

'గతంలో సమాజంలో స్త్రీలకు ఏదైనా సమస్య వచ్చి ఆమె బయటకు చెప్పినప్పుడు– ఆమెలో ఏ దోషం ఉందో అన్నట్టుగా నిందను ఆమె మీదే వేసేవారు ఉండేవారు. వారి భావజాలాన్ని మార్చడమే చేయవలసింది. స్త్రీకి ఏదైనా అన్యాయం జరిగినప్పుడు ఆ మగాడు ఆమెతో అలా ఎందుకు చేశాడు అని ఆలోచించేలా చేస్తే సగం మార్పు వచ్చినట్టే. ఇంట్లో, వీధిలో, ఆఫీసులో స్త్రీలు ఆత్మాభిమానంతో ఉండాలంటే మగాళ్లు మారాలి. అందుకు ఒక రోజు సరిపోదు. ఒకరు పని చేస్తే సరిపోదు. ప్రతి ఒక్కరం ఏదో ఒక మేరకు పని చేయాల్సిందే' అంటుంది ప్రియ.



అందరినీ 'దుర్గ'లుగా మారుస్తూ

అన్యాయం జరిగితే వెరవకుండా ప్రతిఘటించమని ప్రియ ఆధ్వర్యంలో 'దుర్గల' బృందం చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తోంది. స్కూళ్లలో, కాలేజీలలో, బస్తీలలో తిరుగుతూ స్త్రీలకు తమ హక్కులను, చట్టపరమైన రక్షణను, సహాయం చేసే బృందాలను తెలుపుతుంది. 'నేను ఒంటరిదాన్ని కాను అని స్త్రీ అనుకుంటే చాలు... ఆమె పోరాడగలదు' అంటుంది ప్రియ.

ఇంత ప్రయత్నం చేసే ప్రియ లాంటి వారి సంఖ్య ఎంత పెరిగితే దుర్గలకు అంత శక్తి పెరుగుతుంది.

ఖుషీతో దిల్ ఖుష్



చిన్నతనంలో తాము పడ్డ కష్టాలు తమ పిల్లలు పడకూడదని వారికి నొప్పి తెలియకుండా ఎంతో కష్టపడి పెంచుతారు తల్లిదండ్రులు. అయితే లక్నోకు చెందిన ఖుషీ అందుకు భిన్నం. తన తండ్రిలా మరెవరూ కష్టపడకూడదని తానే ఓ సామాజిక కార్యకర్తగా మారి సాటి యువతకు ఆదర్శంగా నిలుస్తోంది ఖుషీ పాండే.

లక్నోకు చెందిన 23 ఏళ్ల ఖుషీ పాండే బాల్యం ఉన్నావ్ అనే ఊళ్లో గడిచింది. తన తండ్రి నుంచి చిన్ననాటి విషయాలను క్షుణ్ణంగా తెలుసుకుంది. ఖుషీ తండ్రికి బాగా చదువుకోవాలని ఉండేది. కానీ పెన్సిల్ కొనే స్థోమత కూడా లేదప్పుడు. ఈ విషయం తెలుసుకుని, నాన్నలా మరెవరూ చదువుకోసం ఇబ్బంది పడకూడదు అనుకుంది. నిరుపేదలకు సాయం చేయాలని చిన్నప్పుడే గట్టిగా నిర్ణయించుకుంది.

ఖుషీ పెద్దయ్యేసరికి నాన్న వాళ్ల లక్నోకి మకాం మార్చారు. అక్కడ ఓ షాపులో పనిచేస్తూ తరువాత కాంట్రాక్టర్‌గా మారారు. ప్రభుత్వానికి సంబంధించిన ప్రాజెక్టులు కూడా రావడంతో ఖుషీ కుటుంబ ఆర్థిక పరిస్థితులు మెరుగుపడ్డాయి. దీంతో ఖుషీ 'లా' పూర్తయ్యాక, సోషల్ వర్క్‌లో పీజీ చేసింది. చదువు పూర్తయ్యాక వెంటనే నిరుపేదలకు చదువు చెప్పడం ప్రారంభించింది. మురికివాడల్లోని పిల్లలను ఒక చెట్టుకింద కూర్చోబెట్టి సాయంత్రం రెండుమూడు గంటలు చదువు చెప్పేది. రోజుకి యాభై మంది వరకు ఖుషీ క్లాసులకు హాజరయ్యేవారు. తన దగ్గరకు వచ్చే పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించడంతోపాటు, వారి తల్లిదండ్రులకు చదువు ప్రాముఖ్యతను వివరిస్తోంది.

తాతయ్య మరణంతో...

అది 2020 ... ఒకరోజు రాత్రి ఖుషీ వాళ్ల తాతయ్య షాపు నుంచి తిరిగి వస్తున్నారు. చీకట్లో సరిగా కనిపించక ఎదురుగా వచ్చే కారు తాతయ్య సైకిల్‌ని ఢీ కొట్టడంతో ఖుషీ తాతగారు అక్కడికక్కడే చనిపోయారు. తాతయ్యను ఎంతో ఇష్టపడే ఖుషీ ఈ చేదు సంఘటనను తట్టుకోలేకపోయింది. సైకిల్‌కు లైట్ ఉంటే ఈ ప్రమాదం జరిగేది కాదు అనుకుని ప్రతి సైకిల్‌కు లైటు ఉండాలని భావించింది. రోజు కూలి పనిచేసుకునేవారు తమ సైకిళ్లకు లైట్లు పెట్టుకోవడానికి తగ్గ స్థోమత ఉండేది కాదు. దాంతో వాళ్లకు ఒక్కొక్కరికి 350 రూపాయల ఖరీదు చేసే లైట్లను ఉచితంగా పంచింది. ఇలా ఇప్పటిదాకా 1500 మంది వాహనాలకు బ్యాటరీతో నడిచే లైట్లను అమర్చింది. లైట్లు అమర్చడానికి 'ఇన్‌స్టాల్ లైట్స్ ఆన్ బైస్కిల్' అని రాసిన ఉన్న ప్లకార్డు పట్టుకుని వీధుల్లో తిరుగుతూ ఎంతోమందికి అవగాహన కల్పించింది. అప్పట్లో ఖుషీ చేసిన ఈ పనిని ఓ ఐఏఎస్ అధికారి వీడియో తీసి సోషల్ మీడియాలో షేర్ చేయడంతో తెగ వైరల్ అయ్యింది. ఈ విషయం తెలిసిన ఎనభైమంది యువకులు ఖుషీతో కలిసి సైకిళ్లు, ట్రక్కులకు, ఇతర వాహనాలకు లైట్లు అమర్చడంలో ఖుషీకి సాయంగా నిలిచారు.





పాఠాలతో పైసలు సంపాదించి...

ఖుషీ చేస్తోన్న సామాజిక కార్యక్రమాలకు నిధులు చాలా కావాలి. ఇందుకు తన తండ్రి, బంధువులు సమకూర్చిన మొత్తం ఏమాత్రం సరిపోలేదు. దాంతో యూట్యూబ్‌లో 'లా' తరగతులు చెప్పడంతోపాటు, ఇతర పార్ట్ టైమ్ ఉద్యోగాలు చేస్తూ నెలకు అరవై నుంచి డెబ్బై వేల వరకు సంపాదించి సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ, నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపుతోంది.

మహిళలకు అండగా...

బాలికలకు శానిటరీ ప్యాడ్ ల గురించి అవగాహన కల్పించడం, విద్యుత్ సదుపాయం లేని వారికి సోలర్ ల్యాంప్స్ అందించడం, 'జీవిక సాథీ' ప్రాజెక్టు పేరుతో దివ్యాంగ మహిళలు, వితంతువులు, ఒంటరి మహిళలకు కుట్టు మిషన్, జ్యూవెలరీ తయారీలో శిక్షణ ఇప్పించి వారి కాళ్ల మీద వాళ్లు నిలబడేలా చేయడం వంటి సేవా కార్యక్రమాలతో ఎంతోమందికి ఆదర్శంగా నిలుస్తోంది.

ఫస్ట్ టైమ్

మంత్రముగ్ధులను చేసే దాస్తాంగోయి



● ఫౌజియా

'దాస్తాంగో ప్రదర్శన ఇస్తున్నది ఓ అమ్మాయా!!' అని బోలెడు ఆశ్చర్యపడుతూనే ప్రేక్షకుల మధ్య కూర్చున్నాడు ఒక ప్రేక్షకుడు. ఇలా కూర్చొని అలా వెళ్లిపోదాం... అనుకున్నాడు. అయితే ప్రదర్శన పూర్తయ్యే వరకు కదలకుండా కూర్చున్నాడు.

ఆ హాల్‌లో నవ్వుల్లో నవ్వు అయ్యాడు. ఏడుపులో ఏడుపు అయ్యాడు. సకల భావోద్వేగాల సమ్మేళనంతో 'దాస్తాంగోయి' ఫౌజియాను ఆశీర్వదించాడు. ఉర్దూలో మౌఖిక కథాసాహిత్య రూపం... దాస్తాంగో.

పురుషులకు మాత్రమే పరిమితమైన ఈ కళా రూపంలో అపారమైన పేరు తెచ్చుకొని 'ఫస్ట్ ఫిమేల్ దస్తాంగోయి'గా గుర్తింపు పొందింది ఫౌజియా...

ఢిల్లీకి చెందిన ఫౌజియాకు స్కూల్ రోజుల నుంచి సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలు అంటే ఇష్టం. స్కూల్లో ప్రదర్శించే నాటకాల్లో పాల్గొనేది. ఫౌజియా తండ్రి మోటర్‌బైక్ మెకానిక్. ఆర్థిక పరిస్థితి రీత్యా ఫౌజియా ఎప్పుడో చదువు మానేయాలి. ట్యూషన్‌లు చెప్పగా వచ్చిన డబ్బుతో పై చదువులు చదివింది. మాస్ కమ్యూనికేషన్‌లో డిగ్రీ చేసింది.

దయాల్ సింగ్ కాలేజీలో చదువుకునే రోజుల్లో ఒకరోజు తొలిసారిగా 'దాస్తాంగో' ప్రదర్శన చూసింది ఫౌజియా. ఇక అప్పటి నుంచి 'దాస్తాంగో' పై ఆసక్తి, అభిమానం పెరిగాయి. తాను కూడా 'దాస్తాంగోయి'గా పేరు తెచ్చుకోవాలనుకుంది. 'ఇది పురుషులకు మాత్రమే పరిమితమైన కళా రూపం. మహిళలు చేయలేరు. ఒకవేళ చేసినా ప్రేక్షకులు ఆదరించరు' అన్నట్లుగా చాలామంది మాట్లాడారు.

ఆ మాటలు విని ఫౌజియా కొంచెం కూడా నిరాశపడలేదు. తనపై తనకు గట్టి నమ్మకం ఉంది.

'జీవితాంతం దాస్తాంగో చెంతనే ఉండాలనుకున్నాను. ఎంతో చరిత్ర ఉన్న ఈ కళ గురించి ఈ తరంలో కొద్ది మందికి మాత్రమే తెలుసు. దీన్ని దృష్టిలో పెట్టుకొని ఈ తరానికి కూడా తెలిసేలా దాస్తాంగోకు ప్రాచుర్యం తీసుకురావాలనుకున్నాను' అంటుంది ఫౌజియా.


డానీష్ హుస్సేన్, మహ్మద్ ఫారూఖీ లాంటి గొప్ప కళాకారుల నుంచి 'దాస్తాంగో'ను నేర్చుకుంది ఫౌజియా. ఫౌజియా కథాసంవిధానంలో కృత్రిమమైన భాషా గాంభీర్యం వినిపించదు. పాత ఢిల్లీ యాస మాత్రమే వినిపిస్తుంది.

'మన దేశంలో ఎన్నో భాషలకు సంబంధించి ఎన్నో మాండలికాలు ఉన్నాయి. ప్రతి మాండలికానికి తనదైన సొగసు ఉంటుంది. ఈతరంలో చాలామంది తమ యాసను దాచి పెట్టే ప్రయత్నం చేస్తుంటారు. ఇది సరి కాదు. మన ఊరు, తల్లిదండ్రులు, సంస్కృతి గురించి గొప్పగా చెప్పుకున్నట్లే మన మాండలికం గురించి కూడా గొప్పగా చెప్పుకోవాలి' అంటుంది ఫౌజియా.

ఫౌజియాకు పుస్తకాలు చదవడం అంటే ఇష్టం. ముఖ్యంగా ఉర్దూ సాహిత్యం. చిన్నప్పుడు అమ్మ, అమ్మమ్మ, నానమ్మల నుంచి ఎన్నో కథలు విన్నది. అద్భుతమైన రీతిలో కథలు చెప్పేవారు. కథను ఎక్కడ మొదలు పెట్టాలి, ఎక్కడ విరామం ఇవ్వాలి, మళ్లీ ఎక్కడ మొదలు పెట్టాలి... అనే దాంట్లో వారు సిద్ధహస్తులు. ఆ మెళకువలు ఊరకే పోలేదు...'దాస్తాంగో'లో ఫౌజియాకు బాగా ఉపకరించాయి.

జానపద కథలు మాత్రమే కాకుండా సామాజిక సందేశం ఉన్న ఆధునిక కథలను కూడా చెబుతూ ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది ఫౌజియా. దేశవిభజన సమయంలో మహిళలు ఎదుర్కొన్న సమస్యలు, హింస గురించి కథగా చెబుతున్నప్పుడు ప్రేక్షకులు కదిలిపోయారు. కోవిడ్ కల్లోల సమయంలో ఫౌజియాకు 'దాస్తాంగో' ప్రదర్శనలు ఇవ్వడానికి కుదరలేదు. దీంతో ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారానే ప్రదర్శన ఇచ్చింది.

అమ్మమ్మ, నానమ్మల నుంచి ఎన్నో కథలు విన్నది. అద్భుతమైన రీతిలో కథలు చెప్పేవారు. కథను ఎక్కడ మొదలు పెట్టాలి, ఎక్కడ విరామం ఇవ్వాలి, మళ్లీ ఎక్కడ మొదలు పెట్టాలి... అనే దాంట్లో వారు సిద్ధహస్తులు. ఆ మెళకువలు ఊరకే పోలేదు... 'దాస్తాంగో'లో ఫౌజియాకు బాగా ఉపకరించాయి.



మహాభారతం కథల నుంచి స్వాతంత్ర్యం కోసం మహాత్ముడి పోరాటం వరకు 'దాస్తాంగోయి'గా ప్రేక్షకులను మెప్పిస్తున్న ఫౌజియాకు ఉర్దూ భాషలోనే కాదు హిందీ, ఇతర భాషలలోనూ 'దాస్తాంగో' ప్రదర్శనలు ఇవ్వాలనేది కల. ఆమె కల నెరవేరాలని ఆశిద్దాం.